ఈనాడు

విజయవాడ 7-1-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 148

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

తిరుమల పరకామణి కేసులో

కుట్రదారులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలి

నిందితుడితో వారు కుమ్మక్కయ్యారు ● కావాలనే సరైన సెక్షన్లు నమోదు చేయలేదు

ఉన్నత న్యాయస్థానం స్పష్టీకరణ ● ముందుకు వెళ్లేందుకు సీఐడీ, ఏసీబీలకు స్వేచ్ఛ

అమానవీయ రీతిలో తనిఖీలు ఆపలేరా అని తితిదేను ప్రశ్నించిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ ఘటనకు సంబంధించిన కేసును బలహీనపరచడంలో కుట్రదారులైన పోలీసులపై తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని హైకోర్టు స్పష్టంచేసింది. సీఐడీ నివేదికను పరిశీలిస్తే.. ఈ కేసులో నిందితుడు సీవీ రవికుమార్, తదితరులతో కొంతమంది పోలీసు అధికారులు కుమ్మక్కైనట్లు స్పష్టమవుతోందని పేర్కొంది. చోరీపై ఉద్దేశపూర్వకంగానే సరైన సెక్షన్లు నమోదు చేయలేదని తెలిపింది. వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ చోరీపై నమోదైన కేసును అప్పట్లో లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్న వ్యవహారంపై మినహా.. ఇతర విషయాల్లో సీఐడీ, ఏసీబీ చట్టప్రకారం ముందుకెళ్లవచ్చని పేర్కొంది. నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబ సభ్యులు ఆదాయానికి మించిన ఆస్తులు ఆర్జించిన వ్యవహారం, తితిదేకి ఆస్తులను రాసిచ్చిన విషయంలో సైతం చట్టప్రకారం ముందుకెళ్లే స్వేచ్ఛ సీఐడీ, ఏసీబీకి ఉంటుందని తేల్చిచెప్పింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.



తితిదే నివేదికపై ఆక్షేపణ

పరకామణిలో చోరీ కేసు రాజీ వ్యవహారం, అక్రమాలపై విచారణ జరుపుతున్న హైకోర్టు.. కానుకల లెక్కింపు విషయంలో సంస్కరణలు అవసరమని ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే. కానుకల లెక్కింపునకు వచ్చిన భక్తులను లోదుస్తులపై తనిఖీలు చేయడాన్ని తప్పుపట్టింది. సంస్కరణల్లో భాగంగా సత్వర, శాశ్వత (ప్లాన్-ఎ, బి) చర్యలపై నివేదిక ఇవ్వాలని తితిదే ఈవోను ఆదేశించింది. సత్వర చర్యలకు సంబంధించి ఈవో హైకోర్టుకు నివేదిక ఇచ్చారు. దానిని పరిశీలించిన న్యాయస్థానం. . తాము ప్రధానంగా లేవనెత్తిన రెండు అంశాల గురించి ఆ నివేదికలో ప్రస్తావన లేదని ఆక్షేపించింది. కానుకలను లెక్కించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన భక్తులను అమానవీయ రీతిలో తనిఖీ చేయడానికి స్వస్తి పలకాలని, టేబుళ్లు ఏర్పాటు చేసి కానుకలను లెక్కించాలని గత విచారణలో తాము సూచించామని గుర్తుచేసింది. అమానవీయ తనిఖీలు నిలిపివేయలేని పరిస్థితి ఉంటే భక్తులతో లెక్కింపు ప్రక్రియను ఆపేస్తామని హెచ్చరించింది. ఈ రెండు అంశాలపై స్పష్టత ఇవ్వాలని తితిదే ఈవో తరఫు న్యాయవాది శ్రీనివాసబాబాను ఆదేశించింది. విచారణను ఈనెల 8కి వాయిదా వేసింది.

కుమ్మక్కైన ఆ పోలీసులెవరు?

హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో విస్తృత చర్చ

అప్పట్లో పనిచేసిన కొందరు పోలీసులపై తీవ్ర ఆరోపణలు

11లో


అదుపులోకి రాని బ్లోఅవుట్

రెండోరోజు అగ్నికీలల తీవ్రత తగ్గుదల

శ్రమిస్తున్న ఓఎన్‌జీసీ బృందాలు

అరికట్టేందుకు మరికొన్నిరోజులు

ఈనాడు, అమలాపురం; న్యూస్‌టుడే, మామిడికుదురు, మలికిపురం: డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బ్లోఅవుట్ ఇంకా అదుపులోకి రాలేదు. మలికిపురం మండలం ఇరుసుమండ వద్ద ఓఎన్‌జీసీ బావిలో సోమవారం మధ్యాహ్నం నుంచి 30 మీటర్ల ఎత్తున అగ్నిజ్వాలలు ఆరంభమైన విషయం తెలిసిందే. మంగళవారం నాటికి తీవ్రత తగ్గినప్పటికీ ఇంకా 10 నుంచి 15 మీటర్లకు పైగా ఎగసిపడుతూనే ఉన్నాయి. బావిలో గ్యాస్ పీడన స్థాయి క్రమంగా తగ్గుతుండడంతో ఓఎన్‌జీసీ చర్యలు ముమ్మరం చేసింది. క్షేత్రస్థాయిలో విపత్తుల నిర్వహణ బృందం (సీఎంటీ), (మిగతా 2లో)



ఇరుసుమండలోని మోరి-5 ఓఎన్‌జీసీ డ్రిల్లింగ్ సైట్‌లోని బావిలో రెండోరోజూ ఎగసిపడుతున్న మంటలను అదుపుచేసే యత్నాలు

మంటలు ఆర్పేందుకు జాతీయ, అంతర్జాతీయ సాయం తీసుకోండి
● నష్టపోయిన వారికి సత్వరమే పరిహారం అందేలా చూడండి: చంద్రబాబు

బ్లోఅవుట్ నియంత్రణకు అమెరికా నిపుణులు
● పూర్తిగా అదుపు చేసేందుకు పది రోజులు పట్టే అవకాశం

2లో

అనుమతుల్లేని పనులతో

₹ 2,745 కోట్ల వృథా



సీమ పేరు చెప్పి ఇదేం నిర్వాకం జగన్?

పెద్దిరెడ్డి కంపెనీలకే పనులు ఇచ్చి దోపిడీ

సీమ ఎత్తిపోతల ఆగిపోయింది మీ హయాంలోనే కదా?

మంత్రి రామానాయుడు నిలదీత

సీమ ప్రాజెక్టులపై ప్రజెంటేషన్


ఈనాడు, అమరావతి: 'అనుమతులేవీ తీసుకోకుండా రాయలసీమకు నీళ్లిస్తామంటూ జగన్ ప్రభుత్వం పనులు చేపట్టి రూ.2,745 కోట్లు వృథా చేసింది. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కంపెనీకే పనులు అప్పగించి ఉపయోగం లేని పనులన్నీ చేసి రూ.వేల కోట్లు బిల్లులు ఇచ్చేసింది. ప్రజలు జగన్‌ను నమ్మి అధికారం అప్పగిస్తే ఇంత దోపిడీ, లూటీయా? మీ హయాంలో సీమలో ఏ ప్రాజెక్టు పూర్తి చేశారు జగన్? అన్నమయ్య ప్రాజెక్టు కొట్టుకుపోతున్నా చూస్తూ కూర్చుని 39 మంది మరణానికి కారణమైన మీరు సీమ ప్రజలకు ఏం సమాధానం చెబుతారు? రాయలసీమ ఎత్తిపోతల (మిగతా 2లో)

రూ.19,391 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

11,753 మందికి ఉపాధి అవకాశాలు

14వ ఎస్ఐపీబీ సమావేశంలో నిర్ణయం

2025లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు



ఇదే ఉత్సాహంతో పనిచేయాలని అధికారులకు సీఎం సూచన 3లో

అమరావతి ఓఆర్ఆర్‌కు.. ఎన్టీఆర్ జిల్లాలో 1,416 హెక్టార్ల భూసేకరణ

● నోటిఫికేషన్ జారీ 8లో

భారమైన హృదయంతో బాధ్యతలు చేపడుతున్నా



మదురో దంపతులను అమెరికా అపహరించింది

కొత్త అధ్యక్షురాలు రోడ్రిగ్జ్ వెల్లడి 10లో

ఇదీ సంగతి!



గోదావరి పిలుస్తోంది.. పండక్కొచ్చేయండి!



కాలువ గట్లపై విహారం.. కేరళ తరహా పడవ పోటీలు

ప్రభుత్వ ఆధ్వర్యంలో అట్టహాసంగా సంక్రాంతి సంబరాలు

11 నుంచి 3 రోజులపాటు ఆత్రేయపురంలో ఉత్సవాలు

తెలుగు రాష్ట్రాల నుంచి భారీగా తరలివస్తారని అంచనా

ఈనాడు, అమరావతి: సంక్రాంతి అనగానే కోస్తా జిల్లాల్లో రంగవల్లులు.. గొబ్బెమ్మలు.. హరిదాసులు.. గంగిరెద్దులు.. కోడిపందేలు గుర్తొస్తాయి. సంక్రాంతి పండగ వస్తోందంటే గోదావరి జిల్లాల్లో.. మరీ ముఖ్యంగా కోనసీమలోని పచ్చని పల్లెలన్నీ కొత్తశోభను సంతరించుకుంటాయి. కోడిపందేలు, ప్రభలతీర్థాలు, నోరూరించే పిండివంటలు ఎక్కడెక్కడివారిని రా రమ్మని ఆహ్వానిస్తాయి. పెద్ద పండగకు మరిన్ని సొబగులద్ది... రాష్ట్రప్రభుత్వం ఈసారి సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటేలా మరింత ఆకర్షణీయంగా నిర్వహించబోతోంది. కేరళలో ఓనం లాంటి ప్రత్యేక సందర్భాల్లో నిర్వహించే పడవ పోటీలు ఈసారి సంక్రాంతికి ప్రత్యేక ఆకర్షణగా నిలవబోతున్నాయి. ఇంతవరకు స్థానిక ప్రజలు, సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సంక్రాంతి ఉత్సవాల్ని రాష్ట్రప్రభుత్వం ఈసారి వ్యవస్థీకృతం చేసింది. బ్రాండ్ ఇమేజ్ కల్పించేందుకు ప్రత్యేకంగా నిధులు కేటాయించింది. ఆత్రేయపురం, ఎస్.యానాం, పిఠాపురాల్లో సంక్రాంతి సంబరాల్ని అట్టహాసంగా నిర్వహిస్తోంది. డ్రాగన్ పడవ పోటీలు, ఈత, గాలిపటాల పోటీలు, మహిళలకు రంగవల్లుల పోటీలు, కోనసీమ సంప్రదాయ పిండివంటలతో (మిగతా 3లో)

సంక్రాంతికి 8,432 ప్రత్యేక బస్సు సర్వీసులు 3లో


ఛాంపియన్

మహిళల ప్రీమియర్ లీగ్‌లో ముంబయి ఇండియన్స్ ఉత్తమ జట్టు అనడంలో మరో మాట లేదు. మూడు సీజన్లలో రెండుసార్లు ఆ జట్టు కప్పు గెలిచింది. ఈసారి కూడా ఫేవరెట్లలో ఒకటిగా, డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతోంది. ఇక రెండేళ్ల ముందు టైటిల్ సాధించిన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఎప్పట్లాగే బలంగా కనిపిస్తోంది. యూపీ వారియర్స్ ఈసారి జట్టును మార్చుకుని, బలమైన క్రికెటర్లను చేర్చుకుని తొలి కప్పు గెలవాలనే పట్టుదలతో బరిలోకి దిగుతోంది. ఈ జట్ల బలాబలాలేంటో చూద్దామా!

ఈనాడు క్రీడావిభాగం

మేటి జట్లలో మెరుపులెవరివో!

డబ్ల్యూపీఎల్-4 మరో 2 రోజుల్లో


గ్రేస్ హారిస్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు

పురుషుల ఐపీఎల్‌లో మాదిరే.. మహిళల లీగ్‌లోనూ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు ఉన్న ఆకర్షణే వేరు. కెప్టెన్ స్మృతి మంధాన, విధ్వంసక వికెట్ కీపర్ బ్యాటర్ రిచా ఘోష్.. మహిళల క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ ఆల్‌రౌండర్ అనదగ్గ ఎలిస్ పెర్రీలతో ఆ జట్టు అభిమానుల దృష్టిని మొదట్నుంచీ బాగా ఆకర్షిస్తోంది. అయితే పురుషుల ఐపీఎల్ లాగా కప్పు కోసం ఆ జట్టు సుదీర్ఘ కాలం ఎదురు చూడాల్సిన అవసరం లేకపోయింది. రెండో సీజన్లోనే స్మృతి బృందం కప్పు పట్టేసింది. అయితే గతేడాది ఆ జట్టు అంచనాలను అందుకోలేకపోయింది. ఈసారి పెర్రీ అందుబాటులో లేకపోయినా.. ఆల్‌రౌండర్లు గ్రేస్ హారిస్, నడైన్ డిక్లెర్క్, బ్యాటర్ జార్జియా వోల్, పేసర్ లారెన్ బెల్, స్పిన్నర్ లిన్సీ స్మిత్‌లతో ఆ జట్టు అంతర్జాతీయ బలం బాగుంది. శ్రేయాంక, పూజ వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, రాధ యాదవ్‌లతో ఆ జట్టు దేశీయ బౌలింగ్ బలం కూడా బాగుంది. అయితే స్పిన్‌లో ఆ జట్టు కొంత బలహీనంగా కనిపిస్తోంది. అలాగే స్మృతి, రిచా కాకుండా పేరున్న భారత బ్యాటర్ లేకపోవడం కూడా మైనస్.

భారతీయులు: స్మృతి మంధాన (కెప్టెన్), రిచా ఘోష్, దయాలన్ హేమలత, శ్రేయాంక పాటిల్, పూజ వస్త్రాకర్, అరుంధతి రెడ్డి, రాధ యాదవ్, ప్రేమ రావత్, గౌతమి నాయక్, సయాలి సత్ఘరే, కుమార్ ప్రత్యూష.

విదేశీయులు: గ్రేస్ హారిస్, జార్జియా వోల్, లారెన్ బెల్, నడైన్ డిక్లెర్క్, లిన్సీ స్మిత్.

ముంబయి ఇండియన్స్


హర్మన్ ప్రీత్

మూడు సీజన్లలో రెండుసార్లు ఫైనల్ చేరి, ఆ రెండుసార్లూ విజేతగా నిలవడం అంటే చిన్న విషయం కాదు. దీన్ని బట్టే హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని ముంబయి ఇండియన్స్ బలమేంటో అర్థం చేసుకోవచ్చు. పురుషుల ఐపీఎల్‌లో ఒకప్పటి ముంబయి జట్టు లాగే మహిళల బృందాన్ని కూడా లీగ్ ఆరంభంలోనే బలంగా తీర్చిదిద్దుకుంది ఫ్రాంఛైజీ. కెప్టెనే ఆ జట్టుకు అతి పెద్ద బలం. తన నాయకత్వ పటిమతో, ముందుండి నడిపించే బ్యాటింగ్ నైపుణ్యంతో జట్టును లీగ్‌లో అత్యంత విజయవంతమైన జట్టుగా మార్చింది హర్మన్‌ప్రీత్. ప్రపంచ అత్యుత్తమ ఆల్‌రౌండర్ల జాబితాలో ముందు వరుసలో ఉండే నాట్‌సీవర్ బ్రంట్, హేలీ మాథ్యూస్, అమేలియా కెర్ ఆ జట్టును దుర్భేద్యంగా మార్చారు. వీరికి తోడు షబ్నిమ్ ఇస్మాయిల్, నికోలా కేరీ రూపంలో విదేశీ మేటి క్రికెటర్లు ఆ జట్టు సొంతం. అమన్‌జ్యోత్ కౌర్, క్రాంతి రెడ్డి, సైకా ఇషాక్, సజీవన్ సజన లాంటి భారత ప్రతిభావంతులు ఆ జట్టు బలాన్ని పెంచుతున్నారు. అయితే హర్మన్‌ప్రీత్ కాకుండా బలమైన భారత బ్యాటర్ లేకపోవడం, దేశీయ స్పిన్ బలం కూడా తక్కువగా ఉండడం ఆ జట్టు బలహీనతలు.

భారత క్రికెటర్లు: హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), అమన్‌జ్యోత్ కౌర్, సజీవన్ సజన, సైకా ఇషాక్, కమలిని, పూనమ్ ఖేమ్నార్, రహీల ఫిర్దౌస్, సంస్కృతి గుప్తా, క్రాంతి రెడ్డి, త్రివేణి వశిష్ఠ.

విదేశీయులు: నాట్‌సీవర్ బ్రంట్, హేలీ మాథ్యూస్, అమేలియా కెర్, నికోలా కేరీ, షబ్నిమ్ ఇస్మాయిల్, మిల్లీ ఇల్లింగ్‌వర్త్.

యూపీ వారియర్స్


దీప్తి శర్మ

మహిళల క్రికెట్ చరిత్రలోనే మేటి కెప్టెన్లలో ఒకరిగా పేరు తెచ్చుకున్న మెగ్ లానింగ్ సారథ్యంలో యూపీ వారియర్స్ ఈసారి మెరుగైన ప్రదర్శన చేయాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతోంది. తొలి మూడు సీజన్లలో దిల్లీ క్యాపిటల్స్‌ను ఫైనల్స్‌కు చేర్చిన లానింగ్.. యూపీ రాతను కూడా మారుస్తుందనే అంచనాలున్నాయి. భారత అత్యుత్తమ ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఆ జట్టుకు అతి పెద్ద బలం. డియాండ్రా డాటిన్ రూపంలో బ్యాటుతో, బంతితో సత్తా చాటగల మరో సీనియర్ ఆ జట్టు సొంతం. సోఫీ ఎకిల్‌స్టోన్, చార్లీ నాట్, క్లో ట్రయాన్ లాంటి ఆల్‌రౌండర్లతో ఆ జట్టు కళకళలాడుతోంది. హర్లీన్ డియోల్, ప్రతీక రావల్ లాంటి టీమ్‌ఇండియా స్టార్లు.. కిరణ్ నవ్‌గిరే, శ్వేత సెహ్రావత్ లాంటి ప్రతిభావంతులు.. శిఖా పాండే లాంటి సీనియర్, క్రాంతి గౌడ్ లాంటి యువ పేసర్ ఆ జట్టు బలాన్ని పెంచుతున్నారు. అయితే కాగితం మీద బలంగా కనిపించినా.. సమష్టిగా ఆడలేకపోవడం మొదట్నుంచి యూపీకి ప్రతికూలతగా ఉంటోంది. ఈసారి లానింగ్ సారథ్యంలో ఆ బలహీనతను జట్టు అధిగమిస్తుందేమో చూడాలి.

భారతీయులు: దీప్తి శర్మ (కెప్టెన్), హర్లీన్ డియోల్, ప్రతీక రావల్, కిరణ్ నవ్‌గిరే, శ్వేత సెహ్రావత్, శిఖా పాండే, క్రాంతి గౌడ్, సుమన్ మీనా, ఆశ శోభన, సిమ్రన్ షేక్, గొంగడి త్రిష, షిప్రా గిరి.

విదేశీయులు: మెగ్ లానింగ్, ఫోబ్ లిచ్‌ఫీల్డ్, డియాండ్రా డాటిన్, చార్లీ నాట్, క్లో ట్రయాన్, సోఫీ ఎకిల్‌స్టోన్, టారా నోరిస్.

ఆయుష్ సంచలనం


ఆయుష్

కౌలాలంపూర్: మలేసియా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 టోర్నీలో భారత యువ షట్లర్ ఆయుష్ శెట్టి సంచలనం సృష్టించాడు. పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లీ జియా (మలేసియా)కు షాకిచ్చి ప్రీక్వార్టర్స్‌లోకి దూసుకెళ్లాడు. మంగళవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ఆయుష్ 21-12, 21-17తో లీ జియాపై విజయం సాధించాడు. స్టార్ షట్లర్ లక్ష్యసేన్ కూడా ముందంజ వేశాడు. తొలి రౌండ్లో అతడు 21-16, 15-21, 21-14తో జియా హెంగ్ జేసన్ (సింగపూర్)పై నెగ్గి ప్రీక్వార్టర్‌ఫైనల్లో అడుగుపెట్టాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో మాళవిక బన్సోద్ 11-21, 11-21తో ఇంతనాన్ రచనోక్ (థాయ్‌లాండ్) చేతిలో పరాజయంపాలైంది.

అమన్ అదరహో


అమన్ రావు 200 నాటౌట్


- 154 బంతుల్లో అజేయంగా 200
- సత్తా చాటిన సిరాజ్
- హైదరాబాద్‌కు మరో విజయం
- విజయ్ హజారే ట్రోఫీ

రాజ్‌కోట్

హైదరాబాద్ యువ ఆటగాడు అమన్ రావు (200 నాటౌట్; 154 బంతుల్లో 12×4, 13×6) అదరగొట్టాడు. అతడు మెరుపు ద్విశతకంతో చెలరేగడంతో విజయ్ హజారే ట్రోఫీలో హైదరాబాద్ మరో విజయాన్ని అందుకుంది. ఇప్పటికే నాకౌట్‌కు దూరమైన హైదరాబాద్ (8 పాయింట్లు)... మంగళవారం జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో 107 పరుగుల తేడాతో బెంగాల్‌ను చిత్తు చేసింది. మొదట హైదరాబాద్ 5 వికెట్లకు 352 పరుగులు చేసింది. ఆరంభంలో నెమ్మదిగా ఆడి 108 బంతుల్లో సెంచరీ అందుకున్న 21 ఏళ్ల అమన్.. ఆ తర్వాత రెచ్చిపోయాడు. మహ్మద్ షమి, ఆకాశ్ దీప్ లాంటి టీమ్‌ఇండియా బౌలర్లను ధాటిగా ఎదుర్కొని భారీ షాట్లు ఆడాడు. సిక్స్‌తో 150 పరుగులు అందుకున్న అమన్.. డబుల్ సెంచరీని కూడా సిక్స్‌తోనే పూర్తి చేయడం విశేషం. ఆకాశ్ దీప్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో ఒక బంతి మిగిలి ఉండగా.. అమన్ స్కోరు 194. ఆఖరి బంతిని స్టాండ్స్‌లో కొట్టిన ఈ హైదరాబాద్ కుర్రాడు ఘనంగా ద్విశతకాన్ని పూర్తి చేశాడు. రాహుల్ సింగ్ (64), తిలక్ వర్మ (34) కూడా రాణించారు. షమి 3 వికెట్లు తీశాడు. ఛేదనలో బెంగాల్ 44.4 ఓవర్లలో 245 పరుగులకే ఆలౌటైంది. షాబాజ్ అహ్మద్ (108) సెంచరీ చేసినా.. జట్టును గెలిపించలేకపోయాడు. న్యూజిలాండ్‌తో వన్డే జట్టుకు ఎంపికైన సిరాజ్ (4/58) సత్తా చాటాడు. ఆరు మ్యాచ్‌ల్లో హైదరాబాద్‌కు ఇది రెండో విజయం. గ్రూప్-బిలో ఉత్తర్‌ప్రదేశ్ (24) ఇప్పటికే క్వార్టర్స్ చేరగా.. 16 పాయింట్లతో ఉన్న విదర్భ, బెంగాల్, బరోడా రెండో బెర్తు కోసం పోటీపడుతున్నాయి.

ఆంధ్ర-హరియాణా మ్యాచ్ టై: ఆంధ్ర-హరియాణా మధ్య ఆలూర్‌లో జరిగిన గ్రూప్-డి మ్యాచ్ అనూహ్యంగా టైగా ముగిసింది. మొదట బ్యాటింగ్ చేసిన హరియాణా 49.5 ఓవర్లలో 324 పరుగులకు ఆలౌటైంది. హిమాంశు రాణా (112) సెంచరీ చేశాడు. ఆంధ్ర బౌలర్లలో సత్యనారాయణ రాజు (5/44), జాగర్లపూడి రామ్ (3/61) ఆకట్టుకున్నారు. ఛేదనలో ఆంధ్ర 48 ఓవర్లలో 307/7తో ఉన్న సమయంలో వెలుతురు లేమి కారణంగా మ్యాచ్‌ను ఆపేశారు. వీజేడీ పద్ధతి ప్రకారం స్కోర్లు సమమైనట్లు తేలడంతో మ్యాచ్‌ను టైగా ప్రకటించారు. జ్ఞానేశ్వర్ (142 నాటౌట్; 141 బంతుల్లో 15×4, 2×6) అజేయ సెంచరీ సాధించాడు. శ్రీకర్ భరత్ (70), ప్రసాద్ (35), సందీప్ (20) రాణించారు. హరియాణా బౌలర్లలో అన్షుల్ కాంబోజ్ (3/40), సామంత్ (2/38) సత్తా చాటారు. ఆరు మ్యాచ్‌ల్లో ఒకే మ్యాచ్ గెలిచిన ఆంధ్ర (6 పాయింట్లు) ఇప్పటికే నాకౌట్‌కు దూరమైంది.

● లిస్ట్-ఎ క్రికెట్లో హైదరాబాద్ తరఫున అత్యధిక వ్యక్తిగత స్కోరు సాధించిన ఘనత అమన్‌దే. అజహరుద్దీన్ (161 నాటౌట్, గోవాపై, 1994)ను అతడు అధిగమించాడు.


శ్రేయస్

మెరిసిన శ్రేయస్: న్యూజిలాండ్‌తో వన్డే సిరీస్‌కు ఎంపికైన శ్రేయస్ అయ్యర్ (82; 53 బంతుల్లో 10×4, 3×6) ఫిట్‌నెస్, ఫామ్‌ను నిరూపించుకున్నాడు. గాయం నుంచి కోలుకున్న అతడిని.. ఫిట్‌నెస్‌ను పరీక్షించాకే తుది జట్టులో ఆడించాలని సెలక్టర్లు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో విజయ్ హజారే ట్రోఫీలో ముంబయికి ఆడుతూ హిమాచల్ ప్రదేశ్‌పై శ్రేయస్ సత్తా చాటాడు. స్వేచ్ఛగా ఆడిన ఈ కుడి చేతి వాటం బ్యాటర్.. సెంచరీ చేసేలా కనిపించాడు. కానీ కుశాల్ బౌలింగ్‌లో ఓ షాట్ ఆడే క్రమంలో నిష్క్రమించాడు. రఘువంశీ (92), ముషీర్‌ఖాన్ (73), సిద్ధేశ్ (52) కూడా రాణించడంతో ముంబయి 7 పరుగుల తేడాతో హిమాచల్‌ను ఓడించింది. యశస్వి జైస్వాల్ (3) విఫలమయ్యాడు. మరో మ్యాచ్‌లో పంజాబ్‌కు ఆడుతూ శుభ్‌మన్ గిల్ (11) సైతం రాణించలేకపోయాడు. హర్నూర్ సింగ్ (94) నమన్ ధీర్ (68) మెరుపులతో పంజాబ్ 6 వికెట్ల తేడాతో గోవాను ఓడించింది. గ్రూప్-సి నుంచి పంజాబ్, ముంబయి చెరో 20 పాయింట్లతో నాకౌట్ చేరాయి.

రాణించిన పంత్: సర్వీసెస్‌తో మ్యాచ్‌లో రిషబ్ పంత్ (67 నాటౌట్; 37 బంతుల్లో 4×4, 3×6) మెరిశాడు. ప్రియాంశ్ ఆర్య (72; 45 బంతుల్లో 9×4, 3×6) కూడా రాణించడంతో గ్రూప్-డి మ్యాచ్‌లో సర్వీసెస్‌పై దిల్లీ గెలిచి నాకౌట్ చేరింది. రాజస్థాన్‌తో గ్రూప్-ఎ మ్యాచ్‌లో కర్ణాటక స్టార్ కేఎల్ రాహుల్ (25) రాణించలేకపోయాడు. అయినా ఆ జట్టు 150 పరుగుల తేడాతో గెలిచింది. మయాంక్ అగర్వాల్ (100), దేవ్‌దత్ పడిక్కల్ (91) మరోసారి సత్తా చాటారు. ఈ గెలుపుతో 24 పాయింట్లతో కర్ణాటక తర్వాతి దశకు చేరింది.

హర్మన్.. 13వ ర్యాంకులో

దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఐసీసీ టీ20 ర్యాంకుల్లో మెరుగైంది. ఇటీవల శ్రీలంకతో సిరీస్‌లో రాణించిన ఆమె రెండు స్థానాలు ఎగబాకి 13వ స్థానానికి చేరింది. స్మృతి మంధాన మూడు, షెఫాలి వర్మ ఆరో స్థానాల్లో కొనసాగుతుండగా.. జెమీమా రోడ్రిగ్స్ 12వ స్థానానికి పడింది. ఆస్ట్రేలియా బ్యాటర్ బెత్ మూనీ అగ్రస్థానంలో ఉంది. ఆల్‌రౌండర్లలో దీప్తి శర్మ అగ్రస్థానాన్ని కోల్పోయింది. ఆస్ట్రేలియా ప్లేయర్ అనాబెల్ సదర్లాండ్ (736 పాయింట్లు) దీప్తి కంటే ఒక పాయింట్ అధిక్యంతో నంబర్‌వన్ స్థానాన్ని దక్కించుకుంది. బౌలర్లలో భారత యువ స్పిన్నర్ శ్రీచరణి అయిదు స్థానాలు మెరుగై 47వ ర్యాంకుకు చేరుకుంది.

హెడ్, స్మిత్ శతకాలు


హెడ్ 163

- పట్టుబిగించిన ఆస్ట్రేలియా
- ఇంగ్లాండ్‌తో యాషెస్ చివరి టెస్టు


స్మిత్ 129 బ్యాటింగ్

సిడ్నీ: ఇంగ్లాండ్‌తో చివరిదైన అయిదో టెస్టుపై ఆస్ట్రేలియా పట్టుబిగించింది. ఓవర్‌నైట్ స్కోరు 166/2తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆ జట్టు.. ట్రావిస్ హెడ్ (163; 166 బంతుల్లో 24×4, 1×6), స్టీవ్ స్మిత్ (129 బ్యాటింగ్; 205 బంతుల్లో 15×4, 1×6) శతకాలు బాదడంతో భారీ స్కోరు సాధించింది. మంగళవారం ఆట ముగిసే సమయానికి 7 వికెట్ల నష్టానికి 518 పరుగులు చేసింది. ఇప్పటికే 134 పరుగుల ఆధిక్యం సంపాదించింది. స్మిత్‌కు తోడుగా వెబ్‌స్టర్ (42 బ్యాటింగ్) క్రీజులో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 384 పరుగులు చేసింది.

సత్తాచాటిన స్మిత్: ఆస్ట్రేలియా ఓపెనర్ ట్రావిస్ హెడ్ సిరీస్‌లో మూడో శతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. హేడెన్ (2002-03) తర్వాత యాషెస్ సిరీస్‌లో మూడు శతకాలు చేసిన తొలి ఆస్ట్రేలియా ఓపెనర్‌గా ఘనత సాధించాడు. 91 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజును మొదలెట్టిన అతడు.. ధాటైన బ్యాటింగ్‌ను కొనసాగించాడు. నైట్‌వాచ్‌మన్ నీసర్ (ఓవర్‌నైట్ 1)తో కలిసి ఇన్నింగ్స్‌ను నడిపించాడు. మూడో వికెట్‌కు 72 పరుగులు జోడించాక నీసర్ (24) ఔటైనా.. స్మిత్‌తో కలిసి హెడ్ ఆధిపత్యాన్ని కొనసాగించాడు. 152 బంతుల్లో 150 పరుగులు చేసిన అతడు.. కాసేపటి తర్వాత బెతెల్ బౌలింగ్‌లో వెనుదిరిగాడు. కానీ క్రీజులో పాతుకుపోయిన స్మిత్.. చక్కని బ్యాటింగ్‌తో జట్టును భారీ స్కోరు వైపు నడిపించాడు. అతడు ఖవాజా (17)తో అయిదో వికెట్‌కు 51, గ్రీన్ (37)తో ఏడో వికెట్‌కు 71, వెబ్‌స్టర్‌తో అభేద్యమైన ఎనిమిదో వికెట్‌కు 81 పరుగులు జోడించి ఆసీస్‌ను తిరుగులేని స్థితిలో నిలిపాడు. కార్స్ 3 వికెట్లు పడగొట్టాడు.

సంక్షిప్త స్కోర్లు... ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్: 384; ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్: 518/7 (హెడ్ 163, స్మిత్ 129 బ్యాటింగ్, లబుషేన్ 48, వెబ్‌స్టర్ 42 బ్యాటింగ్, గ్రీన్ 37; కార్స్ 3/108, స్టోక్స్ 2/87)

ఫిలిప్స్ ఎడమ చేత్తో..


ఫిలిప్స్

దిల్లీ: న్యూజిలాండ్ స్టార్ గ్లెన్ ఫిలిప్స్ కుడి చేతి వాటం బ్యాటర్. కానీ ఇటీవల సూపర్ స్మాష్ టోర్నీలో ఎడమ చేత్తో బ్యాటింగ్ చేసి ఆశ్చర్యపరిచాడు. త్వరలో జరిగే టీ20 ప్రపంచకప్‌లో ఎడమ చేతి స్పిన్నర్లను ఎదుర్కొనే ఉద్దేశంతోనే తాను ఇలా ఆడానని ఫిలిప్స్ వెల్లడించాడు. "ఎడమ చేత్తో బ్యాటింగ్ చేయడాన్ని ఆస్వాదిస్తున్నా. ఇందుకు రెండు కారణాలు ఉన్నాయి. రెండు చేతులతో ఆడడం వల్ల మన బుర్ర రెండు వైపులా పని చేస్తుంది. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్‌ను సమర్థంగా ఎదుర్కోవచ్చు. చాలా ఏళ్లుగా ఎడమ చేత్తో ఆడటాన్ని సాధన చేస్తున్నా. ఉపఖండంలో జరిగే టీ20 ప్రపంచకప్‌లో ఎడమ చేతి వాటం స్పిన్నర్లను ఆడేందుకు సిద్ధమవుతున్నా" అని ఫిలిప్స్ చెప్పాడు. సూపర్ స్మాష్ టోర్నీలో ఒటాగోకు ప్రాతినిధ్యం వహిస్తూ సెంట్రల్ డిస్ట్రిక్ట్స్‌పై ఫిలిప్స్ కొన్ని ఓవర్లు ఎడమ చేత్తో బ్యాటింగ్ చేశాడు. ఓ సిక్స్ కూడా కొట్టాడు. భారత్‌తో మూడు వన్డేల సిరీస్‌లో పాల్గొనే న్యూజిలాండ్ జట్టులో ఫిలిప్స్ సభ్యుడు.

క్రాంతి తండ్రి మళ్లీ పోలీసుగా..

భోపాల్: భారత మహిళల జట్టు ఫాస్ట్‌బౌలర్ క్రాంతి గౌడ్ తండ్రి మున్నా సింగ్‌కు తిరిగి కానిస్టేబుల్ ఉద్యోగం లభించింది. 2012లో ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు ఆయన సస్పెండయ్యారు. మధ్యప్రదేశ్ ప్రభుత్వం ఇప్పుడు ఆయనను పునర్నియమించింది. ప్రభుత్వ నిర్ణయం క్రాంతి కుటుంబానికి గొప్ప ఊరటని మధ్యప్రదేశ్ క్రీడల మంత్రి విశ్వాస్ సారంగ్ చెప్పారు.

కోహ్లి సులభమైన ఫార్మాట్ ఎంచుకున్నాడు


సంజయ్ మంజ్రేకర్

ముంబయి: టీమ్ఇండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లి టెస్టులకు రిటైర్మెంట్ ప్రకటించడంపై మాజీ ఆటగాడు సంజయ్ మంజ్రేకర్ మండిపడ్డాడు. క్రికెట్లో కొనసాగడానికి అతడు తేలికైన ఫార్మాట్ (వన్డేలు)ను ఎంచుకున్నాడని అన్నాడు. యాషెస్ అయిదో టెస్టులో రూట్ సెంచరీ చేసిన నేపథ్యంలో మంజ్రేకర్ స్పందించాడు. "జో రూట్ టెస్టుల్లో మరింత ఎత్తుకు ఎదిగాడు. రూట్, విలియమ్సన్ లేదా స్మిత్ సెంచరీ చేసిన ప్రతిసారి కోహ్లి గుర్తొస్తాడు. ఎందుకంటే అతడు టెస్టు క్రికెట్ కోసం ఎంతో శ్రమించాడు. కాదంటారా..? కానీ అతడు అప్పుడే టెస్టుల నుంచి రిటైరయ్యాడు. దురదృష్టకరమైన విషయమేంటంటే.. రిటైర్మెంట్‌కు ముందు అయిదేళ్లు అతడు ఇబ్బందిపడ్డాడు. తన సమస్యేంటో, అయిదేళ్లలో తాను 31 సగటు మాత్రమే నమోదు చేయడానికి కారణమేంటో కనుక్కోవడానికి అతడు మనస్ఫూర్తిగా ప్రయత్నించలేదు. కష్టపడలేదు" అని అన్నాడు. "కోహ్లి అన్ని రకాల ఫార్మాట్ల నుంచి రిటైరైవుంటే బాగానే ఉండేది. కానీ అతడు వన్డే క్రికెట్ ఆడాలని నిర్ణయించుకోవడం నాకు ఎక్కువ నిరాశను కలిగించింది. ఎందుకంటే నేను ఇంతకుముందే చెప్పినట్లు ఏ టాప్ ఆర్డర్ బ్యాటర్‌కైనా ఈ ఫార్మాట్ చాలా తేలికైంది" అని మంజ్రేకర్ అన్నాడు. ఇప్పటికీ టెస్టు క్రికెట్టే అత్యున్నతమైందని అతడు అభిప్రాయపడ్డాడు.

ఆస్ట్రేలియన్ ఓపెన్ విజేతకు రూ. 25 కోట్లు

మెల్‌బోర్న్: 2026 ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీ ప్రైజ్‌మనీ రికార్డు స్థాయిలో పెరిగింది. టోర్నీ నిర్వాహకులు మంగళవారం ప్రైజ్‌మనీకి సంబంధించి వివరాలు వెల్లడించారు. నగదు బహుమతిని రూ.585 కోట్ల నుంచి రూ.676 కోట్లకు పెంచారు. గత ఏడాదితో పోలిస్తే ఇది 16 శాతం అధికం. పురుషులు, మహిళల సింగిల్స్ ఛాంపియన్లు రూ.25 కోట్ల చొప్పున అందుకోనున్నారు. ఇది గత ఏడాది కంటే 19 శాతం ఎక్కువ.

జమ్ముకశ్మీర్ తొలిసారి

బీసీసీఐ ట్రోఫీ సొంతం

సూరత్: జమ్ముకశ్మీర్ క్రికెట్ జట్టు తొలిసారి ఓ బీసీసీఐ ట్రోఫీ సొంతం చేసుకుంది. విజయ్ మర్చంట్ ట్రోఫీ (ప్లేట్)లో విజేతగా నిలిచింది. మంగళవారం ఫైనల్లో జమ్ముకశ్మీర్ అండర్-16 జట్టు ఇన్నింగ్స్ 182 పరుగుల తేడాతో మిజోరాంను ఓడించింది. కెప్టెన్ స్మేగీ ఖజూజూరియా (102), అథర్వ్ శర్మ (92 నాటౌట్) శతకాలతో రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో జమ్ముకశ్మీర్ 400 పరుగులకు ఆలౌటైంది. అనంతరం మిజోరాం తొలి ఇన్నింగ్స్‌లో 100 పరుగులకే కుప్పకూలింది. ఫాలోఆన్ ఆడుతూ రెండో ఇన్నింగ్స్‌లో 118 పరుగులకే ఆలౌటైంది. విజేత జట్టును జమ్ముకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా అభినందించారు. "చరిత్రాత్మక విజయంతో బీసీసీఐ ట్రోఫీ గెలవడం, ప్రత్యర్థిని చిత్తుగా ఓడించడం క్రికెట్లో జమ్ముకశ్మీర్ ఎదుగుదలను ప్రతిబింబిస్తోంది" అని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు.

ఫిబ్రవరి 14 నుంచి ఐఎస్ఎల్

దిల్లీ: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్) ఫిబ్రవరి 14న మొదలవుతుందని క్రీడల మంత్రి మన్‌సుఖ్ మాండవీయ మంగళవారం ప్రకటించారు. మొత్తం 14 క్లబ్‌లూ టోర్నీలో పాల్గొంటాయని తెలిపారు. వాణిజ్య భాగస్వామి లేక ఈ లీగ్ ఆలస్యమైంది. "ఐఎస్ఎల్ గురించి చాలా ఊహాగానాలు సాగుతున్నాయి. కానీ ఈ రోజు ప్రభుత్వం, ఫుట్‌బాల్ సమాఖ్య, మోహన్ బగాన్, ఈస్ట్‌బెంగాల్ సహా 14 క్లబ్‌లు సమావేశమయ్యాయి. ఐఎస్ఎల్‌ను ఫిబ్రవరి 14న ప్రారంభించాలని మేం నిర్ణయించాం. క్లబ్‌లన్నీ పోటీపడతాయి" అని మాండవీయ ప్రకటించారు. ఐఎస్ఎల్‌లో మొత్తం 91 మ్యాచ్‌లు జరుగుతాయని అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్ఎఫ్) అధ్యక్షుడు కళ్యాణ్ చౌబే చెప్పారు.

ఫైనల్లో బెంగాల్ × ఎస్‌జీ పైపర్స్

రాంచీ: మహిళల హాకీ ఇండియా లీగ్‌లో సూర్మా బెంగాల్ టైగర్స్ ఫైనల్‌కు దూసుకెళ్లింది. చివరి లీగ్ మ్యాచ్‌లో బెంగాల్ సడన్ డెత్‌లో ఎస్‌జీ పైపర్స్‌ను ఓడించింది. నిర్ణీత సమయంలో రెండు జట్లూ గోల్స్ చేయలేకపోయాయి. షూటౌట్లోనూ బెంగాల్-పైపర్స్ 2-2తో సమంగా నిలిచాయి. సడన్ డెత్‌లో బెంగాల్ తమ అయిదు ప్రయత్నాల్లో సఫలం కాగా.. పైపర్స్ నాలుగు గోల్సే చేసి ఓడింది. గురువారం జరిగే తుది పోరులో ఎస్‌జీ పైపర్స్‌తోనే బెంగాల్ తలపడనుంది.


మంగళవారం జరిగిన కార్యక్రమంలో విశ్వనాథన్ ఆనంద్, అర్జున్ ఇరిగేశి, ప్రజ్ఞానంద తదితరులు

నేటి నుంచి టాటా స్టీల్ చెస్

కోల్‌కతా: టాటా స్టీల్ చెస్ బుధవారం ఆరంభం కానుంది. విశ్వనాథన్ ఆనంద్‌తో పాటు అర్జున్ ఇరిగేశి, ప్రజ్ఞానంద వంటి భారత స్టార్లు ఈ ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నమెంట్లో పోటీపడుతున్నారు. ప్రపంచ ఛాంపియన్ గుకేశ్ ఇందులో ఆడట్లేదు. కిందటిసారి రెండు విభాగాల్లోనూ విజేతగా నిలిచిన ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) కూడా ఈ టోర్నీకి దూరంగా ఉన్నాడు. మహిళల విభాగంలో భారత్ నుంచి దివ్య దేశ్‌ముఖ్, హారిక, వైశాలి వంటి ప్లేయర్లు టైటిల్ కోసం పోటీపడనున్నారు.

ఈనాడు

విజయవాడ 7-1-2026 బుధవారం సిటీ సంపుటి 52 . సంచిక 148 THE LARGEST CIRCULATED TELUGU DAILY రూ. 6-50 పేజీలు 14 www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

నేటి నుంచి రాజధాని రెండోవిడత భూసమీకరణ

వడ్డమాను, ఎండ్రాయి గ్రామాలతో ప్రారంభం

ఏడు గ్రామాల్లో రైతుల నుంచి 16,666 ఎకరాల సమీకరణ

- రెండు వరుసల రహదారులు, విద్యుత్‌లైన్లు వేసి రైతులకు వేగంగా స్థలాల అప్పగింత
- సీడ్‌యాక్సెస్ రోడ్డు కోసం 4.50 ఎకరాలకు భూసేకరణ నోటిఫికేషన్ నేడు
- అమరావతిలో కృష్ణా తీరంలో మెరీనా ప్రాజెక్టు
- ముఖ్యమంత్రి అధ్యక్షతన సీఆర్డీఏ సమావేశంలో కీలక నిర్ణయాలు

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి కోసం రెండోవిడత భూసమీకరణ ప్రక్రియను తుళ్లూరు మండలంలోని వడ్డమాను, అమరావతి మండలంలోని ఎండ్రాయి గ్రామాల్లో ప్రభుత్వం బుధవారం ప్రారంభిస్తోంది. ఈ రెండు మండలాల్లో ఏడు గ్రామాల రైతుల నుంచి 16,666.57 ఎకరాలు సమీకరిస్తుంది. అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడానగరం, స్మార్ట్ పరిశ్రమలు, రైల్వే ట్రాక్, ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ఈ భూములు తీసుకుంటోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన సీఆర్డీఏ 57వ అథారిటీ సమావేశంలో భూసమీకరణ ప్రక్రియ ప్రారంభానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. తుళ్లూరు మండలంలోని వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి, అమరావతి మండలంలోని వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి గ్రామాల్లో ప్రభుత్వం ఇప్పుడు భూసమీకరణ చేస్తోంది. రైతులకు స్థలాలు కేటాయించే లేఅవుట్ల అభివృద్ధికి అథారిటీ ఈసారి కీలక నిర్ణయం తీసుకుంది. లేఅవుట్లలో మొదట రెండు వరుసల రహదారులు, విద్యుత్ లైన్లు వేసి వీలైనంత త్వరగా రైతులకు స్థలాలు అప్పగిస్తుంది. భూగర్భంలో డ్రెయిన్లు, తాగునీరు, ఐటీ కేబుల్ వంటి వసతుల్ని ఆ తర్వాత కల్పిస్తుంది. 2014-19 మధ్య తొలివిడతలో భూములిచ్చిన రైతులకు స్థలాలు కేటాయించినా లేఅవుట్లలో మౌలిక వసతుల్ని ఒకేసారి పూర్తిచేయాలని భావించడంతో రైతులకు స్థలాల అప్పగింత ఆలస్యమైంది. దాంతో మొదట రోడ్లు, విద్యుత్ సరఫరా కల్పిస్తే... రైతులు నిర్మాణాలు చేపట్టేందుకు వెసులుబాటు ఉంటుందని ఈ నిర్ణయం తీసుకుంది. సీఆర్డీఏ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల్ని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్‌తో కలసి విలేకర్లకు వెల్లడించారు. తొలివిడతలో భూములిచ్చిన రైతులకు ఇస్తున్న ప్యాకేజీనే... ఇప్పుడు భూములు తీసుకోబోయే రైతులకూ అందజేస్తామని నారాయణ తెలిపారు. తొలివిడతలో 29 గ్రామాలకు ఒకేసారి భూసమీకరణ నోటిఫికేషన్ జారీచేయగా... రెండోవిడతలో ప్రతి గ్రామానికి వేర్వేరుగా నోటిఫికేషన్లు జారీచేసి, ఎక్కడికక్కడ విడిగా ప్రక్రియ పూర్తి చేయబోతున్నారు.



మంగళవారం నిర్వహించిన సీఆర్డీఏ సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో మంత్రి నారాయణ, సీఎస్ విజయానంద్, పురపాలక శాఖ, సీఆర్డీఏ ఉన్నతాధికారులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

సీడ్‌యాక్సెస్ రోడ్డు కోసం భూసేకరణ

రాజధానిలో మంతెన సత్యనారాయణరాజు ప్రకృతి ఆశ్రమం నుంచి ప్రకాశం బ్యారేజీ వరకు... సీడ్‌యాక్సెస్ రోడ్డు రెండో విడత నిర్మాణానికి నాలుగున్నర ఎకరాల్ని భూసేకరణ విధానంలో తీసుకునేందుకు ప్రభుత్వం బుధవారం నోటిఫికేషన్ ఇస్తోంది. భూసమీకరణలో ఇవ్వాల్సిందిగా కోరినా యజమానులు ముందుకు రాకపోవడంతో భూసేకరణ నోటిఫికేషన్ ఇవ్వక తప్పట్లేదని మంత్రి నారాయణ తెలిపారు.

అమరావతిలో మెరీనా

అమరావతిలో కృష్ణాతీరంలో ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్య విధానంలో మెరీనా ప్రాజెక్టు (పర్యాటకుల జలవిహార కేంద్రం. ఇక్కడ జెట్టీలు నిర్మించి బోట్లు నిలుపుతారు) చేపట్టాలని అథారిటీ నిర్ణయించింది. దీనికి ఎకరం స్థలమిస్తారు. మెరీనా వాటర్‌ఫ్రంట్‌లో భాగంగా జెట్టీలు, టూరిజం లీజర్ బోట్లు, ఆహార కేంద్రాలు, ఇతర పర్యాటక ఆకర్షక వసతులు కల్పిస్తారు. 60 బోట్లు ఉంటాయి. వాటర్‌ఫ్రంట్ అభివృద్ధికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని, మెరీనా ప్రాజెక్టుకు వెంటనే టెండర్లు పిలవాలని సీఎం సూచించారు. "కృష్ణానదిలో వాటర్‌స్పోర్ట్స్ నిర్వహణకు ప్రణాళిక సిద్ధం చేయండి. ప్రకాశం బ్యారేజీకి ఎగువన నిర్మించే కొత్త బ్యారేజ్‌తో రాజధానికి పుష్కలంగా నీటి వనరులుంటాయి. కృష్ణానదికి ఇరువైపులా అద్భుతమైన వాటర్‌ఫ్రంట్ అభివృద్ధి చేద్దాం. నదిలోని దీవుల్ని పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాల్ని పరిశీలించండి'' అని సీఎం ఆదేశించారు.

అనాథ చిన్నారులకు పింఛను

రాజధానిలో భూమిలేని పేదలకు ఇస్తున్న పింఛను... ఇకపై అనాథలైన మైనర్లకూ వర్తింపజేసేలా నిబంధనలు సడలించాలని అథారిటీ నిర్ణయించింది. తల్లిదండ్రుల్ని కోల్పోయిన 8 మంది పిల్లలకు నెలకు రూ.5వేల చొప్పున పింఛను ఇవ్వనున్నారు. సీఆర్డీఏలో 2015లో జీవో81 ద్వారా మంజూరుచేసిన 754 పోస్టుల ర్యాటిఫికేషన్‌కు అథారిటీ ఆమోదం తెలిపింది. రాజధానికి భూములిచ్చిన రైతులకు కేటాయించిన వాణిజ్య స్థలాల్లో వీధిశూల ఉన్నవాటికి బదులు వేరే స్థలాల్ని కేటాయించేందుకు అథారిటీ ఆమోదించింది. అలాంటి 112 స్థలాల్ని గుర్తించింది. వాటిని రైతులు ఇప్పటివరకు మరెవరికీ విక్రయించకపోతే లాటరీ విధానంలో ప్రత్యామ్నాయ స్థలాలు కేటాయిస్తామని మంత్రి నారాయణ తెలిపారు. రాజధానిలో జరీబు, జరీబేతర భూముల అంశాన్ని తేల్చేందుకు ఏర్పాటుచేసిన కమిటీ బుధవారం నుంచి పని ప్రారంభిస్తోందని, 45 రోజుల్లో నివేదిక ఇస్తుందని ఆయన పేర్కొన్నారు.

ఖతార్ తరహాలో స్పోర్ట్స్ సిటీ

రాజధానిలో స్పోర్ట్స్ సిటీ అభివృద్ధికి ఖతార్ తరహా ప్రాజెక్టులను అధ్యయనం చేయాలని సీఆర్డీఏ, ఏడీసీ అధికారుల్ని ముఖ్యమంత్రి ఆదేశించారు. "సీఆర్డీఏ, ఏడీసీ ఆర్థికంగా బలోపేతమవ్వాలి. దానికి మంచి ఆర్థిక నమూనా రూపొందించాలి. ఆస్తులు సమకూర్చుకుని సుస్థిర ఆదాయం పొందేలా రెండు సంస్థలు ఎదగాలి'' అని స్పష్టం చేశారు.

బంగాళాఖాతంలో తీవ్ర అల్పపీడనం

ఈనాడు, విశాఖపట్నం: ఆగ్నేయ బంగాళాఖాతంలో శ్రీలంక సమీపంలో ఏర్పడిన అల్పపీడనం.. తీవ్ర అల్పపీడనంగా బలపడింది. ఇది పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతూ నైరుతి బంగాళాఖాతంలో బుధవారం నాటికి వాయుగుండంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం తెలిపింది. తర్వాత 48 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా తమిళనాడు తీరం వైపు కదలొచ్చని పేర్కొంది. అనంతరం ఇది తీవ్ర వాయుగుండంగా బలపడుతుందని, దీని ప్రభావం రాష్ట్రంపై ఉండబోదని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. అయితే, తమిళనాడులో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అంచనా వేస్తున్నారు. రాబోయే మూడు రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం నెలకొంటుందని, కొన్ని ప్రాంతాల్లో దట్టంగా పొగమంచు కురిసే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. శనివారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లోని కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. మిగిలిన ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని అంచనా వేసింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో చలి తీవ్రత తగ్గే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

అనుమతులు లేకుండా డీపీఆర్‌ల తయారీ

- తెలంగాణపై కేంద్రానికి కృష్ణా బోర్డు లేఖ

ఈనాడు, హైదరాబాద్: సీడబ్ల్యూసీ, కేఆర్ఎంబీ, ఎపెక్స్ కౌన్సిల్ నుంచి ఎటువంటి ఆమోదాలు, అనుమతులు లేకుండా తెలంగాణ పలు ప్రాజెక్టుల డీపీఆర్‌లను తయారు చేస్తోందని, అదే సమయంలో ప్రాజెక్టుల సామర్థ్యం పెంచుతోందంటూ కేంద్ర జలశక్తి శాఖకు కృష్ణా బోర్డు మంగళవారం లేఖ రాసింది. 'గత నెల ఎనిమిదో తేదీన తెలంగాణ ప్రాజెక్టులపై ఏపీ జలవనరుల శాఖ ఫిర్యాదు చేసింది. ఈ సమాచారాన్ని తెలంగాణకు బోర్డు పంపించి వివరణ ఇవ్వాలని సూచించినా ఇప్పటివరకు ఎటువంటి సమాధానం రాలేదు. 2014లో ఏర్పడిన బోర్డుకు ఉన్న అధికారాల ప్రకారం 2014 జూన్ రెండో తేదీకి ముందు పూర్తయిన లేదా నిర్మాణాలు చేపట్టిన ప్రాజెక్టులకు కేటాయింపులు, నీటి లభ్యత తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని కొత్తగా చేపట్టిన ప్రాజెక్టుల ప్రభావం వాటిపై ఉంటుందా లేదా అని పరిశీలించాల్సి ఉంటుంది. కృష్ణా జల వివాదాల ట్రైబ్యునల్-2 తీర్పు వెలువడే వరకు మొదటి ట్రైబ్యునల్ చేసిన కేటాయింపులే అమల్లో ఉంటాయి. కృష్ణా, గోదావరి నదులపై ఏపీ, తెలంగాణ చేపట్టిన 34 ప్రాజెక్టుల్లో తెలంగాణకు చెందిన రెండు ప్రాజెక్టులకు మాత్రమే హైడ్రాలజీ, అంతర్రాష్ట్ర క్లియరెన్స్‌లు ఉన్నాయి. మరో రెండు ప్రాజెక్టులు పునర్విభజన చట్టం కింద పేర్కొన్న జాబితాలో ఉన్నాయి. రెండు రాష్ట్రాల ప్రాజెక్టుల విషయంలో కృష్ణా, గోదావరి బోర్డులు.. తెలంగాణ, ఏపీలను ఎప్పటికప్పుడు ప్రాజెక్టుల వివరాలు చెప్పాలని కోరుతూనే ఉన్నాయి. రెండు రాష్ట్రాల నుంచి కేంద్ర జల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా కృష్ణా బోర్డుకు డీపీఆర్‌లు రాలేదు. ట్రైబ్యునల్-2 విచారణ కొనసాగుతుండగా.. ఇంకా నీటి కేటాయింపులు పూర్తి కానందున డీపీఆర్‌లు ఏవైనా అందినా వాటిని పరిశీలించడం సాధ్యం కాదు. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులకు సంబంధించిన అంశాలపై బోర్డు ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై కేంద్ర జల సంఘం తగు సూచనలు చేయాలి' అని లేఖలో కృష్ణా బోర్డు పేర్కొంది.

కవిత రాజీనామాకు ఆమోదం

తెలంగాణ మండలి ఛైర్మన్ నిర్ణయం



ఈనాడు, హైదరాబాద్: తెలంగాణ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రాజీనామాను ఆమోదిస్తూ ఆ రాష్ట్ర శాసన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు మంగళవారం మండలి కార్యదర్శి వి.నర్సింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా భారాస తరఫున 2021 డిసెంబరులో రెండోసారి ఎన్నికయ్యారు. 2022 జనవరిలో ప్రమాణ స్వీకారం చేశారు. 2023 నవంబరులో జరిగిన శాసనసభ, లోక్‌సభ ఎన్నికల్లో భారాస ఓటమి పాలైన అనంతరం పార్టీలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. 2024 ఏప్రిల్ 27న భారాస ఆవిర్భావసభ అనంతరం కవిత.. తన అసంతృప్తిని వ్యక్తం చేస్తూ పార్టీ అధినేత కేసీఆర్‌కు లేఖ రాయడం కలకలం రేపింది. అనంతరం వరుస పరిణామాలతో ఆమె క్రమేపీ పార్టీకి దూరమవుతూ వచ్చారు. పార్టీ సీనియర్‌నేత హరీశ్‌రావు, మాజీ ఎంపీ సంతోష్‌రావును లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేయడంతో కవితను గత సెప్టెంబరులో పార్టీ నుంచి సస్పెండ్ చేశారు. సస్పెన్షన్ లేఖ అందిన రోజే ఆమె తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశారు. సోమవారం కవిత శాసనమండలికి వచ్చి ప్రసంగించారు. తన రాజీనామాను ఆమోదించాలని మండలి వేదికగా ఛైర్మన్‌ను మరోసారి కోరారు. ఈ నేపథ్యంలోనే తాజాగా మంగళవారం రాత్రి కవిత రాజీనామాను ఆమోదించారు.

రూ.17 లక్షల కోట్లతో 852 పీపీపీ ప్రాజెక్టులు

- ఆంధ్రప్రదేశ్‌లో రూ.1.16 లక్షల కోట్లతో 270 ప్రాజెక్టులు

దిల్లీ: మూడేళ్ల కాల వ్యవధితో 852 పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) ప్రాజెక్టులను సృష్టించినట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ మంగళవారం వెల్లడించింది. కేంద్ర, రాష్ట్రాల మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖలు తీసుకొస్తున్న ఈ ప్రాజెక్టుల సంయుక్త విలువ రూ.17 లక్షల కోట్లకు పైనే ఉందని పేర్కొంది. 2025-26 కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన విధంగా ఆర్థిక మంత్రిత్వ శాఖలోని ఆర్థిక వ్యవహారాల విభాగం (డీఈఏ) 2026 ఆర్థిక సంవత్సరం నుంచి ప్రారంభమయ్యే మూడేళ్ల పీపీపీ ప్రాజెక్టులను రూపొందించింది. పెట్టుబడిదార్లు, డెవలపర్లు, ఇతర వాటాదార్లు మరింత సమాచారంతో కూడిన ప్రణాళిక, పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడానికి వీలుగా ఇవి ఉన్నాయని తెలిపింది.

■ రూ.13.15 లక్షల కోట్ల వ్యయంతో కూడిన 232 పీపీపీ ప్రాజెక్టులను కేంద్ర మౌలిక సదుపాయాల మంత్రిత్వ శాఖలు చేపడతాయని, రూ.3.84 లక్షల కోట్ల విలువైన 620 ప్రాజెక్టులను 20 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అమలు చేస్తాయని పేర్కొంది.

■ కేంద్ర ప్రభుత్వ వాటాలో గరిష్ఠంగా 108 ప్రాజెక్టులను (రూ.8.76 లక్షల కోట్ల విలువైన) రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ చేపడుతుంది. దీని తర్వాత విద్యుత్ మంత్రిత్వ శాఖ రూ.3.4 లక్షల కోట్ల విలువైన 46 ప్రాజెక్టులను, రైల్వే మంత్రిత్వ శాఖ రూ.30,904 కోట్ల విలువైన 13 ప్రాజెక్టులను చేపడుతున్నాయి.

■ రాష్ట్రాలకొస్తే ఈ ప్రాజెక్టుల్లో సింహభాగం ఆంధ్రప్రదేశ్‌కు వెళుతున్నాయి. రూ.1.16 లక్షల కోట్ల విలువైన 270 పీపీపీ ప్రాజెక్టులు ఏపీ చేపట్టనుంది. దీని తర్వాత తమిళనాడు 70 ప్రాజెక్టులు (రూ.87,640 కోట్లు), మధ్యప్రదేశ్ 21 ప్రాజెక్టులు (రూ.65,496 కోట్లు), జమ్మూ కశ్మీర్ 57 ప్రాజెక్టులు (రూ.21,374 కోట్లు) చేపడుతున్నాయి.

మంటలు ఆర్పేందుకు జాతీయ, అంతర్జాతీయ సాయం తీసుకోండి

బ్లోఅవుట్‌పై సమీక్షించిన సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో బ్లోఅవుట్ మంటల్ని ఆర్పేందుకు జాతీయ, అంతర్జాతీయ ఏజెన్సీల సహకారం తీసుకోవాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. కొబ్బరిచెట్లు కాలిపోయిన వారికి, ఇతరత్రా నష్టపోయినవారికి సత్వరమే పరిహారం అందించాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా ఓఎన్‌జీసీ సహా ఇతర భాగస్వామ్య సంస్థలతో సమావేశం నిర్వహించాలని సూచించారు. బ్లోఅవుట్‌పై మంగళవారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్షించారు. గ్యాస్ లీక్ అరికట్టేందుకు వివిధ విభాగాలు తీసుకుంటున్న చర్యల్ని సీఎస్ విజయానంద్, హోంమంత్రి అనిత, పోలీస్ ఉన్నతాధికారులు వివరించారు. ప్రమాద స్థలంలో ప్రస్తుత పరిస్థితి, ప్రజల రక్షణకు తీసుకుంటున్న చర్యల గురించి తెలియజేశారు. పునరావాస కేంద్రాల్లోని గ్రామాల ప్రజలకు అందుతున్న సౌకర్యాలపై సీఎం ఆరా తీశారు. ప్రమాదాలు జరిగినప్పుడు ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతారని, వారికి ఎప్పటికప్పుడు వాస్తవ పరిస్థితి వివరించి అండగా నిలవాలని సూచించారు. 'బ్లోఅవుట్ కారణంగా ఊళ్లు, ఇళ్లు వదిలిన వారు ఇబ్బంది పడకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉంది' అని నిర్దేశించారు.

ఇదిగో మన హైడ్రోజన్ రైలు

త్వరలోనే హరియాణాలో ప్రారంభం



చండీగఢ్: భారత్‌లో మొట్టమొదటిసారిగా హైడ్రోజన్‌తో నడిచే రైలును ప్రారంభించేందుకు హరియాణా సిద్ధంగా ఉంది. ఉత్తర రైల్వే ఆధ్వర్యంలో రూపొందిన ఈ రైలు జింద్-సోనిపత్ మధ్య పరుగులు తీయనుంది. ఈ రైలుకు ఇంధనం అందించడానికి జింద్‌లో హైడ్రోజన్ ప్లాంట్‌ను ప్రత్యేకంగా ఏర్పాటుచేశారు. ప్రారంభం, నిర్వహణ దశలకు 11 కేవీల విద్యుత్ సరఫరాను ఈ ప్లాంట్ అంతరాయం లేకుండా అందించనుంది. దీని సామర్థ్యం 3000 కిలోగ్రాములు. ఈ ప్రాజెక్టును సమీక్షించేందుకు హరియాణా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనురాగ్ రస్తోగి దక్షిణ హరియాణా బిజ్లీ వితరణ్ నిగమ్(డీహెచ్‌బీవీఎన్)కు చెందిన అధికారులతో సమావేశమయ్యారు. ప్రస్తుతం చివరి దశ పనులు కొనసాగుతుండగా.. త్వరలోనే దీన్ని ప్రారంభించనున్నారు.

యూపీలో 2.89 కోట్ల ఓట్లు తొలగింపు

సవరించిన ఓటరు ముసాయిదా విడుదల

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) అనంతరం ఓటరు ముసాయిదా జాబితాను ప్రధాన ఎన్నికల అధికారి(సీఈఓ) నవదీప్ రిణవా మంగళవారం విడుదల చేశారు. మొత్తం 12.55 కోట్ల మందిని ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చారు. 2.89 కోట్ల(18.70 శాతం) ఓటర్లను జాబితా నుంచి తొలగించారు. ఓటర్ల పేర్లు లేకపోయినా, తప్పిదాలున్నా ఆన్‌లైన్ వేదికగా అభ్యంతరాలు తెలిపేందుకు నెల రోజులు(ఫిబ్రవరి 6) గడువు కల్పించారు. అభ్యంతరాలు పరిష్కరించిన తర్వాత ఎస్‌ఐఆర్ తుది జాబితా మార్చి 6న విడుదల చేయనున్నట్లు నవదీప్ వెల్లడించారు. సర్‌కు ముందు రాష్ట్రంలో 15.44 కోట్లమంది ఓటర్లు ఉన్నారు. తొలగించిన ఓట్లలో.. 2.57 కోట్ల మంది సంబంధిత చిరునామాలో లేరని వెల్లడైంది. 46.23 లక్షల మంది మరణించగా, 25.27 లక్షల మందికి ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటు హక్కు ఉందని నవదీప్ తెలిపారు. ఈ ముసాయిదా జాబితాను సమాజ్‌వాదీ పార్టీ సహా వివిధ ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండించాయి. ఓటర్ల కోపం తీవ్రస్థాయికి చేరకముందే జాబితాను సవరించాలని ఈసీని అఖిలేశ్ యాదవ్ హెచ్చరించారు.

ఎక్మోతో రోగికి పునర్జన్మ!

విజయవాడ ఆస్టర్ రమేష్ ఆసుపత్రిలో అరుదైన చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ రమేష్ బాబు, పక్కన వైద్యులు రాజా రమేష్, కార్తికేయ, పవన్ తదితరులు

విజయవాడ (కరెన్సీనగర్), న్యూస్‌టుడే: హైపర్ థైరాయిడిజంతో హార్ట్ ఫెయిల్ అయిన వ్యక్తికి ఎక్మో సాయంతో చికిత్స చేసి ప్రాణాలు కాపాడినట్లు విజయవాడలోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ పోతినేని రమేష్ బాబు తెలిపారు. ఈ తొలి చికిత్స చేయడం అరుదన్నారు. మంగళవారం వివరాలను వెల్లడిస్తూ.. "పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన 37 ఏళ్ల యువకుడిని ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి తీసుకొచ్చారు. హైపర్ థైరాయిడిజం కారణంగా ఏర్పడిన తీవ్రమైన కార్డియోజెనిక్ షాక్‌కు గురైనట్లు గుర్తించాం. ఈ స్థితిలో గుండె రక్తాన్ని పంపింగ్ చేయలేకపోవడంతో ప్రాణాలకు ప్రమాదం ఏర్పడింది. కాపాడేందుకు అత్యాధునిక 'వీఏ ఎక్మో'ను అమర్చాం. దాని సాయంతో రక్త ప్రసరణ చేయిస్తూ, గుండెకు విశ్రాంతి కల్పించాం. మందులు ఇచ్చి హృదయ స్పందనలు సాధారణ స్థితిలోకి వచ్చేలా చేశాం. 4 రోజులు చికిత్స చేశాక గుండె పనితీరు మెరుగుపడింది. తర్వాత ఎక్మో తొలగించాం" అని రమేష్‌బాబు వివరించారు. చికిత్సలో పాల్గొన్న క్రిటికల్ కేర్ నిపుణులు డాక్టర్ జంపాల కార్తికేయ, డాక్టర్ పవన్, ఎండోక్రైనాలజిస్ట్ రాకేష్ బొబ్బా, సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ అనూప్ వెలగ, ఎన్.రాజారామ్, రామ్ మనోహర్, శివ ప్రసాద్, విజయ్ కుమార్ బృందాన్ని అభినందించారు.

అదుపులోకి రాని బ్లోఅవుట్



ఓఎన్‌జీసీ డ్రిల్లింగ్ సైట్‌లోని బావిలో ఎగసిపడుతున్న మంటలను అదుపు చేసేందుకు సాగుతున్న వాటర్ అంబ్రెల్లా పనులు



సంఘటన స్థలానికి చేరుకొన్న ఓఎన్‌జీసీ రీజినల్ క్రైసిస్ మేనేజ్‌మెంట్ టీం హెడ్ శ్రీహరి, ఇతర నిపుణులు



బ్లోఅవుట్ జరిగిన ప్రాంతంలో పరిస్థితిని సమీక్షిస్తున్న ఎంపీ హరీష్‌మాథుర్, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌సీఎంటీ సభ్యులు పనులు మొదలుపెట్టారు. నరసాపురం ఓఎన్‌జీసీ యూనిట్ నుంచి అత్యాధునిక పరికరాలు, వాహనాలను తీసుకువచ్చారు. అగ్నికీలలు వ్యాప్తి చెందకుండా, వేడి గాలులు విస్తరించకుండా ప్రత్యేక మోటార్లు పెట్టి నీటిని వెదజల్లుతున్నారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు ఏకధాటిగా నీటిని పంపింగ్ చేయడంతో బావి సమీప ప్రాంతంలో వేడి తగ్గింది. మరో నాలుగైదు రోజులు ఈ చర్యలు ఉంటాయని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి.

సన్నాహక చర్యలు కొలిక్కి..

బావి నుంచి వెలువడే మంటలను ఒకేసారి నియంత్రిస్తే సాంకేతికంగా ఇబ్బందులు వచ్చే అవకాశం ఉన్నందున దశలవారీగా అదుపులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారు. పొలాల మీదుగా తాత్కాలిక రోడ్డు నిర్మాణం మొదలుపెట్టారు. బుధవారం మధ్యాహ్నానికి ఇది పూర్తయ్యే అవకాశముందని ఓ ఇంజినీరింగ్ అధికారి తెలిపారు. తాత్కాలిక రహదారి మీదుగా భారీ వాహనాలతో మడ్ ఫిల్లింగ్ యంత్రాన్ని బావి దగ్గరకు చేర్చి లీకేజీని అరికట్టనున్నారు.

ప్రత్యేక బృందాలతో పరిశీలన..

బ్లోఅవుట్ వంటి విపత్కర పరిస్థితులను సమర్థంగా అదుపులోకి తీసుకువచ్చే ఓఎన్‌జీసీ ప్రత్యేక బృందాలు దిల్లీ, ముంబయి నుంచి వచ్చాయి. టెక్నాలజీ, ఫీల్డ్ సర్వీసెస్ డైరెక్టర్ విక్రమ్ సక్సేనా పర్యవేక్షిస్తున్నారు. ప్రాంతీయ విపత్తుల నిర్వహణ బృందం (ఆర్‌సీఎంటీ) హెడ్ శ్రీహరి పరిస్థితులను అంచనా వేసి సిబ్బందికి సూచనలిస్తున్నారు. ఆయనకు పలు ప్రాంతాల్లో బ్లోఅవుట్‌లను విజయవంతంగా నియంత్రించిన అనుభవం ఉందని ఓఎన్‌జీసీ అధికారి తెలిపారు. మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చాక బావి లోపల లీకులు గుర్తించి రసాయనాలతో కూడిన బురదను వేగంగా లోపలికి పంపి నియంత్రిస్తారు. ఇందుకు నాలుగైదు రోజులకు పైగా సమయం పట్టనున్నట్లు చెబుతున్నారు. అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ లక్కవరంలోనే మకాం వేసి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

నియంత్రణలోకి వస్తోంది: ఓఎన్‌జీసీ

బ్లోఅవుట్ క్రమంగా నియంత్రణలోకి వస్తున్నట్లు ఓఎన్‌జీసీ అధికారులు దిల్లీ నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. సంస్థ సీనియర్ మేనేజ్‌మెంట్, డైరెక్టర్ విక్రమ్ సక్సేనా నేతృత్వంలోని బృందం బావిపై పూర్తి ఆపరేషన్ బాధ్యతను చేపట్టినట్లు పేర్కొన్నారు. అత్యధిక సామర్థ్యమున్న పంపుల ఏర్పాటుకు తాత్కాలికంగా కాలువ తవ్వకం పనులు పూర్తయ్యాయని వివరించారు. అగ్నికీలల తీవ్రతను తగ్గించడంలో నిపుణుల బృందం విజయం సాధించిందని తెలిపారు.

చమురు వెలికితీత.. కోనసీమ గుండెకోత

- 1,255 ఎకరాల్లో తవ్వకాలు

ఈనాడు, రాజమహేంద్రవరం: గోదావరి పరవళ్లు.. నిత్యం పచ్చదనంతో అలరారే కోనసీమ వ్యాప్తంగా ఆన్‌షోర్, ఆఫ్‌షోర్‌లో చమురు నిక్షేపాల వెలికితీత దశాబ్దాలుగా కొనసాగుతోంది. పొలాలు, గ్రామాలు, ఇళ్ల మధ్య నుంచి చమురు పైపులైన్లు ఉండటంతో ఎప్పుడు ఏ విస్ఫోటం సంభవిస్తుందో తెలియక ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. 2014లో మామిడికుదురు మండలం నగరం గ్రామంలో జరిగిన భారీ పేలుడు తరువాత కొద్దిరోజుల పాటు హడావుడి చేసిన చమురు సంస్థలు.. ఆ తరువాత ఎప్పటిలానే నిర్వహణను పక్కనపెట్టేశాయన్న విమర్శలున్నాయి. తాజాగా ఇరుసుమండలో చోటుచేసుకున్న బ్లోఅవుట్ జనావాసాలకు సమీపంలో సంభవిస్తే పరిస్థితి ఏమిటన్న ఆందోళన ఈ ప్రాంత వాసుల్లో నెలకొంది.

217 ప్రాంతాల్లో..

డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పరిధిలో ఆన్‌షోర్, ఆఫ్‌షోర్‌లో 217 ప్రాంతాల్లో చమురు వెలికితీస్తున్నారు. బ్లోఅవుట్ వంటి అంశాలు చాలా చిన్నవని, నిక్షేపాల వెలికితీతతో భూమి పొరల్లో భారీ విధ్వంసం జరుగుతోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. రిగ్ పేరిట కిలోమీటర్ల మేర తవ్వి, తిరిగి పూడ్చకుండా వదిలేయడం అత్యంత ప్రమాదకరమన్నారు.

లీజు ప్రాతిపదికన తీసుకుని..: నిక్షేపాల వెలికితీతకు సంబంధించి గుర్తించిన భూములను రైతుల నుంచి 3 నుంచి 5 ఏళ్లకు లీజు ప్రాతిపదికన తీసుకుంటారు. ఏడాదికి రెండు పంటలకు వచ్చే దిగుబడిని అంచనా వేసి ఎకరాకు సుమారు రూ.80 వేల నుంచి రూ.85 వేలు, బీడు భూములకు రూ.26,500 వరకు చెల్లిస్తున్నారు. తవ్వకాల ప్రక్రియ పూర్తయిన తరువాత తిరిగి అప్పగిస్తున్నారు. తవ్వకాలు చేసిన ప్రాంతంలో గోతులను పూర్తిగా పూడ్చి, ఇవ్వాలి. అది ఖర్చుతో కూడిన వ్యవహారం కావడంతో పూడ్చివేత ఖర్చుల కింద రూ.60, 70 వేలు ఇస్తున్నారు. అయితే చాలా మంది రైతులు పూడ్చడంలేదు. చమురు నిక్షేపాల వెలికితీత అనంతరం కోనసీమ జిల్లాలో 61 బావులను పూడ్చారు. వాటిలో అమలాపురం డివిజన్‌లో 43, కొత్తపేటలో 12, రామచంద్రపురంలో 6 ఉన్నాయి.

సాగులో తగ్గుతున్న దిగుబడి

- కొత్తపేట మండలం వాడపాలెంలో 3.40 ఎకరాలను లీజుకు తీసుకున్నారు. చమురు కోసం తవ్వకాల అనంతరం రైతులకు తిరిగి అప్పగించారు. ఆ రైతు సాగు ప్రారంభిస్తే తొలినాళ్లలో ఎకరాకు కేవలం పది బస్తాల దిగుబడే వచ్చింది. ఇప్పుడు 22 బస్తాల వరకు వస్తోంది. ఆ చుట్టుపక్కల రైతులకు ఎకరాకు 35 బస్తాల వరకు దిగుబడి రావడం గమనార్హం.
- కొబ్బరి చెట్టుకు 100 కాయలు వచ్చేవని, చమురు తవ్వకాల అనంతరం ఆ ప్రాంతంలో 70 కాయలకు తగ్గినట్లు ఉద్యాన శాఖ అధికారి నిర్ధారించారు. కాయ పరిమాణం సైతం తగ్గినట్లు తేల్చారు.

కోనసీమలో చమురు తవ్వకాల తీరిలా.. (విస్తీర్ణం ఎకరాల్లో)

రెవెన్యూ డివిజన్	నిక్షేపాల వెలికితీత ప్రాంతాలు	విస్తీర్ణం
అమలాపురం	158	870.23
కొత్తపేట	20	125.37
రామచంద్రపురం	39	259.91

బ్లోఅవుట్ నియంత్రణకు అమెరికా నిపుణులు

- పూర్తిగా అదుపు చేసేందుకు పది రోజులు పట్టే అవకాశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో ఎస్పీ, జేసీ, ఓఎన్‌జీసీ అధికారులు

అమలాపురం కలెక్టరేట్, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో సంభవించిన బ్లోఅవుట్‌ను పూర్తిగా నియంత్రించేందుకు వారం నుంచి 10 రోజులు పట్టవచ్చని కలెక్టర్ మహేష్ కుమార్ తెలిపారు. మంగళవారం ఓఎన్జీసీ అధికారులతో కలిసి నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంటలను పూర్తిగా నియంత్రించేందుకు అమెరికాకు చెందిన విపత్తుల నివారణ సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు ఓఎన్‌జీసీ అధికారులు తెలిపారు. అక్కడి నుంచి నిపుణులు ఒకటి రెండు రోజుల్లో ఇక్కడికి చేరుకుంటారన్నారు. కలెక్టరు తెలిపిన వివరాలివి..

తగ్గిన ఉద్ధృతి

సోమవారం ఉదయం 11.30 గంటలకు మలికిపురం మండలం ఇరుసుమండ ప్రాంతంలోని మోరి-5 ఓఎన్జీసీ బావిలో డ్రిల్లింగ్ చేస్తుండగా మంటలు వ్యాపించాయి. ప్రస్తుతం వాటి ఉద్ధృతి తగ్గింది. సహజ వాయువు సాధారణ స్థితిలో మండుతోంది. నిపుణుల బృందం గ్యాస్ ఎక్కడి నుంచి పైకి వస్తోందో కనుక్కునే పనిలో నిమగ్నమైంది. బ్లో అవుట్ పరిసర గ్రామాల్లోని 452 మందిని పునరావాస కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం సాధారణ పరిస్థితులు నెలకొనడంతో వారు ఇళ్లకు చేరుకోవచ్చు.

నష్ట శాతం తక్కువే


బ్లోఅవుట్ ప్రభావంతో పెద్దగా నష్టం నమోదు కాలేదు. మంటలకు చుట్టుపక్కల సుమారు 70 కొబ్బరి చెట్లు, 2.50 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు ప్రాథమిక అంచనా. అక్కడ కార్యకలాపాలు నిర్వహించే చమురు సంస్థకు చెందిన యంత్ర సామగ్రి కాలి బూడిదైంది.

వారంలో నివేదిక

బ్లోఅవుట్‌పై ఓఎన్జీసీ ఉన్నతాధికారులు వారం రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక అందిస్తారు. ప్రస్తుతం అక్కడ 2,500 మీటర్ల లోతులో డ్రిల్లింగ్ పనులు జరుగుతున్నాయి. ఆ ప్రాంతంలో సహజవాయువు పీడనంలో అసాధారణ మార్పులు సంభవించడం వల్లనే ఈ ప్రమాదం జరిగిందనేది ప్రాథమిక అంచనా.

- విలేకరుల సమావేశంలో ఎస్పీ రాహుల్ మీనా, జేసీ నిశాంతి, ఓఎన్జీసీ సంస్థ డైరెక్టర్ విక్రమ్ సక్సేనా, ఈడీ శాంతన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని పనులతో ₹2,745 కోట్ల వృథా



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు

(మొదటి పేజీ తరువాయి)

తాగునీటి పథకమేనని రాసి పంపి.. అది ఆగిపోవడానికి కారణమైంది మీ సర్కార్ కాదా?' అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు నిలదీశారు. సచివాలయంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. సీమ ప్రాజెక్టులు, రూ.వేలకోట్ల వృథా పనులు, రాయలసీమ ఎత్తిపోతల అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఇవి జగన్ డబ్బులా? పెద్దిరెడ్డి డబ్బులా?

రాయలసీమ ఎత్తిపోతల పథకానికి రూ.3,825 కోట్లతో 2020 మే 5న పాలనామోదం ఇస్తే అదే నెల 20న పనులు ఆపేయాలని ఎన్జీటీ చెప్పింది. అనుమతుల్లేకుండానే సివిల్ పనులకు రూ.390 కోట్లు, మెకానికల్ పనులకు రూ.283 కోట్లు, వడ్డీ రూ.134 కోట్లు, ఇతరత్రా రూ.183 కోట్ల చొప్పున మొత్తం రూ.990 కోట్లు ఖర్చయ్యాయి. ఎన్జీటీ నిజనిర్ధారణ కమిటీని వేసి, షోకాజ్ ఇచ్చి పనులు నిలిపివేసింది. దీంతో రూ.990 కోట్ల వృథా, రూ.750 కోట్ల అప్పు మిగిలాయి. 2021 డిసెంబరు 12న పనులు ఆపేయాలని ఎన్జీటీ ఆదేశాలివ్వలేదా? 2023 మార్చిలో రూ.2.65 కోట్ల జరిమానా వేయలేదా? అనుమతులు తీసుకురాలేక, నిధులు వృథాచేసి ఇప్పుడు మీ పత్రికలో, టీవీలో ఆరోపణలేంటి జగన్?

- గాలేరు-నగరి, హంద్రీ-నీవా అనుసంధానం అంటూ పెద్దిరెడ్డి కంపెనీకి పనులు అప్పగించారు. అటవీ అనుమతులు లేకుండా పనులు చేసేశారు. రూ.1,067.74 కోట్ల బిల్లులు తీసేసుకున్నారు. లాభదాయకమని పైపులు వేసేశారు. పనులు చేసేది మీ కంపెనీల కోసమా? రాయలసీమ ప్రజల కోసమా?
- ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ముదివేడు, గుంటపల్లి, ఆవులపల్లి రిజర్వాయర్ల పేరుతో రూ.688 కోట్ల పనులు చేసేశారు. మేం వచ్చాక విజిలెన్స్ విచారణ చేయించి బిల్లులు ఆపాం. పర్యావరణ అనుమతుల్లేకుండా ఈ పనులు చేయడంతో ఎన్జీటీ రూ.100 కోట్ల జరిమానా వేసింది. రూ.25 కోట్లు చెల్లించారు. ఇవి ఎవరి డబ్బులు? ఈ పథకాలు రాయలసీమ ప్రయోజనాల కోసమా? మీకు డబ్బుల కోసమా? సీమ ప్రజలకు ఏం సమాధానం చెబుతారు?

రాయలసీమ ఎత్తిపోతలతో దక్కేది 22.6 టీఎంసీలే

శ్రీశైలం జలాశయం నుంచి +841 అడుగుల వరకు పోతిరెడ్డిపాడు నుంచి గ్రావిటీ ద్వారా సీమకు నీళ్లు ఇవ్వచ్చు. +834 మీటర్ల నుంచి నీళ్లు తీసుకునేలా మల్యాల వద్ద, +798 అడుగుల నుంచి తీసుకునేలా ముచ్చుమర్రి ఎత్తిపోతల నిర్మించాం. రాయలసీమ ఎత్తిపోతల +800 అడుగుల నుంచి నీటిని ఎత్తిపోసేలా జగన్ హయాంలో చేపట్టారు. +800 దిగువన మన వాటా ప్రకారం దక్కే నీళ్లు 22.6 టీఎంసీలే. ముచ్చుమర్రి ఎత్తిపోతల ద్వారా అంతకన్నా దిగువ నుంచి నీటిని ఎత్తిపోయొచ్చు.

ఇప్పటికే 366 టీఎంసీల నిల్వలు

రాయలసీమలో ఒక పంట పూర్తయ్యాక మేజర్, మీడియం రిజర్వాయర్లలో 312.84 టీఎంసీల నీటినిల్వలు ఉన్నాయి. 12,141 చెరువుల్లో మరో 53.25 టీఎంసీల నీళ్లున్నాయి. మొత్తం 366.09 టీఎంసీలు ఉన్నాయి. కృష్ణదేవరాయల కాలం తర్వాత ఇప్పుడు చంద్రబాబు హయాంలో చెరువులు నిండుగా ఉన్నాయని సీమ ప్రజలు చెబుతున్నారు.

సీమకు ఖర్చు ఇలా

కాలవ్యవధి	బడ్జెట్ కేటాయింపులు (రూ.కోట్లలో)	వ్యయం (రూ.కోట్లలో)
2019–24	2,493.34	514
2024–26 (ఏడాదిన్నరలోనే)	5,111.40	3,145

రేవంత్‌రెడ్డి ఆ రాష్ట్ర రాజకీయాల కోసం ఏదో మాట్లాడుతున్నారు. ఎన్జీటీ ఆదేశాల ద్వారా రాష్ట్రంలో ఏం జరిగిందో మేం స్పష్టంగా చెబుతున్నాం. మరోవైపు హరీశ్‌రావు రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకున్నది తామేనని ప్రకటించారు. అంటే, జగన్ హయాంలో ఆ పథకాన్ని తెలంగాణ నాయకులు అడ్డుకుంటే చూస్తూ ఊరుకున్నారని తేలడం లేదా?

'మన శంకరవరప్రసాద్ గారు' టికెట్ రూ.1.11 లక్షలు

వేలంలో దక్కించుకున్న అభిమాని

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: చిరంజీవి నటించిన 'మన శంకరవరప్రసాద్ గారు' చిత్రం ప్రీమియర్ షో మొదటి టికెట్‌ను మోకా సుబ్బారావు అనే అభిమాని రూ.1.11 లక్షలకు దక్కించుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని శ్రీవెంకటరమణ థియేటర్ వద్ద చిరంజీవి యువత ఆధ్వర్యంలో మంగళవారం వేలం నిర్వహించగా భాజపా జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి మోకా సుబ్బారావు దీన్ని అత్యధిక ధరకు పాడుకున్నారు. ఈ నగదును చిరంజీవి ఛారిటబుల్ ట్రస్టుకు అందజేస్తామని అభిమాన సంఘం నాయకులు తెలిపారు.

బెయిల్ కోసం చిన్న అప్పన్న పిటిషన్

ఈనాడు, అమరావతి: శ్రీవారి లడ్డూ తయారీకి నకిలీ నెయ్యి సరఫరా కేసులో బెయిల్ కోరుతూ వైకాపా ఎంపీ వైవీ సుబ్బారెడ్డి పూర్వ పీఏ చిన్నఅప్పన్న హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వై.లక్ష్మణరావు మంగళవారం ఈ వ్యాజ్యంపై విచారణ జరిపారు. పూర్తి వివరాలు సమర్పించాలని సీబీఐ డైరెక్టర్ నేతృత్వంలోని సిట్‌ను ఆదేశించారు. విచారణ వారంపాటు వాయిదా వేశారు.

గ్రేట్ గ్రీన్‌వాల్ ప్రాజెక్టును యుద్ధ ప్రాతిపదికన ముందుకు తీసుకెళ్లాలి

- మూడు దశల్లో '50 శాతం గ్రీన్‌కవర్' ప్రాజెక్టు అమలు
- ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో తీర ప్రాంత అడవుల రక్షణ, ఆక్రమణల నిరోధానికి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న 'గ్రేట్ గ్రీన్‌వాల్, 50 శాతం గ్రీన్‌కవర్' ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన ముందుకు తీసుకెళ్లాలని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశించారు. ఈ నెలాఖరులోగా మార్గసూచీ సిద్ధం చేయాలని పేర్కొన్నారు. తీరం వెంబడి ఉన్న మొక్కలకు భద్రత కల్పించడంతోపాటు అటవీ భూములు ఆక్రమణలకు గురికాకుండా చూసే బాధ్యతను తీర ప్రాంత నివాసిత సమాజాలకు అప్పగించాలని నిర్దేశించారు. సచివాలయంలో మంగళవారం అటవీశాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో 50 శాతాన్ని పచ్చదనంతో నింపాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు తనకు వ్యక్తిగతంగా నిర్దేశించిన లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్నారు. దీన్ని సాధించేందుకు సంబంధిత ప్రభుత్వ శాఖలతో కార్యదళం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఆయన చెప్పిన ముఖ్యాంశాలివి.

- తీరప్రాంతం మొత్తాన్ని 5 కిలోమీటర్ల వెడల్పున పచ్చదనంతో నింపేయాలి. మడ, సరుగుడు, తాటి మొక్కలు వంటివి నాటాలి. సీఆర్‌జడ్ పరిధిలోని భూ విస్తీర్ణమెంత? అందులో అటవీశాఖ పరిధిలో ఎంతుంది? ప్రైవేటు వ్యక్తులు, సంస్థల చేతుల్లో ఉన్న భూమి ఎంత అనేదానిపై అధ్యయనం చేయాలి.
- 50% గ్రీన్‌కవర్ పెంచడంలో సంబంధిత శాఖలన్నింటినీ భాగస్వాములను చేయాలి. మొక్కలు నాటేందుకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి కలెక్టర్ల ఆధ్వర్యంలో ఇతర శాఖలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించాలి.
- గ్రేట్ గ్రీన్‌వాల్ ప్రాజెక్టును మూడు దశల్లో ముందుకు తీసుకెళ్లాలి. మొదటిదశలో కోస్తా ప్రాంతానికి అనుకుని ఉండే ప్రాంతం, రెండోదశలో తీరప్రాంతానికి ఆనుకుని ఉండే కాలువలు, రహదారులు, డొంకల వెంబడి ప్రాంతాలు.. చివరి దశలో వ్యవసాయ భూముల్లో రైతులకు ఉపయోగపడే విధంగా మొక్కలు పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి.
- రాష్ట్ర వ్యాప్తంగా 10 వేల ఎకరాల విస్తీర్ణంలో నోటిఫై కాని మడ అడవులు ఉన్నట్లు శాటిలైట్ ద్వారా గుర్తించాం. వీటిని కూడా నోటిఫై చేసి అటవీ శాఖకు అప్పగించేలా చర్యలు తీసుకుంటున్నాం. ముందుగా అటవీ శాఖ పరిధిలోలేని ఈ మడ విస్తీర్ణంలో ఆక్రమణలు జరగకుండా చర్యలు తీసుకోవాలి.

ఇద్దరిని బలిగొన్న పొగమంచు

- దారి కనిపించక బైక్‌ను ఢీకొన్న ఆటో
- ఒకే గ్రామానికి చెందిన యువకుల మృతి



సురేంద్ర రాజశేఖర్

ప్యాపిలి, న్యూస్‌టుడే: పొగమంచు కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే గ్రామానికి చెందిన ఇద్దరు మృత్యువాత పడ్డారు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ విషాద ఘటన నంద్యాల జిల్లా ప్యాపిలి మండలంలోని ఎన్.రంగాపురం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన కొప్పుల సురేంద్ర (26), రాజశేఖర్ (24) మండలంలోని ఉడుములపాడు వద్ద ఉన్న కెమికల్ ఫ్యాక్టరీలో సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున వీరిద్దరూ కలిసి ద్విచక్రవాహనంపై విధులకు బయల్దేరారు. ఇదే సమయంలో చిగురుమానుమిట్ట నుంచి ప్యాపిలి వైపు వెళ్తున్న ఆటో పొగమంచు వల్ల దారి కనిపించక వీరిని ఢీకొంది. ఈ ప్రమాదంలో బైక్‌పైన ఉన్న ఇద్దరికీ తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. ఆటోలో ఉన్న తలారి సురేంద్రకు కాలు విరిగింది. పోలీసులు అతడిని ఆసుపత్రికి తరలించారు. కాగా, రాజశేఖర్ తండ్రి ఆరేళ్ల కిందట గుండెపోటుతో మరణించారు. ఇప్పుడు రాజశేఖర్ కూడా చనిపోవడంతో అతడి తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కొప్పుల సురేంద్రకు ఆరేళ్ల కిందట గుత్తి మండలం కొట్టాల గ్రామానికి చెందిన కల్యాణితో వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమారుడు ఉన్నారు. కల్యాణి ప్రస్తుతం గర్భిణిగా ఉంది. సురేంద్ర రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆమె భోరున విలపిస్తున్నారు.

గ్రహం అనుగ్రహం

7-1-2026 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; హేమంత రుతువు, పుష్యమాసం, బహుళపక్షం
చవితి: ఉ. 11-43 తదుపరి పంచమి
మఖ: సా. 4-04 తదుపరి పుబ్బ
వర్జ్యం: రా. 12-11 నుంచి 1-48 వరకు
అమృత ఘడియలు: మ. 1-40 నుంచి 3-16 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-44 నుంచి 12-28 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.6.36; సూర్యాస్తమయం: సా.5.36

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
విజయనగరం	15.0	26.0
శ్రీకాకుళం	15.0	27.0
కర్నూలు	17.9	30.4
కడప	18.0	28.0
గుంటూరు	18.0	30.5
తాడేపల్లిగూడెం	18.0	30.8
రాజమహేంద్రవరం	18.0	34.0
తిరుపతి	19.4	29.2
అనంతపురం	19.4	31.0
విశాఖపట్నం	20.0	28.2
విజయవాడ	20.0	29.0
ఒంగోలు	21.0	29.6
నెల్లూరు	21.9	28.2

రూ.19,391 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

- 11,753 మందికి ఉపాధి అవకాశాలు
- 14వ ఎస్ఐపీబీ సమావేశంలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: వైకాపా పాలనలో రాష్ట్రం కోల్పోయిన బ్రాండ్ ఇమేజ్‌ను కూటమి ప్రభుత్వం తిరిగి తెచ్చిందని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. 2025లో అంతా కలిసి పనిచేయడంతో రాష్ట్రానికి పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయన్నారు. సచివాలయంలో సీఎం అధ్యక్షతన రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశం మంగళవారం జరిగింది. పరిశ్రమలు, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్, ఇంధన రంగాలకు చెందిన రూ.19,391.33 కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు సమావేశం ఆమోదం తెలిపింది. తద్వారా ఏర్పాటయ్యే పరిశ్రమలతో 11,753 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొంది.

13 సమావేశాల్లో రూ.8.55 లక్షల కోట్ల పెట్టుబడులు ఆమోదించాం

గత 13 ఎస్ఐపీబీ సమావేశాల్లో రూ.8.55 లక్షల కోట్ల పెట్టుబడులను ఆమోదించామని, వాటి ద్వారా 8.23 లక్షల మందికి ఉపాధి అవకాశాలు వస్తాయని చంద్రబాబు పేర్కొన్నారు. '2025లో రాష్ట్రానికి పెట్టుబడులు అద్భుతంగా వచ్చాయి. అదే ఉత్సాహంతో 2026లో పనిచేయాలి. రాష్ట్రాభివృద్ధికి అధికారులు, మంత్రులు కలిసి పనిచేయడం వల్ల విద్యుత్ ఛార్జీలు యూనిట్‌కు 13 పైసలు తగ్గించగలిగాం. రూ.4,500 కోట్ల ట్రూఅప్ ఛార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరిస్తుంది. విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. 2029 నాటికి యూనిట్ విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని రూ.3.70కు తగ్గించాలన్నది లక్ష్యం. విద్యుత్ రంగంలో మనం చేసిన కృషి వల్లే రాష్ట్రానికి డేటా సెంటర్లు వచ్చాయి. రాష్ట్రానికి గూగుల్ తీసుకురావడంలో లోకేశ్ కృషి ఉంది. దావోస్‌లో జరిగిన ప్రపంచ దేశాల ఆర్థిక సదస్సుకు వెళ్లి.. ఏపీ బ్రాండ్‌కు ప్రచారం చేయగలిగాం. విదేశీ కంపెనీల పెట్టుబడులను ఆకర్షించగలిగాం. విజయంతో వచ్చే కిక్ అద్భుతంగా ఉంటుంది. దీనికోసం అంతా పనిచేయాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్‌లో ఫలితాలు తీసుకొచ్చే లక్ష్యంతో పనిచేయాలి' అని పేర్కొన్నారు. సమావేశంలో మంత్రులు లోకేశ్, నారాయణ, అచ్చెన్నాయుడు, కేశవ్, గొట్టిపాటి రవి, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, దుర్గేష్, బీసీ జనార్దన్‌రెడ్డి, సుభాష్, సీఎస్ విజయానంద్ పాల్గొన్నారు.


ఎస్ఐపీబీ సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో మంత్రులు నారాయణ, అచ్చెన్నాయుడు, టీజీ భరత్, లోకేశ్, ఉన్నతాధికారులు

ఎస్ఐపీబీలో ఆమోదించిన పెట్టుబడులు (రూ.కోట్లలో)

కంపెనీ	పెట్టుబడి	ఉపాధి
ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్(ఇస్కాన్)	425.20	1,035
ఆర్నా కోస్టల్ రిసార్ట్స్	187.58	250
సెల్వన్ హాస్పిటాలిటీ గ్రూప్ కన్సార్టియం, యూనిటీ సొల్యూషన్స్ (యూఎస్‌పీ)	183.87	196
శుభమ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్స్ కన్సార్టియం, ఇంద్రనీర్ ఫుడ్స్ అండ్ బెవరేజెస్	64.44	100
సంగం మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్	200.82	245
నవ ఫుడ్ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్	44.42	500
వెబ్‌సోల్ రెన్యువబుల్ ప్రైవేట్ లిమిటెడ్	3,538	1,980
టాటా పవర్ రెన్యువబుల్ ఎనర్జీ లిమిటెడ్	6,675	1,000
ది రామ్‌కో సిమెంట్స్ లిమిటెడ్	1,500	300
షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ లిమిటెడ్	5,571	5,000
కృష్ణా ఆగ్రో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్	2,159	300
ఎన్ఏఎన్ గ్రీన్‌మెట్ ప్రైవేట్ లిమిటెడ్	1,366	340
ఎథిరియల్ ఎక్స్‌ప్లోరేషన్ గిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్	578	382
పయనీర్ క్లీన్ యాంప్స్ ప్రైవేట్ లిమిటెడ్	159	600
వైజయంతి ఫుల్‌ఫిల్‌మెంట్	62	285
రాధిక వెజిటబుల్ ఆయిల్స్ ప్రైవేట్ లిమిటెడ్	234	165
రిలయన్స్ కన్స్యూమర్స్ ప్రైవేట్ లిమిటెడ్	30	---

ఐలాండ్ టూరిజంపై దృష్టి

బీచ్ టూరిజంపై మాస్టర్ ప్లాన్: చంద్రబాబు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: మాల్దీవుల తరహాలో రాష్ట్రంలో ఐలాండ్ టూరిజం ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సూళ్లూరుపేట దగ్గర ఉన్న చిన్న ద్వీపాలను బీచ్ పర్యాటకం కింద అభివృద్ధి చేయడానికి అవకాశం ఉందని చెప్పారు. 25 వేల గదులు నిర్మించగలిగితే పర్యాటకుల్ని ఆకర్షించవచ్చన్నారు. బీచ్ పర్యాటకంపై మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బాపట్ల సమీపంలోని సూర్యలంక అత్యంత సురక్షితమైన తీర ప్రాంతమని, సూర్యలంక బీచ్ రిసార్ట్స్‌ను బ్రాండింగ్ చేయాలని సూచించారు. ఇక్కడ 15 కి.మీ. బీచ్‌ఫ్రంట్ అభివృద్ధి చేయాలన్నారు. ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం మాట్లాడుతూ.. 'టూరిజం కార్పొరేషన్ ద్వారా రాబోయే 15 ఏళ్లలో రూ.వెయ్యి కోట్ల ఆదాయం సాధించేలా ప్రణాళికలు రూపొందించాలి. పాపికొండలు, పోలవరం ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేసే అంశంపై దృష్టి పెట్టండి. కోనసీమ, పులికాట్, విశాఖ క్లస్టర్లు అద్భుత పర్యాటక క్లస్టర్లుగా తయారవుతాయి. అనంతపురం నుంచి గండికోట వరకు టూరిజం క్లస్టర్లలో పర్యాటకానికి అవకాశం ఉంది. తిమ్మమ్మ మర్రిమానును గూగుల్ మ్యాపింగ్ చేయండి. ఆవకాయ్ ఫెస్టివల్, ఫ్లెమింగో ఫెస్టివల్, గండికోట ఉత్సవాలు, విశాఖ అరకు ఉత్సవ్, సీ టూ స్కై, ఏపీ ట్రావెల్ మార్ట్‌లను నిర్వహించాలి. విశాఖ, అమరావతికి హోటళ్లు, ఆస్పత్రులు, విద్యా సంస్థలు వచ్చేలా చూడండి. ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థలకు మాన్సాస్ ట్రస్ట్ తన భూములు విరాళంగా ఇచ్చేందుకు సిద్ధంగా ఉంది. ఆ దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలి' అని సీఎం దిశానిర్దేశం చేశారు.

ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లతో రైతులకు మేలు: 'తిరుపతి ప్రాంతానికి మరిన్ని ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు రావాలి. వివిధ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌కు వెళ్లాలి. రైతులు ఉద్యాన పంటలవైపు ఆసక్తి చూపుతున్నారు. భవిష్యత్తులో ఉద్యాన ఉత్పత్తులు పెద్ద ఎత్తున పెరిగే అవకాశం ఉంది. దానికి అనుగుణంగా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాలి' అని సీఎం పేర్కొన్నారు.

నేడు దిల్లీకి ముఖ్యమంత్రి చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం దిల్లీ వెళ్తున్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో ఆయన భేటీ కానున్నట్లు సమాచారం. ఉదయం పోలవరం ప్రాజెక్టు సందర్శనకు వెళ్తున్న సీఎం, ఆ కార్యక్రమం ముగిశాక మధ్యాహ్నం 3.30 గంటలకు రాజమహేంద్రవరం విమానాశ్రయం నుంచి దిల్లీ బయల్దేరతారు. రాత్రి 10.55కు దిల్లీ నుంచి బయల్దేరి 1.40కి అమరావతి చేరుకుంటారు.

తిరుమలలో ఆఫ్‌లైన్‌లో 'శ్రీవాణి' టికెట్ల జారీ నిలిపివేత

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ఆఫ్‌లైన్‌లో ఇస్తున్న శ్రీవాణి దర్శన టికెట్ల జారీని నిలిపివేసి, ఈనెల 9 నుంచి ఆన్‌లైన్‌లో కరెంట్ బుకింగ్ కింద ఇవ్వనున్నట్లు తితిదే ఓ ప్రకటనలో తెలిపింది. భక్తుల సౌకర్యార్థం, పరిపాలనా సౌలభ్యం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించింది. తిరుమలలో ప్రస్తుతం రోజూ ఆఫ్‌లైన్‌లో 800 టికెట్లు ఇస్తున్నారు. ఈ టికెట్లను ఇకపై రోజూ ఉదయం 9 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసి మధ్యాహ్నం 2 గంటల వరకు అందుబాటులో ఉంచుతారు. టికెట్ పొందిన భక్తులు అదేరోజు సాయంత్రం 4 గంటలకు దర్శనానికి రిపోర్ట్ చేయాలి. 1+3 విధానంలో (మొత్తం నలుగురు) టికెట్ బుకింగ్‌కు అనుమతి ఉంటుంది. బుకింగ్‌లో దుర్వినియోగాన్ని అరికట్టేందుకు ఆధార్ ధ్రువీకరణ, మొబైల్ నంబరు వంటి వివరాలు తప్పనిసరి. ముందువచ్చిన వారికి ముందు విధానంలో భక్తులు టికెట్లు బుక్ చేసుకోవచ్చు. తద్వారా ఆఫ్‌లైన్‌లో శ్రీవాణి దర్శన టికెట్ల కోసం భక్తులు నిరీక్షించాల్సిన సమస్య తొలగనుంది. ఈ నూతన విధానాన్ని నెలరోజులపాటు ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు పేర్కొంది. అడ్వాన్స్ బుకింగ్ విధానంలో రోజుకు మరో 500 టికెట్లు చొప్పున ఇప్పటికే విడుదల చేయగా 3 నెలల అనంతరం ఈ విధానంపైనా సమీక్షించి నిర్ణయం తీసుకోనున్నారు. తిరుపతి విమానాశ్రయంలో ప్రతిరోజూ భక్తులకు ఆఫ్‌లైన్ విధానంలో జారీ చేస్తున్న 200 టికెట్ల జారీ విధానం యథావిధిగా కొనసాగనుంది.

విద్యార్థి సామర్థ్యాలకు అనుగుణంగా ప్రశ్నలు

- కంప్యూటరైజ్డ్ అడాప్టివ్ టెస్టింగ్ విధానం
- జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అమలుకు కసరత్తు
- విద్యార్థులపై ఒత్తిడి తగ్గించడమే లక్ష్యం
- కేంద్ర ప్రభుత్వానికి ఐఐటీ కాన్పూర్ సిఫారసు

ఈనాడు, హైదరాబాద్: ప్రపంచంలో అత్యంత కఠిన పరీక్షల్లో ఒకటైన జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు సంబంధించి కోచింగ్ పరిశ్రమ ప్రాబల్యాన్ని అరికట్టడం, విద్యార్థుల్లో ఒత్తిడిని తగ్గించడం లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో ఒకటే ప్రశ్నపత్రం కాకుండా... విద్యార్థుల విద్యా సామర్థ్యాలకు అనుగుణంగా ప్రశ్నలు ఇచ్చే కంప్యూటరైజ్డ్ అడాప్టివ్ టెస్టింగ్(క్యాట్) తరహా విధానాన్ని అమలు చేయాలని భావిస్తోంది. అంటే... తొలుత తేలికపాటి ప్రశ్నలు వస్తాయి. వాటికి సరైన జవాబులు గుర్తించేకొద్దీ ప్రశ్నల కఠిన స్థాయి పెరుగుతూ పోతుంది. ఒకరకంగా ఒక్కో విద్యార్థికి ఒక్కో ప్రశ్నపత్రం అన్నట్లే. మరోమాటలో వ్యక్తిగత పరీక్షగా చెప్పొచ్చు. విద్యార్థులు కఠిన ప్రశ్నలకు సరైన సమాధానమిస్తే అధిక మార్కులు, తేలిక ప్రశ్నలకు సరైన జవాబులిస్తే తక్కువ మార్కులు వస్తాయి. ఈ విధానంపై అధ్యయనం చేసిన ఐఐటీ కాన్పూర్ కేంద్ర ప్రభుత్వానికి ఇప్పటికే సిఫారసు చేసింది. కొత్త విధానంతో తల్లిదండ్రులపై ఆర్థిక ఒత్తిడి కూడా తగ్గుతుందని భావిస్తున్నారు. అమలుకు సూత్రప్రాయంగా అంగీకరించిన కేంద్ర విద్యాశాఖ... విధివిధానాల రూపకల్పనకు కార్యాచరణ ప్రారంభించిందని ఐఐటీ కాన్పూర్ వర్గాలు సూచించాయి. ప్రస్తుత విధానంలో జేఈఈ మెయిన్‌లో కనీస మార్కులు తెచ్చుకున్న విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్ రాస్తున్నారు. మొదటి ర్యాంకు వచ్చిన వారికి... చివరి ర్యాంకు వచ్చిన వారికి ఒకే ప్రశ్నలు ఉంటున్నాయి. కొత్త విధానంలో అభ్యర్థి సరైన సమాధానాలు చెప్పేకొద్దీ క్లిష్టమైన ప్రశ్నలు వస్తుంటాయి. తప్పుగా జవాబులిస్తే సులభమైన ప్రశ్నలు వస్తాయి. వాటి ఆధారంగా వెంటనే స్కోర్ లభిస్తుంది. తొలుత ప్రయోగాత్మకంగా కొత్త విధానాన్ని ప్రవేశపెట్టి వచ్చిన ఫలితాల ఆధారంగా అడాప్టివ్ టెస్టింగ్ విధానాన్ని అమలు చేసేందుకు దశలవారీగా రోడ్ మ్యాప్ రూపొందించుకోవాలని కేంద్రం భావిస్తోంది. అయితే, ఈ కొత్త విధానం అమలుకు ఏదైనా కాలం పట్టవచ్చని అంచనా వేస్తున్నారు. రానున్న మే నెలలో కాకుండా 2027 మేలో జరిగే జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో అమలుకు అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రస్తుతం జేఈఈ మెయిన్‌కు దాదాపు 14 లక్షల మంది రాస్తున్నారు. వారిలో 2.50 లక్షల మంది జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత సాధిస్తున్నారు.

ఐఐటీ కాన్పూర్ సిఫారసులు ఇవీ...

- తగిన అడాప్టివ్ టెస్టింగ్ విధానాన్ని రూపొందించేందుకు నిపుణుల కమిటీని నియమించాలి. అందుకు ఐఐటీ కాన్పూర్ నేతృత్వం వహిస్తుంది.
- జేఈఈ అడ్వాన్స్‌డ్ అసలు పరీక్షకు రెండు నెలల ముందు నమూనా పరీక్ష(మాక్ టెస్ట్) ఐచ్ఛికంగా నిర్వహించాలి. దీనివల్ల విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను అంచనా వేసుకుని... అసలు పరీక్షనాటికి మరింత సన్నద్ధం అవుతారు.
- ప్రశ్నలను ఉత్పత్తి చేసే టూల్‌ను అభివృద్ధి చేయాలి. సులభం, మధ్యస్థం, కఠిన లాంటి ప్రశ్నలను రూపొందించే టెక్నాలజీని తయారు చేసుకోవాలి.
- విద్యార్థి ఆయా (కఠిన, మధ్యస్థం, సులభం) ప్రశ్నలకు ఇచ్చే సమాధానాలకు అనుగుణంగా వారికి ఇచ్చే మార్కుల్లో తేడాలు ఉండేలా చూసుకోవాలి.

తిరుమలలో ఖాళీ మద్యం సీసాల కుట్రలో ఇద్దరిపై కేసు

సాక్షి మీడియాకు చెందిన నలుగురిని విచారించిన పోలీసులు

తిరుమల, న్యూస్‌టుడే: వేంకటేశ్వరస్వామి భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా, తితిదే ప్రతిష్ఠను దిగజార్చేలా కుట్రపూరితంగా వ్యవహరించిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులపై తిరుమల టూటౌన్ పోలీసులు కేసు నమోదుచేశారు. సీఐ శ్రీరాము తెలిపిన వివరాల మేరకు... ఇటీవల తిరుమలలో ఖాళీ మద్యం సీసాలను పోలీసు అతిథిగృహం పార్కింగ్ సమీపంలో గుర్తించారు. ఆ సీసాలు అక్కడికి రావడం వెనుక ఇద్దరి ప్రమేయం ఉన్నట్లు గుర్తించారు. ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసులు ఆ ప్రాంతంలోని సీసీటీవీ ఫుటేజీ విశ్లేషించారు. గుర్తుతెలియని ఓ వ్యక్తి ఆ ప్రాంతంలోకి వచ్చి... మద్యం సీసాలను అక్కడ పడేసినట్లు గుర్తించారు. మరో వ్యక్తి సంబంధిత దృశ్యాలను చిత్రీకరించినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులు సెల్‌ఫోన్ డేటాను విశ్లేషించి గుర్తించారు. ఈ ఆధారాలతో తిరుమలలోని సాక్షి పత్రిక రిపోర్టర్, ఫొటోగ్రాఫర్, సాక్షి టీవీ రిపోర్టర్, కెమెరామన్‌ను పోలీసులు విచారించారు. గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులపై ఏ1, ఏ2గా పోలీసులు కేసు నమోదుచేశారు. వీరు మీడియాలో ప్రచారం కోసమే ఈ కుట్ర పన్నినట్లు పోలీసులు గుర్తించారు. వారిద్దరినీ త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.

సంక్రాంతికి 8,432 ప్రత్యేక బస్సు సర్వీసులు

- రాష్ట్రంలో నడిపే వాటికి ప్రాధాన్యమిస్తూ ఆర్టీసీ నిర్ణయం
- స్త్రీశక్తి పథకం దృష్ట్యా ప్రణాళికలో మార్పులు

ఈనాడు, అమరావతి: సంక్రాంతి పండగ పురస్కరించుకొని 8,432 ప్రత్యేక బస్సు సర్వీసులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 6 వేలు, అంతర్రాష్ట్ర మార్గాల్లో (హైదరాబాద్, బెంగళూరు, చెన్నై) 2,432 సర్వీసులు నడిపేలా ప్రణాళిక రూపొందించింది. స్త్రీశక్తి పథకం అమలుతో సంక్రాంతికి జిల్లా కేంద్రాలకు, మండలాలకు, గ్రామాలకు వెళ్లే వారి సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నడిపే సర్వీసులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. అందుకు అనుగుణంగా ప్రత్యేక సర్వీసుల ప్రణాళికలో మార్పులు చేశారు. 71% సర్వీసులు రాష్ట్రంలోనే నడపాలని నిర్ణయించారు.

ఆర్టీసీ ప్రతిపాదనలు: ◆ సంక్రాంతికి ముందు హైదరాబాద్ నుంచి 240 సర్వీసులు, బెంగళూరు నుంచి 102, చెన్నై నుంచి 15 సర్వీసులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ నడపనుంది. రాష్ట్రంలోని వివిధ నగరాలు, మండలాలు, గ్రామాలకు వెళ్లే వారి కోసం 3,500 సర్వీసులు నడపాలని నిర్ణయించింది. ◆ సంక్రాంతి తర్వాత తిరిగి వెళ్లే వారి కోసం హైదరాబాద్‌కు 1,800 సర్వీసులు, బెంగళూరుకు 200, చెన్నైకి 75 సర్వీసులు నడపనుండటంతోపాటు.. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 2,500 సర్వీసులు నడపాలని నిర్ణయించింది.

చెంపదెబ్బ కొడితే ప్రాణం పోయింది

భర్త చేతిలో భార్య మృతి

అల్లవరం, న్యూస్‌టుడే: భార్యపై అనుమానంతో చెంపపై గట్టిగా కొట్టడంతో ఓ వివాహిత మృతి చెందిన ఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బోడసకుర్రులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బోడసకుర్రులోని ఇల్లవారిపాలేనికి చెందిన ఇల్ల శ్రీహరితో పుల్లేటికుర్రుకు చెందిన వెంకట సౌజన్యకు 15 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు. ఆమెపై అనుమానంతో మంగళవారం అతను చెంపపై కొట్టడంతో అపస్మారక స్థితికి చేరుకుంది. చికిత్స నిమిత్తం అమలాపురం ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంపత్‌కుమార్ తెలిపారు. అమలాపురం డీఎస్పీ ప్రసాద్, గ్రామీణ సీఐ ప్రశాంత్‌కుమార్ వివరాలు సేకరించారు.

గోదావరి పిలుస్తోంది.. పండక్కొచ్చేయండి!

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యేక ఫుడ్‌ఫెస్టివల్ నిర్వహిస్తోంది.

వేల సంఖ్యలో సందర్శకులు

ఆత్రేయపురం పేరు చెబితే నోరూరించే పూతరేకులతో పాటు, అక్కడి లొల్ల లాకులూ గుర్తుకొస్తాయి. అక్కడ చాలా సినిమా షూటింగులు జరిగాయి. అక్కడ గత సంవత్సరం తొలిసారి సంక్రాంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు చొరవతో ఏర్పాటైన సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ అసోసియేషన్, రాష్ట్రప్రభుత్వం సంయుక్తంగా పడవ పోటీలు, సంక్రాంతి వేడుకలు మూడు రోజులపాటు నిర్వహించాయి. ఆ ఉత్సవాలకు వేలసంఖ్యలో హాజరయ్యారు. ఈ సంవత్సరం సంక్రాంతి సంబరాలకు ప్రభుత్వం రూ.కోటి కేటాయించింది. ఉత్సవాల్ని తిలకించేందుకు రోజూ 10 వేలకుపైగా హాజరవుతారని అంచనా వేస్తున్నారు.

మూడు రోజులపాటు సందడే సందడి

ఆత్రేయపురం ప్రాంతం ఈ సంక్రాంతికి మూడు రోజులపాటు కోలాహలంగా మారబోతోంది. ఈ నెల 11న ఆత్రేయపురం రేవులోని బొబ్బర్లంక ప్రధాన కాలువలో ఈత పోటీలు నిర్వహిస్తున్నారు. 14 ఏళ్ల వయసు దాటినవారు పోటీల్లో పాల్గొనవచ్చు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.8వేలు, రూ.6వేలు, రూ.4వేల చొప్పున అందిస్తారు.

◆ 12, 13 తేదీల్లో డ్రాగన్ పడవపోటీలు జరుగుతాయి.

◆ ఆత్రేయపురం మెయిన్‌రోడ్డులో ఈ నెల 11న మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహిస్తున్నారు. రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల చొప్పున ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులిస్తారు.





◆ 13న లంక ప్రాంతాల్లో గాలిపటాల పోటీలు జరుగుతాయి. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.6వేలు, రూ.4వేలు, రూ.3వేలు అందజేస్తారు.

◆ లొల్ల లాకుల వద్ద బోటింగ్, పిల్లల కోసం ప్రత్యేక ప్లే ఏరియా ఏర్పాటుచేస్తున్నారు. కాలువల్లో విహరించేందుకు రెండు స్పీడ్ బోట్‌లు, ఒక జెట్‌స్కీ అందుబాటులో ఉంటాయి.

పిండివంటల ఘుమఘుమలు... సినిమా పాటల పరవళ్లు

ఆత్రేయపురం పూతరేకులు, కండ్రిగ పాలకోవా, నగరం గరాజీలు, నార్కెడుమిల్లి పచ్చళ్లు... ఇలా కోనసీమలోని ఒక్కో ప్రాంతంలో ఒక్కో పిండివంట ప్రసిద్ధి. వాటన్నిటినీ ఒకచోట అందుబాటులో ఉంచి, సంక్రాంతి సంబరాల్ని చూసేందుకు వచ్చేవారి జిహ్వకు కొత్త రుచుల్ని పరిచయం చేయబోతున్నారు. అహ్లాదకరమైన లొల్ల లాకుల వద్ద ఫుడ్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారు. కోనసీమలోని పిండివంటల రుచులన్నీ ఒకేచోట ఆస్వాదించే అరుదైన అనుభవం సందర్శకులకు దక్కనుంది.

◆ సాయంత్రాలు ప్రముఖ గాయకుల సినీ సంగీత విభావరి ఆనందడోలికల్లో విహరించొచ్చు. ఆత్రేయపురంలోని మహాత్మాగాంధీ జూనియర్ కాలేజీ గ్రౌండ్స్‌లో 11న సంగీత విభావరి నిర్వహిస్తున్నారు. మాళవిక, సాయిశిల్ప, హనుమాన్ తదితర గాయనీ గాయకులు పాల్గొంటున్నారు. 12న సెహరి బ్యాండ్ ఆర్కెస్ట్రా ఉంటుంది.

అటు ఆంధ్రా గోవాలోనూ..

ఆంధ్రా గోవాగా పేరుగాంచిన కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాంలోనూ రాష్ట్రప్రభుత్వం ఈ నెల 14, 15, 16 తేదీల్లో సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తోంది. ఒకపక్క గోదావరి వెనుక జలాలు, మరోపక్క విశాల సముద్రంతో ఈ ప్రాంతం సందర్శకుల్ని కట్టిపడేస్తుంది. అక్కడ బీచ్ ఫెస్టివల్ నిర్వహిస్తారు. రోజూ సినీ గాయకుల సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. గీతామాధురి, మోహన భోగరాజు, సాకేత్ తదితరులు వారి గానంతో అలరించనున్నారు.

పవన్ కల్యాణ్ నియోజకవర్గంలో..

పిఠాపురంలోని మున్సిపల్ స్కూల్ ఆవరణలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో సంక్రాంతి సంబరాలు జరగనున్నాయి. రాష్ట్రప్రభుత్వం రూ.4.80 లక్షలు మంజూరుచేసింది. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ నెల 9న వేడుకలు ప్రారంభించబోతున్నారు. గోపూజ, చిన్నారులకు భోగిపళ్లు పోసే వేడుక, ఫ్యాన్సీ డ్రెస్, రంగవల్లుల పోటీలు నిర్వహిస్తారు. 300 మంది కళాకారులు 27 కళారూపాల్ని ప్రదర్శించనున్నారు. వివిధ ప్రభుత్వ శాఖలు స్టాల్స్ ఏర్పాటు చేయనున్నాయి.

కేరళను తలపించేలా పడవ పోటీలు

కేరళలో ఓనం పండగ వంటి ప్రత్యేక సందర్భాలు, ఉత్సవాల్లో నిర్వహించే పడవ పోటీలు ప్రపంచప్రఖ్యాతి పొందాయి. సన్నగా, పొడవుగా ఉండే ఈ పడవల్ని అక్కడ స్నేక్ బోట్స్‌గా పిలుస్తారు. అళప్పుజలోని పున్నమడలేక్‌లో జరిగే నెహ్రూ ట్రోఫీ, అరన్‌ముల, చాంపక్కుళం, కొచ్చి లాంటిచోట్ల జరిగే ఈ పోటీల్ని తిలకించేందుకు దేశ, విదేశాల నుంచి వేలసంఖ్యలో పర్యాటకులు తరలివస్తారు. తెలుగు రాష్ట్రాల ప్రజలు పడవ పోటీల్ని చూడటానికి ఇక కేరళకు వెళ్లాల్సిన పని లేదు. రాష్ట్రప్రభుత్వం ఆత్రేయపురంలోనే ఆ అవకాశం కల్పిస్తోంది. సంక్రాంతి ఉత్సవాల సందర్భంగా కేరళ తరహాలో డ్రాగన్ పడవ పోటీలు నిర్వహించబోతోంది. ఆత్రేయపురంలోని బొబ్బర్లంక ప్రధాన కాలువలో ఈ నెల 12, 13 తేదీల్లో పడవ పోటీలు జరుగుతాయి. కేరళతో పాటు, ఉమ్మడి ఉభయగోదావరి, అనంతపురం, విశాఖ, కృష్ణా తదితర జిల్లాల నుంచి 25-30 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయి. మొదటి బహుమతిగా రూ.2లక్షలు, రెండో బహుమతిగా రూ.లక్ష అందజేస్తారు.

టీవీకే అధ్యక్షుడు విజయ్‌కి సీబీఐ సమన్లు

చెన్నై(ప్యారిస్), న్యూస్‌టుడే: కరూర్ తొక్కిసలాట ఘటనపై దర్యాప్తునకు హాజరవ్వాలని తమిళగ వెట్రి కళగం(టీవీకే) అధ్యక్షుడు విజయ్‌కి సీబీఐ సమన్లు జారీ చేసింది. గతేడాది సెప్టెంబరు 27న కరూర్‌లో విజయ్ నిర్వహించిన ప్రచారసభలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ ఈ కేసును దర్యాప్తు చేస్తోంది. ఘటన జరిగిన ప్రాంతాన్ని సీబీఐ అధికారులు పరిశీలించి పలు వివరాలు సేకరించారు. ఈ నేపథ్యంలో విజయ్ దిల్లీలో 12న దర్యాప్తునకు హాజరవ్వాలని సీబీఐ సమన్లు జారీ చేసింది.



విజేతలు చేసే 3 పనులు

1. సిగ్గుపడకుండా ప్రశ్నలు అడగడం.
2. ఒక విషయం తెలియకపోతే, తెలియదని ఒప్పుకోవడం.
3. తాము ఎల్లప్పుడూ కరెక్టే అని వాదించకుండా, తప్పులను సరిదిద్దుకోవడం.

– రాజ్ శమానీ, పాడ్‌కాస్టర్

పుస్తక పఠనానికి పూర్వ వైభవం రావాలి

- మాతృభాషలో చదివినవారు ప్రగతి పథంలో సాగుతారు
- మండలి వెంకట కృష్ణారావు గొప్ప సామాజిక కార్యకర్త
- ఏపీ ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి

ఈనాడు, అమరావతి: తెలుగు భాషకు, పుస్తక పఠనానికి పూర్వ వైభవం తెచ్చేందుకు మేధోమథనం జరగాలని భారత రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ మాజీ ఛైర్మన్, ఏపీ ప్రభుత్వ సలహాదారు డాక్టర్ జి.సతీష్‌రెడ్డి అన్నారు. గతంతో పోలిస్తే నేటికాలంలో ఆలయాలకు వెళ్లడం, ఆచార వ్యవహారాలను పాటించడం, పండుగలు చేసుకోవడం వంటివి బాగా పెరిగాయి. ఆహారపు అలవాట్ల విషయంలో కూడా గతంలో చిన్నతనంగా భావించినా నేడు జొన్న రొట్టెలు, రాగి సంగటి వంటివి తినేవారి సంఖ్య పెరిగింది. అలాగే గతంలో మాదిరిగా పుస్తక పఠనం అలవాటును మళ్లీ ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లడం కష్టమేమీ కాదు. తెలుగు మాట్లాడడం గర్వంగా భావించేలా మన సంస్కృతిని అభివృద్ధి చేసుకోవచ్చు. ఈ అంశంపై ఏం చేయాలో నేను ఆలోచిస్తున్నాను. మేధావులంతా ఆలోచిస్తే మళ్లీ పాత రోజులు వస్తాయి' అని ఆయన పేర్కొన్నారు. విజయవాడ పుస్తక మహోత్సవంలో భాగంగా మంగళవారం మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవంలో సతీష్‌రెడ్డి ప్రసంగించారు.

మాతృభాష గొప్ప ఫలితాలిస్తుంది

'మాతృభాషలో చదివి విషయాన్ని సంగ్రహించినవారు ప్రగతి పథంలో వేగంగా పయనిస్తారు. అర్థం చేసుకోవడానికి గ్రహించడానికి, పరిశోధించడానికి మాతృభాష చాలా సులభంగా ఉంటుంది. మండలి వెంకట కృష్ణారావు గొప్ప సామాజిక కార్యకర్త. ప్రజల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. తెలుగు ప్రాచుర్యం కోసం అప్పట్లోనే ప్రపంచ తెలుగు మహాసభలు నిర్వహించి 75 దేశాల నుంచి ప్రముఖులను రప్పించిన ఘనత ఆయనది' అని సతీష్‌రెడ్డి తెలిపారు.

మంత్రిగా ఉన్నా బస్సులోనే తిరిగారు

రచయిత యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ 'మండలి వెంకట కృష్ణారావు మంత్రిగా ఉన్నప్పుడు ఎన్నో సమస్యలను పరిష్కరించారు. ఏకగ్రీవంగా ఎమ్మెల్యే అయ్యారంటే ఆయన స్థాయి అర్థం చేసుకోవచ్చు. అందరికీ వృత్తి, ప్రవృత్తి వేరుగా ఉంటాయి. మండలికి ఆ రెండూ సమాజసేవే. మంత్రిగా ఉన్నా బస్సులోనే ప్రయాణించేవారు. రాజకీయ నాయకులు, యువత తప్పకుండా ఆయన చరిత్ర చదవాలి' అని తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. 'నాన్నకు పుస్తకాలన్నా, తెలుగు భాష అన్నా ఎంతో ప్రేమ. అందుకే ఆయన దశాబ్దాల కిందటే గ్రంథాలయాలను నిర్వహించేవారు. నేనే గ్రంథపాలకుడిగా ఉండేవాడిని. దాని ద్వారానే భాషాభిమానం, పుస్తక పఠనం అభిరుచి అలవడ్డాయి' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో "దివిసీమ గాంధీ" పుస్తకాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, సీనియర్ సంపాదకుడు కె.శ్రీనివాస్, ఎమెస్కో విజయకుమార్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ఈశ్వరయ్య, పలువురు రచయితలు పాల్గొన్నారు.



వేదికపై మాట్లాడుతున్న డీఆర్డీవో మాజీ ఛైర్మన్, ఏపీ ప్రభుత్వ సలహాదారు సతీష్‌రెడ్డి

220 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ప్రకటన

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్య-కుటుంబ సంక్షేమ శాఖలో వైద్య విద్య సంచాలకు(డీఎంఈ)ల పరిధిలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 220 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ వైద్య సేవల నియామక బోర్డు (ఏపీఎంఎస్ఆర్‌బీ) నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత గల అభ్యర్థులు జనవరి 8 నుంచి 22వ తేదీ రాత్రి 11.59 గంటల లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.

ఈనాడు

క్రీడాపాలన మారితేనే పతకాలు!

తాత్కాలిక విధానాలూ అరకొర కేటాయింపులతో ఏ దేశమూ విశ్వక్రీడా సమరాల్లో గెలుపు జెండా ఎగరేయలేదు. ఆయా ఆటల్లో ఆసక్తి చూపేవారిని చిన్నప్పుడే గుర్తించి, వారి సామర్థ్యాలను బాగా సానబట్టాలి. తమ ప్రతిభను ప్రదర్శించేందుకు వర్ధమాన క్రీడాకారులకు తగినన్ని అవకాశాలు కల్పించాలి. బరిలో ఉన్నవారందరి నైపుణ్యాలను నిష్పాక్షికంగా బేరీజు వేసి, అత్యుత్తమ ఆటగాళ్లనే పోటీలకు ఎంపిక చేయాలి. శిక్షణలో, ఇతర సదుపాయాల కల్పనలో అంతర్జాతీయ ప్రమాణాలు పాటించాలి. ఇవన్నీ చేయాలంటే- వృత్తినిబద్ధత, నిజాయతీ కలిగినవారే క్రీడాపాలకులు కావాలి. తద్భిన్నంగా మన జాతీయ క్రీడాసమాఖ్యల్లో (ఎన్‌ఎస్‌ఎఫ్‌ల్లో) అనేకం నిత్యం వివాదాల్లో మునిగితేలుతున్నాయి. వాటి అసమర్థ నిర్వాకాలకు తోడు మౌలిక వసతులు నిధుల లేమితో ఒలింపిక్స్‌లో మనకు చెప్పుకోదగిన సంఖ్యలో పతకాలే పూజ్యమవుతున్నాయి. ఈ దుస్థితిని పరిమార్చి 2036 కల్లా ప్రపంచంలోని పది అగ్రశ్రేణి క్రీడారాజ్యాల్లో ఒకటిగా ఇండియాను నిలబెట్టాలన్నది కేంద్ర ప్రభుత్వ సత్సంకల్పం. ఈ కల నెరవేరాలంటే- ఎన్‌ఎస్‌ఎఫ్‌లకు జవాబుదారీతనం మప్పి క్రీడాపాలనలో పారదర్శకతకు పట్టంకట్టి తీరాలన్నది అభినవ్‌ బింద్రా అధ్యక్షతన ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్‌ తాజా నివేదిక సారాంశం!

అవినీతి, బంధుప్రీతి, ఎంపిక ప్రక్రియల్లో అక్రమాలకు క్రీడాసమాఖ్యలు పర్యాయపదాలుగా మారాయి. వర్గాల వారీగా చీలిపోయి కొట్లాడుకుంటున్న పెత్తందారుల మూలంగా ఆటగాళ్లకు అనేక ఇక్కట్లు ఎదురవుతున్నాయి. రాజకీయ నేతలు, విశ్రాంత ఉన్నతాధికారులు వంటివారి ఏకచ్ఛత్రాధిపత్యాల్లోంచి సమాఖ్యలు బయటపడితేనే దేశంలో క్రీడాభివృద్ధి జరుగుతుందని సుప్రీంకోర్టు సైతం నిరుడు తేల్చిచెప్పింది. ఆ క్రమంలోనే కొత్తగా జాతీయ క్రీడాపాలనా చట్టాన్ని తీసుకొచ్చిన కేంద్రం- క్రీడాపాలన పనితీరులో రావాల్సిన మార్పులను అధ్యయనానికి ఒలింపిక్‌ బంగారు పతక గ్రహీత బింద్రా నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ను నియమించింది. క్రీడావిద్య, సామర్థ్య పెంపునకు ప్రత్యేకంగా చట్టబద్ధమైన సంస్థను కొలువుతీర్చాలని సిఫార్సుచేసిన టాస్క్‌ఫోర్స్‌- స్పోర్ట్స్‌ అథారిటీ ఆఫ్‌ ఇండియా(శాయ్‌), రాష్ట్రాల క్రీడాశాఖల మధ్య సమన్వయం, వాటి కార్యకలాపాలు బాగుపడాల్సిన ఆవశ్యకతనూ స్పష్టీకరించింది. ఆటగాళ్లు, శిక్షకులు, ఎన్‌ఎస్‌ఎఫ్‌లు, శాయ్‌ అధికారులు, క్రీడాశాస్త్రవేత్తలు తదితరులతో విస్తృతంగా సంప్రదింపులు జరిపి బింద్రా బృందం క్రోడీకరించిన సూచనల అమలు- దేశీయ క్రీడారంగానికి సరికొత్త జవసత్త్వాలను అద్దగలదు!

పతకాల పట్టికలో ముందుకు రావడమే కాదు, 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వాలన్నదీ భారత్‌ లక్ష్యం. క్రీడావసతులను విస్తరించడంతోనే ఆ స్వప్నం సాకారం కాదన్నది వాస్తవం. కిందటేడాదిలోనే దీనిపై అప్రమత్తం చేసిన పార్లమెంటరీ స్థాయీసంఘం- 'శాయ్‌' పరిధిలో నూతన మౌలిక సదుపాయాలు, ఉత్కృష్ట క్రీడాకేంద్రాల ఏర్పాటుకు కేటాయింపులు పెంచాలని సూచించింది. మెరికల్లాంటి ఆటగాళ్లను వెలుగులోకి తెచ్చే కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని చెప్పింది. అయినా, గతేడు ఆగస్టు నాటికి 'శాయ్‌'లో 1524 కోచింగ్‌ పోస్టుల్లో 653 ఖాళీగా పడిఉన్నాయి. రాష్ట్రాల 'శాప్‌'ల్లోనూ శిక్షకుల కొరత ఎక్కువే. ఇలాంటప్పుడు ఇక యువ క్రీడాకారుల ప్రతిభావ్యుత్పత్తులకు మెరుగులు దిద్దేదెవరు? పాఠశాల దశ నుంచి వ్యాయామ విద్యకు ప్రాధాన్యమిస్తూ, శిక్షకులూ సౌకర్యాల్లో దుర్భిక్షాన్ని రూపుమాపితేనే- క్రీడల్లో మువ్వన్నెల పతాకం రెపరెపలాడుతుంది!

సంక్షేమం... అభివృద్ధి... జోడెద్దులైతేనే పురోగతి!

"ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించిన భారత్‌- సమీప భవిష్యత్తులోనే మూడో స్థానాన్ని అందుకోనుంది. ప్రస్తుతం మన దేశం అధిక వృద్ధి, అల్ప ద్రవ్యోల్బణంతో కూడిన అనుకూల పరిస్థితుల గుండా పయనిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక పెట్టుబడి వ్యయం చేస్తున్నందున ఈ బంగారు కాలం కొనసాగుతుంది. కాబట్టి, ఇండియా తన ఆర్థిక ప్రస్థానాన్ని సింహావలోకనం చేసుకుని 'వికసిత్‌ భారత్‌' సాధనకు ఉన్న అవకాశాలను పరిశీలించడానికి ఇదే సరైన సమయం"

క్రీ.శ. 1700లో ప్రపంచ జీడీపీలో 25శాతం వాటాతో భారత్‌ అగ్రస్థానంలో నిలవగా, 22.5శాతంతో చైనా రెండో స్థానంలో ఉండేది. అప్పట్లో బ్రిటన్‌, అమెరికా, జపాన్‌, జర్మనీల వాటా అయిదు శాతం లోపే. స్వతంత్ర భారతం సామ్యవాద సిద్ధాంతాలకు పెద్దపీట వేసి భారీ పరిశ్రమలకు అగ్ర ప్రాధాన్యమిచ్చింది. కార్మికుల అవసరం ఎక్కువగా ఉండే చిన్న పరిశ్రమలను నిర్లక్ష్యం చేసింది. విద్యావైద్యాల పట్లా అదే వైఖరిని ప్రదర్శించింది. స్వాతంత్య్రం వచ్చిన తరవాత మూడున్నర దశాబ్దాల వరకు ఇండియా జీడీపీ కేవలం 3.5శాతం వృద్ధి రేటునే నమోదు చేసింది. 1970దశకంలో తూర్పు ఆసియా, ఆగ్నేయాసియా దేశాలు ఆర్థిక సరళీకరణ విధానాలను చేపట్టి ముందుకు దూసుకుపోయాయి. భారత్‌ మాత్రం చాలా ఆలస్యంగా 1991లో అటువంటి విధానాలను చేపట్టింది. ఇక అక్కడి నుంచి



భారత్‌ వృద్ధిరేటు 6-6.5శాతానికి పెరిగింది. 2008నాటి ఆర్థిక సంక్షోభంలోనూ, ఇటీవలి కొవిడ్‌ సంక్షోభంలోనూ భారత్‌ తన వృద్ధిరేటును నిలబెట్టుకుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతదేశ జీడీపీ 7.3 నుంచి 7.5శాతం వరకు ఉండవచ్చు. ద్రవ్యోల్బణం రెండు శాతానికి పడిపోవచ్చు. కృత్రిమ మేధలో భారీ పెట్టుబడుల వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ కూడా అధిక వృద్ధిని అందుకోనుంది. ఏఐ మూలంగా ప్రపంచ సరకు వాణిజ్యం 0.9శాతం నుంచి 2.4శాతం వరకు వృద్ధిని సాధించనుంది. మన దేశంలోనూ ఆదాయపన్ను, జీఎస్టీ రేట్లలో సంస్కరణల వల్ల వస్తుసేవల వినియోగం పెరగనుంది. రిజర్వు బ్యాంకు వడ్డీరేట్లను తగ్గించి, అనేక విధానపరమైన మార్పులు చేపట్టడమూ జీడీపీ బలోపేతానికి ఊతమిస్తుంది.

ప్రైవేటు పెట్టుబడులూ ముఖ్యమే...

అమెరికా అధిక వాణిజ్య సుంకాలను విధించడంతో భారత్‌ తన వాణిజ్యాన్ని వైవిధ్యీకరించింది. ఇతర దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకోవడాన్ని ముమ్మరం చేసింది. రకరకాల సరకులు, సేవలను వేర్వేరు దేశాలకు పెద్దయెత్తున ఎగుమతి చేస్తోంది. అందుకే వాణిజ్య లోటు అదుపులో ఉంది. 2026-27లో భారత్‌లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐలు), భారతీయ స్టాక్‌ మార్కెట్‌లో విదేశీ సంస్థాగత పెట్టుబడులు(ఎఫ్‌ఐఐ) పెరగనున్నాయి. ఫలితంగా రూపాయి విలువ స్థిరపడుతుంది. ఇలా అధిక పెట్టుబడులు, అధిక వినియోగం వల్ల 2027లో జీడీపీ వృద్ధిరేటు 6.5శాతం నుంచి 7శాతం వరకు ఉంటుందని అంచనా. ద్రవ్యోల్బణం 4 నుంచి 4.5 శాతంగానే ఉండవచ్చు. 2047నాటికి దేశాన్ని సుసంపన్నంగా నిలపాలని ప్రభుత్వం ఆశిస్తోంది. ఆ 'వికసిత్‌ భారత్‌' స్వప్నం సాకారమవ్వాలంటే జీడీపీ వృద్ధిరేటు 7-8 శాతాన్ని అందుకోవాలి. ప్రస్తుతం 30-31 శాతంగా ఉన్న పెట్టుబడుల రేటు 34-35 శాతానికి పెరగాలి. పొదుపు, మదుపును ఇతోధికం చేసుకోవాలి. దేశంలో స్థూల పెట్టుబడులు పెరగడానికి ప్రైవేటురంగ మదుపూ ముఖ్యమే. ప్రస్తుతం అనేక ప్రైవేటు కంపెనీలు రుణ భారం వదిలించుకుని, చేతిలోని నగదును బాగా పెంచుకున్నాయి. కాబట్టి, వాటి పెట్టుబడులు పెరిగే అవకాశముంది. నిరుడు ఏప్రిల్‌-డిసెంబరు కాలంలో ప్రైవేటు రంగం చేసిన పెట్టుబడి ప్రతిపాదనలు గడచిన దశాబ్దంలోనే అత్యధికంగా రూ.26.6లక్షల కోట్లకు చేరుకున్నాయని 'సీఎంఐఈ' వెల్లడించింది. అందులో 25శాతం వాటాను ఆంధ్రప్రదేశ్‌ దక్కించుకుంది. ఆ తదుపరి స్థానాల్లో ఒడిశా(13.1శాతం), మహారాష్ట్ర(12.8), తెలంగాణ(10శాతం) నిలిచాయి.


కేంద్ర ప్రభుత్వం ఆదాయపన్ను, జీఎస్టీ సంస్కరణలతోపాటు కార్మిక కోడ్‌లను, నాణ్యతా ప్రమాణాలను తీసుకొచ్చింది. బీమా రంగంలో నూరు శాతం ఎఫ్‌డీఐలనూ, అణుశక్తి రంగంలో ప్రైవేటు పెట్టుబడులనూ అనుమతించింది. వ్యాపార సౌలభ్యాన్ని పెంచింది. సెబీలోనూ సంస్కరణలు తీసుకొచ్చింది. ఇవన్నీ ప్రైవేటు పెట్టుబడులు పెరగడానికి ఊతమిచ్చేవే. అందుకే భారత్‌లో గూగుల్‌, అమెజాన్‌, మైక్రోసాఫ్ట్‌ వంటి దిగ్గజ సంస్థలు భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

రాష్ట్రాలపై సమ బాధ్యత...

కేంద్ర ప్రభుత్వం పరిశోధన, అభివృద్ధి, నవీకరణలను ప్రోత్సహించడానికి లక్ష రూపాయల నిధిని ఏర్పాటుచేసింది. దీనివల్ల కృత్రిమ మేధ(ఏఐ), బయోటెక్‌, డీప్‌టెక్‌ రంగాల్లో ప్రైవేటు పెట్టుబడులకు ఊతం లభిస్తుంది. నగరాలూ పట్టణాల్లో రహదారులు ఫ్లైఓవర్ల వంటి మౌలిక వసతుల నిర్మాణం జీడీపీ వృద్ధికి ఊతమిస్తుంది. మహిళా భాగస్వామ్యమూ దేశార్థికానికి తోడవుతుంది. మేకిన్‌ ఇండియా, పీఎల్‌ఐ పథకాలు దేశార్థికంలో సేద్యరంగం వాటాను తగ్గించి, పరిశ్రమల వాటా పెరగడానికి తోడ్పడతాయి. ప్రస్తుతం జీడీపీలో 17శాతంగా ఉన్న పారిశ్రామిక రంగం వాటాను 25శాతానికి పెంచడానికి ఆత్మనిర్భర్‌, స్వదేశీ విధానాలు ప్రాధాన్యమిస్తున్నాయి. ఈ క్రమంలో 2045 నాటికి ప్రపంచ జీడీపీలో భారత్‌ వాటా 25శాతానికి చేరుతుందన్న అంచనాలు వినవస్తున్నాయి. చాలా రాష్ట్రాలు కూడా తమ జీడీపీనీ, ప్రజల తలసరి ఆదాయాలనూ పెంచడానికి కంకణం కట్టుకోవడం శుభ పరిణామం. అయితే, కొన్ని రాష్ట్రాలు ఉచితాలకు పెద్దపీట వేసి... విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన వంటి రంగాలను అలక్ష్యం చేస్తున్నాయి. సంక్షేమానికీ, అభివృద్ధికీ సమ ప్రాధాన్యమివ్వాలని ఈ రాష్ట్రాలు గుర్తించాలి. జీడీపీ పెంపునకు కేంద్రం చేపట్టిన విధానాలు ఫలించాలంటే, రాష్ట్రాలు సైతం సమ బాధ్యత తీసుకోవాలి.



ప్రొఫెసర్‌ ఎస్‌.మహేంద్ర దేవ్‌
ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి ఛైర్మన్‌



వ్యథలే కథలై...

ఇంట్లో ఖాళీ పంజరం ఉంటే ఒక పక్షి స్వేచ్ఛగా ఉందన్న ఆనందాన్ని ఇస్తుంది.

నిర్లక్ష్యానికి గురైన వ్యక్తి అస్తిత్వం అదృశ్యం కావడానికి ఎక్కువ సమయం పట్టదు.

మన కష్టాలన్నింటికీ మనకు తెలియని భోగ విలాసాలతో గడిపేవారి తెలివి, చతురతలే కారణం...

ఇలాంటి ఆలోచనాత్మక వాక్యాలు మనకు సుప్రసిద్ధ హిందీ సాహితీవేత్త వినోద్‌ కుమార్‌ శుక్లా రచనల్లో తారసపడతాయి. శుక్లా వ్యక్తిత్వం లాగే ఆయన రచన కూడా నిరాడంబరంగా చిన్న చిన్న పదాల్లోనే గంభీరతనూ గాఢతనూ ప్రతిబింబిస్తుంది. పది కవితా సంకలనాలు, ఆరు కథా సంకలనాలు, మరో ఆరు నవలలను ప్రచురించిన ఆయన ఛత్తీస్‌గఢ్‌ నుంచి తొలి జ్ఞానపీఠ్‌ అవార్డు అందుకున్న రచయిత. శుక్లా 1937 జనవరి ఒకటిన ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నందగావ్‌లో జన్మించారు. వ్యవసాయ శాస్త్రంలో ఎం.ఎస్సీ. పూర్తిచేసి, రాయ్‌పూర్‌లోని అగ్రికల్చర్‌ కాలేజీలో లెక్చరర్‌గా చేరారు. సుప్రసిద్ధ హిందీ కవి ముక్తిబోధ్‌ నుంచి ఎంతగానో స్ఫూర్తి పొందిన శుక్లా తన రచనా వ్యాసంగాన్ని కవితలతోనే ప్రారంభించారు. ఆ తరవాత కథలూ నవలలూ రాశారు. ఆయన మొదటి కవితా సంకలనం 'లగ్‌భగ్‌ జై హింద్‌' 1971లో ప్రచురితమైంది. 'వహ్‌ ఆద్మీ చలా గయా నయా గరం కోట్‌ పెహన్‌కర్‌ విచార్‌ కీ తరహ్‌'(వెచ్చని కొత్త కోటు వేసుకుని ఆలోచనల్లాగా... ఆ వ్యక్తి వెళ్లిపోయాడు) అనేది ఆయన రెండో కవితా సంకలనం. శుక్లా రచనల పేర్లన్నీ ఇలాగే చిన్న చిన్న వాక్యాల్లా, సాధారణ సంభాషణలో ఉపయోగించే పదాలతో ఉంటాయి. సబ్‌ కుఛ్‌ హోనా బచా రహేగా, అతిరిక్త్‌ నహీ... లాంటివి ఆయన కవితా సంకలనాల పేర్లు.

శుక్లా నవలల్లో బహుళ ప్రసిద్ధి పొందింది 1979లో రాసిన తొలి నవల 'నౌకర్‌ కీ కమీజ్‌'. దీన్ని మణి కౌల్‌ సినిమాగా తీశారు. 'ఆద్మీ కీ ఔరత్‌, ఔర్‌ అన్య కహానియా' ఆధారంగా తీసిన మరో చిత్రం వెనిస్‌ ఫిల్మ్‌ ఫెస్టివల్‌లో అవార్డు గెలుచుకుంది. సాహిత్య అకాడమీ అవార్డు గెలుచుకున్న 'దీవార్‌ మే ఏక్‌ ఖిడ్‌కీ రెహతీ థీ' నవల ఆంగ్లంలోకి అనువాదమైంది. అంతర్జాతీయ స్థాయిలో సాహితీ రంగంలో చేసిన విశేష కృషికిగాను 2023లో పెన్‌/నబోకోవ్‌ అవార్డు అందుకున్న మొదటి భారతీయ రచయిత వినోద్‌ కుమార్‌ శుక్లా. సగటు మనుషుల వ్యథలను అద్వితీయంగా అక్షరబద్ధం చేసి ఆధునిక హిందీ సాహిత్యాన్ని సుసంపన్నం చేశారాయన.

నిత్యజీవితంలోని చిన్న చిన్న సంఘటనలకు అద్భుత కథా రూపం ఇచ్చి ఆపకుండా చదివించే శైలి శుక్లాది. అందుకే కొందరు విశ్లేషకులు ఈయన కథనశైలిని సుప్రసిద్ధ రష్యన్‌ రచయిత చెహోవ్‌తో పోల్చుతారు. వృత్తిజీవితం వ్యవసాయంతో ముడిపడటం వల్లేమో- మట్టి, పచ్చదనం పట్ల శుక్లా రచనల్లో అమితమైన ప్రేమ కనిపిస్తుంది. శ్రమజీవుల దగ్గరికి వెళ్లి మాట్లాడుతుండటమే తన తొలి, చివరి కోరికగా చెప్పుకొన్న వినోద్‌కుమార్‌ శుక్లా మెరుగైన సమాజాన్ని ఆశించి రచనలు చేస్తూ 88 ఏళ్ల వయసులో ఇటీవలే తుదిశ్వాస విడిచారు.

– డాక్టర్‌ నరసింహారావు కల్యాణి



దిగుమతుల స్థానాన్ని దేశీయ ఉత్పత్తులతో భర్తీ చేసుకోవడం చాలా అవసరం. రూపాయి విలువ తగ్గినకొద్దీ దిగుమతులు భారమవుతాయి. భారతీయ ఉత్పత్తిదారులు దీన్ని అవకాశంగా మలచుకోవాలి.

– బాబా కల్యాణి, వ్యాపారవేత్త

నాదబ్రహ్మ త్యాగయ్య

అరవై నాలుగు కళల్లో సంగీతానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అది ఏ సంగీతమైనా అందులోని మాధుర్యాన్ని అనుభవించడంలో ఆనందం ఉంటుంది. పాటలకు రాగాలను సమకూర్చి, సంగీతానికి సిద్ధాంతాలను రూపొందించి నిర్దిష్టమైన సంప్రదాయాలను ప్రవేశపెట్టిన మహనీయులు ఎందరో! వారిలో నాదబ్రహ్మ త్యాగయ్య చిరస్మరణీయులు, గొప్ప వాగ్గేయకారులు.

త్యాగయ్య తంజావూరు జిల్లాలో కావేరీ నదీ తీరంలోని తిరువారూరులో సీతమ్మ, రామబ్రహ్మం దంపతులకు 1767 మే నాలుగో తేదీన జన్మించారు. తన ఆరాధ్య దైవాలైన సీతారాముల పేర్లే తన తల్లిదండ్రుల పేర్లు కూడా కావడం తన అదృష్టంగా భావించేవారట. బాల్యం నుంచి పరమ రామభక్తుడైన త్యాగయ్య తండ్రి దేవతార్చన చేసుకునేటప్పుడు నిత్యం పక్కనే కూర్చుని తన్మయత్వంతో గొంతుకలిపేవారు. ఒకరోజు అలాగే భక్తిపారవశ్యంలో 'నమో నమో రాఘవా' అనే కీర్తన పాడగా తండ్రి ఆశ్చర్యపోతూ 'ఇంత చక్కటి పాట ఎక్కడ నేర్చుకున్నావు?' అని అడిగారు. 'నోటికి వచ్చింది, పాడేశాను' అన్నారట త్యాగయ్య. అది విని కొడుకు గొప్ప వాగ్గేయకారుడు అవుతాడని రామబ్రహ్మం ఆనాడే పసిగట్టారు.




ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా త్యాగయ్యకు సంగీతం నేర్చుకోవాలన్న కోరిక తీరే మార్గం కనిపించలేదు. ఊరి వెలుపల ఉన్న పూల తోటకెళ్లి తండ్రి పూజకు పూలు కోసుకొచ్చేవారు త్యాగయ్య. ఆ దారిలోనే శొంఠి వెంకట రమణయ్య అనే సంగీత విద్వాంసుడి ఇల్లు ఉండేది. రోజూ పూలు తెస్తూ ఆ ఇంటి ముందు ఆగి ఆయన శిష్యులకు చెప్పే సంగీత పాఠాలను శ్రద్ధగా వినేవారు త్యాగయ్య. ఒకరోజు అలాగే సంగీతపాఠంలో లీనమై ఇంట్లో తండ్రి పూజ విషయం మర్చిపోయారు. దాంతో వెతుక్కుంటూ వెళ్లిన రామబ్రహ్మానికి వెంకట రమణయ్య ఇంటి ముందు నిలబడి పాఠం వింటున్న కొడుకు కనిపించాడు. వెంటనే అతణ్ని తీసుకుని రమణయ్య దగ్గరికి వెళ్లి విషయం వివరించారు. అప్పటికే త్యాగయ్య పేరు విని ఉన్న రమణయ్య అతణ్ని శిష్యుడిగా చేర్చుకున్నారు. ఓ సందర్భంలో వెంకట రమణయ్య ఇంట్లో జరిగిన సంగీత సభలో గురువు ఆనతి మేరకు త్యాగయ్య అప్పటికప్పుడు బిలహరి రాగంలో 'దొరకునా ఇటువంటి సేవ' అనే కీర్తన ఆశువుగా ఆలపించారు. ముగ్ధుడైన గురువు ఆనందం పట్టలేక త్యాగయ్యను ఆలింగనం చేసుకుని ఆశీర్వదించారు. అప్పట్నుంచీ త్యాగయ్య కీర్తిప్రతిష్ఠలు దశదిశలా వ్యాపించాయి.

తండ్రి మరణానంతరం త్యాగయ్య శిష్యులను కూడదీసుకుని పుణ్యక్షేత్రాలు సందర్శిస్తూ తన గానమాధుర్యంతో శ్రోతలను పరవశులను చేస్తూ రామభక్తి సాగరంలో మునిగితేలేవారు. త్యాగయ్య రాసి స్వరపరచిన ఆణిముత్యాల్లాంటి అయిదు కీర్తనలను పంచరత్నాలంటారు. ఏటా శ్రీత్యాగరాజస్వామి ఆరాధనోత్సవాల్లో ఈ అయిదు కీర్తనలను సామూహికంగా గానం చేయడం ఆనవాయితీ. ఆ ఉత్సవాల్లో పాల్గొని విద్వాంసులతో గొంతు కలిపి పాడటాన్ని అదృష్టంగా భావిస్తారు సంగీత కళాకారులు. ఐహిక ప్రలోభాలకు దాసులవకుండా నాదబ్రహ్మగా కీర్తి పొంది ఆరాధనలు అందుకుంటున్న త్యాగయ్య ప్రాతఃస్మరణీయులు.

– యం.సి.శివశంకరశాస్త్రి

అంతర్యామి



ఎడాపెడా హత్యలు

ఎక్కడైనా నేరాలు ఎక్కువగా జరుగుతున్నాయంటే ఆ ప్రాంతంలో ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం తీవ్రంగా ఉన్నాయని అర్థం. విచ్చలవిడిగా మద్యం, మత్తుపదార్థాల లభ్యత, మారణాయుధాలు తేలిగ్గా అందుబాటులో ఉండటం, సామాజిక ఐక్యత విచ్ఛిన్నమవడం వంటివీ ఘోర నేరాలకు కారణమవుతాయి. వీటికి రాజకీయ అస్థిరత జతకలిసి పలుచోట్ల హత్యల రేటు చాలా ఎక్కువగా ఉంటోంది. 2023లో ఆయా ప్రాంతాల్లో ప్రతి లక్ష మందికి హత్యల రేటు...

లాటిన్‌ అమెరికా, కరేబియన్‌	19.7
సబ్‌-సహరన్‌ ఆఫ్రికా	11.9
ఉత్తర అమెరికా	5.4
ఉత్తర ఆఫ్రికా	5.3
పశ్చిమాసియా	4.8
తూర్పు ఐరోపా	3.9
దక్షిణాసియా	3
ఓషియానియా	2.9
ఆగ్నేయ ఆసియా	1.6
మధ్య ఆసియా	1.4
ఉత్తర ఐరోపా	1.1
తూర్పు ఆసియా	0.4

(ఆధారం: డ్రగ్స్‌, నేరాలపై ఐరాస కార్యాలయం 2025)

రఫా... రఫా... రక్తాభిషేకం!

'లోపల ఏం చేస్తున్నారో సారు...'

'పాత సంవత్సరంలో వెలగబెట్టిన ఘన కార్యాలపై సమీక్షలు జరుపుతున్నారు'

'రిమ్ము విరిగిన లారీ షెడ్డులో దుమ్ము కొట్టుకుపోవాల్సిందే.. కుర్చీ పోయాక కాకుల కౌంటింగ్‌కు మించి చేసేంత గొప్ప పనులేముంటాయి!'

'పదవిలో ఉన్నప్పుడు ఏ పనీ సక్రమంగా చేయకే కదా ఇప్పుడీ పరిస్థితి'

'ఇంతకీ సమీక్షలు ఎవరితో, అప్పటి అధికారులతోనా?'

'వాళ్లంతా ఇంకెక్కడున్నారు, కోర్టులూ జైళ్లను సందర్శించుకుంటున్నారు'

'మరి అనుంగు నేతలతోనా..'

'ఊచల కౌంటింగ్‌లో వాళ్లు బిజీ'

'మరింక సమీక్షలు ఎవరితో, ఎందుకో..'

'ఇదంతా రఫా, రఫా బ్యాచులెండి'

'కొత్త వ్యూహకర్తలా ఏంటి?'

'ఇదోటైపు లెండి, అధికారంలో లేకున్నా ఉన్నట్లే హడావుడి చేయడం, ఆందోళనల పేరిట అరాచకాలకు దిగడం, పోలీసులపైకి దూసుకెళ్లడం, అడ్డగోలుగా బ్యానర్లు కట్టడం, స్టేషన్లు ముట్టడించడం, ట్రాఫిక్‌ను అడ్డుకోవడం, దుకాణాలు మూసేయించడం, మేకలూ, పొట్టేళ్ల తలకాయల దండలు కట్టడం, ఫ్లెక్సీలకు రక్తాభిషేకాలు చేయడం, వేటకొడవళ్లు ఊపుతూ కేకలు పెట్టడం, జనాల్ని భయపెట్టడం.. ఇలాంటి వాటిలో నిపుణులన్నమాట!'

'సారుకు ఇలాంటి సైకోలంతా ఎక్కడ దొరుకుతారో?'

'ప్రత్యేకంగా దొరకడమేంటి, సారు చుట్టూ ఉండేదే ఇలాంటివాళ్లు! మొన్నటిదాకా లోపలున్నారు, నాటి నేతలు లోపలికి వెళ్లడంతో, వీళ్లు బయటికొచ్చి సారు చుట్టూ చేరారు'

'ఇంతకీ ఇలాంటివాళ్లతో చేసే సమీక్షలేంటో!'

'ఇంకేముంటాయ్‌.. రఫా రఫా అంటూ రచ్చ రభసలు ఎక్కడెక్కడ చేయాలి, ఎక్కడ ట్రాక్టర్లు తిరగెయ్యాలి, ఏ కూడలిలో మామిడికాయలు రోడ్డుపై పోసి తొక్కాలి, ఏ ఊరి జనాల్ని భయభ్రాంతుల్ని చేయాలి... ఇలాంటి వాటన్నింటికీ ప్లాన్లు తయారు చేస్తారన్నమాట!'

'సారు తీసుకునేది ఇలాంటి ఉన్మాద మూకల సలహాలా!'

'తీసుకోవడమేంటి, శిరసావహిస్తారు, అస్సలు, సారుదే దర్శకత్వ పర్యవేక్షణ, మూకలు ఫాలో అవుతాయంతే!'

'ఈ మందబలం చూసుకునే.. అధికారంలోకి రాగానే రెండునెలల్లో అరెస్టులు తప్పవంటూ భీంకరిస్తున్నారా!'

'ప్రస్తుతం తన పొజిషనేందో సారుకు అర్థం కావడం లేదనుకుంటా, అదృష్టం కాస్త అటూఇటైతే ఏకంగా లోపల కూర్చోవాల్సిన పరిస్థితి. ఏదో కాలం కలిసొచ్చి పచ్చిగాలి పీల్చుకుంటున్నారంతే! అది మరిచిపోయి, ఇలాంటి రఫా రఫా సైకోలతో సయ్యాటలాడుతూనే ఉంటే, ఈసారి బయటికి రావడం కూడా కష్టమే'

'ఇన్ని మూకల దండు ఉండగా లోపలికి ఎందుకెళ్తారు?'



'సారే లోపలికెళ్తే, బయట మూకలకు దక్కేది పోలీసుల రఫ్ఫా ట్రీట్‌మెంటే!'

✦ ✦ ✦

'సార్‌.. నాకు మొత్తం పాతిక తలకాయలకు లెక్క చెప్పాలి'

'సరే, ఈ పిల్లాడికి డబ్బులు సెటిల్‌ చేసి పంపించెయ్యండి'

'అన్నా, నేనయితే, వంద తలకాయలు దండలు గుచ్చి, రోడ్ల నిండా తోరణాలు కట్టాను'

'ఈ తమ్ముడికీ లెక్క సరిచేసేయండి'

'వాడు దండలు కట్టింది కోడి తలకాయలతో సార్‌.. అవి కూడా వాడేమీ కోయలేదు, చికెన్‌ సెంటర్లకు వెళ్లి ఏరుకొచ్చాడంతే'

'పర్వాలేదు లేవయ్యా, కోడైతే ఏంది! ఏదైతే ఏంది! రక్తం పారిందా లేదా, అదో ఫీల్‌ అంతే'

'అన్నా, నేను మీ ఫ్లెక్సీలకు రక్తాభిషేకం చేశాను. రక్తంతో మీ చరిత్రను ఫ్లెక్సీలపై రాయించాను, కావాలంటే చూడండి నా బట్టలన్నీ రక్తంతో తడిసిపోయి ఉన్నాయి'

'ఒప్పుకొంటా లేవయ్యా ఇప్పుడు రక్తచరిత్రకు సాక్ష్యాలు ఎవరడిగారు, నెత్తురు పారిందా లేదా అన్నదే లెక్క కదా!'

'నేను ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేస్తుంటే మన వాళ్లే అడ్డుకుని కొట్టారన్నా'

'మన లెవల్‌కు పాలాభిషేకాలేంటి, రక్తాభిషేకాలు జరగాల్సిందేనని వద్దని ఉంటారులే!'

'బహిరంగంగా జంతుబలి చేశామంటూ పోలీసులు కేసులు పెడుతున్నారు సార్‌'

'బంధుబలులే జరిగాయి, ఇదోలెక్కా అని తొడగొట్టకపోయావ్‌'

'వేట కొడవళ్లతో రఫా రఫా నినాదాలు చేశామంటూ లాఠీఛార్జి చేశారు సార్‌'

'వేట కొడవలి వారసత్వ చిహ్నం, రఫా రఫా.. అభిమాన నినాదం, ఉన్మాదం అంటే ఎలా!'

'అడ్డొస్తే గొడ్డలి వేటే సార్‌'

'అది.. అలా ఉండాలి, అదీ ఫైరంటే!'

✦ ✦ ✦

'సార్‌... ఇదేమీ బాగాలేదు, సైకోమూకల్ని పోగేసుకుని రక్తాభిషేకాలంటూ చర్చలేంటి?'

'అంబలీ.. మీరైనా అధికారం ఉంటేనే నేతలు, లేకుంటే మీరూ ఖాళీ మూకలే, మీవీ ఉత్తుత్తి కేకలే కదయ్యా!'

'గొంతులో చుక్క, ముద్దలో ముక్క లేకపోతే అడుగెయ్యని ఆవారా మూకల్ని చూసుకుని, మమ్మల్ని తక్కువ చేయకండి సార్‌'

'మనల్ని నడిపించేదే వాళ్లయ్యా అంబలీ! లేకపోతే రోడ్లెలా ఎక్కుతాం, రాజకీయాలెలా చేస్తాం, ఎన్నికలెలా గెలుస్తాం!'

'ఇలా జనం నెత్తినెక్కి, బెదిరించినందుకే, నూటయాభై ఒకటి మధ్యలో అయిదు ఎగిరిపోయింది. ఇక, పదకొండులో ఎటుపక్క ఒక్కటి ఎగిరినా, మిగిలేది సింగిల్‌ డిజిటే! రఫా రఫా అంటూ కోతలు ఆపకపోతే డిపాజిట్లూ అనుమానమే!'

'హా...!!!'

– శ్రీశైల

ఎన్ని బహుమతులో..!

హాయ్‌ నేస్తాలూ! మనకు ఏదైనా పని నచ్చితే.. ఎంతసేపైనా చేస్తూనే ఉంటాం కదా! అలా ఓ నేస్తానికి పాటలు పాడటం అంటే ఇష్టం.. అలా తను నిరంతర సాధనతో బాగా పాడుతూ బోలెడు బహుమతులు అందుకుంటోంది. తనెవరంటే..!

గుంటూరు జిల్లా కాకుమాను మండలం కొండపాటూరుకు చెందిన పోలవరపు సాధ్యకు పన్నెండేళ్లు.. ఏడో తరగతి చదువుతోంది. అమ్మానాన్నలు.. స్వైరా, సిరికృష్ణ డాక్టర్లు. బెంగళూరులో స్థిరపడ్డారు. సాధ్య చిన్నప్పటి నుంచే చక్కగా పాటలు పాడేది. అది గమనించిన వాళ్లమ్మ.. సంగీతంలో శిక్షణ ఇప్పించారు. అలా నాలుగేళ్ల వయసులోనే కర్ణాటక సంగీతం నేర్చుకోవడం మొదలుపెట్టింది. ఆరేళ్ల వయసులోనే అంతర్జాతీయ వేదికల మీద పాటలు పాడి, బంగారు పతకాలు అందుకుంది. అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలూ చక్కగా ఆలపిస్తుంది. అంతేకాకుండా వెస్టర్న్‌ సంగీతంలోనూ తన ప్రతిభను చాటుకుంటోంది సాధ్య. అమెరికా, కెనడా, స్విట్జర్లాండ్‌ లాంటి దేశాల్లో నిర్వహించిన పోటీల్లో పాల్గొంది. యార్క్‌ యూనివర్సిటీ, శాన్‌ఫ్రాన్సిస్కో ఒపెరా హౌస్‌ వంటి అంతర్జాతీయ వేదికల మీద తన పాటలు వినిపించి.. ఏడుసార్లు ప్రథమ, ఏడుసార్లు ద్వితీయ, రెండుసార్లు తృతీయ బహుమతులు గెలుచుకుంది. ఇప్పటి వరకు 20కి పైగా బంగారు పతకాలు సాధించింది. అలాగే మూడు గౌరవ, మూడు ప్రత్యేక అవార్డులనూ సొంతం చేసుకుంది. పాశ్చాత్య సంగీతంలో వివిధ రీతుల్లో పాటలు పాడుతూ, అంతర్జాతీయ స్థాయిలో పేరు సంపాదించిన తెలుగు అమ్మాయిగా నిలిచింది సాధ్య. తన ప్రతిభతో స్విట్జర్లాండ్‌కు చెందిన టిజియానో రొసెట్టి ఇంటర్నేషనల్‌ మ్యూజిక్‌ అకాడమీ అందించే స్కాలర్‌షిప్‌ను దక్కించుకుంది. ఇలాగే తను భవిష్యత్తులో మరిన్ని బహుమతులు గెలుచుకోవాలని ఆల్‌ ది బెస్ట్‌ చెప్పేద్దామా!



– కాలవ ప్రసాద్‌

హాయ్‌! బుజ్జీ!!

మన సామెతలు!

ఇక్కడ కొన్ని సామెతలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తి చేయండి చూద్దాం.

1. ☐☐ పీకి ☐☐☐ వేసినట్లు.
2. అందితే ☐☐ అందకపోతే ☐☐.
3. ఏ ☐☐ కు ఆ ☐☐☐.

పిల్లల విక్రయాల కేసులో... ముంబయిలో కవిత అరెస్టు

ఈనాడు - అమరావతి: పిల్లల విక్రయాల కేసులో ముంబయికి చెందిన నిందితురాలు కవితను ప్రత్యేక బృందం అరెస్టు చేసింది. విజయవాడ నుంచి ముంబయి వెళ్లిన బృందం మంగళవారం నిందితురాలిని అదుపులోకి తీసుకుంది. ఆమెపై విజయవాడలో రెండు కేసులు ఉన్నాయి. కవితను ముంబయిలోని కోర్టులో హాజరుపరిచి... అక్కడ ట్రాన్సిట్ వారెంటు తీసుకుని విజయవాడకు తెస్తున్నారు. ముగ్గురు పిల్లలను నూరి, సతీష్‌లతో కవిత ఇటీవల విజయవాడ పంపి సరోజినికి అందజేసింది. నిందితులను అరెస్టు చేసేందుకు మూడు బృందాలు విజయవాడ నుంచి ముంబయి, అహ్మదాబాద్‌లకు వెళ్లాయి. ఒక బృందం కవితను అరెస్టు చేసి, తిరుగు పయనమైంది. మరో వైపు దిల్లీకి చెందిన ప్రియాంకను అరెస్టు చేసేందుకు ఓ బృందం అక్కడికి వెళ్లింది.

అనిల్‌పై పీటీ వారెంట్ జారీ: అహ్మదాబాద్‌కు చెందిన మరో నిందితుడు అనిల్ కోసం వెళ్లిన బృందానికి.. అప్పటికే నిందితుడు ఓ కేసులో అరెస్టయి.. మహారాష్ట్రలో ఓ జైలులో రిమాండ్‌లో ఉన్నట్లు తెలిసింది. దీంతో అతనిపై పీటీ వారెంట్‌ను విజయవాడ కోర్టులో పోలీసులు ఫైల్ చేశారు. దీనిని కోర్టు ఆమోదించడంతో మహారాష్ట్రలోని జైలులో ఉన్న అనిల్‌ను పీటీ వారెంట్‌పై విజయవాడ కోర్టులో హాజరుపరిచేందుకు ప్రత్యేక బృందం మహారాష్ట్ర వెళ్లింది.

కీలక సమాచారం: ప్రధాన నిందితురాలు సరోజిని కస్టడీని ముగించి, ఆమెను పోలీసులు సీఎంఎం కోర్టులో హాజరుపరచగా.. న్యాయమూర్తి ఆదేశాలతో రిమాండ్ నిమిత్తం విజయవాడ కారాగారానికి తరలించారు. ఐదు రోజులు భవానీపురం పోలీసులు నిందితురాలి నుంచి కీలక వివరాలు రాబట్టారు. ఉత్తరాది ముఠాతో సంబంధాలు, లావాదేవీలను తేల్చారు. సరోజినిని నున్న, కొత్తపేట, మహిళా స్టేషన్ పోలీసులు కస్టడీ తీసుకుని విచారించేందుకు పిటిషన్లు వేశారు.

నడిపించే నేస్తం.. గెలిపించే సమస్తం!

ఆకట్టుకున్న పుస్తకప్రియుల పాదయాత్ర... భారీగా తరలివస్తున్న యువత



ర్యాలీగా సాగుతున్న అతిథులు, విద్యార్థులు


పుస్తకాలను ఆసక్తిగా తిలకిస్తున్న చిన్నారులు


స్టాళ్ల వద్ద కిటకిట

ఈనాడు, అమరావతి

విజయవాడ పుస్తక మహోత్సవానికి రోజురోజుకు ఆదరణ పెరుగుతోంది. 5వ రోజైన మంగళవారం సిద్ధార్థ కళాశాల నుంచి ఇందిరా గాంధీ క్రీడా మైదానం వరకు సాగిన పుస్తక ప్రియుల పాదయాత్రకు అపూర్వ స్పందన వచ్చింది. చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోదియా జెండా ఊపి పాదయాత్ర ప్రారంభించారు. వందల మంది విద్యార్థులు, యువత, రచయితలు, సాహిత్య ప్రేమికులు యాత్రలో పాల్గొన్నారు. ఈగల్ సంస్థ ప్రతినిధులు యాత్రలో భాగస్వామ్యమై **డ్రగ్స్ వద్దు.. పుస్తకాలు ముద్దు** వంటి నినాదాలు చేస్తూ యువతను మేల్కొలిపేలా చేశారు. పుస్తక ప్రదర్శనలో సాహిత్య ప్రేమికులు, రచయితలతో పాటు ఎక్కువ మంది యువత, చిన్నారులు, మహిళలు పాల్గొన్నారు. వృత్తాకారంగా ఏర్పాటు చేసిన స్టాళ్లలో పుస్తకాలను పరిశీలిస్తూ అవసరమైన పుస్తకాలను ఆసక్తిగా కొనుగోలు చేసిన దృశ్యాలు కనిపించాయి. యువతీ యువకులు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అధికంగా కొనుగోలు చేశారు. మండలి వెంకట కృష్ణారావు శత జయంతి ఉత్సవాలు పట్టాభిరామ్ సాహిత్య వేదికపై నిర్వహించారు. కార్యక్రమాల ముందు విద్యార్థులతో ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.


వాల్మీకి రామాయణం


సంకలనాలు ఒకేచోట..

మహోత్సవంలో ఈనాడు

సాయంత్రం 6 గంటలకు : పాతికేళ్ల నవల పుస్తకావిష్కరణ: అతిథులు మధురాంతకం నరేంద్ర, అశోక్‌కుమార్

సాయంత్రం 7 గంటలకు : తుమాటి దొణప్ప శత జయంతి సభ: అతిథులు గుమ్మా సాంబశివరావు, తమ్మిరెడ్డి నిర్మల, షేక్‌మస్తాన్

ఎరువు.. ఏటేటా దరువు..!

‘అతివృష్టి.. అనావృష్టి.. ప్రకృతి విపత్తులు.. మార్కెట్ ఒడిదొడుకులు... రైతన్న వెన్ను విరుస్తున్నాయి. గోరుచుట్టుపై రోకటిపోటులా పెరిగిన ఎరువుల ధరలు మరింత ఆర్థికంగా కుదేలు చేస్తున్నాయి. గత ఖరీఫ్ సీజన్‌తో పోల్చినా రబీకి ధరలు పెరిగిపోయాయి. ఓ వైపు యూరియాకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తుండగా కాంప్లెక్స్ ధరల పెరుగుదల మోయలేని భారంగా మారింది.’

పెట్టుబడి భారం...

★ ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ, ఉద్యాన పంటలు కలిపి రబీలో మూడు లక్షల ఎకరాలు సాగు చేస్తున్నారు. ఇందులో వరి, మిర్చి, పత్తి, మొక్కజొన్న, పసుపు, కూరగాయలు, మామిడి అధికం. వీటన్నింటికీ కాంప్లెక్స్ ఎరువుల వినియోగం ఎక్కువగానే ఉంది. ★ ఎకరం వరికి 7, మొక్కజొన్నకు 6, మిర్చికి 15, పత్తికి 3, అపరాలకు 2, పుల్లశనగకు 2 బస్తాల చొప్పున కాంప్లెక్స్ ఎరువులు వాడుతున్నారు.

★ కంచికచర్ల రైతు.. పాల్ 4 ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. నిరుడు కంటే ఎరువుకు రూ.3600 వరకు అదనపు ఖర్చు అవుతోందని వాపోయారు.

రూ.100–230 వరకు... ★ పొటాష్ మొదలు ఎక్కువగా వినియోగించే 28.28.28, 16.16.16, వంటి అన్ని కాంప్లెక్స్ ఎరువుల ధరలు ఒక్క సీజన్లో అమాంతం పెరిగిపోయాయి. ★ గత ఖరీఫ్‌తో పోలిస్తే రబీకి రేట్లు రూ.100-230 వరకు పెరిగాయి. ★ అత్యధికంగా 10.26.26 గరిష్ఠంగా రూ.230 వరకు పెరిగింది. ★ ఒక్కో రైతుపై ఎకరానికి రూ.500 నుంచి రూ.వేలల్లో భారం పడుతోంది. ★ కాంప్లెక్స్ ధరలు అమాంతం పెరిగిపోతున్న నేపథ్యంలో రైతులు తక్కువ ధరకు అందుబాటులో ఉండే యూరియా వాడుతుండటంతో వ్యాపారులు యూరియా దందా మొదలు పెట్టారు.

వీరులపాడు రైతు...
సుధాకర్ పత్తి, మిర్చి, మొక్కజొన్న కలిపి 11 ఎకరాల్లో వేశారు. గత ఖరీఫ్‌తో పోలిస్తే కాంప్లెక్స్ ఎరువుల వినియోగానికి రూ.15 వేలు పైగా భారం పడింది.

పెరిగిన ధరల వివరాలు (రూ.ల్లో)

ఎరువు	ఖరీఫ్	రబీ	▲
14.35.14	1800	1900	100
20.20.0.13	1350	1450	100
28.28.28	1800	1950	150
పొటాష్	1700	1800	100
16.16.16	1450	1600	150
10.26.26	1720	1950	230

– ఈనాడు, అమరావతి
– నందిగామ, న్యూస్‌టుడే

సృజన మెరిసే.. భవిత మురిసే

విద్యార్థులు కొత్తగా ఆలోచించారు. సృజనకు పదును పెట్టారు. సమాజ హిత ప్రాజెక్టులు రూపొందించారు. స్థానిక ఆంధ్రా లయోల కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే మెగా ఎక్స్‌పోలో సుమారు 600 స్టాళ్లు ఏర్పాటు చేసి తాము చేసిన ప్రయోగాలను ప్రదర్శించారు. దాదాపు 5 వేల మంది విద్యార్థులు, సందర్శకులు ఎక్స్‌పోని తిలకించారు. అందులో కొన్ని నమూనాలపై కథనం.


– కరెన్సీనగర్, న్యూస్‌టుడే

నిర్దిష్ట దిశలో వెళ్లే వాహనం..



నిర్దిష్ట దిశలో పయనించే రోబో వాహనాన్ని రూపొందించాం. సూచించిన నల్లని గీతలో మాత్రమే వాహనం నడిచేలా దానిని తయారు చేశాం. ఇది పెద్ద కార్పొరేట్ కంపెనీలు, కళాశాలల్లో వివిధ పనులకు వినియోగించేందుకు ఉపయోగపడుతుంది. ఆర్మీలో కూడా వాడుకొనే వీలుంది. **- అఖిల్, సుదర్శన్, రాజు, అభి, బీసీఏ**

కృత్రిమ మేధతో రోబోటిక్ చెయ్యి



కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ సాంకేతికతతో రోబోటిక్ చెయ్యిని తయారు చేశాం. దానితో శస్త్రచికిత్సలు చేసే అవకాశం ఉంది. భవిష్యత్తులో వైర్‌లెస్ కంట్రోల్‌తో వాయిస్ ఇచ్చి నియంత్రించే వీలుంది. వైద్య రంగంలో కీలకం. దూర ప్రాంతంలో వైద్యుడు ఉన్నా ఇక్కడ శస్త్రచికిత్స చేయవచ్చు. **- ఎం.శ్రుతి, కె.తన్విశ్రీ నాగ, పి.చైతన్య, బీసీఏ**

రాకెట్ ఎగిరే విధానంపై..



శ్రీహరి కోట రాకెట్ లాంచింగ్ స్టేషన్ నమూనా రూపొందించాం. కమాండ్ కంట్రోల్‌లో వచ్చిన శబ్దాలకు అనుగుణంగా రాకెట్ స్టేషన్ తెరచుకోవడం, అందులోంచి రాకెట్ (తారాజువ్వ) పైకి వెళ్లేలా తయారు చేశాం. ప్రతి పావు గంటకు రాకెట్‌పైకి వెళ్లేలా టైమింగ్ సిద్ధం చేశాం. **- పి.సాయి మణికంఠ, తోట రోహిత్, టి.వెంకట సాయి, ఎం.అఖిల్, కర్రి వరుణ్, విజయ్ కుమార్, బీఎస్సీ**

స్మార్ట్ రైల్వే గేట్‌తో మేలు..



రైల్వే గేట్ల వద్ద కాపలాదారు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. వాటి నివారణకు ఆటోమెటిక్ స్మార్ట్ రైల్వే గేట్ సిస్టం రూపొందించాం. రైలు వచ్చినప్పుడు గేటు ఆటోమెటిక్‌గా వేసుకునే వెసులుబాటు సిస్టంలో పొందుపర్చాం. దీని వల్ల ప్రమాదాలను నివారించవచ్చు. **- జె.రాజు, పి.శ్రీయశస్వి, జి.వినోద్, చైతన్య, బీసీఏ**

ఆవకాయ్ ఉత్సవానికి ఏర్పాట్లు


పున్నమిఘాట్ వద్ద సిద్ధమవుతున్న వేదిక

భవానీపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పున్నమిఘాట్, కృష్ణానది మధ్యలోని భవానీద్వీపంలో నిర్వహించనున్న ఆవకాయ్ ఉత్సవానికి సంబంధించి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ద్వీపం పరిసరాలను శుభ్రం చేసి రంగులు వేస్తున్నారు. నదిలోకి దిగకుండా ఒడ్డున ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. ద్వీపంలో పడిపోయిన చెట్లను కొట్టేసి శుభ్రం చేస్తున్నారు. పున్నమిఘాట్ వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదికలను ఏర్పాటు చేస్తున్నారు.

పరిష్కారం చూపాలి.. పండగ తేవాలి!


హైటెన్షన్ విద్యుత్తు తీగలు తక్కువ ఎత్తులో ఉండటంతో నిలిచిన వంతెన నిర్మాణం

విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనాలు విజయవాడ మీదుగా వెళ్లాల్సి రావడం..సిగ్నల్స్, ట్రాఫిక్ రద్దీతో దాదాపు 1-2 గంటలకుపైగా సమయం వృథా అయ్యేది. దీనిని అధిగమించేలా.. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వం పశ్చిమ బైపాస్‌కు అడుగులు వేసింది. నగరంలోకి రాకుండానే గన్నవరం సమీపంలో చినఆవుటపల్లి దగ్గర నుంచి హైదరాబాద్ జాతీయ రహదారిపై గొల్లపూడి దగ్గరకు 45 నిమిషాల్లోనే చేరుకునేలా ప్యాకేజీ-3లో 30 కి.మీ పశ్చిమ బైపాస్ నిర్మాణం చేపట్టింది. పనులు దాదాపు పూర్తయినా హైటెన్షన్ విద్యుత్తు లైన్లు జక్కంపూడి, అంబాపురం, నున్న ప్రాంతాల్లో రహదారిపై 8 మీటర్ల ఎత్తులో వెళ్తుండడంతో జక్కంపూడి-అంబాపురం మధ్య పశ్చిమబైపాస్ వంతెన నిర్మాణం నిలిపివేశారు. కోర్టుకు చేరిన వివాదాన్ని, కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక చొరవతో టవర్ల ఎత్తు 8 మీటర్ల నుంచి 14 మీటర్లకు యథాస్థానంలోనే పెంచాలని నిరుడు అక్టోబర్ 30న కోర్టు తీర్పు ఇచ్చింది. వివాదాలన్నీ తొలగి సమస్య పరిష్కారమై రెండు నెలలు కావస్తోంది. నిధుల సమస్య లేకున్నా, నిర్మాణ సంస్థ నత్తనడకన వంతెన పనులు చేస్తుండడం, అధికారులు చొరవ చూపకపోవడంతో పశ్చిమబైపాస్ పూర్తి స్థాయిలో ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. సంక్రాంతి నేపథ్యంలో హైదరాబాద్-విశాఖ మధ్య రాకపోకలు సాగించే వాహనచోదకులు ఎక్కువగా ఇటే ప్రయాణిస్తారు. దీంతో అసంపూర్తి వంతెన నిర్మాణం దగ్గర ట్రాఫిక్ సమస్యలు తీవ్రం కానున్నాయి. యుద్ధప్రాతిపదికన టవర్ల ఎత్తు పెంచి, వంతెన పూర్తి చేసి అందుబాటులోకి తేవాలి.

-ఈనాడు, అమరావతి

నియోజకవర్గ దార్శనిక ప్రణాళికలపై దృష్టి

ఎన్టీఆర్ కలెక్టరేట్ : స్వర్ణాంధ్ర-2047 సాధన దిశగా చేస్తున్న ప్రయాణంలో ప్రతి శాఖకు చెందిన ప్రగతి సూచికల్లో పురోగతి కనిపిస్తోందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలపైనా ప్రత్యేక దృష్టిపెట్టి సమగ్ర కార్యాచరణతో ముందడుగు వేయాలని శాఖల అధికారులు, దార్శనిక ప్రణాళిక యూనిట్ల యంగ్ ప్రొఫెషనల్స్‌కు సూచించారు. వీటిపై కలెక్టరేట్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖలకు సంబంధించి 563 కీలక ప్రగతి సూచికల్లో.. సూచికలు, మండలాల వారీగా స్కోర్లు, గ్రేడ్లపై సమీక్షించారు. పలు శాఖలు ఇంకా బీ, సీ గ్రేడ్లలోనే ఉన్నాయని, ఎ, ఎ+కు చేరేలా కృషి చేయాలని కోరారు. సీపీవో శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

పతంగులతో మజా.. ప్రాణాంతకం మాంజా

సంక్రాంతి నేపథ్యంలో గాలి పటాలు ఎగుర వేయడం అంటే పిల్లలు, యువతకు సరదా. పతంగులు ఎగుర వేసే క్రమంలో ప్రాణాలకు ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. గాలి పటాలు ఎగురవేయడానికి వాడే నైలాన్, గ్లాస్ పూతతో తయారు చేసే చైనీస్ మాంజా దారం గొంతు కోసేంత పదునుగా ఉండడమే అందుకు కారణం. దాని వల్ల అనేక ప్రమాదాలు కూడా చోటుచేసుకుంటున్నాయి. ద్విచక్ర వాహనదారుల మెడకు చుట్టుకొని తీవ్రంగా గాయపడిన ఘటనలు గతంలో నగరంలో చోటుచేసుకున్నాయి. పాదచారులు, చిన్నారులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు.

మాంజా పక్షుల జీవితాలపై కూడా ప్రభావం చూపుతోందని పర్యావరణ ప్రేమికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెట్లు, విద్యుత్తు తీగల మధ్య చిక్కుకున్న మాంజా వల్ల పక్షులు బలవుతున్నాయి. వాటి రెక్కలు, మెడలకు మాంజా అల్లుకుపోయి మరణిస్తున్నాయి. విద్యుత్తు తీగలకు తగిలితే షార్ట్ సర్క్యూట్ చోటుచేసుకొని అగ్ని ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నట్లు ఆ శాఖ అధికారులు చెబుతున్నారు. ★

నిషేధం ఉన్నప్పటికీ..

ఇప్పటికే నైలాన్, మాంజాపై నిషేధం కొనసాగుతోంది. అయినప్పటికీ కొన్నిచోట్ల వాటిని అక్రమంగా విక్రయించి వ్యాపారం చేస్తున్నారు. తక్కువ ధర, గట్టిగా ఉంటుందనే కారణంతో నిషేధం ఉన్నా.. వాటినే కొంటున్నారు. కానీ అవి తెగి మనుషులు, పక్షుల ప్రాణాలను ప్రమాదంలో పడేస్తున్నాయి. అందుకే సాధారణ దారాలు వినియోగిస్తే మేలు.

నిఘా ఉంచాం..

దీనిపై పటమట సీఐ పవన్‌కిశోర్ మాట్లాడుతూ... నిషేధిత మాంజాను విక్రయించినా.. నిల్వ చేసినా.. ఉపయోగించినా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే దుకాణాల్లో తనిఖీలు చేయడంతో పాటు నిఘా ఉంచాం. తల్లిదండ్రులు కూడా పిల్లలు వినియోగిస్తున్న దారాలను గమనించాలి. మాంజా వాడకుండా చూడాలి. పాఠశాలల్లో సైతం అవగాహన కల్పించాలి.

– పటమట, న్యూస్‌టుడే

ఆవిష్కరణల కృష్ణభగవాన్


న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్



అరకొర చదువు. 81 ఏళ్ల వయసు.. ఇలాంటి వ్యక్తులు సాధారణంగా ఇంటి పట్టునే ఉంటూ పిల్లలు పెట్టేది తిని వయోభారంతో ఇబ్బందులు పడుతూ జీవనం సాగిస్తుంటారని అనుకుంటాం. కానీ.. ఆ వయసులో కూడా అనేక ఆవిష్కరణలు చేస్తూ ఔరా అనిపిస్తున్నారు మచిలీపట్నంకు చెందిన తోట కృష్ణభగవాన్.

ఏడో తరగతి వరకు చదివిన ఆయన.. తొలుత ఆంధ్ర జాతీయ కళాశాలలో చేరి లేత్ మిషన్‌పై శిక్షణ పొందారు. అనంతరం ఆంధ్రా సైంటిఫిక్ కంపెనీలో పదేళ్లు పనిచేశారు. జీతం చాలక బయటకొచ్చారు. 1969లో సోదరుడు తులసీరామ్‌తో కలిసి రూ.5వేల పెట్టుబడితో ట్రాక్టర్ విడిభాగాలు, పరికరాల తయారీ ప్రారంభించారు.


వెన్నతీసే..


నువ్వుల లడ్డూల యంత్రాలు

1972.. 1985.. 1994

★ 1972లో రాష్ట్రంలోనే తొలిసారిగా పచ్చిపాల నుంచి వెన్న తీసే యంత్రం రూపొందించారు. ★ 1985లో 1.5 మి.మీ నుంచి 3.5 మి.మీ వ్యాసం కలిగిన మెటల్ తీగలపై సున్నితమైన నమూనాలను చెక్కగల యంత్రాన్ని అభివృద్ధి చేశారు. రోల్డ్‌గోల్డ్ నగల తయారీకి పలు యంత్రాలను రూపొందించారు. గాజులు, చెవిరింగులు, వడ్డాణాలు, అరవంకీలకు మెటల్ తీగలపై డిజైన్లు రూపొందించేందుకు ఇవి ఉపయోగపడుతున్నాయి. ★ 1994లో ఓ సంస్థకు అగరబత్తీలు, దూప్‌స్టిక్స్ తదితరాల తయారీకి యంత్రాలు తయారు చేశారు. వీటికి పేటెంట్ కూడా పొందారు. ★ సున్నుండలు, వేరుశనగ, నువ్వుల లడ్డూలు, చెకోడీలు, అప్పడాలు, కాజాల తయారీకి యంత్రాలను తీర్చిదిద్దారు.

కుర్చీలో తిరుగుతూ ..

కుమారులు తోట వాసుదేవరావు, చంద్రమౌళి సహకారంతో కృష్ణభగవాన్ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. ‘సమస్యకు పరిష్కారం కనుగొనే దాకా కృషి చేయాలని నాన్న వెంకయ్య చెప్పేవారని, అదే స్ఫూర్తితో సాగుతున్నట్లు’ ఆయన వివరించారు.

వేసవిలో మేలైన విద్యుత్తుకు ప్రణాళికలు


అధికారులకు సూచనలు ఇస్తున్న సీఎండీ పుల్లారెడ్డి. వేదికపై వెంకటేశ్వర్లు, మురళీకృష్ణయాదవ్

సూర్యారావుపేట, న్యూస్‌టుడే : వేసవి నాటికి ప్రజలకు కోతలు లేని మేలైన విద్యుత్తు సరఫరాకు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పి.పుల్లారెడ్డి సూచించారు. మంగళవారం విద్యుత్తు సర్కిల్ కార్యాలయంలో డిస్కం పరిధిలోని ఎస్ఈలు, ఈఈలతో సమీక్షించారు. వినియోగదారులకు నాణ్యమైన సేవలు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. నిరంతరం కోతలు లేని సరఫరా చేయాలని కోరారు. బిల్లింగ్ సకాలంలో పూర్తి చేసి, రెవెన్యూ వసూళ్లు నూరు శాతం సాధించాలని పేర్కొన్నారు. ఏయే ప్రాంతాల్లో లోఓల్టేజీ సమస్య వచ్చే అవకాశం ఉందో గమనించి.. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫీడర్స్ బ్రేక్ డౌన్ లేకుండా నిరంతరం పర్యవేక్షించాలని కోరారు. వ్యవసాయ సర్వీసులను ఎప్పటికప్పుడు విడుదల చేయాలని ఆదేశించారు. ఎక్కడా ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీ సీపీడీసీఎల్ డైరెక్టర్లు మురళీకృష్ణయాదవ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -152 రిటైల్ ధర 179 చికెన్ విత్ స్కిన్ - 260, చికెన్ స్కిన్‌లెస్ - 295. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 175, 184, 195 చికెన్ విత్ స్కిన్ - 340 చికెన్ స్కిన్‌లెస్ - 350.

సూక్ష్మ సాగునీటిలో ఆటోమేషన్‌తో దిగుబడులు

విజయవాడ (ఎన్టీఆర్ కలెక్టరేట్), న్యూస్‌టుడే : రాష్ట్రంలో వ్యవసాయ రంగం సాంకేతికత, కచ్చితత్వం, స్థిరమైన అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్నట్లు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. విజయవాడ జలవనరుల శాఖ ఆవరణలోని రైతు శిక్షణ కేంద్ర భవనంలో ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో సూక్ష్మ సాగునీటిలో ఆటోమేషన్‌ను మంత్రి మంగళవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. స్మార్ట్ వ్యవసాయంతో రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. స్మార్ట్ ఇరిగేషన్‌తో సుస్థిర వ్యవసాయం దిశగా రాష్ట్రం పయనిస్తోందని చెప్పారు. దిగుబడులు పెంపే సూక్ష్మ సాగునీటి ఆటోమేషన్ లక్ష్యమని వివరించారు.

నీటి ఆదా.. కార్మిక వ్యయాల తగ్గింపు

ఇకపై నీరు, ఎరువుల వినియోగం సెన్సర్లు, డేటా, ఆటోమేషన్ ఆధారంగా జరగడంతో 20 నుంచి 30 శాతం నీరు ఆదా అవుతుందని, వ్యయాలు తగ్గుతాయని మంత్రి చెప్పారు. దిగుబడి, నాణ్యతల్లో పెరుగుదల ఉంటుందని తెలిపారు. పీఎంకెఎస్‌వై కింద హెక్టారుకు రూ.40,000 వరకు మద్దతుతో రాష్ట్ర వ్యాప్తంగా అమలు జరుగుతోందన్నారు. చిన్న, సన్న కారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు 55 శాతం, ఇతర రైతులకు 45 శాతం రాయితీ అందిస్తూ.. ఇప్పటికే ఉన్న డ్రిప్‌లలోనూ ఆటోమేషన్ అమర్చుకునే వీలుందని వివరించారు. రైతును ఎప్పుడూ భరోసాగా నిలబెడతామని స్పష్టం చేశారు. స్మార్ట్ వ్యవసాయంతో ఏపీని దేశానికి ఆదర్శంగా నిలబెడతామన్నారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్, రాష్ట్ర ఉద్యాన శాఖ డైరెక్టర్ కె.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, ఉద్యాన శాఖ డైరెక్టర్ శ్రీనివాసులు



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు, విజేతలతో 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్ కిశోర్‌కుమార్, ప్రిన్సిపల్ వి.వి.సుబ్రహ్మణ్యకుమార్, పద్మజా సుజుకి సేల్స్ మేనేజర్ శ్రావణి, డైమండ్ నెక్స్ మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్ తదితరులు

సిద్ధార్థ మహిళా కళాశాలలో ఉత్సాహంగా ముగ్గుల పోటీలు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సంక్రాంతి సంబరాల్లో భాగంగా విజయవాడ లబ్బీపేటలోని శ్రీదుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో 'ఈనాడు' ఈఎఫ్ఎం 91.9 ఆధ్వర్యంలో మంగళవారం రంగవల్లుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని పండగ విశిష్టత, పర్యావరణ పరిరక్షణపై సందేశాత్మక ముగ్గులు వేసి ఔరా అనిపించారు. పోటీలను ప్రోత్సహిస్తూ తోటి విద్యార్థినులు సందడి చేశారు. పూజ్య ప్రథమ, ఎల్.హేమలత ద్వితీయ, వి.సంధ్య తృతీయ స్థానాల్లో నిలిచారు. వారికి 'ఈనాడు' విజయవాడ యూనిట్ ఇన్‌ఛార్జి సీహెచ్ కిశోర్‌కుమార్, కళాశాల ప్రిన్సిపల్ వి.వి.సుబ్రహ్మణ్యకుమార్, పద్మజా సుజుకి సేల్స్ మేనేజర్ శ్రావణి, డైమండ్ నెక్స్ మేనేజర్ సయ్యద్ నజీర్ అహ్మద్ బహుమతులు అందజేశారు. అధ్యాపకులు కె.శ్రీలక్ష్మి, కె.సరళ, టి.నాగరాణి, రేఖ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి మెయిన్ స్పాన్సర్‌గా డైమండ్ నెక్స్, సపోర్ట్ స్పాన్సర్‌గా పద్మజా సుజుకి, అసోసియేట్ స్పాన్సర్‌గా ప్రియా ఫుడ్స్ వ్యవహరించాయి.



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, వేదికపై సీపీ రాజశేఖర్‌బాబు తదితరులు

ఆవకాయ్-అమరావతి ఉత్సవాల్లో పర్యాటకులకు ప్రాధాన్యం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఆవకాయ్-అమరావతి ఉత్సవాల్లో పర్యాటకులకు పెద్ద పీట వేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మంగళవారం నిర్వహించిన జిల్లా అధికారుల సమావేశంలో ఆవకాయ్-అమరావతి ఉత్సవాలు విజయవంతానికి క్షేత్ర స్థాయిలో సమన్వయంపై శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జైపూర్ సాహిత్య ఉత్సవం తరహాలో టీమ్ వర్క్‌తో పనిచేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈనెల 8 నుంచి 10 వరకు ఉత్సవాలను నిర్వహిస్తుందన్నారు. పున్నమి ఘాట్‌తోపాటు భవానీ ద్వీపంలో సినిమా, సంస్కృతి, సాహిత్యాలకు సంబంధించి వినూత్న కార్యక్రమాలు చేపట్టామన్నారు. సీపీ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతతో దసరా ఉత్సవాల తోపాటు భవానీదీక్షల విరమణ వంటి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామన్నారు. అదే స్ఫూర్తితో ఈ ఉత్సవాలను సమన్వయంతో విజయవంతం చేయాలని కోరారు. ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్ మాట్లాడుతూ భవానీ ద్వీపంలో ఉత్సవాల నిర్వహణకు తొమ్మిది బోట్లు, నాలుగు జెట్టీలను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జేసీ ఇలక్కియా, జిల్లా పర్యాటకాధికారి శిల్ప, ఆర్డీవో చైతన్య, ఏడీసీ చంద్రశేఖర్, డీసీపీ షిరీన్‌బేగం పాల్గొన్నారు.

పకడ్బందీగా ఏర్పాట్లు: భవానీపురం, న్యూస్‌టుడే: ఏపీ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆవకాయ్ ఉత్సవానికి పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలి పేర్కొన్నారు. పున్నమిఘాట్, భవానీద్వీపం ప్రాంతాల్లోని ఏర్పాట్లను ఆమె మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలు పాల్గొనాలని కోరారు.

రూ.3 వేల కోట్లతో రహదారుల అభివృద్ధి

మైలవరం, జి.కొండూరు, న్యూస్‌టుడే : రాష్ట్రంలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన రహదారులను ప్రస్తుతం రూ.3 వేల కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి వెల్లడించారు. రాబోయే రోజుల్లో మరో రూ.5 వేల కోట్లతో పూర్తిస్థాయిలో తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలో పలు చోట్ల అభివృద్ధి చేయాల్సిన రహదారుల పనులకు విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి పనుల పైలాన్‌ను ఆయన ఆవిష్కరించారు. జి.కొండూరు మండలం కందులపాడు వద్ద బుడమేరుపై పూర్తిగా దెబ్బతిన్న వంతెనను పరిశీలించి, త్వరలో నిధుల విడుదలకు సహకరిస్తానని చెప్పారు. అనంతరం మైలవరంలో విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధి చేస్తే ఈ ఇబ్బందులు ఉండేవి కావని, కనీస రోడ్లను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అన్నారు. రాబోయే రోజుల్లో చిత్తశుద్ధితో రహదారుల అభివృద్ధిపై దృష్టి సారించనున్నట్లు స్పష్టం చేశారు.



శంకుస్థాపనలో మంత్రి జనార్దనరెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

రూ.30 కోట్ల పనులకు శంకుస్థాపన

రూ.14.85 కోట్లతో వివిధ ప్యాకేజీలుగా అభివృద్ధి పనులు చేపట్టిన మైలవరం- నూజివీడు రహదారి పనులకు, వెలగలేరు గడ్డ మధ్య, గణపవరం, మద్దులపర్రు రహదారి పనులకు మంగళవారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్‌తో కలిసి మంత్రి పైలాన్ ఆవిష్కరించారు. అనంతరం గణపవరం, మద్దులపర్రు రహదారి అభివృద్ధి పనులకు సంబంధించి మండలంలోని వెల్వడం హైస్కూల్ వద్ద పైలాన్ ఆవిష్కరించారు. ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రస్తుతం రూ.30 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు కోమటి సుధాకరరావు, అక్కల గాంధీ, బాలకోటేశ్వరరావు, విజయబాబు, సీతారామయ్య, ఏఎంసీ ఛైర్మన్ నవ్యశ్రీ, కందులపాడు సర్పంచి నెల్లూరు లీలా శ్రీదేవి, హెచ్.ముత్యాలంపాడు సర్పంచి కాజా సంధ్యారాణి పాల్గొన్నారు.

మహిళా ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : మహిళా ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా ఏపీ ఎన్జీవో అసోసియేషన్ సంఘం పని చేస్తుందని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ పేర్కొన్నారు. సంఘం రాష్ట్ర మహిళా విభాగం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం మంగళవారం ఛైర్‌పర్సన్ నిర్మల కుమారి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. విధి నిర్వహణలో మహిళా ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమని చెప్పారు. ప్రభుత్వ కార్యాలయాల్లో లక్ష్యాల సాధనకు అంకితభావంతో పనిచేస్తూ.. శాఖ ప్రతిష్ఠను ఇనుమడింపజేయడంలో వారి సహకారం అభినందనీయమన్నారు. ఒకవైపు గృహిణిగా మరోవైపు ఉద్యోగినిగా ద్విపాత్రాభినయనం చేస్తూ.. అలుపెరగని సేవలు అందిస్తున్నారని కొనియాడారు. చైల్డ్ కేర్ లీవ్ వినియోగంలో పరిమితుల ఎత్తివేయడం వల్ల సుమారు రెండు లక్షల మంది ప్రయోజనాలు పొందారని చెప్పారు. కార్యాలయాల్లో ప్రత్యేక వసతులు, ఆరోగ్య సేవలు, మహిళా ఉద్యోగుల క్షేమం, సంక్షేమం పట్ల సంఘం ప్రత్యేకంగా దృష్టిసారిస్తుందని వివరించారు. ప్రతి శాఖలో మహిళా రక్షణ విభాగాల ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కన్వీనర్ మాధవి, బి.జానకి, యం.రాజ్యలక్ష్మి, శాంతిశ్రీ, వి.వి.లలితాంబ, కె.గౌరి, కె.నాగలలిత, పి.స్వర్ణలత, వై.పద్మజ, వి.జయలక్ష్మి, జి.హైమావతి, పి.సురేఖ, టి.కుసుమకుమారి, సి.హెచ్.నాగమల్లేశ్వరి, జి.సుబ్బలక్ష్మి, ఎస్.దివ్య, ఎల్.అర్చన పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యాసాగర్. వేదికపై మహిళా సంఘ నాయకులు తదితరులు

ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రం సమగ్రాభివృద్ధి చెంది, ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని కృష్ణ భగవానుడిని వేడుకుంటూ ఈ నెల 2 నుంచి భాగవత సప్తాహం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు గణపతి సచ్చిదానంద స్వామీజీ తెలిపారు. పటమట దత్త పీఠంలో మంగళవారం స్వామీజీ సమక్షంలో భాగవత సప్తాహం కార్యక్రమం నిర్వహించారు. భాగవతంలోని మూల శ్లోకాలను స్వామీజీ గానం చేసి వాటి అర్థాలను భక్తులకు వివరించారు. స్వామి ఆశీస్సులు తీసుకోడానికి భక్తులు పెద్ద సంఖ్యలో రావడంతో దత్త పీఠం రద్దీగా మారింది. ఈ నెల 8వ తేదీ వరకు వివిధ పూజల నిమిత్తం స్వామి దత్త పీఠంలోనే ఉంటారని నిర్వాహకులు పేర్కొన్నారు.

నిందితుడికి వైద్య పరీక్షలు

విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో ఏ49గా ఉన్న చొక్రా అనిల్‌ను మంగళవారం జిల్లా జైలు అధికారులు విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆస్తమా సమస్యతో ఇబ్బంది పడుతున్నానని పలుమార్లు అనిల్ పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ఆయన్ని రిమాండ్ ఖైదీగా.. ఓపీ చీటీ తీసుకొని వైద్యుడికి చూపించారు. పరీక్షలు నిర్వహించిన వైద్యులు మందులు వాడాలని సూచించినట్లు తెలిసింది. అనంతరం జైలుకు తరలించారు.

తిరువూరు మెప్మాలో.. అవినీతి కుంభకోణం

రూ.17 కోట్లు స్వాహా చేశారని విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు

ఈనాడు, అమరావతి, తిరువూరు న్యూస్‌టుడే: తిరువూరు పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో రూ.17కోట్ల భారీ కుంభకోణం జరిగినట్లు ఫిర్యాదులొస్తున్నాయి. తాజాగా సీపీఎం(ఎం) కార్యదర్శి ఎం.తిరుపతిరావు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ప్రకారం మొత్తం 823 సంఘాలకు రుణాలు మంజూరైనట్లు రికార్డుల్లో ఉన్నా..అందులో పెద్ద మొత్తంలో నిధులు పక్కదారి పట్టాయి. కొందరు మహిళలు రుణం తీసుకోకున్నా బ్యాంకు నోటీసులు రావడంతో అవాక్కయ్యారు. అసలు సంఘాల్లో సభ్యులకు తెలియకుండా రుణాలు మంజూరు కావడం గమనార్హం. ఈ వ్యవహారం గత కొన్నేళ్లుగా జరుగుతోంది. రికార్డుల్లో మహిళలకు రుణాలు ఇస్తున్నట్లు చూపించి మధ్యవర్తులు, కొందరు అధికారులు, స్థానిక సిబ్బంది కలిసి సొమ్ము స్వాహా చేశారు. అనేక సంఘాల పేరుతో నకిలీ బ్యాంకు ఖాతాలు తెరవడం, సంతకాలు ఫోర్జరీ చేసి అక్రమాలకు పాల్పడ్డారు.

అన్ని స్థాయిల అధికారులున్నారు..: ఫిర్యాదు మేరకు ఈ వ్యవహారంలో జిల్లా అధికారులు మొదలు అందరూ ఉన్నారు. మెప్మా రాష్ట్ర కార్యాలయంలోనూ ఒక వ్యక్తి పాత్ర ఉంది. తిరువూరు మెప్మాలో మొత్తం 27 మంది ఆర్పీలు ఉండగా వీరిలో కొందరు తమ గ్రూపు సభ్యులతో ఒక బ్యాంకులో లోన్ తీసుకుని పేర్లు మార్చి మరో బ్యాంకులో మళ్లీ తీసుకుని అవినీతి చేసినట్లు అధికారులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై స్థానిక, జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని కారణంగా విజిలెన్స్ విభాగాన్ని సంప్రదించినట్లు, తన దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయని ఫిర్యాదులో వివరించారు.

జగన్మాత సేవలో హీరో సాయిధరమ్ తేజ్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై కొలువైన జగన్మాత దుర్గమ్మను ప్రముఖ హీరో సాయిధరమ్ తేజ్ మంగళవారం దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు ఆయనకు ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించారు. వేదపండితులు ఆశీర్వచనం చేశారు. దేవస్థానం ఏఈవో వెంకటరెడ్డి, పాలకమండలి సభ్యురాలు పద్మావతి ఠాకూర్ ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.



సాయిధరమ్‌తేజ్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఏఈవో తదితరులు

9 నుంచి క్రెడాయ్ ప్రాపర్టీ షో

పటమట, న్యూస్‌టుడే: విజయవాడ ఎ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ నెల 9 నుంచి 11వ తేదీ వరకు ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నట్లు క్రెడాయ్ విజయవాడ ఛాప్టర్ ఛైర్మన్ సి.సతీష్ బాబు, అధ్యక్షుడు జి.ఎస్.ఆర్.మోహన్‌రాజు తెలిపారు. షో గోడప్రతులను మంగళవారం రామవరప్పాడు రింగ్ సమీపంలోని కె హోటల్‌లో ఆవిష్కరించారు. మోహన్‌రాజు మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో నిర్మాణ రంగం ఇబ్బందులకు గురైందని, కూటమి ప్రభుత్వం వచ్చాక పుంజుకుందని తెలిపారు. సతీష్ బాబు మాట్లాడుతూ.. షో ప్రారంభోత్సవానికి సీఎం చంద్రబాబు, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణలను ఆహ్వానించినట్లు తెలిపారు. మొత్తం 50 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రదర్శనలో ప్రాపర్టీ కొనుగోలు చేసే వారికి కూపన్లు అందిస్తామని, వాటితో రోజూ లక్కీ డ్రా తీసి ఒకరిని ఎంపిక చేస్తామని, వారు కొన్న ప్రాపర్టీకి ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తామని తెలిపారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసరి రాంబాబు మాట్లాడుతూ.. రోజూ లక్కీ డిప్ ద్వారా రూ.లక్ష విలువైన బంగారు ఆభరణాలను అందజేస్తామని వెల్లడించారు. విజయవాడ ఛాప్టర్ ఉపాధ్యక్షులు బి.పవన్ కుమార్, కె.రమేష్, ఎ.శివనారాయణ, ప్రధాన కార్యదర్శి కె.రఘురామ్, కోశాధికారి జి.సత్యసాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.



గోడప్రతులు ఆవిష్కరిస్తున్న సతీష్ బాబు, మోహన్‌రాజు, దాసరి రాంబాబు తదితరులు

బాలికపై అత్యాచారం.. 20 ఏళ్ల జైలు

విజయవాడ (సూర్యారావుపేట), న్యూస్‌టుడే : ముక్కుపచ్చలారని చిన్నారిపై అత్యాచారం చేసి, చంపుతానని బెదిరించిన వ్యక్తికి 20 సంవత్సరాల కఠిన కారాగారవాసం, రూ.15వేలు జరిమానా విధిస్తూ విజయవాడ పోక్సో కోర్టు న్యాయమూర్తి వేల్పుల భవానీ మంగళవారం తీర్పు చెప్పారు. వాంబేకాలనీకి చెందిన ఓ బాలిక (8) తన కుటుంబ సభ్యులతో కలిసి ఉంటోంది. రావూరి వెంకటేశ్వరరావు (50) బాలికపై పలుమార్లు అత్యాచారం చేశాడు. 2019, మే 31న అమ్మమ్మ ఈ విషయాన్ని గుర్తించి.. చిన్నారి తల్లికి చెప్పడంతో ఆరా తీశారు. వెంకటేశ్వరరావు పలుమార్లు తనపై అత్యాచారం చేశాడని, బయటకు చెబితే చంపుతానని బెదిరించాడని బాధితురాలు చెప్పింది. దీనిపై 2019, జూన్ 1న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు పోక్సో కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు గడ్డం రాజేశ్వరరావు, వి.కృష్ణవేణి వాదించారు. మొత్తం 12 మంది సాక్షులను విచారించగా నిందితుడిపై నేరం రుజువైంది. కఠిన కారాగారవాసం, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. బాధితురాలికి రూ.5 లక్షలు నష్టపరిహారం అందించాలని డిస్ట్రిక్ట్ లీగల్ సెల్ అథారిటీకి న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు.

చిన్నారిపై ఉపాధ్యాయిని, ఆయాల దాష్టీకం

చిట్టినగర్, న్యూస్‌టుడే: ఉపాధ్యాయిని, ఆయా కొట్టడంతో ఎల్‌కేజీ చదువుతున్న చిన్నారి విలవిల్లాడింది. కలరా ఆసుపత్రి సెంటర్‌కు చెందిన చిన్నారి సోమవారం పాఠశాలకు రావడానికి మారాం చేస్తుంటే తల్లి తీసుకొచ్చి చిట్టినగర్‌లోని శ్రీగౌతమ్ పబ్లిక్ స్కూల్లో అప్పగించింది. అప్పటికే ఆ పాప ఏడుస్తూ, తల్లి చెయ్యి గుంజుకుంటుండగా పాఠశాల ఆయా వచ్చి చిన్నారిని తరగతి గదిలోకి తీసుకు వెళ్లింది. ఆ సమయంలో ఏడుపు ఆపకపోవడంతో ఆయా కొట్టినట్లు చెబుతున్నారు. తరగతి గదిలో ఉపాధ్యాయిని కూడా కొట్టింది. ఇంటికి వెళ్లిన అనంతరం చూస్తే వీపు, చేతిపైన ఎర్రగా కమిలి చేతి వేలిముద్రల ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. వీపుపైన గీసుకుపోయిన చిన్న గాయం కూడా ఉంది. చిన్నపిల్ల అని కూడా చూడకుండా దండించడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విషయం పాఠశాల డైరెక్టర్ సూర్యారావు దృష్టికి రాగా ఆయా, ఉపాధ్యాయినితో తల్లిదండ్రులకు క్షమాపణ చెప్పించినట్లు తెలిసింది.



చిన్నారి వీపుపైన ఎర్రగా కందిపోయి ఇలా..

తిరువూరు

• తిరువూరు • మైలవరం

యంత్ర పరికరాలకు దరఖాస్తు చేసుకోవాలి



కార్యక్రమంలో ఏవో శ్రీనివాసరావు, రైతులు

రెడ్డిగూడెం: ప్రభుత్వం రాయితీపై అందజేసే వ్యవసాయ యంత్ర పరికరాలు కావాల్సిన రైతులు ఆర్ఎస్‌కేలో నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం కూనపరాజుపర్వలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, మొక్కజొన్న పంటల్లో నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు రైతులు పాటించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచికి పరామర్శ

చింతలనర్వ (గంపలగూడెం) : మండలంలోని చింతలనర్వ మాజీ సర్పంచి యనమద్ది నాగమల్లేశ్వరరావును మంగళవారం రాష్ట్ర ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్ పరామర్శించారు. ఇటీవల నాగమల్లేశ్వరరావు తండ్రి పూర్ణయ్య మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

మైలవరం: స్థానిక బైపాస్‌లో విద్యుత్తు లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల నరికివేత, మరమ్మతుల నేపథ్యంలో 7న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలుపుతున్నట్లు ఏఈ జి.రమేష్‌బాబు తెలిపారు. సూరిబాబుపేట, శాంతినగర్, కోతమిషన్ ప్రాంతం, రాజాపేట, ఎండీఓ కార్యాలయ ప్రాంతం, కుమ్మరవీధి, బైపాస్ రోడ్డు, శివాలయం వీధి, నూజివీడు రోడ్డు, హాజీపేట, పాత మసీదు, వడ్డెర కాలనీ, చిన్న ఎస్సీ ఏరియా, దేవునిచెరువు, శివాజీ వీధి ప్రాంతాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు.

మొక్కజొన్న సాగే ప్రయోజనం

- ఆసక్తి చూపుతున్న రైతులు
- ఎంతో కొంత ఆదాయం వస్తుందని ఆశ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే

మెట్ట ప్రాంతమైన మైలవరం నియోజకవర్గంలో రబీ సీజన్‌లో వరిపంట తర్వాత మొక్కజొన్న సాగుకు అన్నదాతలు మక్కువ చూపి సాగు చేపట్టారు. గతేడాది కంటే ఈ రబీలో సాగు విస్తీర్ణం పెరిగింది. నియోజకవర్గంలో 5 వేల ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేసినట్లు సమాచారం. ఖరీఫ్ సీజన్‌లో అధిక వర్షాలతో పత్తి పంట సాగు చేసిన రైతులు నష్టపోవడంతో ఆ పంట తొలగించారు. నీటి వసతి ఉన్న రైతులు మొక్కజొన్న వేశారు. నియోజకవర్గంలో 4,100 ఎకరాల్లో ఇప్పటి వరకు పంట సాగైంది. ఇబ్రహీంపట్నం మండలంలో



అన్నేరావుపేట పొలాల్లో సాగు చేసిన మొక్కజొన్న

500 ఎకరాలు, మైలవరంలో 1200, జి.కొండూరులో 1500, రెడ్డిగూడెంలో 900 ఎకరాలు సాగులో ఉంది

- సాగు ఖర్చులు పోగా ఎంతోకొంత ఆదాయం పొందవచ్చని ఆశతో మొక్కజొన్న పంట సాగుకు రైతు మొగ్గు చూపుతున్నారు. క్వింటా మొక్క జొన్న మద్దతు ధర రూ.2 వేల వరకు ఉండటంతో పాటు మొక్కజొన్నలు కోళ్ల మేతగా ఉపయోగించడంతో ధరలు పెరిగితే లబ్ధి పొందవచ్చని ఉన్నారు.

క్రాసింగ్ సాగు అధికం

గతంలో కంటే రెడ్డిగూడెం మండలంలో క్రాసింగ్ మొక్కజొన్న సాగు ఎక్కువ మంది రైతులు సాగు చేశారు. విత్తన సంస్థలు ముందుగా కొంత పెట్టుబడి పెడుతుండటంతో ముందుకు వస్తున్నారు. 900 ఎకరాల సాగులో 650 ఎకరాలు క్రాసింగ్ మొక్కజొన్న సాగు చేసినట్లు మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు తెలిపారు. గతంలో విత్తన సంస్థలు డబ్బులు చెల్లించక సాగు చేసిన కొందరు నష్టపోయారు. అందువల్ల ముందుగా వాటితో ఒప్పందాలు చేసుకుని సాగు చేస్తే రైతులకు మేలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు.

ముగ్గురమ్మల జాతర నేడు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే



విద్యుత్తు దీపాలతో అలంకరించిన ఆలయాలు

కొచవరం శివారు దొనబండలో బుధవారం నిర్వహించనున్న ముగ్గురమ్మల జాతరకు నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. తమిళనాడు నుంచి దాదాపు 50 ఏళ్ల కిందట ఉపాధి పనుల కోసం కేతనకొండ, దొనబండ గ్రామాలకు వచ్చిన క్వారీ కార్మికులు ఇక్కడే స్థిరపడ్డారు. నాటి నుంచి నేటి వరకు ఏటా ధనుర్మాసంలో తమిళ, తెలుగు సంప్రదాయాల మిళితంతో ముగ్గురమ్మల జాతర నిర్వహిస్తున్నారు. ప్రధానంగా ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంతో పాటు, కంచికచర్ల జి.కొండూరు మండలాలకు చెందిన వందలాది క్వారీ కార్మిక కుటుంబాలు జాతరలో శక్తి ప్రదర్శనలు చేస్తూ అమ్మవార్లకు మొక్కులు తీర్చుకుంటారు. ప్రారంభంలో కాళెమ్మ, సత్తెమ్మ, మారెమ్మకు చిన్న గుడులు నిర్మించి పూజలు, ఉత్సవాలు చేసేవారు. కాలక్రమంలో దాతలు, గ్రామస్థులు, క్వారీ యజమానుల సహకారంతో ముగ్గురమ్మలకు ఆలయాలు నిర్మించి వైభవంగా జాతర నిర్వహిస్తున్నారు. తాము చేసే ప్రధాన రాతి క్వారీ పనుల్లో ప్రమాదాలు జరగకుండా రక్షించమని వేడుకుంటూ జాతర ముగిసిన నాటి నుంచి క్వారీ పనులకు వెళతారు. తమ కోర్కెలు తీరిన భక్తులు నిప్పుల కుండలను తలపై పెట్టుకుని అమ్మవార్లకు బోనాలు సమర్పిస్తారు. మరి కొందరు శరీరానికి సూదులతో నిమ్మకాయలు, ఇంకొందరు నోట్లో శూలాలను గుచ్చుకుని మొక్కులు తీర్చుకోవడం జాతర ప్రత్యేకత. స్థానికులు, ప్రజాప్రతినిధులు కుటుంబ సభ్యులతో వచ్చి ప్రత్యేక పూజలు చేస్తారు.

27వ డివిజన్ సమస్యలు పరిష్కరించండి

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లి పురపాలక సంఘంలోని 27వ డివిజన్‌లోని సమస్యలు పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీ సభ్యురాలు పి.ఆనందకీర్తి కలెక్టర్ లక్ష్మీశను కోరారు. ఆ డివిజన్‌ను పరిశీలించిన ఆమె అక్కడి సమస్యలు గుర్తించి.. కలెక్టర్‌ను మంగళవారం విజయవాడలో కలిసి మాట్లాడారు. డీపీవీ పాఠశాల వెనుక అనేక మంది నివాసం ఉన్నారని, ఆ ప్రాంతంలో మురుగు వ్యవస్థ సరిగా లేదని చెప్పారు. తాగునీటి పైపులైన్లు మురుగులో ఉన్నాయని, ఇళ్ల నిర్మాణాలకు పురపాలక సంఘం అనుమతులు ఇవ్వడం లేదని చెప్పారు. వీటిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంబేడ్కర్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత



పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో ఎస్టీయూ నాయకులు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని రామచంద్రాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులు 18 మందికి రాష్ట్రోపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో వీరాస్వామి ఆర్థిక సౌజన్యంతో ముద్రించిన అభ్యాసన సామగ్రి (స్టడీ మెటీరియల్) మంగళవారం పంపిణీ చేశారు. హెచ్ఎం సుల్తానా, ఎస్టీయూ నాయకులు ఎం.బసవయ్య, ఎస్.జార్జి వాషింగ్టన్, బి.లక్ష్మీరామ్‌నాయక్, ఎం.శాంతకుమార్ వీటిని అందజేశారు.

ప్రతిభ చూపి.. బహుమతులు పట్టి



విజేతలతో హెచ్‌ఎం శోభారాణి, ఉపాధ్యాయులు



పోటీల్లో విద్యార్థులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : విస్సన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం 'ఈనాడు' ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పాటవ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. జనరల్ నాలెడ్జి, సమకాలీన అంశాలపై జరిగిన క్విజ్ పోటీల్లో చంద్రాల నాగ ప్రియాంక, కొక్కెరగడ్డ శ్రీ జశ్వంత్, సత్తారి ప్రశాంత్ ప్రతిభ చూపి.. వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు. ప్రధానోపాధ్యాయురాలు ఆర్.శోభారాణి విజేతలకు బహుమతులు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీసీహెచ్ సూర్యనారాయణ, ఎం.జీవన్, బి.గోవింద్ పాల్గొన్నారు.

క్రీడా పోటీల నిర్వహణ హర్షణీయం

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే : సంప్రదాయ క్రీడలను ప్రతి చోటా వేడుకలా నిర్వహించాల్సిన తరుణం వచ్చిందని ర.భ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను మంత్రి మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సంబరాల్లో భాగంగా కబడ్డీ పోటీలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కొన్ని ప్రాంతాలకే పరిమితమైన ఈ పోటీలు అన్ని చోట్లా విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వపరంగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, కూటమి నాయకులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి జనార్దనరెడ్డి, ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

మత్తు పదార్థాలకు బానిసలు కావద్దు

జి.కొండూరు, న్యూస్‌టుడే : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని జి.కొండూరు ఎస్సై కె.సతీష్‌కుమార్ సూచించారు. స్థానిక వివేకానంద పాఠశాలలో మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని.. తల్లిదండ్రులను కూడా చైతన్య పరచాలని కోరారు. బాలురు ద్విచక్ర వాహనాలు నడపకూడదని చెప్పారు. పోక్సో చట్టం గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ శ్రీనివాసరావు, కరస్పాండెంట్ ఈశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు ముగ్గుల పోటీలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: సంక్రాంతి పండగ నేపథ్యంలో పెనుగంచిప్రోలులోని తపోవన్ విద్యాలయంలో మహిళలకు మంగళవారం ముగ్గులు పోటీలు నిర్వహించారు. పోటీల్లో 55 మంది ఉత్సాహంగా పాల్గొనగా, విజేతలకు పారామౌంట్ సంస్థ అధినేత వెనిగళ్ల సురేష్ బహుమతులు పంపిణీ చేశారు.

పారదర్శకంగా భూముల రీ సర్వే

విస్సన్నపేట, న్యూస్‌టుడే : భూముల రీ సర్వే పారదర్శకంగా చేపట్టి రాజముద్ర చిహ్నంతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను ప్రభుత్వం రైతులకు అందజేస్తుందని ఆర్డీవో కె.మాధురి అన్నారు. విస్సన్నపేట మండలం చంద్రుపట్ల గ్రామంలో మంగళవారం గ్రామ సభలో తహసీల్దార్ కె.లక్ష్మీ కల్యాణితో కలిసి రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలను ఆమె అందజేశారు. తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావు, రెవెన్యూ అధికారులు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు మండలం చిట్యాల గ్రామసభలో తహసీల్దార్ నాగమణి, సర్పంచి శ్రీనివాసరావు పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అందజేశారు.

గంపలగూడెం : భూముల రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న కొత్త పట్టాదారు పాసు పుస్తకాల్లో రైతులకు వాస్తవ యాజమాన్య హక్కులతో కూడిన సమాచారం ఉందని తహసీల్దార్ వి.రాజకుమారి తెలిపారు. మండలంలోని చెన్నవరం, రాజవరంలో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సభల్లో అన్నదాతలకు పుస్తకాలు పంపిణీ చేశారు. చెన్నవరంలో మాజీ ఎంపీపీ వై.పుల్లయ్య చౌదరి, సర్పంచి ఎం.బజార్, వీఆర్వో ఏటీఆర్ మూర్తి పాల్గొని 411 మందికి, రాజవరంలో సర్పంచి సీహెచ్ నరసింహారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు బి.శ్రీనివాసరావు, వీఆర్వో ఎస్.శ్రీధర్ పాల్గొని 338 మంది రైతులకు పాసు పుస్తకాలు పంపిణీ చేశారు.



చంద్రుపట్ల గ్రామసభలో రైతులకు పాసు పుస్తకాలు అందజేసిన ఆర్డీవో మాధురి, తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి తదితరులు



చిట్యాలలో సర్పంచి శ్రీనివాసరావు, తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి తదితరులు

భోగాపురం విమానాశ్రయం ఘనత చంద్రబాబుదే

ఇబ్రహీంపట్నం (గ్రామీణం), న్యూస్‌టుడే : భోగాపురం విమానాశ్రయం కల ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితో సాకారమవుతుందని మైలవరం శాసనసభ్యుడు కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలోని గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు మంగళవారం ఆయన భూమిపూజలు చేశారు. అనంతరం మీడియాలో మాట్లాడుతూ భోగాపురం విమానాశ్రయం నిర్మాణ పనులను అప్పట్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారన్నారు. ఆనాడు ప్రతిపక్ష నేత ఎన్నో పత్రికా సమావేశాల్లో అభ్యంతరం వ్యక్తం చేశారని.. అది అభివృద్ధి లేని ప్రాంతమని విమర్శించారని పేర్కొన్నారు. నేడు విమానాశ్రయం కల సాకారం అవుతుంటే అది నేనే చేశాను అంటూ ప్రతిపక్ష పార్టీ నేత, ఆయన అనుచరులు చెప్పుకోవడం దురదృష్టకరమని అన్నారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలల అభివృద్ధికి చర్యలు చేపడితే కోటి సంతకాల డ్రామాలు ఆడుతున్నారని దుయ్యబట్టారు. ఇకనైనా హుందాగా వ్యవహరించాలని, నిర్మాణాత్మక ప్రతిపక్ష పాత్ర పోషించాలని సూచించారు.

పేదలకు చీరల పంపిణీ



చీరలు పంచుతున్న రాజేశ్వరరెడ్డి, పూర్ణచంద్రారెడ్డి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండల కేంద్రమైన రెడ్డిగూడెంలోని ఫ్రెండ్స్ సర్వీస్ సొసైటీ డే కేర్ కేంద్రంలో విస్సన్నపేట శ్రీనివాస ఎడ్యుకేషన్ సొసైటీ తరపున శ్రీశ్రీ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నిరుపేదలైన వృద్ధులు, వితంతువులు 125 మందికి మంగళవారం చీరలు పంపిణీ చేశారు. శ్రీశ్రీ విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ భీమిరెడ్డి రాజేశ్వరరెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ ఎం.పూర్ణచంద్రారెడ్డి, సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు సీహెచ్ విజయ్‌కుమార్, కార్యదర్శి సీహెచ్ హన్న పాల్గొన్నారు.

రూ.9.5 కోట్లతో 29 ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : మైలవరం నియోజకవర్గంలో రూ.9.5 కోట్లతో 29 ఆరోగ్య కేంద్రాల నిర్మాణాలు చేపట్టినట్లు శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలంలో గుంటుపల్లి, దాములూరులో రూ.36 లక్షల చొప్పున రెండు ఆరోగ్య కేంద్ర భవనాల నిర్మాణాలకు, గుంటుపల్లిలో ఉపాధి హామీ నిధులైన రూ.25 లక్షలతో సిమెంటు రహదారుల పనులకు ఆయన మంగళవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. పేదల ఆరోగ్యం కోసం నియోజకవర్గంలో నేటి వరకు రూ.12.29 కోట్లు మంజూరు చేసినట్లు వివరించారు. మైలవరం నియోజకవర్గంలో 95 శాతం పైగా ప్రధాన రహదారుల అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని పేర్కొన్నారు. సర్పంచులు, జనసేన మైలవరం నియోజకవర్గ బాధ్యులు అక్కల రామ్మోహనరావు, కూటమి నేతలు పాల్గొన్నారు.



గుంటుపల్లిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

ఐటీఐ స్థాపనకు రూ.కోటి విరాళం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని ఎస్.జి.ఎస్ కళాశాలలో నెలకొల్పబోయే ఐటీఐ నిర్మాణానికి ప్రముఖ పారిశ్రామికవేత్త, పారామౌంట్ అధినేత వెనిగళ్ల సురేష్ రూ.కోటి విరాళం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయనను ప్రభుత్వ మాజీ విప్ సామినేని ఉదయభాను, కళాశాల కమిటీ సభ్యులు మంగళవారం ఘనంగా సత్కరించారు. అనంతరం ఉదయభాను మాట్లాడుతూ కళాశాల పూర్వ వైభవానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. సురేష్ మాట్లాడుతూ ఐటీఐ విద్యకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ఎన్నో ఉపాధి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. కళాశాల అభివృద్ధికి తన సహకారం ఉంటుందని ఆయన తెలిపారు.

ప్రధాన రహదారుల అభివృద్ధికి ప్రణాళికలు

ఇబ్రహీంపట్నం గ్రామీణ మండల పరిధిలోని గ్రామాల ప్రధాన రహదారుల అభివృద్ధిపై శాసనసభ్యుడు కృష్ణప్రసాద్ దృష్టి సారించారు. గతంలో గ్రామాల్లోని అంతర్గత రహదారులను ఉపాధి హామీ నిధులైన రూ.5.10 కోట్లతో సీసీ రోడ్లుగా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం గ్రామాల్లోని ప్రధాన రహదారుల అభివృద్ధికి కూడా ఉపాధి హామీ నిధులు కేటాయిస్తున్నారు. మూలపాడు గ్రామ ప్రధాన రహదారిని రూ.1.50 కోట్లతో రెండు వరసలుగా అభివృద్ధి చేశారు. దీని మధ్యలో డివైడర్ నిర్మించారు. ఇందులో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు ఎన్టీటీపీఎస్ సామాజిక నిధి నుంచి నుంచి రూ.12 లక్షలు కేటాయించారు. రహదారి వెంట పచ్చదనం పెంచేందుకు విభాజికం మధ్యలో వివిధ మొక్కలు నాటి సంరక్షించేందుకు పంచాయతీ ప్రణాళికలు రూపొందించింది. ఇదే మాదిరి మిగిలిన గ్రామాల ప్రధాన రహదారులను కూడా అభివృద్ధి చేయనున్నారు.

– న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం గ్రామీణం



మధ్యలో డివైడర్‌తో రూపు మారిన మూలపాడు ప్రధాన రహదారి

కాలమానిని, దైనందినిల ఆవిష్కరణ



క్యాలెండర్లు, డైరీలు చూపుతున్న ఎంపీపీ, ఎంపీడీవో, సంఘ నాయకులు

మైలవరం: డెమొక్రటిక్ పీఆర్టీయూ ఆధ్వర్యంలో రూపొందించిన 2026 సంవత్సర కాలమానిని, దైనందినిలను మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రసన్నరాణి, ఎంపీడీవో అనురాధ, ఎంఈవోలు రాజు, బాలు ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సంఘ రాష్ట్ర కార్యదర్శి జడ్.శ్రీనివాసరెడ్డి, మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి కె.కోటేశ్వరరావు, ఆర్వీఎస్ రామకృష్ణారావు, సభ్యులు మస్తాన్‌రావు, యాకుబ్ మియా, ప్రసాద్, గోపాలం, బుజ్జిబాబు, ఓంప్రకాశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర ర.భ శాఖ మంత్రికి సన్మానం

గొల్లపూడి: రాష్ట్ర ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి బీసీ జనార్దనరెడ్డి గొల్లపూడిలోని మైలవరం శాసనసభ్యుడు కృష్ణప్రసాద్ కార్యాలయానికి మంత్రి మంగళవారం వచ్చారు. మంత్రికి ఎంపీ కేశినేని శివనాథ్, శాసనసభ్యుడు కృష్ణప్రసాద్ స్వాగతం పలికి సన్మానించారు.

జనసేన నాయకుడికి నివాళి

విస్సన్నపేట, న్యూస్‌టుడే : ఇటీవల మృతి చెందిన విస్సన్నపేట జనసేన నాయకుడు అబ్బినేని కొండయ్య కుటుంబాన్ని జనసేన పార్టీ విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త అమ్మిశెట్టి వాసు, తెదేపా మండల అధ్యక్షుడు రాయల సుబ్బారావుతో కలిసి మంగళవారం పరామర్శించారు. తొలుత కొండయ్య చిత్రపటానికి అమ్మిశెట్టి వాసు పూలదండ వేసి నివాళి అర్పించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



గంపలగూడెంలో.. దీక్ష



మైలవరం : నినాదాలు చేస్తున్న సహకార ఉద్యోగులు

మైలవరం, గంపలగూడెం, కంభంపాడు, జి.కొండూరు, తిరువూరు, న్యూస్‌టుడే : వ్యవసాయ సహకార సంఘాల్లో దీర్ఘకాలంగా పని చేస్తున్న ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరుతూ చేపట్టిన ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం మైలవరం, గంపలగూడెం, కంభంపాడు, జి.కొండూరు, తిరువూరు కేడీసీసీ బ్యాంకు కార్యాలయాల ముందు ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. బ్రాంచి మేనేజరు శివకుమార్, సిబ్బంది వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామని, ప్రధాన డిమాండ్లను నెరవేర్చాలని కోరారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



గర్భిణులకు పరీక్షలు చేస్తున్న సిబ్బంది

గంపలగూడెం, న్యూస్‌టుడే : జిల్లా ఆరోగ్య, వైద్యశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారుల ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని అనుముల్లంకలో ప్రత్యేక శిబిరంలో గర్భిణులకు రక్త పరీక్షలు చేశారు. గ్రామ పరిధిలోని పదిమంది నుంచి రక్త పరీక్షకు నమూనాలు సేకరించారు. రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. జిల్లా ప్రోగ్రాం అధికారి వి.మహేశ్వరరావు, డీపీ హెచ్ఎన్‌వో సీహెచ్ కృష్ణకుమారి, ఆరోగ్య కార్యకర్త ఏస్తేర్‌రాణి, ఆరోగ్య సహాయకుడు రాజారత్నం, ఎంఎల్‌హెచ్‌పీ కీర్తిప్రియ పాల్గొన్నారు.

స్పందనకు వందనం : పట్టణంలోని 14వ వార్డులో మురుగు కాల్వల్లో మట్టి, చెత్త పేరుకుని మురుగు నీటి పారుదలకు ఆటంకంగా ఉందని అమర్‌నాథ్ 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించి మున్సిపల్ శానిటరీ ఆధికారి సంతోష్ సిబ్బంది పంపి కాల్వలు శుభ్రం చేయించారు. –తిరువూరు న్యూస్‌టుడే

? విస్సన్నపేటలో డివైడర్ వెంట మట్టిని పోగేసి దిబ్బలా మార్చారు. రాత్రి వేళ ఎదుటి వాహనాల లైటింగ్‌తో వాహనదారులకు ఇవి కనిపించక ప్రమాదం జరిగే అవకాశం ఉంది. **- స్థానికులు** ✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి మట్టిని తొలగించి శుభ్రం చేయిస్తాం. **-కేశవ హరికృష్ణ కుమార్, పంచాయతీ కార్యదర్శి - విస్సన్నపేట, న్యూస్‌టుడే**

భక్తిశ్రద్ధలతో ధనుర్మాస పూజలు

గంపలగూడెం, ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని వైష్ణవాలయాల్లో మంగళవారం ఆండాళ్, రంగనాయకులకు ధనుర్మాస పూజలు నిర్వహించారు. గోదాదేవి తిరుప్పావై పాశురాలు పఠించారు. పెనుగొలను, గంపలగూడెం, నెమలి, గోసవీడు, వినగడప, ఎ.కొండూరు మండల పరిధిలోని వేణుగోపాలస్వామి, సీతారామచంద్రస్వామి, రంగనాయకస్వామి, వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు.



పెనుగొలనులో అలంకరణలో రంగనాయక స్వామి మూలవిరాట్

హనుమాన్ చాలీసా పారాయణం

తిరువూరు : పట్టణంలోని వేంకటాచల స్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా వైష్ణవ తదియ ఆరాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం చేశారు.

కొండపల్లిలో చౌక బియ్యం పట్టివేత

కొండపల్లి, న్యూస్‌టుడే : కొండపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన చౌక బియ్యాన్ని విజిలెన్స్, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పట్టణ పరిధిలోని ఎస్టీ కాలనీకి చెందిన వ్యక్తి అదే ప్రాంతంలోని ఓ గోదాములో రేషన్ బియ్యం దాచినట్లు రెవెన్యూ, విజిలెన్స్ అధికారులకు సమాచారం వచ్చింది. వారు వెళ్లి అందులో తనిఖీలు చేయగా 50 కిలోల బరువు కలిగిన 148 బస్తాలను గుర్తించారు. బియ్యం స్వాధీనం చేసుకొని గొల్లపూడి తరలించారు. నిందితుని శ్రీనుపై కేసు నమోదు చేశారు.

విద్యార్థులకు అల్పాహారం వితరణ

పోలిశెట్టిపాడు (ఎ.కొండూరు), న్యూస్‌టుడే : లయన్స్ క్లబ్ వ్యవస్థాపకుడు మెల్విన్ జోన్స్ పుట్టినరోజు సందర్భంగా లయన్స్ క్లబ్ తిరువూరు ప్రతినిధుల ఆధ్వర్యంలో మండలంలోని పోలిశెట్టిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలలో 183 మంది విద్యార్థులకు అల్పాహారం అందించారు. క్లబ్ ప్రతినిధులు పి.వెంకటేశ్వరరావు, కె.ముత్యప్రసాద్, కె.రాజేశ్ ఖన్నా, డీజే నరసింహారావు, హెచ్ఎం శోభన్‌బాబు పాల్గొని అల్పాహారంగా టమాట బాత్ పంపిణీ చేశారు.

రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తే క్షేమం



ర్యాలీలో ఆర్టీవో పద్మావతి పక్కన ఎమ్‌వీఐ పూర్ణిమ

నందిగామ, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తే ఎటువంటి ప్రమాదాలు జరగవని స్థానిక ప్రాంతీయ రవాణా శాఖాధికారి ఎం.పద్మావతి తెలిపారు. జాతీయ రహదారి భద్రతా ఉత్సవాలు సందర్భంగా మంగళవారం ఆర్టీవో కార్యాలయం వద్ద రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వాకథాన్ ర్యాలీని ఆమె ప్రారంభించి పాల్గొన్నారు. మోటార్ వాహన తనిఖీ అధికారి పూర్ణిమ, ఏవో ప్రభాకరలింగం, ఐషర్ మోటార్స్ రీజినల్ ట్రైనర్ జగదీష్, చైతన్య కళాశాల, పీఎస్‌సీ బోస్, అన్నపూర్ణ డ్రైవింగ్ స్కూలు వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక దినోత్సవం



ప్రశంసా పత్రాలను చూపుతున్న విద్యార్థులతో ప్రిన్సిపల్, దాతలు

మైలవరం, న్యూస్‌టుడే : స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం సాంస్కృతిక దినోత్సవం ఎల్‌హెచ్‌ఆర్ ఎక్స్‌పో 2కె 26 ఉత్సాహంగా నిర్వహించారు. వివిధ అంశాలకు సంబంధించి విద్యార్థులు స్టాళ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న దాత హనిమిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల్లో నైపుణ్యాలను వెలికి తీయడానికి ఎక్స్‌పోలు దోహద పడతాయని వివరించారు. ప్రిన్సిపల్ పి.రంగారావు మాట్లాడుతూ కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలలో కార్యక్రమాలు నిర్వహించటం సంతోషంగా ఉందని చెప్పారు. పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు. దాత తనయుడు సిద్ధార్థరెడ్డి, కల్చరల్ క్లబ్ కో- ఆర్డినేటర్ ఎం.దేవానంద్‌కుమార్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికీ తెలియజేయునది ఏమనగా.. నా క్లయింట్ NTR జిల్లా, మైలవరం మండలం, మైలవరం గ్రామ కాపురస్తుడయిన దరణికోట రమేష్, S/o శ్రీరాములు గారు మైలవరం సబ్ రిజిస్ట్రార్ పరిధిలో ఉన్న ఒరిజినల్ దస్తావేజు నెం. 690/2001 ది. 02-01-2026న జిరాక్సు తీసుకొనుటకు మైలవరంలో బైకుపై వెళ్ళే మార్గంలో పోయినందున, ఎవరికైనా దొరికినయెడల, ఈ క్రింది ఫోన్ నంబరు గల అడ్రసుకు అందజేయగలరు.

ఓర్సు శ్రీనివాసరావు, అడ్వకేట్
మైలవరం, Ph. No: 98485 78996
తేదీ: 07-01-2026

రైతులకు ఇచ్చే పాసుపుస్తకాల్లో తప్పులు ఉండకూడదు

పట్టాదారు పాసుపుస్తకాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రెవెన్యూ రికార్డుల సరిచేసి.. తప్పుల్లేని కొత్త పట్టాదారు పాసుపుస్తకాల్లో రైతులకు పంపిణీ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'ప్రభుత్వం పంపిణీ చేస్తున్న కొత్త పట్టాదారు పాసుపుస్తకాలతో రైతుల్లో నమ్మకం, భరోసా కలగాలి. వాటి ముద్రణకు ప్రభుత్వం తీసుకున్న జాగ్రత్తల్ని వారికి అర్థమయ్యేలా చెప్పాలి. భూ రికార్డుల్లో గతంలో జరిగిన తప్పులను సరిదిద్దాలి. కొత్త పాసుపుస్తకాలు ముద్రించే ముందే.. గ్రామసభల్లో రైతుల నుంచి భూమి వివరాలను నిర్ధారించుకోవాలి' అని సూచించారు. పట్టాదారు పాసుపుస్తకాల పంపిణీపై మంగళవారం సాయంత్రం ఆయన సచివాలయంలో సమీక్షించారు.

పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులు సరిచేసేందుకు సిద్ధం

రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్

ఈనాడు, అమరావతి: పట్టాదారు పాసుపుస్తకాల్లో తప్పులుంటే సరిదిద్దేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్వహించిన రీసర్వేలో తప్పులు దొర్లాయని.. కూటమి అధికారంలోకి వచ్చాక వాటిని సరిదిద్ది పట్టాదారు పాసుపుస్తకాలు పంపిణీ చేస్తోందన్నారు. పట్టాదారు పాసుపుస్తకాలు ముద్రించాక కొందరు పట్టాదారులు చనిపోయారు. వారి స్థానంలో కొత్తగా వచ్చిన హక్కుదారుల పేర్లు చేర్చి పుస్తకాలు ఇవ్వాల్సి ఉందని ఆయన మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. 'గత ప్రభుత్వంలో 6,688 గ్రామాల్లో తప్పుల తడకగా రీసర్వే చేశారు. 4,783 గ్రామాల్లో పంపిణీ చేసిన భూహక్కు పత్రాల్లో తప్పులు దొర్లాయి. విస్తీర్ణం, జాయింట్ ఎల్పీఎం, పేర్లు, సర్వేనంబర్లు, ఆధార్‌లో తప్పులున్నాయి. భూహక్కు పత్రాలపై జగన్ బొమ్మ వేయడం రైతుల్లో ఆందోళనకు కారణమైంది. ప్రజల ఇక్కట్లు పరిగణించి దుకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ తెచ్చారు. కూటమి ప్రభుత్వం పక్కాగా నిర్వహించిన గ్రామసభల్లో 7.50 లక్షల ఫిర్యాదులు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వాటిని పరిష్కరించింది. రాజముద్ర, క్యూఆర్ కోడ్‌తో 22.33 లక్షల పట్టాదారు పాసుపుస్తకాలను ఉచితంగా అందిస్తోంది' అని వివరించారు. రాష్ట్రంలో 1,68,688 ఎల్పీఎం నంబర్లు సరిదిద్దాల్సి ఉందన్నారు.



వీటిని మించిన విజయం లేదు

✦ మీ సమయం మీద నియంత్రణ మీ చేతుల్లోనే ఉండటం.
✦ మీకు నచ్చిన పని చేయడం లేదా దొరికిన పనిని ఆస్వాదించడం.
✦ కుటుంబ సభ్యులతో ఎక్కువ సేపు గడపడం.

– జాన్ హెన్రీ, ఇన్వెస్టర్

విశాఖ ఈఎస్ఐ ఆసుపత్రికి అనుబంధంగా వైద్య కళాశాల!

- ఏర్పాటుకు అవకాశాలను పరిశీలించిన కేంద్ర బృందం
- ఆసుపత్రిని తమకు అప్పగించాలని కోరుతున్న ఈఎస్ఐసీ



విశాఖలో ఈఎస్ఐ ఆసుపత్రిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

ఈనాడు, అమరావతి: విశాఖపట్నంలోని ఈఎస్ఐ ఆసుపత్రికి అనుబంధంగా 50 సీట్లతో వైద్య కళాశాల ఏర్పాటుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. విశాఖలో ప్రస్తుతం 200 పడకల అనుమతితో ఆసుపత్రి కొనసాగుతోంది. దీన్ని 220 పడకలకు పెంచి, వైద్య కళాశాల ఏర్పాటు చేయాలని ఈఎస్ఐసీ కార్పొరేషన్ భావిస్తోంది. కార్పొరేషన్‌కు చెందిన మెడికల్ కమిషనర్ సప్నా మిత్తల్, డిప్యూటీ మెడికల్ కమిషనర్లు సువర్ణ పోష్లి, బిలుంగ్ ఇ థెరెసాలతో కూడిన బృందం మంగళవారం విశాఖపట్నం ఆసుపత్రిని పరిశీలించింది. పోర్టు స్థలంలో లీజు ప్రాతిపదికన ఏర్పాటు చేసిన ఈ ఆసుపత్రిని రాష్ట్ర ఈఎస్ఐ విభాగం నిర్వహిస్తోంది. వైద్య కళాశాల ఏర్పాటుకు ఆసుపత్రిని తాత్కాలికంగా తమకు అప్పగించాలని కేంద్ర కార్పొరేషన్ కోరింది. అలా ఇస్తే మిగతా పడకలకు తాత్కాలికంగా నిర్మాణాలు చేసి, వైద్య కళాశాల పరిపాలన, వసతిగృహాలకు ప్రైవేటు భవనాలను అద్దెకు తీసుకోవాలని భావిస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని ఈ ప్రక్రియ త్వరగా పూర్తయ్యేలా చూస్తే 2026-27 విద్యా సంవత్సరంలో వైద్య కళాశాల వచ్చేందుకు అవకాశం ఉంటుంది. జాప్యం జరిగితే మరో ఏడాదికి వాయిదా పడుతుంది.

స్థలం లీజు, పడకల సమస్యలు


★ విశాఖ ఈఎస్ఐ ఆసుపత్రికి 200 పడకలకు అనుమతులున్నా 80 పడకలతోనే నిర్వహిస్తున్నారు. పోర్టు స్థలంలో లీజు ప్రాతిపదికన నడుస్తోంది. దీన్ని కార్పొరేషన్‌కు అప్పగిస్తే అదనపు నిర్మాణాల కోసం పోర్టు అనుమతి తీసుకోవాలి. అందుకు ప్రభుత్వం వేగంగా చర్యలు తీసుకోవాలి.

★ రాష్ట్ర ఈఎస్ఐ విభాగం ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఆసుపత్రిని కేంద్ర ప్రభుత్వంలోని ఈఎస్ఐ కార్పొరేషన్‌కు ఇస్తే అక్కడ పని చేస్తున్న సిబ్బంది సర్దుబాటుకు ఇబ్బందులు వస్తాయని అధికారులు పేర్కొంటున్నారు.

★ ఈ ఆసుపత్రి సమీపంలోనే కార్పొరేషన్ 350 పడకలతో మరో ఆసుపత్రిని నిర్మిస్తోంది. ఇది పూర్తయ్యేందుకు ఏడాదికి పైగా సమయం పట్టనుంది. ఈలోపు వైద్య కళాశాల ఏర్పాటుకు రాష్ట్ర పరిధిలో ఉన్న ఆసుపత్రిని లీజుకు ఇవ్వాలని కార్పొరేషన్ కోరుతోంది. ఆ మేరకు ఇస్తాం.. కానీ, సిబ్బంది సర్దుబాటు, రోగులకు సేవలందించేందుకు ఇబ్బంది లేకుండా కార్పొరేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న 350 పడకల ఆసుపత్రిని తమకు ఇవ్వాలని రాష్ట్ర అధికారులు ప్రతిపాదించారు. దీనిపైనా ప్రభుత్వం చొరవ చూపించాలి.

అందరినీ కలిపేదే భాష

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్



నెల్లూరులోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ప్రచురించిన గ్రంథాలను విడుదల చేస్తున్న ధర్మేంద్రప్రధాన్

ఈనాడు, దిల్లీ: భాష అనేది మనుషులను కలిపేదే తప్పితే విభజించేది కాదని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. ఆంగ్లేయుల విభజించు - పాలించు నీతి, మెకాలే విద్యావిధానం కారణంగా భారత్‌లో భాషల మధ్య అవరోధాలు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. మంగళవారం ఇక్కడ జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన దేశంలోని వివిధ ప్రాచీన భాష అధ్యయన పీఠాలు ప్రచురించిన సాహిత్య సంపుటాల విడుదల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నెల్లూరులోని తెలుగు భాష విశిష్ట అధ్యయన కేంద్రం ప్రచురించిన ఎనిమిది గ్రంథాలను విడుదల చేశారు. 'ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించినట్లు భారతీయ భాషలన్నీ జాతీయ భాషలే. మోదీ ప్రభుత్వం భారతీయ భాషలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. ఇదివరకు ప్రాచీన భాష హోదా కల్పించిన 6 భాషలకు తోడు మరో ఐదింటిని చేర్చింది. ఇప్పుడు అంతటా క్వాంటమ్ గురించి విస్తృత చర్చ జరుగుతోంది. క్వాంటమ్ అనేది వేదంలో అంతర్భాగమని కొందరు చెబుతున్నారు. అయితే మాటలు చెప్పినంత మాత్రాన అది నిరూపణ కాదు. సాక్ష్యాధారాలతో ప్రజల ముందుంచాలి' అని ధర్మేంద్ర పేర్కొన్నారు.

విడుదల చేసిన గ్రంథాలివే: కేంద్రమంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ కార్యక్రమంలో 8 గ్రంథాలను విడుదల చేశారు. వైద్యం వెంకటేశ్వరాచార్యులు రచించిన 'చిత్రకవిత్వ దర్పణం', మొట్టమొదటి తెలుగు చందోగ్రంథం కవిజనాశ్రయంకు ప్రొఫెసర్ బి.వెంకటేశ్వర్లు తెలుగులో, ప్రొఫెసర్ ఆర్వీ సుందరం ఇంగ్లిష్‌లో రాసిన వ్యాఖ్యానాలు, ప్రొఫెసర్ జయశంకర్ తమిళంలోకి అనువదించిన 15వ శతాబ్దానికి చెందిన క్రీడాభిరామం, డాక్టర్ గీతా నావల్ కన్నడంలోకి అనువదించిన అన్నమయ్య 'సంకీర్తన లక్షణం', డాక్టర్ రమేష్ రాసిన మల్లు పురాణం, రత్నావళి పరిణయం, డాక్టర్ టీఎస్ వెంకటేష్ రచించిన హరిచంద్రోపాఖ్యానాలను కేంద్రమంత్రి ఆవిష్కరించారు.

తిరుప్పరకుండ్రం కొండపై ఉన్నది దీప స్తంభమే

- అక్కడ దీపం వెలిగించాలి
- సింగిల్ జడ్జి ఉత్తర్వులను సమర్థించిన మదురై ధర్మాసనం

చెన్నై(ప్యారిస్), వడపళని-న్యూస్‌టుడే: మదురై జిల్లా తిరుప్పరకుండ్రం కొండపై ఉన్న దీప స్తంభంపై దీపం వెలిగించాలని న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్ నేతృత్వంలోని ఏక సభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం సమర్థించింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులు చెల్లుతాయని మంగళవారం తీర్పు వెలువరించడంతో పాటు దీపం వెలిగించేందుకు కొన్ని మార్గదర్శకాలను జారీ చేసింది. జస్టిస్ స్వామినాథన్ గతంలో ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ తమిళనాడు ప్రభుత్వం, మదురై జిల్లా యంత్రాంగం, దేవాదాయశాఖ, సికందర్ దర్గా.. తదితరుల తరఫున 26 అప్పీళ్లు దాఖలయ్యాయి. వాటిని న్యాయమూర్తులు జస్టిస్ జయచంద్రన్, జస్టిస్ రామకృష్ణన్‌ల ధర్మాసనం విచారణ జరిపి తీర్పు వాయిదా వేసింది. మంగళవారం తీర్పును వెలువరిస్తూ తిరుప్పరకుండ్రం కొండపై ఉండేది దీప స్తంభమేనని, అది ఆలయ పరిధిలోనే ఉందని న్యాయమూర్తులు పేర్కొన్నారు. 1996లో ఇచ్చిన ఆదేశాల్లో ఉచ్చి పిళ్లైయార్ ఆలయం, ఇతర ప్రాంతంలో దీపం వెలిగించవచ్చని ఉందని, ఆ తీర్పును పాటించి దేవస్థానం దీపం వెలిగించాలని ఆదేశించారు. ఇందుకు కేంద్ర పురావస్తుశాఖ నుంచి తగిన అనుమతి పొందాలని సూచించారు. దీపం వెలిగించే కార్యక్రమాన్ని మదురై జిల్లా కలెక్టరు పర్యవేక్షించాలని, ఆ క్రతువును నిర్వహించడానికి దేవస్థానం, జిల్లా యంత్రాంగం, పోలీసులే వెళ్లాలన్నారు. ప్రతి కార్తికమాసంలో దీపం వెలిగించడాన్ని నిర్ధారించాలని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. మరోవైపు తిరుప్పరకుండ్రం వ్యవహారంలో తమిళనాడు ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. రాజకీయ ప్రయోజనాల కోసం శాంతి భద్రతల సమస్య అనే ఊహాజనిత భయాన్ని సృష్టించారని ఆక్షేపించింది.

వంట చేయకపోవడం క్రూరత్వం కాదు

ఈ కారణంగా విడాకులు కుదరవు • భర్త అప్పీలును కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు

ఈనాడు, హైదరాబాద్: భార్య, భర్త.. ఇద్దరూ ఉద్యోగులుగా ఉన్నపుడు వంట చేయకపోవడం, తల్లికి సహకరించలేదన్న కారణాన్ని క్రూరత్వంగా పరిగణించి.. విడాకులు మంజూరు చేయడం కుదరదని తెలంగాణ హైకోర్టు తేల్చి చెప్పింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు ఉద్యోగం చేస్తున్న భార్య వంట చేయకపోవడం అన్నది భర్తను హింసిస్తున్నట్లు చెప్పలేమని, ఇది క్రూరత్వం పరిధిలోకి రాదని స్పష్టం చేసింది. అంతే కాకుండా అత్తకు వంట పనుల్లో సహకరించకపోవడం అన్నది ఆమెను హింసించినట్లు కాదంది. ఈ కారణాల మీద వివాహాన్ని రద్దు చేయలేమంటూ తీర్పు వెలువరించింది. భార్య కారణంగా హింసకు గురవుతున్నానని, వివాహాన్ని రద్దు చేయాలన్న హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌ను కింది కోర్టు కొట్టివేయడంతో హైకోర్టులో అప్పీలు దాఖలు చేశారు. దీనిపై హైకోర్టు విచారణ చేపట్టి ఇటీవల తీర్పు వెలువరిస్తూ భర్త అప్పీలును కొట్టివేసింది. భర్త మధ్యాహ్నం 1 నుంచి రాత్రి 10 వరకు ఆఫీసు విధుల్లో ఉండగా, భార్య సాయంత్రం 6 గంటల వరకు ఉద్యోగంలో ఉంటుందని, ఇలాంటప్పుడు ఉదయం వంట చేయలేదన్న కారణం మీద క్రూరత్వంగా పరిగణించలేమంది. విడాకులు మంజూరు చేయలేమంటూ అప్పీలును కొట్టివేసింది.



కార్యక్రమంలో మాట్లాడుతున్న సూర్యకుమారి. చిత్రంలో సునీతా కృష్ణన్, జేడీ శిరీష

మానవ అక్రమ రవాణా అడ్డుకట్టకు.. సీఎం సహకారం అభినందనీయం

ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు సునీతా కృష్ణన్

ఈనాడు, అమరావతి: అక్రమ రవాణాకు గురైన అమ్మాయిల్లో 25-30 శాతం మంది హెచ్ఐవీ బారిన పడుతున్నారని, తీవ్ర శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం క్లిష్టమని, షెల్టర్ హోమ్స్ అనుభవాలే ఇందుకు నిదర్శనమని ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకురాలు సునీతా కృష్ణన్ చెప్పారు. దేశంలోనే తొలిసారి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో.. 2003లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమ రవాణా నిరోధక పాలసీని అమలు చేసిందని, అక్రమ రవాణా అడ్డుకట్టకు సీఎం నుంచి అందుతున్న సహకారం అభినందనీయమని ఆమె వివరించారు. మానవ అక్రమ రవాణా నిరోధం, బాలికల సంరక్షణపై మహిళాశిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విజయవాడలో మంగళవారం ప్రాంతీయ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీతా కృష్ణన్ మాట్లాడారు. మహిళా శిశు సంక్షేమశాఖ కార్యదర్శి సూర్యకుమారి మాట్లాడుతూ... 'బాలల రక్షణ, మహిళా సాధికారత కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోంది. ఇందుకోసం జిల్లాకో ప్రత్యేక అధికారిని నియమించింది' అని వివరించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమశాఖ జేడీ శిరీష పాల్గొన్నారు.

అమరావతి ఓఆర్ఆర్‌కు.. ఎన్టీఆర్ జిల్లాలో 1,416 హెక్టార్ల భూసేకరణ

నోటిఫికేషన్ జారీ

ఈనాడు, దిల్లీ: అమరావతి అవుటర్ రింగ్‌రోడ్డు(ఓఆర్ఆర్) కోసం ఎన్టీఆర్ జిల్లాలోని కంచికచర్ల, వీరులపాడు, జి.కొండూరు, మైలవరం మండలాల్లోని 18 గ్రామాల్లో 1,416.31 హెక్టార్ల భూమిని సేకరించనున్నారు. ఈమేరకు కేంద్ర రహదారి, రవాణా శాఖ మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసింది. 1,798 సర్వే నంబర్ల నుంచి భూమిని సేకరించనున్నట్లు నోటిఫికేషన్‌లో అధికారులు పేర్కొన్నారు. 21 రోజుల్లోపు ఎన్టీఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా... అభ్యంతరాలు, సూచనలు, సలహాలను సమర్పించాలని సూచించారు. ఈ ప్రక్రియ ముగిశాక నేషనల్ హైవేస్ యాక్ట్ 1956లోని సెక్షన్ 3(2) కింద తుది ఉత్తర్వులిస్తారు. సేకరించబోయే భూమిని చదరపు మీటర్లలో చూపారు. ఓఆర్ఆర్ కోసం గుంటూరు జిల్లా మంగళగిరి, తాడికొండ, మేడికొండూరు, కొల్లిపర, తెనాలి, వట్టిచెరుకూరు, గుంటూరు తూర్పు, పశ్చిమం మండలాల్లోని 4,763 సర్వే నంబర్ల పరిధిలో 2,342.87 హెక్టార్లు... కృష్ణా జిల్లా బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, కంకిపాడు, తోట్లవల్లూరు మండలాల పరిధిలోని 2,002 సర్వే నంబర్ల నుంచి 1,111.71 హెక్టార్ల సేకరణకు డిసెంబరు 8న రెండు నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. మూడు జిల్లాల్లో 4,870.89 హెక్టార్లను ఓఆర్ఆర్ కోసం సేకరిస్తున్నారు.


భూమిని సేకరించే గ్రామాలివే...

కంచికచర్ల మండలం
★ కంచికచర్ల, పెరికెపాడు, మున్నలూరు, మొగులూరు, కునికినపాడు

వీరులపాడు మండలం
★ పొన్నవరం, జగన్నాథపురం, జుజ్జూరు, చెన్నారావుపాలెం, తిమ్మాపురం, గూడెంమాధవరం

జి.కొండూరు మండలం
★ కుంటముక్కల, దుగ్గిరాలపాడు, పేట్రంపాడు, నందిగామ, కోడూరు

మైలవరం మండలం
★ మైలవరం, పొందుగుల



నూతన కమిటీ సభ్యులతో విద్యాసాగర్, రమణ

ఉద్యోగుల హక్కుల పరిరక్షణే లక్ష్యం

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఉద్యోగుల హక్కుల పరిరక్షణకు తొలి ప్రాధాన్యం ఇస్తామని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ అన్నారు. సంఘానికి క్యాపిటల్ సిటీ యూనిట్ కార్యవర్గం బలమని చెప్పారు. మంగళవారం గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యాలయాల (హెచ్‌వోడీ విభాగం) ఉద్యోగులతో కూడిన క్యాపిటల్ సిటీ యూనిట్ కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా స్థానిక యూనిట్ల ఎన్నికలు పూర్తయ్యాయని చెప్పారు. త్వరలోనే రాష్ట్ర సంఘానికి ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుందని తెలిపారు. సంఘం 75 ఏళ్ల సుదీర్ఘ పోరాటాల వల్ల ఉద్యోగులకు ఎన్నో ప్రయోజనాలు కలిగాయని వివరించారు. పింఛనర్లకు గత 8 నెలల్లో రూ.13 వేల కోట్ల ప్రయోజనాలు సాధించినట్లు తెలిపారు. సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.వి.రమణ మాట్లాడుతూ క్యాపిటల్ సిటీ యూనిట్ డిమాండ్ల సాధనకు ఏపీ ఎన్జీవో కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఉద్యోగులు నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు.

క్యాపిటల్ సిటీ యూనిట్ అధ్యక్షుడిగా నాగభూషణం: ఈ ఎన్నికల్లో మొత్తం 19 పోస్టులకు గాను 18 పోస్టులకు ఒక్కో నామినేషన్ దాఖలైంది. అధ్యక్షుడిగా సి.హెచ్.నాగభూషణం, సహాధ్యక్షుడిగా వై.మురళీ మనోహరరావు, కార్యదర్శిగా జి.కిషోర్‌బాబు, కోశాధికారిగా టి.మహేష్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సి.హెచ్.సుధీర్, ఉపాధ్యక్షులుగా బి.అశోక్‌బాబు, ఎం.సరస్వతి, ఆర్.శివారెడ్డి, టి.మునికేశవులు, ఎల్.రజనీష్‌బాబు, మహిళా ఉపాధ్యక్షురాలిగా వి.వి.లలితాంబ, సంయుక్త కార్యదర్శులుగా ఆర్.శ్రీనివాసరావు, టి.రామకృష్ణ, డి.దాసు, ఆర్జా నాగరాజు, ఎం.మాధవీలత, కె.శ్రీనివాస్, మహిళా సంయుక్త కార్యదర్శులుగా వై.సులోచనలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఒక ఉపాధ్యక్షుడి పోస్టుకు ఎవరూ నామినేషన్ వేయలేదని ఎన్నికల అధికారి పి.రమేష్ తెలిపారు. సహాయ ఎన్నికల అధికారిగా బి.సతీష్‌కుమార్, పర్యవేక్షకుడిగా షేక్ నాగూర్ షరీఫ్ వ్యవహరించారు.

'సిద్ధార్థ' స్వర్ణోత్సవాలు వాయిదా

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : పీబీ సిద్ధార్థ కళాశాల మైదానంలో నేడు (బుధవారం) నిర్వహించాల్సిన సిద్ధార్థ అకాడమీ స్వర్ణోత్సవాలు వాయిదా పడ్డాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు కావాల్సి ఉండగా.. ఆయన దిల్లీ పర్యటన నేపథ్యంలో వేడుకలను వాయిదా వేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఖేలో ఇండియా కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: క్రీడా వ్యవస్థను బలోపేతం చేయడానికి జిల్లా స్థాయిలో ఖేలో ఇండియా కేంద్రాలు ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి కాకర్ల కోటేశ్వరరావు తెలిపారు. ప్రాధాన్యం గల 15 క్రీడాంశాల్లో ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేయడానికి శాప్ శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. సైక్లింగ్, తైక్వాండో, షూటింగ్, ఉషు, జిమ్నాస్టిక్స్, రోయింగ్, సెపక్ తక్రా, కయాకింగ్ అండ్ కెనోయింగ్, కరాటే, సెయిలింగ్, ఈక్వెస్ట్రియన్, జూ-జిట్సు, కురాష్, స్క్వాష్, గోల్ఫ్ వంటి క్రీడాంశాల్లో.. గరిష్ఠంగా మూడింటిని ఆసక్తి గలవారు, ఛాంపియన్లుగా నిలిచిన క్రీడాకారులు, శిక్షకులు, సంఘాల ప్రతినిధులు ఎంచుకోవాలని తెలిపారు. వాటికి సంబంధించిన ధ్రువపత్రాలు, గుర్తింపు కార్డులతో స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని డీఎస్ఏ కార్యాలయంలో ఈ నెల 8వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు సంప్రదించాలని ఆయన కోరారు. మరిన్ని వివరాలకు 98661 34016 నంబరులో సంప్రదించాలని తెలిపారు.

బెయిల్ పిటిషన్లపై ముగిసిన వాదనలు

ఈనాడు - అమరావతి: సత్యవర్ధన్‌పై దాడి, అపహరణ కేసులో ముగ్గురు నిందితుల బెయిల్ పిటిషన్లు మంగళవారం ఎస్సీ, ఎస్టీ కోర్టులో విచారణకు వచ్చాయి. తేలప్రోలు రాము, వజ్రకుమార్, రామాంజనేయులు దాఖలు చేసుకున్న బెయిల్ పిటిషన్లను తిరస్కరించాలని, కేసు విచారణ ఇంకా పూర్తి కాలేదని.. ఈ దశలో బెయిల్ ఇస్తే దర్యాప్తునకు ఆటంకం కలుగుతుందని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. పోలీసులు ఇప్పటికే ఛార్జిషీట్ దాఖలు చేశారని.. నిందితులకు బెయిల్ ఇవ్వాలని వారి తరఫు న్యాయవాది సత్యశ్రీ వాదనలు వినిపించారు. వంశీని అరెస్టు చేసినప్పుడు పటమట స్టేషన్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీని కోర్టు ముందుంచాలనీ, దానిని భద్రపర్చాలని ఆమె కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. ఈ రెండు పిటిషన్లపై తదుపరి వాదనల నిమిత్తం గురువారానికి న్యాయాధికారి వాయిదా వేశారు.

పుస్తకాలకు ప్రాచుర్యం కల్పించాలి: ఆర్పీ సిసోదియా



పాదయాత్ర ప్రారంభిస్తున్న చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోదియా

మొగల్రాజపురం(విజయవాడ సిటీ), న్యూస్‌టుడే: రానురానూ పుస్తకాలకు ఆదరణ తగ్గిపోతోందని, వాటికి ప్రాచుర్యం కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చేనేత, జౌళిశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్.పి.సిసోదియా అన్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవం ఆధ్వర్యంలో మంగళవారం మొగల్రాజపురం పీబీ సిద్ధార్థ కళాశాల నుంచి ఇందిరాగాంధీ మున్సిపల్ మైదానంలోని పుస్తక ప్రదర్శన వరకు నిర్వహించే పుస్తక ప్రియుల పాదయాత్రను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సిసోదియా మాట్లాడుతూ ఏటా విభిన్న కార్యక్రమాలు నిర్వహిస్తున్న విజయవాడ పుస్తక మహోత్సవ సొసైటీ ప్రతినిధులను అభినందించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. పుస్తక పఠనం ద్వారా జ్ఞానం పెరుగుతుందని తెలిపారు. విజయవాడలో నిర్వహిస్తున్న ప్రదర్శనకు వేలాదిగా పుస్తక ప్రియులు తరలిరావడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. మాజీ రాజ్యసభ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ మాట్లాడుతూ పుస్తకప్రియుల పాదయాత్రలో విద్యార్థులను భాగస్వాములను చేయడం గొప్ప విషయమని, భవిష్యత్తు తరాలకు పుస్తకాల విలువ తెలియజెప్పేందుకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. ● ఆంధ్రజ్యోతి పూర్వ సంపాదకుడు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ హైదరాబాద్‌లో నిర్వహించిన పుస్తక మహోత్సవం విజయవంతమైందని, అదే స్ఫూర్తి ఇక్కడా కొనసాగుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో తానా సాహిత్య వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్, తెలుగు ఎన్నారై డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజా, సాహితీవేత్త వేముల హజరత్తయ్య గుప్తా, పుస్తక మహోత్సవం సమన్వయకర్త, ఎమెస్కో అధినేత విజయ్‌కుమార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు. మాదక ద్రవ్యాలు వద్దు-పుస్తకాలే ముద్దు అంటూ విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శించారు.

చుట్టూ తిప్పేసి.. సెల్ఫీ తీసేసి..



సెల్ఫీ బూత్‌పై డ్యాన్స్ చేస్తున్న చిన్నారిని సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తూ..

360 డిగ్రీల సెల్ఫీ బూత్ విజయవాడ పుస్తక మహోత్సవానికి వస్తున్న చిన్నారులను, యువతను ఎంతో ఆకట్టుకుంటోంది. 360 డిగ్రీల్లో తిరిగే ఒక ప్లాట్‌ఫాం.. దానికి అనుసంధానమై సెల్‌ఫోన్ స్టాండ్.. మనచేతిలో ఉన్న ఫోన్‌ను ఆ స్టాండ్‌కు తగిలించి.. దానిపై నిలబడి మనం డ్యాన్స్ చేసినా..ఫొటోలకు ఫోజులు ఇచ్చినా మనచుట్టూ తిరుగుతూ అన్ని కోణాల నుంచి అద్భుతమైన పనోరమిక్ వీడియోను, సెల్ఫీలను అందిస్తుంది. దీనిని ధనిక్ భారత్ విద్యా సంస్థల స్టాల్ ముందు ఉంచారు. **- ఈనాడు, అమరావతి**

వర్తమాన అంశాలపై చిన్నారుల పట్టు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో 36వ పుస్తక మహోత్సవం.. అయిదో రోజు మంగళవారం జయంత్ విష్ణు నార్లిక్ ప్రతిభా వేదికపై చిన్నారులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. విశ్రాంత మిలటరీ మేజర్ అశోక్ బాలలను ఆరు బృందాలుగా ఏర్పాటు చేశారు. వర్తమాన వ్యవహారాలు ఇతర అంశాలపై ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని చక్కగా జవాబులు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పిల్లలు నిరంతరం పుస్తక పఠనం చేయాలని సూచించారు.



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న అశోక్



మాట్లాడుతున్న శివశంకర్

గ్రామీణ జానపదానికి కొసరాజు సాహిత్యం దర్పణం

విజయవాడ సాంస్కృతికం: తెలుగు గ్రామీణ సంస్కృతి, జానపద భాషకు.. కొసరాజు రాఘవయ్య చౌదరి సాహిత్యం దర్పణం పడుతుందని ప్రముఖ కవి పాపినేని శివశంకర్ అన్నారు. 36వ విజయవాడ పుస్తక మహోత్సవంలో అయిదో రోజు టీవీ పట్టాభిరామ్ సాహిత్య వేదికపై కొసరాజు 'సర్వలభ్య' రచన సంకలనం పరిచయ సభ నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 'ఏరువాకా సాగారో' వంటి పాటల ద్వారా రైతు జీవితం, ఆ నాటి సామాజిక పరిణామాలు, వర్గాల మధ్య ఘర్షణలను కొసరాజు హృద్యంగా రచించారని పేర్కొన్నారు. పాటలతో పాటు ఇతర రచనల ద్వారా తెలుగు సాంస్కృతిక మూలాలను.. చరిత్రలో చిరస్థాయిగా నిలిపారని వివరించారు. సభకు తానా ప్రపంచ సాహిత్య వేదిక అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ అధ్యక్షత వహించారు. కవి బండ్ల మాధవరావు పుస్తకాన్ని పరిచయం చేశారు. కవయిత్రి బాలాంత్రపు నాగ ప్రసూన.. కొసరాజు చలనచిత్ర పాటల విశిష్టతను వివరించారు. మనసు ఫౌండేషన్ బాధ్యుడు పారా అశోక్ వందన సమర్పణ చేశారు.

బెయిల్ మంజూరుకు జోగి సోదరుల పిటిషన్లు

ఈనాడు - అమరావతి: నకిలీ మద్యం కేసులో వైకాపా నేత జోగి రమేష్, అతని సోదరుడు రాము బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. మంగళవారం విజయవాడ ఎక్సైజ్ కోర్టులో రెండోసారి పిటిషన్లు వేశారు. ఇటీవల వీరి బెయిల్ పిటిషన్లను కోర్టు డిస్మిస్ చేసిన సంగతి తెలిసిందే.

అనిల్ చోక్రా, రోణక్ కస్టడీ కోరుతూ..

ఈనాడు - అమరావతి: మద్యం కేసులో నిందితులు అనిల్ చోక్రా, రోణక్ కస్టడీ కోరుతూ సిట్ అధికారులు పిటిషన్లు దాఖలు చేశారు. నిందితులను ఏడు రోజుల కస్టడీ కోరుతూ మంగళవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో ఈ మేరకు పిటిషన్లు ఫైల్ చేశారు. చోక్రా కస్టడీ పిటిషన్‌పై కౌంటర్ వేయాలని నిందితుడి తరఫు న్యాయవాదిని కోర్టు ఆదేశించింది. చోక్రా బెయిల్ పిటిషన్, కారాగారంలో వేడినీరు ఇవ్వాలని వేసిన పిటిషన్లపై విచారణ బుధవారానికి వాయిదా పడింది. ఈ కేసులో నిందితుల నుంచి అరెస్టు సమయంలో స్వాధీనం చేసుకున్న ఫోన్ల తాలూకా నివేదికను ఎఫ్ఎస్ఎల్ కోర్టుకు సమర్పించింది. దీని కాపీని సిట్ అధికారులు తీసుకునేందుకు బుధవారం కోర్టులో మెమో దాఖలు చేయనున్నారు.

మాతృ భాషాభివృద్ధికి ప్రవాసాంధ్రుల కృషి స్ఫూర్తిదాయకం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, వేదికపై ప్రసాద్, మునిరత్నం నాయుడు, తోటకూర ప్రసాద్, గౌరీశంకర్

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : తాము పుట్టి పెరిగిన ప్రాంతాన్ని వదిలి కొన్నేళ్లవుతున్నా.. ప్రవాసాంధ్రులు మాత్రం మాతృభాషపై ఎంతో మక్కువ చూపుతున్నారని కృష్ణా జిల్లా అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'ప్రవాసాంధ్రుల ఆత్మీయ సమ్మేళనం' విజయవాడలోని పీబీ సిద్ధార్థ కళాశాలలో మంగళవారం నిర్వహించారు. బుద్ధప్రసాద్ మాట్లాడుతూ.. అమ్మ భాషపై మక్కువతో ఎంతో మంది సిలికానాంధ్ర ద్వారా ఆన్‌లైన్‌లో తెలుగు నేర్చుకున్నారని తెలియజేశారు. పిల్లలు, యువత, ప్రజలకు తెలుగు నేర్పించాలనే తపన రాష్ట్రేతర తెలుగు సంఘాలకు ఉందని పేర్కొన్నారు. తెలుగు నేర్పించే సంస్థకు గుర్తింపు ఇవ్వాలని, వారు ఇచ్చే ధ్రువీకరణ పత్రానికి విలువ ఉండాలని సూచించారు. సభల్లో తెలుగు భాష గొప్పదని వక్తలు ప్రసంగాలు చెప్పడం కంటే.. ప్రస్తుత సమస్యలను గుర్తించి పరిష్కరించాలని సూచించారు. భవిష్యత్తు తరాలకు తెలుగు భాషను ఎలా అందించాలనే అంశంపై ఆలోచనలు చేయాలని కోరారు. తానా మాజీ అధ్యక్షుడు తోటకూర ప్రసాద్ మాట్లాడుతూ.. తెలుగు భాషా వికాసానికి, పేద విద్యార్థుల్లో విద్యాభివృద్ధికి సాహితీ అభిమానులు, దాతలు, ప్రభుత్వం సమష్టి కృషి చేయాలని అన్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య డి.మునిరత్నం నాయుడు మాట్లాడుతూ... వచ్చే విద్యాసంవత్సరం నుంచి బహుళ ప్రయోజనం చేకూర్చే ఎనిమిది కోర్సులను విశ్వవిద్యాలయం ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ఆచార్య పి.గౌరీశంకర్, రాష్ట్రేతర తెలుగు సమాఖ్య ప్రతినిధి ప్రసాద్, రాజ్యసభ మాజీ సభ్యుడు యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వసుంధర

vasundhara@eenadu.in

రిమోట్ వర్క్... ఏదో వెలితి!

మూడేళ్లుగా రిమోట్ వర్క్(ఇంటి నుంచి పని) చేస్తున్నాను. ఇందులో సౌలభ్యం ఉన్నప్పటికీ, టీమ్‌తో సంబంధాలు తెగిపోతున్నట్లు అనిపిస్తోంది. వర్చువల్ మీటింగ్స్ అన్నీ వర్క్‌కు సంబంధించే ఉంటున్నాయి. దీంతో ఆఫీసులో సహోద్యోగుల మధ్య ఉండే సాన్నిహిత్యాన్ని కోల్పోతున్నా. రిమోట్ వర్క్ వదులుకోకుండానే, టీమ్‌తో అనుబంధాన్ని ఎలా పెంచుకోవాలి?

– ఎస్.లిఖిత, విజయనగరం

మారుతున్న పని సంస్కృతిలో చాలామంది ఎదుర్కొంటున్న సమస్య ఇది. రిమోట్ వర్క్ వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ, అందరితో కలిసి ఉండటానికి మనం ప్రత్యేకంగా ప్రయత్నించాలి. అందుకోసం ఏం చేయాలంటే...

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

వర్చువల్ సమావేశాలు: పనితో సంబంధం లేని సరదా వర్చువల్ సమావేశాలను ఏర్పాటుచేయమని సూచించండి. టీమ్ ట్రివియా సెషన్లు, వర్చువల్ కాఫీ బ్రేకులు లేదా ఆన్‌లైన్ ఎస్కేప్ రూమ్స్ వంటివి నిర్వహించవచ్చు. బయటి విషయాల గురించి మాట్లాడుకోవడానికి ఒక వేదికను సృష్టించడం వీటి ప్రధాన ఉద్దేశం.

వర్చువల్ కో-వర్కింగ్ సెషన్లు: టీమ్ సభ్యులందరూ ఒకే వీడియో కాల్‌లో ఉండి, ఎవరి పని వాళ్లు చేసుకునేలా ప్లాన్ చేయండి. ఇది అందరూ ఒకే గదిలో కూర్చుని పని చేస్తున్న అనుభూతిని కలిగిస్తుంది. మధ్యలో అప్పుడప్పుడు మాట్లాడుకోవడానికి అవకాశం ఇస్తుంది.

వ్యక్తిగత పలకరింపులు: సహోద్యోగులతో వ్యక్తిగతంగా మాట్లాడండి. 'హాయ్, మనం మాట్లాడుకుని చాలా రోజులైంది. ఈ వారం ఏదైనా ఒక రోజు కాసేపు వర్చువల్‌గా కాఫీ తాగుతూ ముచ్చటిద్దామా?' వంటి చిన్న మెసేజ్ పాత సంబంధాలను మళ్లీ చిగురింపజేస్తుంది.

ప్రత్యక్ష ఈవెంట్‌లకు హాజరవ్వండి: మీ కంపెనీ ఎప్పుడైనా ఇన్-పర్సన్ మీటింగ్స్ నిర్వహిస్తే, తప్పకుండా వెళ్లడానికి ప్రయత్నించండి. ఇవి వర్చువల్ సంబంధాలను మరింత దృఢపరుస్తాయి.

వ్యక్తిగత విషయాలను పంచుకోండి: వర్చువల్ మీటింగ్‌లలో చిన్నపాటి వ్యక్తిగత అప్‌డేట్స్ లేదా విశేషాలను పంచుకోండి. ఇది ఇతరులు కూడా తమ గురించి చెప్పేలా ప్రోత్సహిస్తుంది. దాంతో పరస్పర నమ్మకాన్ని పెంచుతుంది.

టీమ్ మధ్య అనుబంధం పెంచాలనే మీ కోరికను మేనేజర్‌కు తెలియజేయండి. వాళ్లు దీనికోసం కొత్త మార్గాలను సూచించవచ్చు.

ఇలాంటి మార్గాల ద్వారా, ఒకేసారి మీరు రిమోట్ వర్క్ ఇచ్చే స్వేచ్ఛనీ, సహోద్యోగులతో ఉండే ఆత్మీయతనీ పొందవచ్చు. పని ప్రదేశంలో సంబంధాలు నిరంతర ప్రయత్నం, శ్రద్ధతోనే వృద్ధి చెందుతాయి.

మీకు తెలుసా!

పిల్లలకు దాదాపు ఎనిమిదేళ్లు వచ్చేవరకు వాస్తవానికీ కల్పనకూ మధ్య తేడా తెలియదట. అందుకే కొత్తగా ఏది విన్నా, చూసినా భయపడుతుంటారు. వాళ్లు చూసేవీ, చదివే వాటిమీద తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంటే మంచిదంటున్నాయి అధ్యయనాలు.

ఫోర్బ్స్‌లో అమ్మాయిల ఫోర్స్!

వయసు... పాతికేళ్లకు అటూఇటూ! అయినా అనుభవం, ఆర్థికం లాంటి అంశాలేవీ వాళ్ల కలలకు కళ్లెం వేయలేకపోయాయి. అంతరించిపోతున్న కళలకు అంతర్జాతీయ ఖ్యాతిని తెస్తున్నారు, డిజిటల్ మార్కెటింగ్‌లో దిగ్గజాలనీ వెనక్కి నెట్టేస్తున్నారు, క్రీడల్లో తమకు పోటీలేదని నిరూపిస్తున్నారు. జెన్‌జీలైనా... బౌద్ధ జెన్‌ల మాదిరిగా లక్ష్యం దిశగా రాజీలేని ప్రయాణం చేస్తున్నారీ అమ్మాయిలు. అందుకే 2026కిగానూ ఫోర్బ్స్ ఇండియా 30 అండర్-30లో చోటు సంపాదించారు.



టీ, కాఫీ... ఆమె మనసు!

సంప్రదాయ అల్లికలు మహిళల సృజనాత్మకతనే కాదు, వాళ్ల మనసునీ తెలియజేస్తాయంటారు **మౌమితా బసక్**. పశ్చిమ బెంగాల్‌లోని శ్రీరామ్‌పుర్ అనే చిన్న పల్లె ఆమెది. ప్రభుత్వ కళాశాలలోనే ఫైన్ ఆర్ట్స్‌లో బ్యాచిలర్స్, పీజీ పూర్తిచేశారు. తన కళాకృతులతో ఎన్నో అవార్డులు గెలుచుకోవడమే కాదు... గుర్తింపునీ తెచ్చుకున్నారు. ఈ క్రమంలో జాతీయ, అంతర్జాతీయ స్కాలర్‌షిప్‌లూ అందుకున్నారు. పాత వస్త్రాలు, తమ ప్రాంత సంప్రదాయ కాంతా అల్లిక, టీ, కాఫీ, నాచు వంటివాటితోనే ఆమె చిత్రాలన్నీ రూపుదిద్దుకుంటాయి. వాటిలో ప్రతిఫలించేది మాత్రం 'ఆమె' మనసే! పురుషాధిక్యత చూస్తూ పెరిగారు మౌమిత. మహిళల భావోద్వేగాలు, వాళ్లు ఎదుర్కొనే ఇబ్బందులు, సవాళ్లతోపాటు పర్యావరణంపై ప్రేమనీ వాటిల్లో చాటుతుంటారు. తన చిత్రాలతో దేశీయంగానే కాదు... లండన్, స్పెయిన్, పోలాండ్ వంటి విదేశాల్లోనూ ఎగ్జిబిషన్లు ఏర్పాటుచేశారు. పోలాండ్‌లో జరిగిన ఓ అంతర్జాతీయ ఆర్ట్ పోటీలో బంగారు పతకాన్ని సాధించారు. 'చిన్న ప్రాంతాలనుంచి వస్తేనేం? మనదైన కృషితో అంతర్జాతీయ గుర్తింపు తెచ్చుకోవడం అసాధ్యమేమీ కాద'ంటారీమె.

ఆతిథ్యంతో మెప్పించాలని...

కొన్నేళ్ల క్రితం... న్యూ ఇయర్ ట్రిప్‌కి వెళ్లిన **సిమోనా మోహన్**, ఆమె స్నేహితులకు కూర్గ్‌లో సరైన వసతి దొరకలేదట. అదే తనను దానికి పరిష్కారం వెతికే దిశగా నడిపించిందంటారామె. 28 ఏళ్ల సిమోనా మోహన్.. రాజకీయ వ్యూహకర్తగా పనిచేసేవారు. వినియోగదారులకు తక్కువ ధరల్లోనే ప్రీమియం ఎక్స్‌పీరియన్స్ ఇవ్వాలనే లక్ష్యంతో ఆమె వ్యాపార ఆలోచన చేశారు. పర్యటక ప్రాంతాల్లో విడివిడిగా ఉన్న హోమ్ స్టేలను ఏకతాటి మీదకు తీసుకురావాలనుకున్నారు. ఇందుకోసమే... కుటుంబ స్నేహితులైన సిద్ధార్థ్, గౌతమ్ సోమనాలతో కలిసి సిమోనా రాహో హాస్పిటాలిటీస్‌ను ప్రారంభించారు. రీడిజైన్ చేయడం, అతిథులకు స్థానిక వంటకాలను రుచి చూపించడం వంటివే కాదు... పెట్ స్పా వంటి కస్టమైజ్డ్ సర్వీసుల వరకూ అన్నింటినీ ఈ సంస్థ ఏర్పాటుచేస్తుంది. ప్రస్తుతం కూర్గ్‌లో 50కి పైగా గదులతో దీని కార్యకలాపాలు సాగుతున్నాయి. 2025లో రూ.2.5 కోట్ల ప్రీ సీడ్ ఫండింగ్‌ను సేకరించింది. త్వరలోనే మరిన్ని పర్యటక ప్రాంతాలకు విస్తరించడానికి సిద్ధంగా ఉంది.

అజరఖ్ కళ తెచ్చినందుకే...

ప్రాచీన కళల్లో అజరఖ్ ఒకటి. సహజ రంగులు, చెక్కబ్లాకులు ఉపయోగించి... సంక్లిష్టమైన జియోమెట్రిక్ డిజైన్లతో దీన్ని రూపొందిస్తారు. ఈ బ్లాక్ ప్రింటింగ్‌లో సుమారు 14-16 దశలు ఉంటాయి. ఎంతో క్లిష్టమైన ఈ కళను పురుషులు మాత్రమే చేసేవారు. కానీ ఈ సంప్రదాయాన్ని తిరగరాశారు **ముబాశిరా ఖాలిద్ ఖత్రీ**. పురుషులు ఆధిపత్యం చెలాయించే ఈ రంగంలో అడుగు పెట్టి స్వతంత్రంగా నిలిచిన తొలి మహిళగా గుర్తింపు పొందారు. వాళ్లింట్లో మూడోతరం కళాకారిణి. 2001లో గుజరాత్ భూకంపం సమయంలో వీరి కుటుంబం భుజ్ నుంచి అజరఖ్‌పుర్‌కి వచ్చి స్థిరపడింది. ఈ కళనే ఉపాధిగా మలుచుకుంది. కాలక్రమంలో ఆమె తండ్రి, అన్న సంప్రదాయ అజరఖ్ ముద్రణలో మార్పులు తేవాలనుకున్నారు. అందుకోసం కొత్త ఆలోచనలు చేయడం ముబాశిరాలో ఆసక్తిని పెంచాయట. దీంతో వారితో కలిసి తానూ పనిచేయడం ఆరంభించారు. 2021లో 'ఎలీషియన్స్' బ్రాండ్‌తో సంప్రదాయ అజరఖ్ కళకు ఆధునిక హంగులు అద్దుతున్నారు. తక్కువ సమయంలోనే గుర్తింపునీ అందుకున్నారు. అంతేకాదు, మొన్నామధ్య ముబాశిరా లాక్మే ఫ్యాషన్ వేదికపైనా మెరిశారు.

డిజిటల్ మార్కెటింగ్‌లో దూసుకెళ్తూ..

సోషల్ మీడియాలో బిజీగా ఉంటూ... రీల్స్, షార్ట్స్, ఫొటోలతో ప్రయోగాలు చేస్తోంది ఈతరం. **కాజోల్ భేడా** మాత్రం అదే డిజిటల్ ప్రపంచంలో ప్రఖ్యాత సంస్థలకు మార్కెటింగ్ చేస్తున్నారు. మీడియా ప్రొడక్షన్ విభాగంలో యూకేలో మాస్టర్స్ చేశారు కాజోల్. కొవిడ్ సమయంలో రీల్స్, డబ్‌స్మాష్, టిక్‌టాక్... ఊపందుకోవడం చూసి యువతరానికి చేరువ కావడానికి బ్రాండ్‌లకు ఇది మంచి మార్గమని భావించారు కాజోల్. అలా 2020లో స్కైబుల్డ్ ప్రారంభమైంది. 'జాతీయ, అంతర్జాతీయ సంస్థల్లో పనిచేశాను.. బ్రాండ్‌లు కోరుకుంటున్నదానికీ, ఏజెన్సీ సంస్థలు అందిస్తున్నదానికీ మధ్య చాలా వ్యత్యాసం ఉంది. దాన్ని పూడ్చాలనుకున్నా' అని చెబుతారు కాజోల్. ముంబయి కేంద్రంగా పనిచేస్తోన్న స్కైబుల్డ్‌కు హల్దీరామ్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అమెజాన్ ప్రైమ్ లాంటి ప్రముఖ సంస్థలు ఖాతాదారులు. 'ఫోన్‌కు వచ్చే సేల్స్ కాల్స్ సంస్థల మార్కెటింగ్ విభాగాలను తిరిగి సంప్రదించి తొలి ఖాతాదారుని సంపాదించుకున్నాం' అంటారు కాజోల్. సంస్థను యూఏఈకి విస్తరించారు. 'ప్రకటనల రంగంలో అప్పటికే దిగ్గజ సంస్థలున్నాయి. నాకప్పటికి పాతికేళ్లూ లేవు. అమ్మాయిలు ఇదంతా చేయలేరనుకున్నారు. వాళ్ల అభిప్రాయం తప్పని నిరూపించాం' అని చెబుతారు కాజోల్. జెన్‌జీల మనసు ఆ వయసువాళ్లకంటే ఇంకెవరికి బాగా తెలుస్తుంది!

మీ ఆస్తి... మీ హక్కు!

'షేర్లు, స్థిరాస్తుల మీద పెట్టుబడులు పెట్టాలి... అవి ఉన్నాయన్న సంగతి మరచిపోవాలి. అప్పుడే వాటి ఫలాలు పూర్తిగా అందుతాయి'. ఆర్థిక నిపుణుల మాట ఇది. పొదుపు మంత్రాల్లో మొదటి నియమం కూడా. అందుకే మదుపరుల్లో చాలామంది దీన్నే ఫాలో అవుతారు. కానీ, దీనివల్ల ప్రతికూలతలూ ఉన్నాయి అంటారు **పూజా మాలిక్**. ఈమెది దిల్లీ. చండీగఢ్ యూనివర్సిటీలో ఎంబీఏ పూర్తిచేశారు. చదువయ్యాక తన స్నేహితురాలు నేహా జైన్‌తో కలిసి 'ఈక్విట్రేసర్స్' అనే అంకురాన్ని స్థాపించారీమె. 'గత కొన్ని సంవత్సరాలుగా క్యాపిటల్ మార్కెట్లో వినియోగదారులు కొన్ని సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. వాటిల్లో ప్రధానమైనది పెట్టుబడులు పెట్టి మరచిపోవడం. ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్(ఐఈపీఎఫ్) లెక్కల ప్రకారం... మనదేశంలో క్లెయిమ్ చేయని షేర్లు, డివిడెంట్ల విలువ సుమారు రూ.1.84 లక్షల కోట్లు. అదంతా రికవరీ చేసి హక్కుదార్లు, వారసులకు అందేలా చేస్తున్నాం. సంబంధిత డాక్యుమెంట్లు, డిజిటల్ కాపీలు ఉన్నప్పుడే ఇది సాధ్యం. అయితే యజమాని చనిపోవడం, డాక్యుమెంట్లు పోగొట్టుకోవడం వంటివాటినీ మేం పరిష్కరిస్తాం' అంటారు పూజ. దిల్లీ కేంద్రంగా 2022 నుంచి పనిచేస్తుందీ సంస్థ. దీనికి దేశీ, విదేశీ కలిపి వందకు పైగానే క్లయింట్లు ఉన్నారు. అనతి కాలంలోనే వీళ్ల సంస్థ మంచి ఆదరణనూ సంపాదించుకుంది.

కళాకారుల కోసమే ఈ బ్రాండ్!

'కరోనా సమయంలో జీవనం సాగించడానికి కష్టపడుతున్న ఒక కళాకారుడు తన బాధను అమ్మతో పంచుకున్నాడు. ఆ సంభాషణ నుంచి పుట్టిన ఆలోచనే 'హౌస్ ఆఫ్ చికన్‌కారి'. కనుమరుగవుతున్న హస్తకళను కాపాడాలన్న ఆలోచనతో అమ్మ పూనమ్‌తో కలిసి దీన్ని మొదలుపెట్టా' అంటారు **ఆకృతి రావల్**. దిల్లీలో పుట్టి పెరిగిన ఈమె బ్రిటన్‌లోని ఇంపీరియల్ కాలేజ్ లండన్‌లో స్ట్రాటజిక్ మార్కెటింగ్‌లో ఎమ్మెస్సీ పూర్తిచేశారు. 'చిన్నప్పట్నుంచీ భారతీయ హస్తకళలంటే ఇష్టం. ట్రెండ్ మారుతున్నా వాటి హుందాతనాన్ని అవి ఎప్పటికీ కోల్పోవు. కానీ వాటిని నమ్ముకున్న కళాకారుల పరిస్థితి మాత్రం దుర్భరంగా ఉంది. సరైన ఉపాధి, గుర్తింపు రెండూ లేవు. ఇవే నన్ను వ్యాపారం వైపు అడుగులు వేసేలా చేశాయి. ఆ పరిస్థితి మార్చి, వాళ్లకు సాధికారత కల్పించాలనుకున్నా. 2020లో 80మంది కళాకారులు, రూ.3లక్షల పెట్టుబడితో లఖ్‌నవూలో మా వ్యాపారం మొదలైంది. మా దగ్గర మధ్యవర్తులు ఉండరు. కళాకారుల నుంచి సంప్రదాయ వస్త్రాల్ని మేమే సేకరిస్తాం. వాటిని మా సొంత వెబ్‌సైట్‌తోపాటు, ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్స్‌లో విక్రయిస్తున్నాం' అంటారు ఆకృతి. మూలాలను వదలకుండా వాటికి ఆధునికతను జతచేస్తే ఆర్థిక భద్రతకు కొదవే ఉండదంటూ కళాకారులకీ, వ్యాపారవేత్తలకీ సందేశమిస్తున్నారీమె.

ముగ్గురూ ముగ్గురే!

- సిగ్గరి... ఎవరితోనూ కలవలేని అమ్మాయి **అనీత్ పడ్డా**. 'నీ భావాలను మనసులోనే దాచకోకు. కవితల్లోనూ, చిన్న స్కిట్‌ల ద్వారానో నీకు నచ్చిన విధానంలో బయటపెట్టు' అని తల్లి సలహానిచ్చిందట. దాన్ని తప్పక పాటించింది కాబట్టే, ఎలాంటి శిక్షణ లేకుండానే మంచి నటిగా ఎదిగింది అనీత్. హీరోయిన్‌గా తొలి సినిమాతోనే గుర్తింపు తెచ్చుకుంది. బాలీవుడ్‌లోనే కాదు దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. వరుస ఆఫర్లు అందుకుంటోంది.
- పిట్ట కొంచెం కూత ఘనం... **దివ్యా దేశ్‌ముఖ్** పేరు విన్నవారెవరైనా ఇదే అంటారు. 20 ఏళ్లే! కానీ అవతల ఎంత అనుభవమున్న ప్రత్యర్థి అయినా ఉండనీ తొణకదీ చెస్ క్రీడాకారిణి. కాబట్టే ఫిడే విమెన్స్ వరల్డ్‌కప్ గెలిచింది. అదీ టాప్ ప్లేయర్లను ఓడించి! దాంతో గ్రాండ్ మాస్టర్ టైటిల్‌నీ అందుకుంది. దాన్ని అందుకున్న నాలుగో భారతీయురాలిగా నిలిచింది. ఈ ఏడాది తన విజయ ప్రస్థానాన్ని కొనసాగించడానికి సిద్ధమవుతోంది.
- **శీతల్ దేవి**... ఈ పేరు ఇప్పుడు దేశవ్యాప్తంగా పరిచయమే! చిన్న గ్రామంలో రెండు చేతుల్లేకుండా పుట్టిందీ అమ్మాయి. చేతుల్లేకపోతేనేం, తనకంటూ గుర్తింపు సాధించాలని కాళ్లతో బాణాలు వేయడం నేర్చుకుంది. అంతర్జాతీయ స్థాయిలో పతకాలు కొల్లగొడుతోంది. పారా ఆర్చరీ కాంపౌండ్ విభాగంలో ప్రపంచ ఛాంపియన్‌గా నిలిచిన ఈమె... సాధారణ ఆర్చర్లతో కలిసి ఆసియా కప్‌లో పోటీ పడేందుకు అర్హత సాధించింది. ఇలా ఓ పారా అథ్లెట్ పోటీపడటం ఇదే తొలిసారి. దేశంలో పారాలింపిక్ మెడల్ సాధించిన అతిపిన్న వ్యక్తి కూడా.

ఆ రోజులే వేరు!



మాది గుంటూరు జిల్లా, తాడేపల్లి గ్రామం. ఉమ్మడి కుటుంబం. పాతిక మందిమి ఉండేవాళ్లం. సంక్రాంతి వచ్చిందంటే పండుగంతా మా ఇంట్లోనే! సరదా కబుర్లు, ఆటపాటలతో ప్రపంచాన్నే మర్చిపోయేవాళ్లం. రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలు, కోడి పందాలు, ఇంటి ముందు ఎండలో ఆరబెట్టిన ధాన్యం.. వాటిలో నడుస్తోంటే 'అరెరె... ధాన్యమంతా పాడు చేస్తున్నారు. పక్కకి వెళ్లి ఆడుకోవచ్చుగా' అంటూ అరుపులతో సందడే సందడి. సాయంత్రం కరెంటు పోతే ఆరుబయట మేమేమో పాటలు పాడుతూ డ్యాన్స్ వేసేవాళ్లం. అది చూసి అమ్మలకేమో ముగ్గుపోతుందన్న కంగారు. తీరా అరిస్తే... 'మాకన్నా మీకు ముగ్గులంటేనే ప్రేమ కదూ' అంటూ అడిగేసేవాళ్లం. పెద్దవాళ్ల కథలు చెబుతోంటే ఊకొడుతూ నిద్రపోయేవాళ్లం. ఉదయాన్నే లేచాక మా పిల్ల బ్యాచ్‌కి ఒకటే పని! ఊరంతా తిరిగి ఎవరి ముగ్గు బాగుందో చూడటం. మా అమ్మావాళ్లు వేసిన వాటికే ఎక్కువ మార్కులిచ్చేవాళ్లం. 'వీళ్లవి బాలేదు, వాళ్లవి బాలేదు... నీ ముగ్గే బాగుందమ్మా' అంటూ అమ్మకి ముద్దు పెడితే ఆమె మురిసిపోవడం నాకిప్పటికీ జ్ఞాపకమే. మా ఊళ్లో అప్పుడు చిన్న రంగుల రాట్నం ఉండేది. తాత దగ్గర అర్ధరూపాయి తీసుకుని వెళ్లి ఎక్కితే గిరగిరా తిప్పేవాళ్లు. స్నేహితులకీ డబ్బులు కట్టి తీసుకెళ్లేవాళ్లం. ఆ ఆత్మీయతలే వేరు. ఇప్పుడు వాటన్నింటికీ దూరం. చదువు, ఉద్యోగాలు, పెళ్లిళ్లు, బాధ్యతలతో అందరం ఎక్కడెక్కడో స్థిరపడ్డాం. అయితేనేం, ఆ జ్ఞాపకాలు మాత్రం ఎప్పటికీ నాతోనే ఉంటాయి. కాకపోతే పొలాలు, వీధుల్లో ఆడుకున్న రోజులు పోయి, ఈ తరం మొబైళ్లతో, టీవీలతో కాలక్షేపాలు చేస్తూ గడపడం చూస్తేనే బాధేస్తుంది. నిజానికి సంక్రాంతి పండుగ కాదు అనుభూతి. కాలం ఎంత దూరం తీసుకెళ్లినా మనసు మాత్రం ఊళ్లోని ఆ జ్ఞాపకాలతోనే పండుగ చేసుకుంటూ ఉంటుంది. – కె. సింధు, జంగారెడ్డిగూడెం



మీకూ ఇలాంటి జ్ఞాపకాలున్నాయా... అయితే, మాతో పంచుకోండి.

చిన్న గ్యాడ్జెట్లు... పెద్ద సాయం!

ఇంటిపని అంటే అలసట అన్న భావనకు చెక్ పెట్టేలా చేస్తున్నాయి గ్యాడ్జెట్లు. అలాంటి వంటింటి నేస్తాల్లో ఇవి కొన్ని...



చెక్కు తీయడానికి...

కొన్ని రకాల పీలర్లు గ్రిప్ దొరకవు. అసలే హడావుడిగా పని మొదలుపెడతామా... ఆ కంగారులో చేతులు కోసుకుంటుంటాం. అలాకాకూడదంటే ఈ 'ఫింగర్ వెజిటబుల్ పీలర్'ను తెచ్చేసుకోవాల్సిందే. రింగ్ తొడిగినట్లుగా దీన్ని అమర్చుకుంటే సరి. స్క్రబర్‌లా చేతికి గ్రిప్ దొరుకుతుంది. చెక్కు తీయడం సులువవుతుంది. దెబ్బలూ తగలవు. స్టెయిన్‌లెస్ స్టీల్ బ్లేడ్‌తో తయారుచేశారు కాబట్టి, శుభ్రం చేయడమూ సులభమే.

పిండి పట్టడానికి...



గోధుమ, రాగులు, తృణధాన్యాలతో దోశలు, చిరుతిళ్లు... వంటివి తయారుచేసుకుని తినేవారి సంఖ్య పెరిగింది. మరి వీటికి అవసరమైన పిండిని బయట కొని తెస్తే వాటిలో కల్తీ ఉంటుందేమో అన్న సందేహం వెంటాడుతుంది. అలా అని చేసుకుందామంటే సమయం ఉండదు. అందుకే ఇప్పుడు 'మినీ మిల్లు'లు వచ్చాయి. మనకు ఎప్పుడు కావాలంటే అప్పుడు... కావాల్సిన పరిమాణంలో పిండి తయారుచేసుకుని కావాల్సిన వంటలు చేసుకోవచ్చు. కప్పులా కనిపించే భాగంలో ధాన్యాల్ని వేసి... బటన్ నొక్కితే సరి.

అమెరికా సైన్యానికి నెయ్యి విక్రయించా!

అందరిలానే సాధారణ గృహిణి రాజకుమారి కూడా. కానీ ఓ ఆలోచన తనను వ్యాపారవేత్తను చేసింది. 200 మంది మహిళలకి ఉపాధిగానూ మారింది. ఆ ప్రయాణం ఎలా మొదలైందో ఆమె మాటల్లోనే...



మాది ఫరియాబాద్‌లోని, సోనిపత్. వ్యవసాయం, పశుపోషణ జీవనాధారం. కానీ ఏడేళ్ల క్రితం వచ్చిన ఓ ఆలోచన మా జీవితాన్ని మార్చింది. పంటలు పండించడం, పాలు, పెరుగు అందించడమే కాకుండా పాల సంబంధిత ఉత్పత్తుల్నీ తయారుచేసి అమ్మితే బాగుంటుంది అనిపించింది. అప్పుడే నెయ్యి తయారుచేసి విక్రయించాలనుకున్నా. కొన్ని ఆవుల్ని కొనుగోలు చేశా. కానీ వాటి పోషణ భారమైంది. దాంతో స్థానిక మహిళల్ని ఆశ్రయించి వాళ్లకు ఉచితంగా ఆవుల్ని ఇచ్చా. వాళ్ల దగ్గర నుంచి పాలు కొన్నా. నెయ్యి తయారీ మొదలుపెట్టా. అనతి కాలంలోనే మేము తయారుచేసిన నెయ్యికి మంచి పేరు వచ్చింది. దాంతో ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతూ వచ్చా. నాణ్యతే పెట్టుబడిగా వ్యాపారం అభివృద్ధి చెందింది. మంచి లాభాలనూ ఆర్జించాం. ప్రస్తుతం 200 మంది మహిళలకి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్నా. దేశవ్యాప్తంగా ఎక్కడ ఎగ్జిబిషన్లు జరిగినా... అక్కడ మా స్టాల్‌ను తెరచి విక్రయాలు కొనసాగిస్తున్నాం. ఇటీవల అమెరికా సైన్యానికి 300 కేజీల నెయ్యిని తయారుచేసి ఇచ్చా. వీటితోపాటు పచ్చళ్లు, హెల్త్ మిక్స్‌లు, రాగి లడ్డూలు వంటివీ విక్రయిస్తున్నాం. ఈ వ్యాపారం చేస్తూనే పిల్లల్ని బాగా చదివించగలిగా. ఒక అమ్మాయికి పెళ్లి చేసి పంపా కూడా. ఇప్పుడు నాకు యాభై నాలుగేళ్లు... ఈ వయసులో ఆంత్రప్రెన్యూర్‌గా మారి ఇంతటి ఎదుగుదలను సాధించడం సంతోషంగా అనిపిస్తుంది. చాలాసార్లు ఏదైనా చేయాలన్న ఆలోచన రాగానే ఇప్పుడా, ఈ వయసులోనా అంటూ మనకు మనమే అడ్డంకులు పెట్టుకుంటాం. కలలకు, లక్ష్య సాధనకు వయసు ఎప్పుడూ అడ్డంకి కాదు. మా సంస్థలో పనిచేస్తున్న, చేయాలనుకునే మహిళలకు ఇదే విషయం చెబుతుంటా. ఈ వ్యాపారాన్ని ఇంకా విస్తరించాలన్నదే నా లక్ష్యం.

అధిక బరువుని తగ్గించే యాలకులు...




సుగంధ ద్రవ్యాల రాణిగా పిలిచే యాలకులు... వంటకాలకు సువాసనను, రుచిని ఇవ్వడమే కాదు. పోషకాలనూ అందిస్తాయి. ముఖ్యంగా మహిళలకు ఎంతో మేలు చేస్తాయి.

- యాలకుల్లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాల వల్ల నెలసరి నొప్పులు, పీఎంఎస్ లక్షణాలు తగ్గుతాయి. హార్మోన్ల సమతుల్యతను కాపాడతాయివి. గర్భధారణ సమయంలో మార్నింగ్ సిక్‌నెస్‌నీ తగ్గిస్తాయి.
- అన్నం తిన్నాక రెండు యాలకుల్ని నోట్లో వేసుకోండి. తీసుకున్న ఆహారం పూర్తిగా జీర్ణమవుతుంది. యాలకుల్లో జీర్ణశక్తిని మెరుగుపరిచే గుణాలు మెండుగా ఉన్నాయి. ఇందులోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు ప్రమాదకర వ్యాధుల బారిన పడకుండా కాపాడతాయి. ముఖ్యంగా ఊపిరితిత్తులకు ఆక్సిజన్ సరఫరాను మెరుగుపరిచి, శ్వాసకోస సంబంధిత సమస్యలను దూరం చేస్తాయి.
- యాలకుల్లో ఉండే ఔషధగుణాలు బ్యాక్టీరియాతో పోరాడతాయి. వీటిని తీసుకుంటే నోటి దుర్వాసనను దూరం చేసుకోవచ్చు. ఇవి చిగుళ్లను ఆరోగ్యంగా ఉంచుతాయి.
- ఊబకాయం ఉన్న ప్రి డయాబెటిక్ మహిళలపై చేసిన పలు అధ్యయనాలు యాలకులు తీసుకోవడం వల్ల మెటబాలిజం పెరుగుతుందని చెబుతున్నాయి. రక్తపోటు, కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటాయి.
- పాలిసిస్టిక్ ఓవరీ సిండ్రోమ్ ఉన్న మహిళల్లో హార్మోన్లు, బరువు నియంత్రణకు సహాయపడతాయివి. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు మానసిక ఒత్తిడి నుంచి ఉపశమనం కలిగిస్తాయి.

రంగవల్లిక

23 చుక్కలు
5 వరుసలు
5 వచ్చేవరకూ






కావ్యశ్రీ
హైదరాబాద్



కీర్తి ముంజంపల్లి
హైదరాబాద్

15 చుక్కలు
1 వచ్చేవరకూ





సిహెచ్ అహల్య
మాచవరం

18 చుక్కలు
6 వరుసలు
6 వచ్చేవరకూ

మీ ముగ్గులు
9154091911
నంబరుకు వాట్సాప్ చేయొచ్చు.

మా చిరునామా:
వసుంధర, ఈనాడు
ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
అనాజ్‌పూర్,
అబ్దుల్లాపూర్‌మెట్
మండలం,
రంగారెడ్డి జిల్లా,
తెలంగాణ - 501 512.
Email:vasundhara@eenadu.in

బంగారం - వెండి



6న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,41,410	1,27,650	2,53,697
విజయవాడ	1,37,130	1,27,250	2,52,400
ప్రొద్దుటూరు	1,41,600	1,30,270	2,52,000
రాజమహేంద్రవరం	1,38,820	1,27,250	2,71,000
విశాఖపట్నం	1,35,820	1,27,250	2,52,000
తమిళనాడు	-----	1,28,830	2,71,000



కారకాస్‌లో అమెరికా వ్యతిరేకుల ఆందోళన

వెనెజువెలాలో మళ్లీ కాల్పులు

కారకాస్: వెనెజువెలా రాజధాని కారకాస్‌లోని మిరా ఫ్లోర్స్ అధ్యక్ష భవనం సమీపంలో కాల్పుల శబ్దాలు వినిపించడం ఆందోళనకు దారితీసింది. కారకాస్ సెంట్రల్‌లో ఉన్న మిరా ఫ్లోర్స్ ప్యాలెస్ పరిసరాల్లో స్థానిక కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం ఒక్కసారిగా కాల్పుల శబ్దాలు వినిపించాయి. అదే సమయంలో అధ్యక్ష భవనం మీదుగా గుర్తు తెలియని డ్రోన్లు ఎగురుతున్నట్లు భద్రతా బలగాలు గుర్తించాయి. డ్రోన్లను ముప్పుగా భావించిన సైన్యం, భద్రతా దళాలు వెంటనే అప్రమత్తమై కాల్పులు జరిపినట్లు సమాచారం. పరిస్థితి పూర్తిగా అదుపులోనే ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం అధికారిక ప్రకటన విడుదల చేసింది.

రష్యా-ఉక్రెయిన్ చర్చల్లో ముందడుగు

పారిస్: అమెరికా నేతృత్వంలో కాల్పుల విరమణ పర్యవేక్షణ యంత్రాంగం ఏర్పాటుకు ఉక్రెయిన్ భాగస్వాముల మధ్య అంగీకారం కుదిరినట్లు ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్ తెలిపారు. రష్యా, ఉక్రెయిన్ యుద్ధం ముగింపులో ఇది కీలక ముందడుగని ఆయన పేర్కొన్నారు. 'సెక్యూరిటీ స్టేట్‌మెంట్‌కు మంగళవారం ఉక్రెయిన్ భాగస్వాములు ఆమోదం తెలిపారు. ఇందులో అమెరికా కూడా ఉంది. శాంతి ప్రక్రియలో ఇది కీలక ముందడుగు' అని మెక్రాన్ వివరించారు. దాదాపు రెండు డజన్ల దేశాల నేతలు పారిస్‌లో జరిగిన సదస్సులో పాల్గొన్నారని తెలిపారు.

వెలగపండు చాయ్... భలే బేరమండోయ్!



వెలగపండు ముక్కలతో రంజన్

బిహార్‌కు చెందిన ఓ యువకుడు ... 'తేనీటి యందు వుడ్-యాపిల్(వెలగపండు) టీ రుచి వేరయా' అంటూ సరికొత్త ఆలోచనతో వ్యాపారంలో దూసుకుపోతున్నారు. బుద్ధగయలోని మహాబోధి ఆలయ ప్రధాన ద్వారం వద్దకు వెళ్లే మార్గంలో రంజన్ కుమార్ (30) వెలగపండు (బేల్) టీని విక్రయిస్తున్నారు. ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తున్న సమయంలో థాయ్‌లాండ్ వెళ్లిన రంజన్ అక్కడ బేల్ టీ రుచి చూసి ముగ్ధుడయ్యారు. భారత్‌కు తిరిగొచ్చిన తర్వాత బేల్ టీ స్టాల్‌ను ప్రారంభించి మంచి ఆదాయం గడిస్తున్నారు. 'బేల్ టీ రుచికరం. ఆరోగ్యకరం. పాదాల నొప్పులు, అలసట వంటి సమస్యల నుంచి ఉపశమనం కల్పిస్తుంది' అని రంజన్ తెలిపారు.

ఏడేళ్లుగా ఒంటికాలిపైనే!


- అన్న పానీయాలు, నిద్రా ఆ భంగిమలోనే

ప్రయాగ్‌రాజ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ మాఘమేళాలో ఓ 26 ఏళ్ల సాధువు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు. అతను ఏడేళ్లుగా ఒంటికాలిపైనే తన జీవనాన్ని కొనసాగిస్తున్నారు. బిహార్‌లోని సీతామఢీ ప్రాంతానికి చెందిన శంకర్‌పురి గత ఏడేళ్లలో ఒక్కసారి కూడా శయనించడం, కూర్చోవడం వంటివి చేయలేదని చెబుతున్నారు. 'నేను నైమిశారణ్య ప్రాంతంలో జన్మించాను. అక్కడ దాదాపు 88వేల మంది సాధువులుంటారు. 6 ఏళ్ల వయసులోనే సన్యాసం స్వీకరించాను. ఈ ప్రాంతంలోనే నాకు ఓ ఆలోచన వచ్చింది. ఇకపై ఎప్పుడూ నిల్చొనే ఉండాలనుకున్నాను. అన్నం తినడం, మంచి నీళ్లు తాగడంతో పాటు అన్ని పనులనూ నిల్చునే చేస్తాను. చెక్కతో చేసిన ఊయలలాంటి ఆకృతిపై శిరస్సును ఆనించి నిలుచునే నిద్రపోతాను' అని శంకర్‌పురి వివరించారు.



ప్రతిష్ఠకు చిహ్నంగా మారిన కారు

- వాయునాణ్యత క్షీణతకు కారణాలు తెలుసుకోలేరా?
- సీఏక్యూఎం వైఫల్యం.. రైతుల్ని నిందించడం సరికాదు: సుప్రీంకోర్టు



దిల్లీ: వాయు నాణ్యత నిర్వహణ కమిషన్ (సీఏక్యూఎం) తన బాధ్యతల నిర్వహణలో విఫలమైందని సుప్రీంకోర్టు మంగళవారం పెదవి విరిచింది. రెండు వారాల్లో నిపుణుల సమావేశం నిర్వహించి కాలుష్య పరిస్థితి మరింతగా దిగజారిపోతుండటానికి కారణాలపై నివేదిక సమర్పించాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం ఆదేశించింది. వాహన రద్దీని తగ్గించడానికి దిల్లీ సరిహద్దుల్లోని టోల్ ప్లాజాలను మూసివేయడమో, మరో ప్రాంతానికి తరలించడమో చేయాలంటూ దాఖలైన వ్యాజ్యంపై విచారణను రెండునెలలు వాయిదా వేయాల్సిందిగా సీఏక్యూఎం అభ్యర్థించడాన్ని కోర్టు తప్పు పట్టింది. ఒకటికి మించి కార్లు కలిగి ఉండే ప్రవృత్తిని నిరోధించడం ద్వారా వాయు కాలుష్యాన్ని నివారించవచ్చని న్యాయవాది రాకేశ్ ద్వివేది చేసిన సూచనపై స్పందించింది. "ప్రతిష్ఠకు చిహ్నంగా కారు మారిపోయింది. ప్రజలు తమ పొదుపు మొత్తాన్ని కారు కొనుగోలుకు వాడుతున్నారు.. సైకిళ్ల వాడకం కనుమరుగైంది" అని జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. ధనికులు అతి ఖరీదైన కార్లకు బదులు విద్యుత్ కార్లు వినియోగించాలన్నారు. కమిషన్ ఈనెల 2న సమావేశం నిర్వహించి రెండు నెలల అనంతరం కోర్టు సమక్షానికి వస్తామని చెప్పడం సమ్మతం కాదని స్పష్టం చేశారు.

సామాన్యులు ఎలా ప్రయాణిస్తారు?

పంటవ్యర్థాల దహనం, బస్సులు, ట్రక్కులు తదితర కారణాల వల్ల దిల్లీలో కాలుష్య సమస్య తీవ్రమవుతోందని అధికారులు పేర్కొనడంపై ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. కాలుష్యానికి బస్సులు, ట్రక్కులే కారణమని చెప్పడం చాలా సులభమమని, వాటిని నిలిపివేస్తే సామాన్య పౌరులు ఎలా ప్రయాణిస్తారని ప్రశ్నించింది. కాలుష్యం ప్రస్తావన వచ్చినప్పుడల్లా రైతులను నిందించడం సరికాదని వ్యాఖ్యానించింది. శాస్త్రీయ ఆధారాలు సమర్పించాలని సీఏక్యూఎంను ఆదేశించింది. సంక్లిష్ట కారణమేదైనా ఉంటే దానిని గుర్తించాలని, సమర్థమైన పరిష్కారాలు అన్వేషించాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేసింది.




వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలిగా ప్రమాణం చేస్తున్న డెల్సీ రోడ్రిగ్జ్

భారమైన హృదయంతో బాధ్యతలు చేపడుతున్నా

కొత్త అధ్యక్షురాలు రోడ్రిగ్జ్ వెల్లడి

కారకాస్: భారమైన మనసుతో అధ్యక్ష బాధ్యతలు స్వీకరిస్తున్నానని వెనెజువెలా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ పేర్కొన్నారు. అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోర్స్‌ను అమెరికా అపహరించి ప్రజాస్వామ్యంపై, దేశ సార్వభౌమత్వంపై అమెరికా దాడి చేసిందని వ్యాఖ్యానించారు. వెనెజువెలాపై అమెరికా దాడులు చేసి అధ్యక్షుడు నికోలస్ మదురోను అరెస్టు చేసి న్యూయార్క్‌కు తరలించిన నేపథ్యంలో ఉపాధ్యక్షురాలైన డెల్సీ రోడ్రిగ్జ్ సోమవారం తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించారు. జాతీయ అసెంబ్లీలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఆమె సోదరుడు, అసెంబ్లీ అధ్యక్షుడు జార్జ్ రోడ్రిగ్జ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైనా, రష్యా, ఇరాన్ దేశాల రాయబారులు హాజరయ్యారు.

కేంద్ర మాజీ మంత్రి కల్మాడీ కన్నుమూత



పుణె: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, కేంద్ర మాజీ మంత్రి సురేశ్ కల్మాడీ (81) మంగళవారం తెల్లవారుజామున పుణెలో మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతూ తెల్లవారుజామున 3.30 గంటలకు తుదిశ్వాస విడిచారు. 1944లో మద్రాసులో జన్మించిన కల్మాడీ భారత క్రీడా రంగ పరిపాలనలో అత్యంత ప్రాముఖ్యమున్న వ్యక్తిగా ఖ్యాతి గడించారు. కొన్ని క్రీడా రంగ కుంభకోణాల్లో అపఖ్యాతి కూడా మూటగట్టుకున్నారు. రైల్వే శాఖ సహాయ మంత్రిగానే కాక భారత ఒలింపిక్ సంఘం అధ్యక్షునిగా కూడా పనిచేశారు. భారత వాయుసేన పైలట్‌గా 1971 నాటి భారత్-పాక్ యుద్ధంలో పాల్గొన్నారు. తొలిసారిగా 1982లో పార్లమెంటులో ప్రవేశించారు. నాలుగు పర్యాయాలు రాజ్యసభ సభ్యునిగా, మూడుసార్లు పుణె నుంచి లోక్‌సభ సభ్యునిగా ఎన్నికయ్యారు. పుణెను ఐటీ కేంద్రంగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన మృతి పట్ల ఎన్సీపీ (ఎస్పీ) నాయకుడు శరద్ పవార్, మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తదితరులు సంతాపం వ్యక్తంచేశారు.

బంగ్లాలో కిరాణా వ్యాపారి హత్య

- 24 గంటల్లోనే మరో హిందువుపై దారుణం

ఢాకా: బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. శరత్ చక్రవర్తి మణి అనే ఓ కిరాణా వ్యాపారిపై గుర్తుతెలియని వ్యక్తులు పదునైన ఆయుధాలతో దాడి చేశారు. దీంతో ఆయన చనిపోయారు. రాణాప్రతాప్ బైరాగి అనే జర్నలిస్టు హత్య జరిగిన కొన్ని గంటల్లోనే ఈ ఘటన జరగడం గమనార్హం. నర్సింగ్డి జిల్లాలో అత్యంత రద్దీగా ఉండే చార్ సిందూర్ బజార్‌లో ఈ హత్య జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, శరత్ చక్రవర్తి మణి స్థానిక మార్కెట్‌లో ఓ కిరాణా దుకాణాన్ని నడుపుతున్నాడు. సోమవారం రాత్రి దుకాణంలో ఉండగా కొందరు దుండగులు షాపులోకి చొరబడి పదునైన ఆయుధాలతో అతనిపై దాడి చేశారు. ఈ ఘటనలో మణి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే స్పందించి ఆస్పత్రికి తరలించారు. అయితే, అప్పటికే అతడు ప్రాణాలు కోల్పోయాడు. మణి చక్రవర్తి చాలా మంచి వ్యాపారి అని, అతనికి ఎవరితోనూ విభేదాలు లేవని తోటి వ్యాపారులు తెలిపారు. గడిచిన 18 రోజుల్లోనే హిందువుల మరణాల సంఖ్య ఆరుకు చేరింది.

రాజకీయ ప్రతీకారం కారణంగానే హాదీ చనిపోయాడు: బంగ్లా పోలీసులు

ఉస్మాన్ హాదీ రాజకీయ ప్రతీకారం కారణంగానే చనిపోయాడని బంగ్లా పోలీసులు వెల్లడించారు. అవామీ లీగ్, ఛత్ర లీగ్‌లు గతంలో చేపట్టిన కార్యక్రమాలను సామాజిక మాధ్యమాలు, బహిరంగ ప్రదర్శనల ద్వారా హాదీ తీవ్రంగా విమర్శించడం ఆయా నేతల్లో ఆగ్రహానికి దారితీసిందని వివరించారు. ఈ కేసుతో సంబంధమున్న 17 మందిపై ఛార్జిషీటు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. వీరిలో 12 మందిని అరెస్టు చేశామన్నారు. అవామీ లీగ్ పార్టీని బంగ్లాదేశ్‌లో నిషేధించిన విషయం తెలిసిందే!

'భారతీయుల వర్క్ పర్మిట్లను రద్దుచేయాలి'

విద్యార్థి నాయకుడు, ఇంక్విలాబ్ మోంచా నేత షరీఫ్ ఉస్మాన్ హాదీ హత్య నేపథ్యంలో న్యాయం చేయాలని ఆ పార్టీ నేతలు మంగళవారం ఢాకాలో రోజంతా నిరసనలు చేపట్టారు. బంగ్లాలో ఉన్న భారతీయుల వర్క్ పర్మిట్లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు. హాదీ హత్య కేసు విచారణలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని, ఈ కేసులో హంతకుడు, నిందితులను వచ్చేనెల 12లోపు ట్రయల్ కోర్టు ముందు ప్రవేశపెట్టాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.



నిజమైన ఆనందాన్ని అనుభూతి చెందాలంటే..

నిజమైన ఆనందం అనేది సవాళ్లను ఎదుర్కోవడం, మన సామర్థ్యాలపై విశ్వాసాన్ని పెంచుకోవడం, కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం, వాటి ద్వారా వచ్చే శక్తిని అనుభవించడంలో ఉంటుంది. ఎప్పటికప్పుడు మిమ్మల్ని మెరుగుపర్చుకోవడంపై దృష్టి పెడితేనే దాన్ని అనుభూతి చెందగలరు.

– రాబర్ట్ గ్రీన్, రచయిత

ఇరాన్‌లో ప్రదర్శనలు ముమ్మరం.. 35కు చేరిన మృతుల సంఖ్య

నిర్బంధంలో 1,200 మంది

దుబాయ్: ఇరాన్‌లో ఆర్థిక వ్యవస్థ పతనమై జనజీవనం మరింతగా దిగజారుతుండటంతో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం నిరసనకారులు టెహ్రాన్‌లోని గ్రాండ్ బజార్‌లో ధర్నా నిర్వహించారు. నిరసనలు ఇప్పట్లో సమసిపోయే సూచనలు లేవు. ప్రదర్శనకారుల్ని చెదరగొట్టేందుకు భద్రతా దళాలు బాష్పవాయువు ప్రయోగించాయి. ప్రదర్శనల్లో ఇప్పటివరకూ 35 మంది ప్రాణాలు కోల్పోయారని అమెరికాకు చెందిన మానవహక్కుల సంస్థ తెలిపింది. దాదాపు 1,200 మంది నిరసనకారుల్ని ఇరాన్ ప్రభుత్వం నిర్బంధించిందని వెల్లడించింది. ఇరాన్‌లో 31 రాష్ట్రాలుండగా అందులో 27 చోట్ల ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఇందులో 250 మంది పోలీసు అధికారులు, 45 మంది ఇతర బలగాల సిబ్బంది గాయపడినట్లు సమాచారం. నిరసనల్లో పాల్గొంటూ పోలీసులకు చిక్కిన 22 ఏళ్ల మహసా అమీనీ అనే యువకుడు నిర్బంధంలో మరణించడంపై దేశవ్యాప్తంగా ఆగ్రహం వ్యక్తమవుతోంది. శాంతియుతంగా ప్రదర్శనల్లో పాల్గొంటున్న నిరసనకారుల్ని ఇరాన్ హింసాత్మకంగా చంపితే తాము ఆ ప్రదర్శనకారులకు మద్దతుగా నిలుస్తామని అమెరికా అధ్యక్షుడు ఇటీవల హెచ్చరించారు.

ఆసుపత్రిలో చేరిన సోనియాగాంధీ

దిల్లీ: కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ అనారోగ్యంతో దిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రిలో చేరారు. ఆమెకు దీర్ఘకాలంగా దగ్గు సమస్య ఉందని, నగర కాలుష్యం కారణంగా అది ఇంకా ఎక్కువైందని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. సాధారణ ఆరోగ్య పరీక్షల్లో భాగంగానే ఆమె సోమవారం సాయంత్రం ఆసుపత్రిలో చేరారని తెలిపాయి. శ్వాసనాళాల ఉబ్బసం స్వల్పంగా పెరిగినందున చికిత్స అందిస్తున్నామని, ఆమెను డిశ్చార్జ్ చేయడానికి ఒకటి రెండు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని వివరించాయి.

ఈసీ తప్పుడు విధానాలను అవలంబిస్తోంది: మమత

గంగాసాగర్: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ(సర్) కోసం భారతీయ జనతా పార్టీ(భాజపా) ఐటీ విభాగం అభివృద్ధి చేసిన మొబైల్ అప్లికేషన్లను ఎన్నికల సంఘం(ఈసీ) అక్రమంగా వినియోగిస్తోందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీ ఆరోపించారు. దక్షిణ 24 పరగణాలు జిల్లాలోని గంగాసాగర్‌లో రెండురోజుల పర్యటనలో ఉన్న ఆమె ఈ మేరకు వ్యాఖ్యానించారు. ఈసీ తప్పుడు విధానాలను అవలంబిస్తోందని, అర్హత కలిగిన ఓటర్లను జాబితా నుంచి తొలగిస్తోందని మమత వ్యాఖ్యానించారు. రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న ఈ ఆరోపణలు నిరాధారమైనవిగా భాజపా ఖండించింది. మరోవైపు ఈసీకి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) పిటిషన్ దాఖలు చేసింది. సర్ ప్రక్రియను చట్ట విరుద్ధ, ఏకపక్ష విధానాలతో ఈసీ చేపడుతోందని పిటిషన్‌లో పేర్కొంది.



అమర్త్యసేన్‌కు 'సర్' నోటీసులపై అభిషేక్ ఆరోపణ..

సర్ విచారణకు హాజరుకావాలని నోబెల్ గ్రహీత అమర్త్యసేన్‌కు ఈసీ నోటీసులు ఇచ్చిందని టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ ఆరోపించారు. దేశం గర్వించదగ్గ ఆయనను విచారణకు ఎలా పిలుస్తారని, ఇది వేధింపుల కిందికే వస్తుందని అభిషేక్ మండిపడ్డారు. టీమ్ఇండియా పేసర్ మహమ్మద్ షమి, టీఎంసీ ఎంపీ, నటుడు దేవ్‌కు నోటీసులివ్వడాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ వ్యాఖ్యలపై ఈసీ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

అశ్లీల కంటెంట్ తొలగింపు చర్యలపై ఎక్స్‌కు గడువు నేటి వరకూ పొడిగింపు

దిల్లీ: కృత్రిమ మేధ ఆధారంగా పనిచేసే "గ్రోక్" వంటి సాధనాల సాయంతో రూపొందించిన అసభ్యకరమైన, అశ్లీల లైంగిక పోస్టులు, వీడియోలను తొలగించాలని కోరుతూ ఇటీవల కేంద్రం సోషల్ మీడియా వేదికలకు ఆదేశాలు జారీ చేసిన విషయం విదితమే. ఈ ఆదేశాలపై ఏం చర్యలు తీసుకున్నారో సవివరంగా తెలిపే నివేదిక(ఏటీఆర్) సమర్పించేందుకు సోషల్ మీడియా వేదిక "ఎక్స్"కు ఇచ్చిన గడువును కేంద్ర ప్రభుత్వం బుధవారం నాటి వరకూ పొడిగించింది. మరికాస్త సమయం ఇవ్వాలని కోరుతూ ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్‌కు చెందిన ఎక్స్ వేదిక చేసిన అభ్యర్థన మేరకు ప్రభుత్వం ఈ గడువు పొడిగించిందని అధికార వర్గాలు తెలిపాయి. సోషల్ మీడియా ద్వారా ప్రసారమైన, పోస్టుచేసిన చట్ట వ్యతిరేక విషయాలపై తన భద్రతా హ్యాండిల్ అయిన "సేఫ్టీ" సాయంతో చర్యలు చేపడతామని ఎక్స్ ఇటీవల ప్రకటించింది. బాలలపై లైంగిక అకృత్యాలను చూపే చిత్రాలు, వీడియోలు తదితరాలను తొలగించడంతో పాటు వాటికి ప్రచారం కల్పించిన అకౌంట్లను శాశ్వతంగా రద్దుచేస్తామని ఎక్స్ సంస్థ ప్రకటించింది కూడా. చట్ట వ్యతిరేకమైన చిత్రాలు, వీడియోలు, పోస్టులు సృష్టించేందుకు కృత్రిమ మేధ సాధనం "గ్రోక్" సాయం పొందే వారిని చట్టవిరుద్ధ అంశాలను అప్‌లోడ్ చేసినవారితో సమానంగా పరిగణిస్తామని ఆ సంస్థ స్పష్టంచేసింది.

'మదురో ఆపరేషన్'లో 24 మంది వెనెజువెలా భద్రతాధికారుల మృతి

వాషింగ్టన్: మదురోను బంధించి తీసుకొచ్చేందుకు అమెరికా చేపట్టిన ఆపరేషన్ సందర్భంగా 24 మంది వెనెజువెలా భద్రతాధికారులు మృతి చెందారు. దీంతో మొత్తం మృతి చెందిన భద్రతాధికారుల సంఖ్య 56కు చేరుకుంది. ఈ ఆపరేషన్ సందర్భంగా తమ దేశానికి చెందిన 32 మంది భద్రతాధికారులు మృతి చెందారని సోమవారం క్యూబా ప్రకటించింది. మంగళవారం తమ భద్రతాధికారులు 24 మంది మృతి చెందారని వెనెజువెలా వెల్లడించింది. పలువురు పౌరులూ మృతి చెందారని తెలుస్తోంది. మరోవైపు డజన్లకొద్దీ భద్రతా సిబ్బంది, పౌరులు మరణించారని వెనెజువెలా అటార్నీ జనరల్ తారెక్ విలియం మంగళవారం తెలిపారు. యుద్ధ నేరం కింద కేసులు నమోదు చేసి విచారిస్తామని ఆయన ప్రకటించారు.

గ్రీన్‌లాండ్ ఆ దేశ ప్రజలదే

- ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన ఐరోపా నేతలు
- అదే జరిగితే నాటో అంతం
- డెన్మార్క్ ప్రధాని వ్యాఖ్య
- అమెరికాలో భాగం కావాల్సిందేనన్న శ్వేతసౌధం

బెర్లిన్: గ్రీన్‌లాండ్ ఆ దేశ ప్రజలదేనని ఐరోపా కూటమి నేతలు స్పష్టం చేశారు. అమెరికా ఆ దేశాన్ని స్వాధీనం చేసుకుంటుందన్న ట్రంప్ వ్యాఖ్యలను తోసిపుచ్చారు. వ్యూహాత్మక, ఖనిజాలతో నిండి ఉన్న ఈ ఆర్కిటిక్ ద్వీపంపై హక్కు అక్కడి ప్రజలకే ఉంటుందని పేర్కొన్నారు. ఐరోపా కూటమి దేశాలైన ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, పోలండ్, స్పెయిన్‌తోపాటు ఈయూలో లేని బ్రిటన్ దేశాధినేతలు.. డెన్మార్క్ ప్రధాని ఫ్రెడ్రిక్సన్‌తో గొంతు కలిపారు. సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రీన్‌లాండ్ సార్వభౌమత్వాన్ని కాపాడతామన్న డెన్మార్క్‌కు మద్దతు పలికారు. డెన్మార్క్ ఆధ్వర్యంలో స్వతంత్ర దేశంగా ఉన్న గ్రీన్‌లాండ్ అంశాన్ని ఆ రెండు దేశాలే నిర్ణయించుకుంటాయని స్పష్టం చేశారు.

నాటో అంతమవుతుందన్నా..


గ్రీన్‌లాండ్‌ను అమెరికా ఆక్రమిస్తే నాటో అంతమవుతుందని డెన్మార్క్ ప్రధాని హెచ్చరించినా అమెరికా వెనక్కి తగ్గలేదు. గ్రీన్‌లాండ్ అమెరికాలో భాగంగా మారాల్సిందేనని శ్వేతసౌధం ప్రతినిధి స్టీఫెన్ మిల్లర్ స్పష్టం చేశారు. అధ్యక్షుడు ట్రంప్ గత కొన్ని నెలలుగా ఇదే విషయం చెబుతున్నారని సోమవారం పేర్కొన్నారు. ఆర్కిటిక్ ప్రాంతంలో రష్యా, చైనాల నుంచి ముప్పు ఉందని, నాటో ప్రాంతంలో భద్రత కోసం గ్రీన్‌లాండ్‌పై అమెరికాకు నియంత్రణ ఉండాలని ట్రంప్ అంటున్నారు.

మిజోరంలో కొత్తరకం రెల్లుజాతి పాము

ఆయిజోల్: రష్యా, జర్మనీ, వియత్నాం దేశాలకు చెందిన పరిశోధకులతో కలిసి మిజోరం శాస్త్రవేత్తలు రాష్ట్రంలో ఓ కొత్తరకం రెల్లు జాతి పామును గుర్తించారు. భారత సరీసృప జంతుజాల వర్గీకరణలో చాలాకాలంగా ఉన్న తప్పులను సరిచేసి, కొత్త రకం జాతులను చేర్చడం కోసం చేపట్టిన పరిశోధనల్లో దీన్ని గుర్తించారు. ఈ పాము విషపూరితం కాదని తెలిపారు. దీనికి కలమారియా మిజోరమెన్సిస్ అని నామకరణం చేశారు. పామును కనుగొన్న రాష్ట్రానికి గుర్తుగా ఈ పేరు పెట్టినట్లు పరిశోధకుల బృంద నాయకుడు, మిజోరం విశ్వవిద్యాలయంలో జంతుజాల విభాగానికి చెందిన ఆచార్యుడు హెచ్.టి.లాల్రెంసంగ తెలిపారు. ఈ పరిశోధన ఫలితాలను సోమవారం జూటాక్సా అంతర్జాతీయ శాస్త్రీయ పత్రికలో ప్రచురించారు. ఈ పాముకు సంబంధించిన నమూనాలను మొదటిసారిగా 2008లోనే సేకరించినప్పటికీ, ఆగ్నేయాసియాలో విస్తృతంగా ఉన్న పాము జాతుల్లో ఒకటిగా అప్పుడు పరిగణించారు.



92 ఏళ్ల జడ్జి ముందుకు మదురో..



అల్విన్ హెల్లర్‌స్టీన్

ఇంటర్నెట్ డెస్క్: వెనెజువెలా పదవీచ్యుత అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియాలపై కేసులను విచారిస్తున్న మన్‌హటన్ ఫెడరల్ కోర్టు న్యాయమూర్తి అల్విన్ హెల్లర్‌స్టీన్ వయసు 92 ఏళ్లు. ఆయన 1933లో న్యూయార్క్‌లో జన్మించారు. కొలంబియా యూనివర్సిటీ లా స్కూల్ నుంచి గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన ఆయన.. తొలినాళ్లలో అమెరికా ఆర్మీలో లాయర్‌గా పని చేశారు. ఆ తర్వాత ప్రైవేటుగా ప్రాక్టీసు మొదలుపెట్టారు. 1998లో నాటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్.. అల్విన్‌ను న్యూయార్క్ సదరన్ డిస్ట్రిక్ట్ ఫెడరల్ కోర్టు జడ్జిగా నామినేట్ చేశారు.

తన సుదీర్ఘ కెరీర్‌లో అల్విన్ ఎన్నో సివిల్ కేసుల్లో కీలక తీర్పులిచ్చారు. 2001 సెప్టెంబరులో న్యూయార్క్, వాషింగ్టన్‌లలో జరిగిన అల్ ఖైదా ఉగ్రదాడుల కేసును ఆయనే విచారించారు. హష్ మనీ కేసు విచారణను ఫెడరల్ కోర్టుకు మార్చాలంటూ అధ్యక్షుడు ట్రంప్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చి వార్తల్లో నిలిచారు. గత ఏడాది వెనెజువెలా డ్రగ్స్ ముఠా సభ్యులను కోర్టు విచారించకుండా డిపోర్టు చేసేందుకు ట్రంప్ యంత్రాంగం చేసిన ప్రయత్నాలను అడ్డుకున్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించిన కేసును గత 15 ఏళ్లుగా విచారిస్తున్నారు. ఇదే కేసులో 2020లోనే మదురోపై అమెరికా అభియోగాలు మోపగా.. ఆ దేశ మాజీ ఇంటెలిజెన్స్ చీఫ్ హ్యూగో ఆర్మాండో ఇప్పటికే దోషిగా తేలారు.

అసాంజేను విడిపించిన లాయర్‌తో..

మదురో తరఫున అమెరికాకు చెందిన ప్రముఖ న్యాయవాది బారీ జె.పోలక్ వాదనలు వినిపించనున్నారు. వికీలీక్స్ వ్యవస్థాపకుడు జూలియన్ అసాంజే తరఫున వాదించి 2024లో ఆయనను జైలు నుంచి విడిపించడంతో పోలక్ పేరు అప్పట్లో మార్మోగింది. తన మూడు దశాబ్దాల కెరీర్‌లో పోలక్ ఎంతోమంది కార్పొరేట్ ఎగ్జిక్యూటివ్స్, రాజకీయ ప్రముఖుల తరఫున వాదించారు.

అక్టోబరు నుంచి ట్రంప్‌తో మాట్లాడలేదు: మచాడో



ఇంటర్నెట్ డెస్క్: వెనెజువెలా మాజీ అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా నిర్బంధించిన అనంతరం ఆ దేశ అధ్యక్ష బాధ్యతలను ప్రతిపక్ష నేత మచాడోకు అప్పగించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విముఖత చూపారు. ఈ పరిణామాలపై మచాడో స్పందించారు. వెనెజువెలాలో అధికారం కోసం తాను ట్రంప్‌తో ఎటువంటి చర్చలు జరపలేదని స్పష్టం చేశారు. అక్టోబరులో తనకు శాంతి బహుమతి ప్రకటించిన రోజున చివరిసారి ట్రంప్‌తో మాట్లాడానని. . తర్వాత మళ్లీ ఆయనను సంప్రదించలేదని తెలిపారు. త్వరలో తిరిగి స్వదేశానికి చేరుకోవడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మదురోను అమెరికా నిర్బంధించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు.

అంతర్జాతీయ సమాజం స్పందించాలి..: మదురో కుమారుడు



కారకాస్: మదురో కుమారుడు నికోలస్ మదురో గువేరా జాతీయ అసెంబ్లీలో భావోద్వేగంగా ప్రసంగించారు. తన తండ్రిని అమెరికా అపహరించిందని ఆరోపిస్తూ. . అంతర్జాతీయ సమాజం స్పందించాలని పిలుపునిచ్చారు. ఒక దేశాధ్యక్షుడిని ఇలా అరెస్టు చేయడాన్ని సహిస్తే.. రేపు ఏ దేశమూ సురక్షితంగా ఉండబోదని హెచ్చరించారు. తమ కుటుంబంపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని అభిప్రాయపడ్డారు.

మదురోకు మద్దతుగా ప్లకార్డులతో ప్రదర్శన

మదురో మద్దతుదారులు వెనెజువెలా రాజధాని కారకాస్‌లో వీధుల్లోకి వచ్చారు. వందల సంఖ్యలో ప్రజలు జాతీయ జెండాలతో మదురోకు మద్దతుగా ప్లకార్డులతో ప్రదర్శనలు నిర్వహించారు. అమెరికా చర్యను వ్యతిరేకిస్తూ, తమ నాయకుడిని తిరిగి దేశానికి తీసుకురావాలని డిమాండు చేశారు.

మోదీపై మళ్లీ అదే వ్యాఖ్యలు చేసిన ట్రంప్

వాషింగ్టన్: రష్యా నుంచి చమురు కొంటున్నందుకు భారత్‌పై తాము విధించిన సుంకాల కారణంగా భారత ప్రధాని నరేంద్రమోదీ తన విషయంలో అంత ఆనందంగా లేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వ్యాఖ్యానించారు. చట్టసభ సభ్యులకు మంగళవారం ఇచ్చిన విందులో ఆయన మాట్లాడారు. 'మోదీ నన్ను చూడటానికి వచ్చారు. సర్.. నేను రావచ్చా అని అడిగారు. సరేనన్నాను. నాకు ఆయనతో చాలా చక్కని సంబంధాలున్నాయి. అయినా టారిఫ్‌ల భారం వల్ల మోదీ ఆనందంగా లేరు. ఇప్పుడైతే రష్యా నుంచి చమురు కొనుగోలును వాళ్లు బాగా తగ్గించారని మీకు తెలుసు కదా. అపాచీ హెలికాప్టర్ల కోసం అయిదేళ్లుగా నిరీక్షిస్తున్నామని భారత్ చెప్పింది. మనం దానిని మారుస్తున్నాం.. మారుస్తున్నాం.. 68 అపాచీల కోసం భారత్ ఆర్డరు పెట్టింది" అని ట్రంప్ చెప్పారు.

వెస్ట్‌బ్యాంకులో ఇజ్రాయెల్ కొత్త సెటిల్‌మెంట్ నిర్మాణానికి సిద్ధం

జెరూసలెం: వెస్ట్‌బ్యాంకులో జెరూసలెంకు సమీపంలోని ప్రాంతంలో వివాదాస్పద కొత్త సెటిల్‌మెంట్ నిర్మాణానికి ఉన్న చివరి అడ్డంకిని ఇజ్రాయెల్ అధిగమించింది. ఇది వెస్ట్ బ్యాంకును రెండుగా చీల్చనుంది. ఈ1 పేరుతో నిర్మించే ఈ సెటిల్‌మెంట్ కోసం ప్రభుత్వం టెండర్లను పిలిచింది.

కాశీ ఎక్స్‌ప్రెస్ రైలుకు బాంబు బెదిరింపు

లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లోని మవూ రైల్వే స్టేషన్‌కు మంగళవారం బాంబు బెదిరింపు వచ్చింది. కాశీ ఎక్స్‌ప్రెస్(15018 డౌన్) రైలులో బాంబు పెట్టినట్లు గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ రావడంతో భద్రతా దళాలు అప్రమత్తమయ్యాయి. సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు, ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్‌పీ), రైల్వే భద్రతా బలగాలు(ఆర్‌పీఎఫ్) రైలులోని ప్రయాణికులను సురక్షిత ప్రాంతాలకు తరలించి, గాలింపు చర్యలు చేపట్టారు. తనిఖీలో ఎటువంటి పేలుడు పదార్థాలు లభ్యమవలేదని, ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఫోన్ కాల్ ఎక్కడి నుంచి వచ్చిందని గుర్తించి తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

చోరీకి వెళ్లి వంటగది కన్నంలో చిక్కుకుని...

ఇంటర్నెట్ డెస్క్: ఓ ఇంట్లో చోరీకి వెళ్లిన దొంగ తప్పించుకునే ప్రయత్నంలో ఎగ్జాస్ట్ ఫ్యాన్ కన్నంలో ఇరుక్కుపోయాడు. ఈ ఘటన రాజస్థాన్‌లోని కోటాలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈనెల 3న సుభాష్ కుమార్ రావత్ అనే వ్యక్తి ఇంట్లో చోరీకి వెళ్లిన దొంగ తప్పించుకునే ప్రయత్నంలో వంట గదిలోని ఎగ్జాస్ట్ ఫ్యాన్ కన్నంలో ఇరుక్కుపోయాడు. అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఇంటికి వచ్చిన రావత్ భార్య కన్నంలో వేలాడుతున్న దొంగను గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు దాదాపు గంటపాటు శ్రమించి దొంగను కన్నం నుంచి బయటకు తీశారు. ఆ తర్వాత అదుపులోకి తీసుకున్నారు.





కుసుమ మయూరాలు

శ్వేత, గులాబీ వర్ణాల్లో ఠీవిగా నిలబడి ఉన్న ఈ పూల నెమళ్లను చూడాలంటే యానాం వెళ్లాల్సిందే. పట్టణంలో ఏర్పాటు చేసిన ఫల, పుష్ప, కూరగాయల ప్రదర్శనలో వీటిని ఉంచారు. చెన్నైకు చెందిన ఫ్లవరిస్ట్ కార్తీక్ గులాబీలు, బంతులు, చామంతులు.. ఇతర పుష్పాలను ఉపయోగించి వివిధ రూపాల్లో చేసిన అమరికలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పుదుచ్చేరి వ్యవసాయశాఖ మంత్రి సి.జయకుమార్ మంగళవారం ఈ కార్యక్రమాలను ప్రారంభించారు.

– న్యూస్‌టుడే, యానాం

బసవన్నల సవాల్



సంక్రాంతి.. జల్లికట్టు.. ఈ రెండింటినీ తమిళుల సంస్కృతి నుంచి వేరుచేయలేం. జల్లికట్టు అంటేనే వీరత్వానికి ప్రతీకగా భావిస్తుంటారు. ఈ ఏడాది సంక్రాంతి సందర్భంగా మదురై జిల్లాలోని అలంగానల్లూర్, పాలమేడు, అవనియాపురంలో జల్లికట్టు కోలాహలంగా జరగనుంది. ఎన్నో ప్రత్యేకతలు కలిగిన ఈ పోటీలకు ఇంకో వారమే ఉన్న నేపథ్యంలో ఎద్దులకు వాటి యజమానులు ప్రత్యేక శిక్షణ ఇచ్చి సిద్ధం చేస్తున్నారు. జల్లికట్టు కోసం బసవన్నలను ఎంపిక చేయడమే అత్యంత ముఖ్యం. వాటి వయసు, శారీరక దృఢత్వం ఆధారంగా ఎంచుకుంటారు. రోజు గంటపాటు ఈతలో శిక్షణ ఇస్తారు. కొమ్ములతో మట్టిని ఢీకొట్టించడం, గుంతలలో నడిపించడం చేస్తుంటారు. ఎద్దుల కాళ్లు బలపడేలా రోడ్లపై పరుగెత్తిసుంటారు.



వ్యాధులు సోకకుండా వేడినీళ్లతో కాళ్లు కడుగుతారు. మెడ బలంగా ఉండేందుకు, స్థిరత్వాన్ని మెరుగుపరిచేందుకు ఎద్దు తలను కొంత సేపు పైకి లేపి ఉంచుతారు. సాధారణంగా ఇచ్చే ఆహారం కన్నా మొక్కజొన్న, జొన్న, సజ్జలు, మినుములు, కంది, ఖర్జూరం, నానబెట్టిన వేరుశనగలు పెడతారు. వీటన్నింటికీ తోడు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు చేయించి జాగ్రత్తలు తీసుకుంటామని అలంగానల్లూర్‌కి చెందిన లోగు అనే శిక్షకుడు తెలిపారు.

– న్యూస్‌టుడే, చెన్నై(ప్యారిస్)

శునక వేదనకు మానవ ఓదార్పు!



పిల్లను నోట కరిచి తీసుకువెళ్తున్న తల్లి కుక్క

అగ్నిజ్వాలల నుంచి విపరీతమైన వేడి వస్తుండటంతో ఓ తల్లి కుక్క తల్లడిల్లిపోయింది. తన పిల్లలు ఏమవుతాయోనన్న ఆందోళనతో ఒక్కొక్కదాన్ని నోట కరచుకుని సురక్షిత ప్రాంతానికి తరలించడానికి ఆరాటపడింది. డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలోని బ్లోఅవుట్ జరిగిన డ్రిల్లింగ్ బావి సైట్ వద్ద మంగళవారం కనిపించిన ఈ దృశ్యమిది. ఆ తల్లి శునకం వేదనను గమనించిన ఓఎన్‌జీసీ సిబ్బంది దాని వెనకాలే వెళ్లి ఓ పొద నుంచి అన్ని పిల్లలనూ బయటకు తీసుకువచ్చి సురక్షిత ప్రాంతంలో పెట్టారు.



ఓఎన్‌జీసీ సిబ్బంది సాయం..

– న్యూస్‌టుడే, మామిడికుదురు, రాజోలు

పరకామణి కేసులో.. కుమ్మక్కైన ఆ పోలీసులెవరు?

- హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో విస్తృత చర్చ

ఈనాడు– అమరావతి, ఈనాడు డిజిటల్– తిరుపతి, న్యూస్‌టుడే– తిరుపతి నేర విభాగం: వైకాపా హయాంలో తిరుమల శ్రీవారి పరకామణిలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి నిందితుడు రవికుమార్, మరికొందరితో కుమ్మక్కైన పోలీసు అధికారులెవరు, ఈ కేసు బలహీనపరచటంలో కుట్రదారులైన పోలీసు అధికారులెవరు అనేది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. 'నిందితుడు రవికుమార్, మరికొంతమందితో అప్పట్లో పనిచేసిన పలువురు పోలీసు అధికారులు కుమ్మక్కయ్యారనేది సీఐడీ నివేదికలో వెల్లడైంది. ఈ కేసును బలహీనపరచటంలో కుట్రదారులైన పోలీసు అధికారులపై క్రమశిక్షణచర్యలు తీసుకోవాలి' అంటూ హైకోర్టు మంగళవారం ఆదేశించింది. దీంతో ఆ పోలీసు అధికారులు ఎవరనే చర్చ జరుగుతోంది. లోక్ అదాలత్‌తో ఈ కేసు రాజీ మినహా ఇతర అంశాల్లో చట్టప్రకారం ముందుకెళ్లొచ్చని సీఐడీ, ఏసీబీ అధికారులకు హైకోర్టు చెప్పటంతో ఇకపై జరగబోయే దర్యాప్తులో ఆయా పోలీసు అధికారుల ప్రమేయం, పాత్రకు సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. పరకామణిలో చోరీ, ఆ కేసు రాజీ జరిగిన సమయాల్లో కీలక స్థానాల్లో ఉన్న పోలీసు అధికారుల ప్రమేయంపై తీవ్ర ఆరోపణలున్నాయి.

1. జగన్మోహన్ రెడ్డి (అప్పటి తిరుమల వన్‌టౌన్ సీఐ):



పరకామణిలో చోరీ జరిగిన సమయంలో తిరుమల వన్‌టౌన్ సీఐ (ఎస్‌హెచ్‌వో)గా బాధ్యతల్లో ఉన్నారు. నేర తీవ్రత తగ్గించేలా సెక్షన్లు పెట్టించి, ఎఫ్‌ఐఆర్‌లోనూ కనీస వివరాలు పొందుపరచకుండా కేసు నమోదు చేయించారనే ఆరోపణలున్నాయి. దర్యాప్తును ముందుకు సాగనివ్వలేదని, ఈ కేసును లోక్ అదాలత్‌లో రాజీ చేసుకునేలా చేయటంలో కీలకంగా వ్యవహరించారని, ఫిర్యాదుదారుపై ఒత్తిడి తీసుకొచ్చారని ఆరోపణలున్నాయి. ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న జగన్మోహన్‌రెడ్డిని వీటన్నింటిపైనా సీఐడీ అధికారులు ఇప్పటికే విచారించారు.

2. చంద్రశేఖర్ (అప్పటి తిరుపతి 2 టౌన్ సీఐ):




తిరుమల వన్‌టౌన్ సీఐ జగన్మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిందితుడు రవికుమార్‌ను ఆయన విచారించారు. ఆయన ఆస్తుల వివరాలు పరిశీలించారు. నిందితుడి నుంచి రికవరీ చేసిన నగదు విషయంలో జగన్మోహన్ రెడ్డి చెప్పినట్లే చంద్రశేఖర్ చేశారనే ఆరోపణలున్నాయి. ఆయనా ఇప్పుడు వీఆర్‌లోనే ఉన్నారు.

3. రామలక్ష్మీరెడ్డి (అప్పటి తిరుమల వన్ టౌన్ ఎస్ఐ):



పరకామణిలో చోరీపై కేసు నమోదు చేశారు. నిందితుడు రవికుమార్‌ను అరెస్టు చేయకుండా సీఆర్‌పీసీ 41ఏ నోటీసులిచ్చి సరిపెట్టేశారు. తర్వాత కొందరి ఒత్తిళ్లకు తలొగ్గి కేసు రాజీ చేయించారనే ఆరోపణలున్నాయి. ప్రధాన నిందితుడు, అతని కుటుంబసభ్యులతో రామలక్ష్మీ రెడ్డికి సన్నిహిత సంబంధాలున్నట్లు సీఐడీ ఇప్పటికే గుర్తించింది. ఆయన కూడా వీఆర్‌లోనే ఉన్నారు.

4. డి.నరసింహకిషోర్ (అప్పటి సీవీఎస్‌వో, ప్రస్తుత తూర్పుగోదావరి ఎస్పీ):



పరకామణిలో చోరీ, తర్వాత కేసు రాజీ అంతా నరసింహకిషోర్ సీవీఎస్‌వోగా ఉన్నప్పుడే జరిగింది. ఈ కేసులో సీఐడీ ఆయన్ను ఇటీవల విచారించింది. 'మీకు తెలియకుండానే ఏవీఎస్‌వో స్థాయి అధికారి రాజీ చేసుకోగలరా? లోక్ అదాలత్‌లో కేసు రాజీ చేసుకునేలా అప్పటి ఏవీఎస్‌వో సతీష్‌కుమార్‌పై మీరు ఒత్తిడి తీసుకొచ్చారా? ఎవరి ఆదేశాల మేరకు ఒత్తిడి తెచ్చారు? పరకామణిలో చోరీ జరిగిన రోజు విధుల్లో ఉన్నదెవరు, వారిలో ఎంతమందిని విచారించారు? విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఏం తేల్చారు, మీ దర్యాప్తులో ఏం తేలింది, నిందితుడికి ఎన్ని ఆస్తులున్నాయి, కేసు ఎలా అంత త్వరగా మూసివేయగలిగారు' అని ఆయన్ను ఆరా తీసింది.

5. పరమేశ్వరరెడ్డి (అప్పటి తిరుపతి ఎస్పీ, ప్రస్తుత సీఐడీ ఎస్పీ):



చోరీ కేసు దర్యాప్తు ముందుకు సాగకుండా చేయటంలోనూ, తర్వాత కేసు రాజీలోనూ ఆయన కీలక పాత్ర పోషించారనే ఆరోపణలున్నాయి. కొందరు ముఖ్య నాయకుల ఆదేశాలతో ఆయనే తెరవెనక చక్రం తిప్పారనే ఫిర్యాదులున్నాయి.

మరో ఉత్సవానికి సిద్ధమైన విజయవాడ

- 'ఆవకాయ్, అమరావతి' రేపు ప్రారంభం
- పున్నమిఘాట్ వేదికగా 3 రోజులపాటు ఉత్సవాలు



పున్నమిఘాట్ వద్ద ఏర్పాట్లపై వివరాలు తెలుసుకుంటున్న ఆమ్రపాలి

ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, భవానీపురం: మూడు నెలల క్రితం ప్రజలను ఉర్రూతలూగించిన విజయవాడ ఉత్సవాలు, కొద్ది రోజులుగా ప్రజలకు విజ్ఞానం అందిస్తున్న పుస్తక మహోత్సవం, ఇప్పుడు ఆవకాయ్-అమరావతి ఉత్సవాలు.. తెలుగు సినిమా, సాహిత్యం, కళల వైభవాన్ని చాటి చెప్పే పలు కార్యక్రమాలకు విజయవాడ మరోసారి వేదిక కానుంది. కృష్ణా నది ఒడ్డున ఉన్న పున్నమి ఘాట్, భవానీ ఐలాండ్‌లో రాష్ట్ర పర్యాటక శాఖ, టీమ్ వర్క్ ఆర్ట్స్ సంయుక్తంగా మూడు రోజులపాటు ఆవకాయ్-అమరావతి ఉత్సవాలు నిర్వహించనున్నాయి. సంగీతం, నృత్యం, నాటకం, కవిత్వం, కథా విన్యాసంతోపాటు సదస్సులు, సాంస్కృతిక సంభాషణల వంటి విభిన్న కార్యక్రమాలతో ప్రజలకు ముందుగానే సంక్రాంతి విందు అందించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం సాయంత్రం (8న) పున్నమి ఘాట్‌లో ఉత్సవాలు ప్రారంభిస్తారు. ఈ సందర్భంగా నిర్వహించే తోలుబొమ్మల ఊరేగింపు, తీన్‌మార్ డప్పులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. అనంతరం జామర్స్ సంగీతం, ఘాట్ వద్ద హారతి, హౌస్‌బోటు ప్రారంభోత్సవం, శంఖం-నగారా-డ్రమ్స్‌తో హోరెత్తించనున్నారు.

● 9న శుక్రవారం భవానీ ద్వీపంలో 'సినిమాల్లో ప్రతి నాయకుడి పాత్ర'పై నిర్వహించే చర్చలో ఎస్.హుస్సేన్ జైదీ, యండమూరి వీరేంద్రనాథ్, సుధీర్ మిశ్ర పాల్గొంటారు. 'భారతీయ పురాణాలు, పురోగమనం'పై చర్చలో కస్తూరి మురళీకృష్ణ, సంజీవ్ సన్యాల్, అనురాధ మోతాలి మాట్లాడతారు. 'ఓటీటీ యుగంలో సినిమా ప్రభావం' చర్చలో లీనాయాదవ్, సునీల్ షైనాని, శిబాసిన్ సర్కార్, సౌగత ముఖర్జీ, శ్రీరూప మిత్ర, సుప్రియా యార్లగడ్డ పాల్గొంటారు. ● మార్షల్ ఆర్ట్స్ (ఆదిత్య రాయ్), నగాడా (నతూలాల్ సోలంకి), బొమ్మల తయారీ (షమీమ్), నృత్యం (గిల్లెస్ చుయెన్-ఫ్రాన్స్)పై సదస్సులు నిర్వహించనున్నారు. సాయంత్రం పున్నమిఘాట్‌లో కర్ణాటక సంగీతం (చంద్రన బాల కల్యాణ్), కూచిపూడి నృత్య నాటకం (వనశ్రీరావు) ఏర్పాటు చేశారు. 'సినిమాలో సంగీతం, కవిత్వం' చర్చలో శేఖర్ రవి జియాని, ప్రియా సరయ్యా, కాసర్ల శ్యామ్, రక్షందా జలీల్ పాల్గొంటారు. అనంతరం అనిరుద్ వర్మ కలెక్టివ్, నిజామీ బంధుతో 'ఆజ్ రంగ్ హై' సంగీత ప్రదర్శన ఉంటుంది. ● 10న శనివారం భవానీ ద్వీపంలో తెలుగు కథన కళ, సినిమా-జర్నలిజం, తెలుగు సాహిత్యం-సినిమా వైభవం, అనువాద కళపై చర్చలు నిర్వహించనున్నారు. పున్నమిఘాట్‌లో సాయంత్రం చౌరస్తా సంగీత ప్రదర్శన, ఎన్టీఆర్ నటనా విశ్వరూపానికి నివాళి, ప్రేమ కథ సంగీత నాటకం, జావేద్ అలీ సంగీత కచేరి ఏర్పాటు చేశారు. హెరిటేజ్ వాక్, ఘాట్ ఫెర్రీ ప్రయాణాలతోపాటు ఫుడ్ ఫెస్టివల్ కూడా నిర్వహిస్తారు. ● ప్రజలకు ప్రవేశం ఉచితమని, ప్రేక్షకులు ఆన్‌లైన్‌లో www.avakaifestival.com పేర్లు నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

రోడ్లపై భద్రత దారితప్పొద్దు!



'ఈనాడు'తో ఐఐటీ ఖరగ్‌పూర్ ఆచార్యులు భార్గవ్ మైత్రా

- రహదారులు వాహనాల కోసమే కాదు
- అవి అందరి కోసమని గుర్తిస్తే ప్రమాదాలు తగ్గుతాయి
- రోడ్ ఇంజినీరింగ్, ఆధునిక నిఘాతో సురక్షిత ప్రయాణాలు సాధ్యమే

ఈనాడు – హైదరాబాద్

"రహదారులు వాహనాల రాకపోకలకు మాత్రమే కాదు. అందరి భద్రత కోసం ఉండాలి. ప్రమాదాలకు వివిధ కారణాలున్నా... అతివేగం ఎక్కువ మందిని బలిదీసుకుంటోంది. రోడ్ ఇంజినీరింగ్, సాంకేతికతతో కూడిన నిరంతర నిఘా ఉన్నచోట వాహనదారులు వేగ పరిమితులు పాటిస్తూ, హెల్మెట్లు, సీట్‌బెల్ట్‌లు ధరిస్తారు. పర్యవేక్షణ బలహీనంగా ఉంటే... బాగున్న రోడ్లపైనా ప్రమాదాలు పెరుగుతాయి. రహదారి భద్రత ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదు.. ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత" అని ఐఐటీ ఖరగ్‌పూర్ ఆచార్యులు భార్గవ్ మైత్రా అన్నారు. రోడ్ సేఫ్టీ నెట్‌వర్క్(ఆర్ఎస్ఎన్) సభ్యుడిగా కూడా ఉన్న మైత్రాతో 'ఈనాడు' ముఖాముఖి వివరాలివీ...

? ప్రపంచంలోనే అత్యధికంగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న దేశాల్లో భారత్ ఒకటి. ఇందుకు మీరు గుర్తించిన మూడు ప్రధాన కారణాలేంటి



అతి వేగం మొదటి కారణం. 2023లో దాదాపు 68% ప్రమాదాలు, మరణాలకు ఇదే ప్రధాన కారణంగా తేలింది. రోడ్లపై రక్షణ, కనీస సౌకర్యాల లేమి రెండో ప్రధాన లోపం. నిబంధనలన్నీ పాటించేలా చూసే వ్యవస్థ(ఎన్‌ఫోర్స్‌మెంట్) సరిగా లేకపోవడం మూడో ప్రధాన కారణం.

● చాలారోడ్లపై పాదచారులు నడవడానికి, సైకిళ్లను తొక్కడానికి సరైన సౌకర్యాలు లేవు. ఫలితంగా వారు రహదారులను ప్రమాదకర రీతిలో ఉపయోగించాల్సి వస్తోంది. ఈ కారణంగానే రోడ్డు ప్రమాదాల మృతుల్లో పాదచారులు, సైకిళ్లు నడిపేవారు 67% మంది వరకు ఉంటున్నారు. వీరికి ప్రత్యేక మార్గాలను రోడ్ డిజైన్‌లో చేర్చాలి.

? రహదారి భద్రతలో డ్రైవర్లు, రోడ్ ఇంజినీరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్‌కి సంబంధించి ఎవరి పాత్ర ఎంత

డ్రైవర్ల ప్రవర్తనాపరమైన సమస్య ఒక సవాల్‌గా ఉన్నప్పటికీ రోడ్ ఇంజినీరింగ్, నిబంధనల అమలు వ్యవస్థను బలోపేతం చేయడం చాలా ముఖ్యం. ఎన్‌ఫోర్స్‌మెంట్ అనేది డ్రైవర్ల ప్రవర్తన, రోడ్ ఇంజినీరింగ్‌ల మధ్య వారధిగా పని చేస్తుంది.

? రోడ్లపై చేపట్టాల్సిన అత్యంత క్లిష్టమైన ఇంజినీరింగ్ మార్పులేంటి

ఆధునిక రోడ్లు వాహనాల వేగానికి అనుగుణంగా ఉన్నా... కొన్ని మార్పులు అవసరం. జాతీయ రహదారులున్న చోట స్థానిక ట్రాఫిక్ కోసం సర్వీస్ రోడ్లు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చాలా కూడళ్లలో తగినంత దూరం వరకు రహదారి కన్పించకపోవడం, చిన్న రోడ్ల నుంచి వచ్చే ట్రాఫిక్‌పై నియంత్రణ లేకపోవడం సమస్యగా మారుతోంది. భూమి లభ్యత లేక విభాగిని(డివైడర్)ల వెడల్పు తగ్గించడంతో.. మలుపులు, యూటర్న్‌లలోనూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

? రహదారులపై బ్లాక్‌స్పాట్‌ల గుర్తింపు, సరిదిద్దడంలో పాటించాల్సిన శాస్త్రీయ పద్ధతులు..

ఒకచోట పదేపదే ప్రమాదాలు జరుగుతున్నాయంటే అక్కడ మౌలిక సదుపాయాల లోపం ఉన్నట్లు అర్థం. భారతీయ రోడ్ కాంగ్రెస్(ఐఆర్‌సీ), కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ నిర్దేశించిన నిబంధనల ప్రకారం బ్లాక్‌స్పాట్‌లను గుర్తిస్తారు. పశ్చిమబెంగాల్‌లో మేం చేసిన పరిశోధన ఆధారంగా.. ప్రతి రాష్ట్రానికి వేర్వేరు ప్రమాణాలు ఉండాలని గుర్తించాం. ఐఐటీ ఖరగ్‌పూర్‌లో మెషిన్ లెర్నింగ్, స్పేషియల్ ఎనాలసిస్ పద్ధతులను ఉపయోగిస్తున్నారు.

? రోడ్లు బాగున్న చోట ఎక్కువగా, సరిగాలేని చోట తక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి. దీనిని ఎలా చూడాలి

నేటితరం వాహనాలు అత్యాధునిక సాంకేతికతతో, ఎక్కువ వేగంతో దూసుకెళ్లే సామర్థ్యం కలిగి ఉంటున్నాయి. దీంతో రోడ్లు బాగున్నప్పుడు అతివేగం పెద్ద సవాల్‌గా మారింది. రోడ్ ఇంజినీరింగ్ ద్వారా వేగాన్ని నియంత్రించే పద్ధతులను ప్రవేశపెట్టాలి. నిబంధనలను సిబ్బంది ద్వారానే కాకుండా సాంకేతికత ఆధారితంగా అమలయ్యేలా చూడాలి. తద్వారా రహదారి వినియోగదారుల్లో బాధ్యత పెరుగుతుంది. అధిక వేగంతో వెళ్లే వాహనాల నుంచి పాదచారులను వేరుచేసే మౌలిక సదుపాయాలను కల్పించాలి.

? గుడ్ సమారిటన్ చట్టంపై ప్రజల్లో ఏ మేరకు అవగాహన ఉంది

సేవ్ లైఫ్ ఫౌండేషన్ అధ్యయనం ప్రకారం ఇప్పటికీ 84% మంది భారతీయులకు గుడ్ సమారిటన్ చట్టం గురించి తెలియదు. దీంతో ప్రమాద సమయంలో బాధితులకు సహాయం చేయడానికి బాటసారులు జంకుతున్నారు. రోడ్ సేఫ్టీ నెట్‌వర్క్‌గా మేం బాధ్యతాయుతమైన ప్రయాణం కోసం... సివిల్ సొసైటీ, గ్రూపులు, స్వచ్ఛంద సంస్థలు, సామాజిక కార్యకర్తల్లో అవగాహన కల్పించడంతోపాటు విధానాల రూపకల్పన, అమలులోనూ కీలక పాత్ర పోషిస్తున్నాం.

◆ భారత రోడ్డు భద్రతా చట్టంలో నాలుగు కీలక లోపాలను సరిచేయాలని విధానకర్తలను కోరాం. చిన్నారుల భద్రత, వేగ నియంత్రణ, రాష్ట్రస్థాయిలో బలమైన కార్యాచరణ ప్రణాళికలు, మోటారు వాహనాల చట్టంలో మార్పులను సూచించాం.

విద్వేష వ్యాఖ్యలపై కఠిన చర్యలు

- మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేశ్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: సామాజిక మాధ్యమాల్లో విద్వేషపూరిత పోస్టులు పెట్టేవారిపై కఠినంగా వ్యవహరించాలని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ సూచించారు. సామాజిక మాధ్యమాల్లో జవాబుదారీతనం, పౌరుల రక్షణను బలోపేతం చేయడం అనే అంశంపై సచివాలయంలో నిర్వహించిన మంత్రుల బృందం సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. ఐటీ చట్టంలో ఇందుకు ఉన్న నిబంధనలపై చర్చించారు. అనంతరం లోకేశ్ మాట్లాడుతూ.. 'ప్రభుత్వ నిర్ణయాలపై సద్విమర్శలను స్వాగతిస్తాం. ఉద్దేశపూర్వక విద్వేష వ్యాఖ్యలను సహించం. ఏఐ ఆధారిత డీప్‌ఫేక్ అసభ్య కంటెంట్‌ను అరికట్టాలి. మహిళలపై అవమానకర, అసభ్య పోస్టులు పెట్టే వారిపై నిఘా ఉంచాలి. ప్రజాభీష్టాన్ని అడ్డుకోవడం మా ఉద్దేశం కాదు. భావవ్యక్తీకరణ స్వేచ్ఛ (ఫ్రీడమ్ ఆఫ్ స్పీచ్) పేరుతో దురుద్దేశపూర్వక పోస్టులను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించం. ప్రతిపక్షాలు ధర్నాచౌక్ లాంటి ప్రదేశాల్లో నిరసన తెలియజేసేందుకు ప్రభుత్వం అవకాశం ఇస్తుంది. గతంలో జ్యుడిషియరీతో పాటు కొంతమందిని లక్ష్యంగా చేసుకుని అసభ్య పోస్టులు పెట్టారు. విదేశాల్లో ఉంటూ అభ్యంతరకర పోస్టులు పెట్టే వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తాం. ఇందుకోసం బలమైన లీగల్ ఫ్రేమ్ వర్క్ ఏర్పాటు చేయాలి. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో అమలు చేస్తున్న చట్టాలపై అధ్యయనం చేయాలి. మాజీ ముఖ్యమంత్రి భార్యపై పోస్టు పెడితే మా పార్టీ వాడైనా జైలుకు పంపించాం' అని వెల్లడించారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులకు సంబంధించి రాష్ట్రస్థాయి సమన్వయ సెల్ ఏర్పాటు చేస్తున్నట్లు హోం మంత్రి అనిత చెప్పారు. సమావేశంలో సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి పాల్గొన్నారు.

అమ్మో ఇదంతా సిగ్గే!



ముళ్ల బంతిలా ఉన్న ఈ జీవిని గానుక పలకపుల్ల అని మత్స్యకారులు పిలుస్తుంటారు. విశాఖలోని రుషికొండ తీరంలో సాగర జలాలు వెనక్కి మళ్లడంతో ఇవి కనిపించాయి. వీటి శాస్త్రీయ నామం 'సీ ఆర్చిన్ ఎకినోడెర్మ్' అని విశాఖ ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారిణి (ఎఫ్‌డీవో) ఆశాజ్యోతి తెలిపారు. 'ఇవి సూర్యరశ్మిలో కన్నా చీకటిగా ఉండే రాళ్ల మధ్య, శిలల్లో ఉండటానికే ఇష్టపడతాయి. బయటకు వచ్చినా వెంటనే లోపలకు వెళ్లిపోతాయి. ఈ జీవులపై ఉన్న ముళ్లను తొలగించగా మిగిలిన భాగాన్ని అలంకరణకు ఉపయోగిస్తారు' అని వివరించారు.

– న్యూస్‌టుడే, విశాఖపట్నం (సాగర్‌నగర్)

కర్ణాటక సీఎం సరికొత్త రికార్డు

- అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య



ఈనాడు, బెంగళూరు: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కర్ణాటక చరిత్రలో అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా కొనసాగిన నేతగా రికార్డు సృష్టించనున్నారు. గతంలో దేవరాజ అరసు (కాంగ్రెస్) ఏడు సంవత్సరాల 239 రోజుల రికార్డును సిద్ధరామయ్య బుధవారంతో అధిగమించనున్నారు. దేవరాజ అరసు ముఖ్యమంత్రిగా విరామం లేకుండా కొనసాగగా, సిద్ధరామయ్య 2013-18 వరకు, 2023 నుంచి ఇప్పటివరకు కొనసాగుతున్నారు. అరసు, సిద్ధరామయ్య తర్వాత నిజలింగప్ప (కాంగ్రెస్) మాత్రమే ఏడేళ్లకు పైగా సీఎంగా పని చేశారు. తాజా రికార్డుతో పాటు ఆర్థిక మంత్రిగా 16 బడ్జెట్‌లు ప్రవేశపెట్టిన నేతగా కూడా సిద్ధరామయ్య రికార్డు సృష్టించారు. రానున్న మార్చిలోనూ తానే బడ్జెట్ ప్రవేశపెడతానని, 2028 వరకు ముఖ్యమంత్రిగా కొనసాగుతానని సిద్ధరామయ్య ప్రకటించటం గమనార్హం. ముఖ్యమంత్రిగా ఉన్నా ఆర్థికశాఖ కూడా సిద్ధరామయ్య వద్దే ఉంది. సీఎంగా ఆయన రికార్డు నేపథ్యంలో అభిమానులు రాష్ట్రవ్యాప్తంగా నాటుకోడి, రాగి ముద్ద, బిర్యానీలు పంచి, సంబరాలు చేసుకున్నారు.

'సాక్షి'పై పరువు నష్టం కేసు.. నేడు విశాఖ కోర్టుకు లోకేశ్

ఈనాడు, అమరావతి: సాక్షి పత్రికపై వేసిన పరువు నష్టం కేసులో విశాఖ 12వ అదనపు జిల్లా న్యాయస్థానంలో క్రాస్ ఎగ్జామినేషన్‌కు మంత్రి నారా లోకేశ్ బుధవారం హాజరు కానున్నారు. ఈ కేసులో ఇప్పటికే రెండు దఫాలు క్రాస్ ఎగ్జామినేషన్ పూర్తి కాగా.. మూడోసారి లోకేశ్ హాజరవుతున్నారు.

ఆంగ్రూ నుంచి కొత్తగా నాలుగు వంగడాలు

- ఆవిష్కరించిన కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

గుంటూరు (జిల్లాపరిషత్), న్యూస్‌టుడే: ఆచార్య ఎన్.జి.రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పరిశోధించి రూపొందించిన నాలుగు వంగడాలు జాతీయస్థాయిలో విడుదలయ్యాయి. కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ దేశవ్యాప్తంగా ఏసీఏఆర్ అభివృద్ధి చేసిన 26 రకాల పంటల్లో అధిక దిగుబడిని ఇచ్చే 184 కొత్త వంగడాలను దిల్లీలో విడుదల చేశారు. వాటిలో ఆంగ్రూ అభివృద్ధి చేసిన సజ్జలు, నువ్వులు, వరిగ, పొగాకు ఉన్నాయి. ఈ విడుదలపై వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి శాస్త్రవేత్తలు, ఉద్యోగులను మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు.

పంట: నువ్వు



వంగడం: వైఎల్ఎం 146. కాలపరిమితి 90-95 రోజులు. వేసవి సాగుకు అనుకూలం. హెక్టారుకు 8-10 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. 44.4% నూనె ఉంటుంది. పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, బిహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సాగుకు సిఫార్సు చేశారు. ఎలమంచిలి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధి చేసింది.

పంట: సజ్జ



వంగడం: ఏపీహెచ్‌బీ 126. పంట కాలవ్యవధి 84-86 రోజులు. ఖరీఫ్, రబీకి అనుకూలం. 30-33 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. గింజల్లో ఇనుము, జింక్ అధికం. అనంతపురం వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసింది.

పంట: వరిగ



వంగడం: పీఎంవీ 480 (అల్లూరి). పంట వ్యవధి 72-77 రోజులు. ఖరీఫ్‌కు అనుకూలం. హెక్టారుకు 2.27 టన్నుల దిగుబడి ఇస్తుంది. గింజల్లో ప్రొటీన్ శాతం అధికం. విజయనగరం వ్యవసాయ పరిశోధన స్థానం అభివృద్ధి చేసింది.

పంట: బీడి పొగాకు



వంగడం: ఏబీడీ 132. పంట వ్యవధి 195-210 రోజులు. ఖరీఫ్ వర్షాధారం అనుకూలం. పొగలోని హానికర అంశాల శాతం తక్కువ. నంద్యాల ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం అభివృద్ధి చేసింది.

కునిటి మల్లారెడ్డి సామాజికవర్గం పేరు కుంటి మల్లారెడ్డిగా మార్పు

ఈనాడు, అమరావతి: ఆర్థికంగా వెనుకబడిన తరగతుల(ఈబీసీ)కు చెందిన జాబితాలోని కునిటి మల్లారెడ్డి సామాజికవర్గం పేరును కుంటి మల్లారెడ్డిగా మార్పు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. 2022-23లో అప్పటి ప్రభుత్వం ఈబీసీ సామాజికవర్గాలకు చెందిన జాబితాలో కుంటి మల్లారెడ్డి కులం పేరును కునిటి మల్లారెడ్డిగా తప్పుగా నమోదు చేసింది. దీన్ని సవరించాలని కుంటి మల్లారెడ్డి సేవా సంఘం ప్రతినిధులు ఇటీవల ప్రభుత్వానికి నివేదించారు. దీనిపై స్పందించిన ప్రభుత్వం సంఘ ప్రతినిధుల విజ్ఞప్తి మేరకు సామాజికవర్గం పేరును ఈబీసీ జాబితాలో సరిచేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

మినీ భారత సమ్మేళనంగా సరస్

- రేపటి నుంచి పదిరోజులు గుంటూరు వేదికగా ప్రదర్శన
- దేశవ్యాప్తంగా తరలివస్తున్న కళాకారులు

గుంటూరు (కలెక్టరేట్), న్యూస్‌టుడే: అతివలను అన్నిరంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. స్వయం సహాయక సంఘాల మహిళలు స్వయం ఉపాధి పొందేలా, వారు తయారుచేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలు కల్పించి ప్రోత్సహిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం సరస్ (సేల్ ఆఫ్ ఆర్టికల్స్ ఆఫ్ రూరల్ ఆర్టిజన్స్ సొసైటీ) పేరున ప్రదర్శన చేపడుతోంది. దీనికోసం గుంటూరు శివార్లలోని నరసరావుపేట రోడ్డులో వేదికను సిద్ధం చేసింది. జాతీయస్థాయిలో సరస్ ప్రదర్శనను ఒక మినీ భారత సమ్మేళనంగా చేపడుతున్నారు. అన్నిరాష్ట్రాల నుంచి స్వయం సహాయక సంఘాల సభ్యుల ఉత్పత్తులు, హస్తకళలు, చేనేత వస్త్రాలు, ఆహార పదార్థాల ప్రదర్శనకు అవకాశం కల్పించారు.

300 స్టాళ్లు.. పది రోజుల ప్రదర్శన

గుంటూరు సరస్ ప్రదర్శనలో మొత్తం 300 స్టాళ్లు ఏర్పాటు చేస్తున్నారు. జనవరి 8 నుంచి 18వ తేదీ వరకు ఉదయం 9 నుంచి రాత్రి 9 వరకు ప్రదర్శన నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని డ్వాక్రా సంఘాలకు 150, ఇతర రాష్ట్రాల వారికి 150 స్టాళ్లను సిద్ధం చేసింది. డ్వాక్రా మహిళలకు వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక వేదిక ఏర్పాటుచేసి శిక్షణ ఇవ్వనున్నారు.

పండగవేళ ప్రదర్శన ఆకట్టుకునేలా

సంక్రాంతి నేపథ్యంలో అందరినీ ఆకట్టుకునేలా సరస్ ప్రదర్శనను తీర్చిదిద్దారు. గుంటూరు మిరపకాయనే మస్కట్‌గా ఎంపికచేశారు. రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు, ఫుడ్‌కోర్టులు, చిన్నారుల పార్కు ఏర్పాటు చేస్తున్నారు. రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) సౌజన్యంతో గుంటూరు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఈ ప్రదర్శన నిర్వహిస్తోంది.

సరస్‌లో ఏమేం ఉంటాయంటే..

ప్రదర్శనలో అఖిలభారత డ్వాక్రాబజార్‌లో చేనేత, హస్తకళలు, చీరలు, తివాచీలు, దుప్పట్లు, వెదురు, లోహ, ఆభరణాలు, గృహాలంకరణ వస్తువులు, గాజు ఉత్పత్తులు, సంప్రదాయ, సేంద్రియ ఆహార పదార్థాలశాలలు ఉండనున్నాయి. రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా జాతీయస్థాయిలో సరస్ కార్యక్రమం జరుగుతోందని గుంటూరు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా చెప్పారు. దేశంలోని ఆయా రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబించేలా చేనేతలు, హస్తకళలు, ఇతర సామగ్రి ప్రదర్శన, విక్రయాలు ఉంటాయన్నారు. దేశంలోని విభిన్న ఆహార పదార్థాల ఘుమఘుమలకు సరస్ సిద్ధమైందని తెలిపారు.



సిద్ధమవుతున్న స్టాళ్లు



పిల్లల కోసం ఏర్పాటుచేసిన పార్కు



సరస్ మేళా మస్కట్

రూ.1,673 కోట్లతో మంగళగిరి-తాడేపల్లిలో యూజీడీ

ఈనాడు, అమరావతి: గుంటూరు జిల్లా మంగళగిరి, తాడేపల్లి నగరపాలక సంస్థలో హైబ్రిడ్ యాన్యుటీ మోడ్ (హెచ్ఏఎం)లో రూ.1,673.51 కోట్లతో రెండు దశల్లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ (యూజీడీ), మురుగునీటి శుద్ధి ప్లాంట్ల (ఎస్‌టీపీ) ఏర్పాటుకు అనుమతిస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. తొలిదశలో రూ.870.36 కోట్లు, రెండో దశలో రూ.803.15 కోట్లతో పనులు చేపట్టనున్నారు. ఈ మేరకు తదుపరి చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ప్రజారోగ్య ఇంజినీరింగ్ విభాగం ఈఎన్‌సీని ఆదేశిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్ కుమార్ ఉత్తర్వులిచ్చారు.

ఇన్వాయిస్ డిస్కౌంట్ల పేరుతో భారీ మోసం కేసులో... ఫాల్కన్ గ్రూప్ ఎండీ అరెస్టు

ఈనాడు, హైదరాబాద్: ఇన్వాయిస్ డిస్కౌంట్ల పేరుతో భారీగా లాభాల ఆశ చూపించి రూ.వందల కోట్లు దోచుకున్న క్యాపిటల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు చెందిన ఫాల్కన్ గ్రూప్ ఎండీ అమర్‌దీప్ కుమార్‌ను తెలంగాణ సీఐడీ అధికారులు అరెస్టు చేశారు. ఈ మేరకు సీఐడీ అదనపు డీజీ చారూ సిన్హా మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చాలాకాలంగా పరారీలో ఉన్న అమర్‌దీప్‌పై లుకౌట్ నోటీసు జారీ కాగా... సోమవారం ఇరాన్ నుంచి వచ్చి ముంబయి విమానాశ్రయంలో దిగిన వెంటనే అక్కడి అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం సీఐడీ పోలీసులు అరెస్టు చేసి హైదరాబాద్‌కు తీసుకువచ్చారు. ఫాల్కన్ గ్రూప్ పేరుతో వెబ్‌సైట్ పెట్టి... ప్రముఖ సంస్థల నుంచి చేసిన కొనుగోళ్లలో పెద్దఎత్తున డిస్కౌంట్లు ఇప్పించడం ద్వారా భారీగా లాభాలు మూటగట్టుకోవచ్చంటూ 7,056 మంది నుంచి క్యాపిటల్ ప్రొటెక్షన్ సంస్థ రూ.4,215 కోట్లు వసూలు చేసింది. ఆ తర్వాత ముఖం చాటేయడంతో బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు... గతేడాది సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఆర్థిక నేరాల విభాగంలో తొలుత కేసు నమోదైంది. ఆ తర్వాత కేసు సీఐడీకి బదిలీ అయింది. ఇందులో ఇప్పటివరకూ డైరెక్టర్లు, ఎగ్జిక్యూటివ్‌లు, ఛార్టెడ్ ఎకౌంటెంట్లు సహా మొత్తం 11 మంది అరెస్టు కాగా... రూ.43 కోట్ల విలువైన 12 స్థలాలు, 4 విలాసవంతమైన కార్లు, రూ.8 లక్షల నగదు, 21 తులాల బంగారం, రూ.20 కోట్ల విలువైన షేర్లు, రూ.8 కోట్ల బ్యాంకు డిపాజిట్లను జప్తు చేశారు.

'భోగాపురం'పై వైకాపా చెప్పేదంతా బోగస్

- 2014-19 మధ్య అన్ని అనుమతులు తెచ్చాం
- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి వెల్లడి

ఈనాడు, అమరావతి: భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయ నిర్మాణానికి అనుమతులన్నీ 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వమే సాధించిందని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ పట్టాభి తెలిపారు. మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అప్పట్లో విమానాశ్రయ నిర్మాణానికి జారీ చేసిన ఉత్తర్వులు, కేంద్ర అనుమతులను వివరించారు. విమానాశ్రయ నిర్మాణానికి రూ.750 కోట్లు తెదేపా ప్రభుత్వమే ఖర్చు చేసిందని వెల్లడించారు. "విమానాశ్రయ నిర్మాణంలో జగన్‌మోహన్‌రెడ్డి పాత్ర ఏమీ లేకున్నా.. దాన్ని మేమే నిర్మించామని వైకాపా క్రెడిట్ చోరీకి పాల్పడుతోంది. రాష్ట్రంలో గత ఏడాదిన్నరలో జరిగిన అభివృద్ధి పనులన్నీ తామే చేశామని వైకాపా నేతలు మాట్లాడుతున్నారు. 'విశాఖపట్నంలో ఉన్న విమానాశ్రయం సరిపోదా?' అంటూ జగన్ చేసిన ప్రకటనలు వారికి గుర్తు లేవా? విమానాశ్రయ భూముల్లో 500 ఎకరాలు తన రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం కొట్టేసిందీ జగన్‌మోహన్‌రెడ్డే. ఆ భూమిని తిరిగి విమానాశ్రయ నిర్మాణానికి కేటాయిస్తూ సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు' అని పేర్కొన్నారు.

అప్పట్లో సాధించిన అనుమతులే నిదర్శనం

'విమానాశ్రయ నిర్మాణానికి అవసరమైన అనుమతులు అప్పటి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి అశోక్ గజపతి రాజు ద్వారా తెదేపా ప్రభుత్వమే సాధించింది. నిర్మాణ పనులు ప్రారంభించేందుకు కీలకమైన కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ అనుమతులు మేం తీసుకొచ్చాం' అని పట్టాభి పేర్కొన్నారు.

★ "2015 ఫిబ్రవరి 20న బెంగళూరులో జరుగుతున్న ఇంటర్నేషనల్ ఎయిర్ షోలో సీఎం చంద్రబాబు పాల్గొన్నారు. అప్పటి కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి భోగాపురంలో విమానాశ్రయ నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు.

★ విశాఖపట్నం విమానాశ్రయానికి పరిమితులు ఉండటంతో ప్రత్యామ్నాయంగా ఉత్తరాంధ్రలో అంతర్జాతీయ స్థాయిలో నిర్మించాలని చంద్రబాబు భావించారు. ఆ మేరకు 2015 మే 20న 'భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ కంపెనీ లిమిటెడ్' పేరిట ఒక ఎస్‌పీవీ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది.


★ 2016 అక్టోబరు 7న విమానాశ్రయ నిర్మాణానికి కేంద్రం ప్రాథమిక అనుమతులు ఇచ్చింది.

★ 2017 ఆగస్టు 14న పర్యావరణ అనుమతులకు కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. విమానాశ్రయ నిర్మాణ పనులు ప్రారంభించడానికి ఈ అనుమతులు కీలకం" అని పట్టాభి వివరించారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పట్టాభి

EENADU Vol: 52, Issue: 148 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao



కృత్రిమ మేధ.. కృత్రిమ మేధ (ఏఐ). ఎక్కడ చూసినా దీనిదే హవా. ముమ్ముందూ దీని జోరు తగ్గేది కాదు. టెక్నాలజీ, సైన్స్, వైద్యం, ఇంజినీరింగ్.. ఇలా ఏదైనా సరే. ఏఐ లేని రంగాన్ని ఊహించుకోలేని స్థితికి చేరుకున్నాం. ఈ సంవత్సరమూ ఇది ఎన్నెన్నో మేలి మలుపులకు శ్రీకారం చుట్టనుంది. డేటాను శోధించటం దగ్గరి నుంచి ఔషధాల ఆవిష్కరణ వరకూ అన్నింటా తనదైన ముద్ర వేయనుంది. అలాంటి వినూత్న పరిజ్ఞానాలకు ఇవిగో కొన్ని మచ్చుతునకలు.

నవ దిశ

రోబో విప్లవం



రోబో స్నేహితులు, సహోద్యోగులు, పనిమనుషులు సైన్స్ ఫిక్షన్ కథలను దాటుకొని వాస్తవ రూపం ధరించాయి. ఈ సంవత్సరం మరిన్ని హ్యూమనాయిడ్ రోబోలు పరిచయం కానున్నాయి. ఉదాహరణకు- అమెరికాలో నియో అనే హ్యూమనాయిడ్ రోబోల తొలి సరఫరా 2026లో మొదలుకానుంది. ఇంటిపనులకు తోడ్పడటం వీటి ప్రత్యేకత. ఇవి రకరకాల పనులు చేయగలవు. పక్కన కూర్చొని, మాట్లాడగలవు. ప్రస్తుతం జరుగుతున్న సీఈఎస్ సదస్సులోనూ ఎల్‌జీ సంస్థ ఇలా ఇంటి పనుల్లో సాయం చేసే రోబోను ప్రదర్శించింది. గోదాముల వంటి చోట్ల పనిచేసే డిజిట్ రోబోలు మరింత ఎక్కువగా దర్శనమివ్వనున్నాయి. అటనమస్ నావిగేషన్‌తో పనిచేసే వీటిని ఏజిలిటీ రోబోటిక్స్ రూపొందిస్తోంది. 1.7 మీటర్ల ఎత్తు గల ఇవి 16 కిలోల బరువున్న ప్యాకెట్లను ఎత్తగలవు. ప్రస్తుతం వందలాది డిజిట్ రోబోలను అమెరికాలో వాడుతున్నారు. వీటిని మరింత పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. కృత్రిమ మేధతో సమ్మిళితమైన హ్యూమనాయిడ్ రోబోలు సైతం ఈ సంవత్సరం వెల్లువెత్తే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

జన్యు సవరణకు ఏఐ సాయం



క్రిస్పర్ పరిజ్ఞానం రాకతో డీఎన్‌ఏను సవరించటం, అనుకున్న విధంగా మార్చటం నల్లేరు మీద నడకలా మారింది. రైబోన్యూక్లిక్ యాసిడ్ (ఆర్ఎన్‌ఏ) అనే గైడింగ్ మాలిక్యుల్, కాస్9 అనే ఎంజైమ్ సాయంతో శాస్త్రవేత్తలు దీన్ని సుసాధ్యం చేస్తున్నారు. డీఎన్ఏ పోచను సమర్థంగా కత్తిరించి, దాని స్థానంలో విజయవంతంగా జన్యు సమాచారాన్ని జొప్పిస్తున్నారు. క్రిస్పర్ పరిజ్ఞానం ఈ ఏడాది కృత్రిమ మేధ (ఏఐ)తో మరింత సుసంపన్నం కానుంది. ప్రస్తుతం క్రిస్పర్ పరిజ్ఞానాన్ని క్యాన్సర్లు, హటింగ్‌టన్ డిసీజ్ వంటి జన్యువ్యాధుల మీద అధ్యయనాలకు వాడుకుంటున్నారు. అయితే డీఎన్‌ఏలో ఏ భాగం జబ్బుకు కారణమవుతుందో తెలుసుకోవటం చాలా కీలకం. ఇక్కడే ఏఐ గణనీయంగా తోడ్పడగలదు. ఇది బోలెడంత జన్యు సమాచారాన్ని సమ్మిళితం చేయటం ద్వారా ఆర్ఎన్ఏకు దారి చూపగలదు. జన్యువుల్లో లోపమున్న చోటుకు కచ్చితంగా తీసుకెళ్లగలదు. దీని విషయంలో మమోత్ బయోసైన్స్, రీజెనరాన్ ఫార్మాస్యూటికల్స్ వంటి కంపెనీలు భాగస్వామ్యం కుదురుకుంటున్నాయి. భవిష్యత్తులో టార్గెటెడ్ చికిత్సలను మరింత మెరుగుపరచటమే వీటి ఉద్దేశం.

కారు డోర్లే బ్యాటరీలు



విమానాల రెక్కలు, కారు డోర్ల నుంచే విద్యుత్తు ఉత్పత్తి అయితే? ఇదేమీ కల కాదు. స్ట్రక్చరల్ బ్యాటరీ కాంపోజిట్స్ (ఎస్‌బీసీస్) భావన దీన్ని నిజం చేయనుంది. వాహనాలకు ఆకృతిని ఇవ్వటమే కాదు.. విద్యుత్తు నిల్వ చేసుకొని, దాన్ని సరఫరా చేసే పదార్థాలు ఇందులో కీలకాంశం. ప్రస్తుతం ఎస్‌బీసీస్‌ను సృష్టించటానికి రెండు అవకాశాలు ఉన్నాయి. ఒకటి- వాహనాల బాడీ ప్యానెల్స్‌లో బ్యాటరీ కణాలను పొదగటం. రెండు- విద్యుత్తును నిల్వ చేసుకోవటానికి వాహనాల ఆకృతుల పోచలను ఎలక్ట్రోడులుగా తీర్చిదిద్దటం. ప్రస్తుతం ఈ పరిజ్ఞానం అభివృద్ధి దశలోనే ఉంది. దీనిపై శరవేగంగా ప్రయోగ పరీక్షలు నడుస్తున్నాయి. విద్యుత్తు వాహనాల్లోని లిథియం అయాన్ బ్యాటరీలతో పోలిస్తే సామర్థ్యం తక్కువే అయినా గత సంవత్సరం వరల్డ్ ఎకనమిక్ ఫోరమ్ సదస్సులో ఉత్తమమైన వర్ధమాన పరిజ్ఞానాల్లో ఎస్‌బీసీఎస్ కూడా ఒకటిగా నిలవటం గమనార్హం. ఇవి విద్యుత్ వాహనాల సామర్థ్యాన్ని 8% వరకూ పెంచగలవని ఫోరమ్ ప్రతిపాదించింది. విమానాల ఇంధన సామర్థ్యమూ 15% వరకూ పెరుగుతుందని వివరించింది. ఈ సంవత్సరం దీనిపై మరింత ఎక్కువగా ఆసక్తి కనబరిచే అవకాశముంది.

అవయవ ముద్రణ ఆశలు



జీవముద్రణ (బయోప్రింటింగ్) రంగం ఈ సంవత్సరం గొప్ప పురోగతి సాధించే అవకాశం కనిపిస్తోంది. 3డీ ముద్రణ మాదిరిగానే ఇందులో కణాలతో నిండిన 'జీవసిరా' (బయోఇంక్)ను పొరలు పొరలుగా పరచుకుంటూ సజీవ కణజాలాలను ముద్రించటం దీని ప్రత్యేకత. జీవముద్రణను 80ల్లో ఆవిష్కరించినప్పటికీ ఇంకా శైశవ దశలోనే ఉంది. ఇందులో పెద్ద సవాలు- జీవసిరా స్థిరంగా ఉండకపోవటం, దీన్ని సరిగా నిల్వ చేయలేకపోవటం. ఇప్పుడు దీని విషయంలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఎంఐటీ శాస్త్రవేత్తలు ఐటీఎల్ ఓ వినూత్న పరిజ్ఞానాన్ని రూపొందించారు. ఇది ముద్రించే సమయంలోనే డిజిటల్ మైక్రోస్కోప్ సాయంతో హై రిజల్యూషన్ ఇమేజీలను సంగ్రహిస్తుంది. ఏఐ మెషిన్ లెర్నింగ్ సాఫ్ట్‌వేర్‌తో ప్రాథమిక డిజైన్‌తో పోల్చి చూస్తుంది. ఇలా ప్రత్యక్ష పర్యవేక్షణ మెరుగు పడుతుంది. ఇది ముందుముందు కణజాల ముద్రణ మనుషుల ప్రమేయం లేకుండా, ఆటోమేట్ చేయగలదని భావిస్తున్నారు. శాస్త్రవేత్తలు ఇప్పటికే చర్మం, మూత్రాశయం, శ్వాసనాళం, మృదులాస్థి వంటి రకరకాల సజీవ కణజాలాలను ముద్రించటంలో విజయం సాధించారు. కంటి కార్నియా ఎండోథీలియల్ కణాలతో కార్నియా ఇంప్లాంట్‌నూ ముద్రించటం విశేషం. దీన్ని ప్రయోగపరీక్షల్లో భాగంగా ఒకరికి అమర్చారు కూడా. దీని ఫలితాలు ఈ సంవత్సరంలోనే వెలువడనున్నాయి. ఇది విజయవంతమైతే కార్నియా జబ్బులతో బాధపడుతున్న ఎంతోమందికి కొత్తవెలుగు చూపగలదనటం అతిశయోక్తి కాదు.

కార్బన్ సంగ్రహణ వేగం




వాతావరణ సంక్షోభాన్ని ఎదుర్కోవటానికి ఎన్నో మార్గాలు. వీటిల్లో ఒకటి కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించటం. ఇక్కడే డైరెక్ట్ ఎయిర్ క్యాప్చర్ (డీఏసీ) పరిజ్ఞానం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. ఇది ప్రత్యేకమైన ఫిల్టర్ల ద్వారా గాలిని లోపలికి తీసుకుంటుంది. దానిలోంచి కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించి, నిల్వ చేస్తుంది. ప్రస్తుతం అతిపెద్ద డీఏసీ కేంద్రం ఐస్‌లాండ్‌లో ఉంది. దీని పేరు మమోత్. ఇది ఏటా 36వేల టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహిస్తుంది. అయితే త్వరలోనే టెక్సాస్‌లో నెలకొల్పిన స్ట్రాటోస్ కేంద్రం దీన్ని మించనుంది. ఇది ఏటా 5లక్షల టన్నుల కార్బన్ డయాక్సైడ్‌ను సంగ్రహించనుంది మరి. అంతేకాదు, దాన్ని భూగర్భంలోని ఉప్పు నీటిలోకి పంపించి, అక్కడ శాశ్వతంగా నిల్వ చేస్తుంది కూడా. ఇతర దేశాలూ డీఏసీ పరిజ్ఞానం మీద ఆసక్తి చూపుతున్నాయి. బ్రిటన్ 2026లో భారీ డీఏసీ కేంద్రాన్ని నెలకొల్పనుంది.

హరిత హైడ్రోజన్ శక్తి



శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయం, పర్యావరణ హిత హరిత (గ్రీన్) హైడ్రోజన్ గురించి తెలిసిందే. ఎలక్ట్రోలైజర్ పరికరం సాయంతో నీటిలోని హైడ్రోజన్, ఆక్సిజన్ అణువులను వేరు చేయటం ద్వారా హైడ్రోజన్ ఇంధనం పుట్టుకొస్తుంది. దీన్ని సంగ్రహించి కంప్రెస్డ్ గ్యాస్ రూపంలో గానీ అతి శీతల ద్రవరూపంలో గానీ నిల్వ చేస్తారు. ఈ విషయంలో నెదర్లాండ్స్ ఈ సంవత్సరం గొప్ప ముందడుగు వేయనుంది. అక్కడ చేపట్టిన హాలండ్ హైడ్రోజన్ 1 అనే ప్రాజెక్టు త్వరలోనే పూర్తికానుంది. దీనిలోని భారీ ఎలక్ట్రోలైజర్ సమీపంలోని సోలార్ పార్క్‌తో అనుసంధానమై పనిచేస్తుంది. ఏడాది 3లక్షల కిలోల హరిత హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయనుంది. సౌదీ అరేబియాలోనూ అతిపెద్ద హైడ్రోజన్ కేంద్రం కొలువుదీరనుంది. దీని పేరు నియోమ్ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు. ఇందులో సౌరశక్తితో పాటు పవనశక్తినీ వాడుకోనున్నారు. ఇది ఏటా 600 టన్నుల గ్రీన్ హైడ్రోజన్‌ను ఉత్పత్తి చేయగలదు. ఈ సంవత్సరమే ఉత్పత్తి మొదలు కాగలదని భావిస్తున్నారు.

కృత్రిమ ఎంజైమ్‌లు



మన శరీరంలో వేలాది ఎంజైమ్‌లు బోలెడన్ని పనుల్లో పాలు పంచుకుంటుంటాయి. జీవ ఉత్ప్రేరకాలుగా పేరొందిన ఇవి ఆహారం జీర్ణం కావటం, డీఎన్‌ఏ వృద్ధి వంటి రసాయన చర్యలను వేగవంతం చేస్తాయి. వీటిల్లో 'యాక్టివ్ సైట్' అనే భాగంలో మాలిక్యూల్స్ అంటుకొని, రసాయన ప్రతిచర్యను ప్రేరేపిస్తాయి. అందుకే వీటిని కృత్రిమంగా సృష్టించటం మీద కొన్ని కంపెనీలు దృష్టి సారించాయి. నానోజైమ్‌లుగా పిలుచుకునే ఇవి ఎంజైమ్‌ల మాదిరిగా ఉత్ప్రేరక గుణాలు కలిగుండటం విశేషం. జబ్బుల చికిత్సలో ఇవి గణనీయంగా తోడ్పడగలవు. క్యాన్సర్ కణాల వంటి వాటికి అంటుకునేలా కూడా వీటిని తీర్చిదిద్దొచ్చు. కొన్ని జీవ వ్యవస్థలు చురుగ్గా పనిచేయటానికీ వాడుకోవచ్చు. సెనిక్స్ అనే సంస్థ ఈ సంవత్సరం సీఎక్స్213 అనే నానోజైమ్‌తో తొలిదశ ప్రయోగ పరీక్షలు చేయటానికి సిద్ధమైంది. ఒకరకం మెదడు వాపును తగ్గించటానికి సీఎక్స్213 ఉపయోగపడుతుంది.

క్వాంటమ్ కంప్యూటర్ పురోగతి



క్వాంటమ్ కంప్యూటర్లు 2026లో తొలిసారి క్వాంటమ్ అడ్వాంటేజ్‌ని అందించొచ్చు. వాస్తవ ప్రపంచ సమస్యలను సంప్రదాయ ఆల్గోరిథమ్‌ల కన్నా మరింత వేగంగా, సమర్థంగా, చవకగా పరిష్కరించే క్వాంటమ్ ఆల్గోరిథమ్‌లను క్వాంటమ్ అడ్వాంటేజ్ అనుకోవచ్చు. సంప్రదాయ కంప్యూటర్లు బైనరీ బిట్స్ (0 లేదా 1) ఆధారంగా పనిచేస్తాయి. అదే క్వాంటమ్ కంప్యూటర్లు 0, 1 రెండింటినీ సమ్మిళితం చేసే క్యూబిట్స్‌తో పనిచేస్తాయి. సూపర్‌పొజిషన్‌లో.. అంటే సున్నాలు, ఒకట్లు ఒకదాంతో మరోటి ఎంటాంజిల్ అయ్యి ఉన్నప్పుడే క్యూబిట్లు ఉనికిలో ఉంటాయి. ఉదాహరణకు- క్యూబిట్‌ను స్విచ్‌లా ఊహించుకోండి. సాధారణంగా స్విచ్‌తో లైటును ఆన్ లేదా ఆఫ్ చేస్తాం కదా. కానీ క్యూబిట్ మధ్యస్థంగా.. ఒకే సమయంలో ఆన్, ఆఫ్ స్థితిలో ఉంటుంది. అంటే సంప్రదాయ కంప్యూటర్ ఒక పని తర్వాత మరోటి చేస్తుంది. అదే క్వాంటమ్ కంప్యూటర్ ఒకే సమయంలో లెక్కలేనన్ని పనులు నిర్వహిస్తుంది. క్వాంటమ్ అడ్వాంటేజ్‌ను సాధిస్తే అత్యంత సంక్లిష్టమైన, ఆచరణ సాధ్యం కాని సమస్యలనూ సమర్థంగా, అతివేగంగా పరిష్కరించటానికి వీలవుతుంది. ప్రముఖ ఐటీ కంపెనీ ఐబీఎం తమ క్వాంటమ్ కంప్యూటర్‌తో ఈ ఏడాది చివర్లో క్వాంటమ్ అడ్వాంటేజ్ తొలి ఉదాహరణలను ప్రదర్శించాలని ప్రయత్నిస్తోంది.

మహా అటనమస్ సెన్సింగ్



డ్రైవర్లు లేకుండా తమకు తామే నడిచే వాహనాలు రోజురోజుకీ ప్రాచుర్యం పొందుతున్నాయి. ఒకప్పుడు కల కావొచ్చు గానీ అమెరికాలోని లాస్ ఏంజెల్స్, సాన్ ఫ్రాన్సిస్కో వంటి నగరాల్లో ఇప్పటికే కొన్ని అటనమస్ కార్లు చక్కర్లు కొడుతున్నాయి. ఇవి లైట్ డిటెక్షన్ అండ్ రేజింగ్ (లైడర్) అనే నావిగేషన్ పరిజ్ఞానంతో ప్రయాణిస్తాయి. వీటిల్లో పరిసరాలను, అడ్డంకులను గుర్తించటానికి బోలెడన్ని సెన్సర్లుంటాయి. సామర్థ్యాన్ని బట్టి డ్రైవర్ లేని కార్ల స్థాయులను సున్నా నుంచి ఐదు వరకు లెక్కిస్తారు. ప్రస్తుతం కొన్ని దేశాల్లో తిరుగుతున్న వాహనాల స్థాయి నాలుగు వరకూ ఉంది. అంటే అవి అనుగుణమైన వాతావరణ పరిస్థితుల్లో తమకు తాముగా ప్రయాణించే సామర్థ్యం కలిగున్నాయన్నమాట. ఇప్పటివరకూ రోడ్ల మీద ఏ అటనమస్ వాహనమూ ఐదో స్థాయికి చేరుకోలేదు. దీనికి వీలు కల్పించే వినూత్న లైడర్ ఆవిష్కరణలకు ఈ సంవత్సరం వేదికయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. అధునాతన అంచనా వ్యవస్థలతో కూడిన, ఎలాంటి వాతావరణంలోనైనా ప్రయాణించటానికి తోడ్పడే కొత్తతరం లైడర్ పరిజ్ఞానం 'హాలో'ను మెర్సిడెస్ బెంజ్ తీసుకురానుంది. ఐదో స్థాయి అటనమస్ వాహనాలు రేపో మాపో రోడ్ల మీద దూసుకుపోవటం ఖాయమని చెప్పుకోవచ్చు.

షావోమీ కొత్త పరికరాలు



షావోమీ తాజాగా రెడ్‌మీ నోట్ 15 5జీ స్మార్ట్‌ఫోన్‌ను పరిచయం చేసింది. ఇది స్నాప్‌డ్రాగన్ 6 జెన్ 3 ప్రాసెసర్, ఆండ్రాయిడ్ 15 ఆధారిత హైపర్‌ఓఎస్ 2తో పనిచేస్తుంది. 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 3,200 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.77 అంగుళాల కర్వ్‌డ్ ఎమోలెడ్ తెర.. 5,520 ఎంఏహెచ్ బ్యాటరీ (ఫోన్‌తో పాటు 45డబ్ల్యూ ఛార్జర్ వస్తుంది).. 108 ఎంపీ ప్రధాన కెమెరా, 8 ఎంపీ అల్ట్రావైడ్ లెన్స్.. ముందు 20 ఎంపీ కెమెరా.. దుమ్ము, నీటిని తట్టుకోవటంలో ఐపీ66 రేటింగ్ ఫీచర్లతో అలరిస్తోంది. 8 జీబీ ర్యామ్, 128 జీబీ స్టోరేజీ రకం ధర రూ. 19,999. 8 జీబీ/256 జీబీ రకం ధర రూ.21,999. ఈనెల 9 నుంచి అమ్మకాలు ప్రారంభం.



● షావోమీ ఫోన్‌తో పాటు ట్యాబ్లెట్ ప్రియుల కోసం రెడ్‌మీ ప్యాడ్ 2 ప్రొ 5జీ కూడా తీసుకొచ్చింది. 120 హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 600 నిట్స్ గరిష్ఠ ప్రకాశం, డాల్బీ విజన్‌ను సపోర్టు చేసే 12.1 అంగుళాల 2.5కే డిస్‌ప్లేతో కనువిందు చేస్తోంది. స్టైలస్‌తో పాటు కీబోర్డు కంపాటబిలిటీ కూడా ఉంది. 12,000 ఎంఏహెచ్ బ్యాటరీ (బాక్సులో 33డబ్ల్యూ ఛార్జర్ ఉంటుంది) కలిగుంది. 27డబ్ల్యూ రివర్స్ ఛార్జింగ్‌నూ సపోర్టు చేస్తుంది. ఆడియో కోసం డాల్బీ ఆటమ్స్ సపోర్టు గల క్వాడ్ స్పీకర్లున్నాయి. స్నాప్‌డ్రాగన్ 7ఎస్ జెన్, హైపర్‌ఓఎస్ 2తో పనిచేసే ఇది జెమినీ ఏఐతో పాటు సర్కిల్ టు సెర్చ్ వంటి ఏఐ ఫీచర్లతోనూ ఆకర్షిస్తోంది. 8 జీబీ ర్యామ్, 128/256 జీబీ స్టోరేజీతో కూడిన దీని ప్రారంభ ధర రూ.22,999.

మధ్యశ్రేణిలో ఒప్పో ఏ6 5జీ

మధ్యశ్రేణి వినియోగదారులను దృష్టిలో పెట్టుకొని ఒప్పో కొత్త ఏ సిరీస్ స్మార్ట్‌ఫోన్‌ను తీసుకొచ్చింది. పేరు ఒప్పో ఏ6 ప్రొ 5జీ. మీడియాటెక్ డైమెన్సిటీ 6300 చిప్, కలర్‌ఓఎస్ 15తో పనిచేసే దీని ఫీచర్లు..



- 120హెచ్‌జడ్ రిఫ్రెష్ వేగం, 1,125 నిట్స్ గరిష్ఠ ప్రకాశంతో కూడిన 6.75 అంగుళాల తెర.
- 50 ఎంపీ ప్రధాన కెమెరా, 2 ఎంపీ మోనోక్రోమ్ లెన్స్ ముందు 16 ఎంపీ కెమెరా
- నీటిని తట్టుకోవటంలో ఐపీ69 రేటింగ్ కలిగుంది. ఒకటిన్నర లోతు నీటిలో అరగంట సేపు మునిగినా ఏమీ కాదు.
- భారీ 7000ఎంఏహెచ్ బ్యాటరీ, 80డబ్ల్యూ సూపర్‌వూక్ ఫ్లాష్ ఛార్జర్. సూపర్‌కూల్ వీసీ సిస్టమ్.
- 8 జీబీ ర్యామ్, 128/256 జీబీ స్టోరేజీ. ● ప్రారంభ ధర రూ.21,999.

మహా ఐరన్ బ్యాటరీ కోసం

బ్యాటరీల్లో వీలైనంత ఎక్కువ శక్తిని నిల్వ చేయటానికి రోజురోజుకీ ప్రాధాన్యం పెరిగిపోతోంది. ఆధునిక టెక్ ప్రపంచంలో విద్యుత్తు వాహనాల దగ్గరి నుంచి భారీ బ్యాటరీ కేంద్రాల వరకూ అన్నింటికీ అత్యధిక సామర్థ్యం గల బ్యాటరీలు తక్షణావసరంగా మారాయి మరి. ప్రస్తుతం చాలావరకూ లిథియం అయాన్ బ్యాటరీలే వాడుతున్నారు. సాధారణంగా వీటిల్లో కోబాల్ట్, నికెల్‌తో కూడిన కాథోడ్లు ఉంటాయి. ఈ లోహాలు ఖరీదైనవి. వీటిని సేకరించటంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గనులను తవ్వి తీయటం వల్ల పర్యావరణానికీ హాని కలుగుతోంది. ఈ నేపథ్యంలో ఇటీవల కోబాల్ట్, నికెల్‌కు బదులు ఐరన్‌ను వాడుకోవటం మొదలైంది. ఇది చవక. కాకపోతే ఐరన్ ఆధారిత బ్యాటరీల్లో సామర్థ్య పరంగా కొన్ని చిక్కులు.. ముఖ్యంగా ఆపరేటింగ్ వోల్టేజీలు, విద్యుత్తు స్థాయుల్లో సమస్యలు తలెత్తుతున్నాయి. వీటిని పరిష్కరించే క్రమంలో స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ పరిశోధకులు అత్యధిక ఆక్సీకరణ స్థితితో కూడిన ఒక ఐరన్ రకాన్ని రూపొందించారు. సంప్రదాయ ఐరన్ కన్నా భిన్నమైన విద్యుత్ గుణాలు గల అతి సూక్ష్మ స్ఫటిక రేణువులను పొందుపరచి దీన్ని రూపొందించారు. ఇది అత్యధిక వోల్టేజీని తట్టుకునే, మార్చుకునే, స్థిరమైన బ్యాటరీ కాథోడ్‌కు వీలు కల్పిస్తుంది. ఇప్పుడు వాణిజ్యపరంగా వాడుకునే విధంగా తీర్చిదిద్దటం మీద దృష్టి సారించారు.

యమహో ఏజెంటిక్ బ్రౌజర్

కొత్త తరం ఏఐ ఆధారిత బ్రౌజర్ల రాకతో ఇంటర్నెట్‌ను శోధించే తీరే మారిపోయింది. ఏజెంటిక్ ఏఐ బ్రౌజర్లుగా పిలుచుకుంటున్న ఇవి స్మార్ట్‌ఫోన్, పీసీ తెరల మీద ఏమేం ఉన్నాయో చూడగలవు. ప్రాంప్ట్‌లు, మాటల రూపంలో ఇచ్చే సందేశాలను అర్థం చేసుకోగలవు. వాటి ప్రకారం నడచుకోగలవు. ఆయా అంశాలను వెతకటం, సమాచారాన్ని సంక్షిప్తీకరించటం దగ్గరి నుంచి ఫారాలు నింపటం, షాపింగ్, ప్రయాణ టికెట్లు బుక్ చేయటం వంటి ఆన్‌లైన్ సేవల వరకూ ఎన్నెన్నో పనులు చేసి పెడుతున్నాయి. అలాంటి కొన్ని ఏజెంటిక్ ఏఐ బ్రౌజర్ల గురించి తెలుసుకుందామా.

చాట్‌జీపీటీ అట్లాస్: ప్రస్తుత ఏఐ బూమ్‌ను వెల్లువెత్తేలా చేసింది చాట్‌జీపీటీనే. లార్జ్ లాంగ్వేజ్ మోడల్ ఆధారిత చాట్‌బాట్స్‌ను ప్రపంచానికి పరిచయం చేసింది. చాట్‌జీపీటీ అట్లాస్‌తో ఏజెంటిక్ వెబ్ బ్రౌజింగ్‌ను చేరువ చేసింది. ఓపెన్‌ఏఐకి చెందిన అధునాతన ఏఐ మోడల్ అయిన జీపీటీ-5తో కూడిన ఇది చాలా శక్తిమంతమైంది. ఒకసారి ఏజెంట్ మోడ్‌ను యాక్టివేట్ చేసుకుంటే సైడ్‌బార్‌లోని ఆస్క్ చాట్‌జీపీటీ ద్వారా సూచనలు ఇవ్వొచ్చు. పేజీలు ఓపెన్ చేయటం, ఫారాలు పూరించటం వంటి పనులన్నీ తనే చేస్తుంది. తన మౌస్, కీబోర్డుతో పనులు పూర్తిచేస్తుంది. ఒకరకంగా మీ కంప్యూటర్‌ను రోబోకు అప్పగించినట్టుగా అనిపిస్తుంది. చాట్‌జీపీటీ మాదిరిగానే అట్లాస్ బ్రౌజర్‌కూ తనదైన మెమరీ ఉంటుంది. అందుకే సమాచారాన్ని దాచుకొని, గుర్తుతెచ్చుకోగలదు. మనకు అవసరమైన పనులు చేయటానికి వీటికి వాడుకోగలదు. ప్రస్తుతం ప్రొ లేదా ప్లస్ టయర్ యూజర్లకు మాత్రమే.. అదీ మ్యాక్‌ఓఎస్ మీదే ఏఐ ఏజెంట్ మోడ్ అందుబాటులో ఉంది. త్వరలో ఎక్కువ మందికి అందుబాటులోకి వచ్చినా ఆశ్చర్యపోనసరం లేదు.

ఒపేరా నియాన్: ఒపేరాకు చెందిన ఏరియా బ్రౌజర్ ఏఐతో దీన్ని రూపొందించారు. మాటల రూపంలో ఇచ్చే ప్రాంప్ట్‌లను అర్థం చేసుకుంటుంది, ఇమేజ్‌లను సృష్టిస్తుంది. దీని ప్రత్యేకత ప్రైవసీ. హైబ్రిడ్ ప్రాసెసింగ్ మోడల్ ద్వారా పరికరంలోని కంప్యూటింగ్ వనరులు, క్లౌడ్ మధ్య తెలివిగా సమతుల్యత పాటిస్తుంది. సున్నిత సమాచారం, వ్యక్తిగత సంభాషణలను పరికరానికే పరిమితం చేస్తుంది. పనిభారం ఎక్కువగా ఉంటే దాన్ని క్లౌడ్‌కు బదిలీ చేస్తుంది.

పర్‌ప్లెక్సిటీ కామెట్: గూగుల్ వంటి సంప్రదాయ సెర్చ్ ఇంజిన్ల ఆధిపత్యాన్ని సవాల్ చేయటానికి 'ఆన్సర్ ఇంజిన్'గా కామెట్‌ను రూపొందించారు. మంచి స్పందన రావటంతో ఏజెంటిక్ ఏఐ బ్రౌజర్‌గా తీర్చిదిద్దారు. ఇప్పుడిది షాపింగ్, క్యాలెండర్ మేనేజింగ్, ఈమెయిల్ డ్రాఫ్టింగ్ వంటి అటనమస్ పనులను తేలిగ్గా చేసేస్తోంది. రిసెర్చ్ టూల్‌గానూ ఉపయోగపడటం విశేషం. చాలా ట్యాబ్‌లను ఓపెన్ చేయటానికి, వేర్వేరు వనరుల నుంచి సమాచారాన్ని క్రోడీకరించటానికిది వీలు కల్పిస్తుంది. ఈ విషయంలో ఇతర ఏజెంటిక్ బ్రౌజర్లతో పోలిస్తే కామెట్ తన ప్రత్యేకతను ప్రదర్శిస్తోంది.

మ్యానస్: దీన్ని ఏజెంటిక్ బ్రౌజర్ అనటం కన్నా 'క్లౌడ్‌లో బ్రౌజర్'గా చెప్పుకోవచ్చు. నాచురల్ లాంగ్వేజ్ ఇంటర్ఫేస్ ద్వారా దీనికి సూచనలు ఇవ్వొచ్చు. కాకపోతే ఇది మన బ్రౌజర్ ద్వారా కాకుండా క్లౌడ్‌లో తన సొంత బ్రౌజర్‌లో కంప్యూటింగ్ చేస్తుంది. న్యూస్ సైట్లను స్కాన్ చేయటం దగ్గరి నుంచి డేటా సారాంశం వరకూ చాలా పనులు నిర్వహిస్తుంది. మనుషుల పర్యవేక్షణ, గైడెన్స్ లేకపోయినా సంక్లిష్టమైన, వివిధ అంచెల రిసెర్చ్ ప్రక్రియలనూ చేపడుతుంది.

వినూత్న ప్రదర్శనం

కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్ షో (సీఈఎస్) అనగానే భవిష్యత్ టెక్నాలజీ సముదాయమే గుర్తుకొస్తుంది. అమెరికాలోని లాస్ వేగాస్‌లో ఏటా నిర్వహించే ఇది ఈ సంవత్సరమూ అదరగొడుతోంది. విచిత్రమైన టెక్నాలజీలు, గ్యాడ్జెట్లతో కనువిందు చేస్తోంది. అలాంటి కొన్ని పరికరాలు ఇవిగో..

పెంపుడు బంతి

పెంపుడు జంతువుల మీద ఉండే మమకారం చెప్పలేనిది. కొందరు వీటిని విడిచి ఉండలేరు కూడా. ఆఫీసుకు వెళ్లినప్పుడు వీటిని వెంట తీసుకెళ్లటం కుదరదు కదా. మరి ఎక్కడున్నా వాటితో ఆడుకునేలా ఉంటే? పెపెహోలా బంతి ఉంటే ఇది సాధ్యమే. ఇంటర్నెట్‌తో అనుసంధానమయ్యే ఇది పెంపుడు జంతువుతో ఆడుకోవటానికి వీలు కల్పిస్తుంది. రిమోట్‌తో బంతిని విసరటం వంటివి చేయొచ్చు. ఇలా ఫోన్‌లోని పెపెహోలా యాప్‌లో చూస్తూ వాటితో ఆడుకోవచ్చు. దీని బ్యాటరీని ఒకసారి ఛార్జ్ చేస్తే నాలుగు రోజుల వరకూ వస్తుంది.



ఘన బ్యాటరీ బైక్



ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి సాలిడ్ స్టేట్ బ్యాటరీతో కూడిన ఎలక్ట్రిక్ మోటార్‌బైక్. ఫిన్లాండ్‌కు చెందిన వర్జ్ కంపెనీ రూపొందించిన దీని పేరు టీఎస్ ప్రొ. కేవలం 10 నిమిషాలు ఛార్జ్ చేస్తే 370 మైళ్ల వరకూ ఆగకుండా ప్రయాణిస్తుంది. లిథియం అయాన్ బ్యాటరీల కన్నా సాలిడ్ స్టేట్ బ్యాటరీల్లో శక్తి సాంద్రత ఎక్కువ. చిన్న బ్యాటరీలతోనే ఎక్కువ సామర్థ్యం లభిస్తుంది. ఎక్కువ దూరం ప్రయాణించే ఎలక్ట్రిక్ వాహనాలకిది వరమని చెప్పుకోవచ్చు. సురక్షితం, చవక కూడా.

రోబో శునకం

ఒక కాలితో షేక్ హ్యాండ్ ఇస్తున్న దీని పేరు సిరియస్. ఇది మామూలు రోబో శునకం కాదు, ఏఐ సామర్థ్యాలు కలిగుంది. నడవటం, గెంతటమే కాదు, పెంపుడు కుక్క మాదిరిగానే మీ మాటలకూ స్పందిస్తుంది. కూర్చో, లే, షేక్ హ్యాండ్ ఇవ్వు అనగానే చేసేస్తుంది. 14 మోటార్లతో కూడిన ఇది హావభావాలనూ అర్థం చేసుకుంటుంది. సంగీతానికి అనుగుణంగా డ్యాన్స్ చేస్తుంది కూడా.





కాళ్లకు సైడ్‌కిక్ దన్ను

ఇది సులభంగా నడవటానికి తోడ్పడే పరికరం. వెనకాల కార్బన్ ఫైబర్ ప్లేట్‌తో కూడిన ప్రత్యేక షూ, బ్యాటరీతో పనిచేసే పట్టీల్లాంటి ఎక్సోస్కెలెటన్ ఉంటాయి. దీన్ని ధరించి నడవటం మొదలెట్టగానే ముందు కొద్దిసేపు నడక తీరును విశ్లేషిస్తుంది. తర్వాత ఎక్సోస్కెలెటన్ పనిలోకి దిగి, అడుగు వేసే తీరుకు అనుగుణంగా మడమలను పైకి లేపుతాయి. దీంతో నడవటం తేలికవుతుంది.

విజ్ఞాన క్యూబ్

దీని పేరు లూకా ఏఐ క్యూబ్. పాకెట్ సైజులో ఉండే ఓ ఏఐ తోడు. ప్రత్యేక మల్టీమోడల్ ఇంటరాక్షన్ టెక్నాలజీతో కూడిన దీన్ని ధరించొచ్చు. సైన్స్, చరిత్ర, పర్యావరణ వంటి వాటి గురించి ఎప్పుడైనా, ఎక్కడైనా దీంతో తెలుసుకోవచ్చు. ఇది పరిసరాలను చూడగలదు, అర్థం చేసుకోగలదు. వస్తువులను గుర్తిస్తుంది కూడా. వాటి గురించి అడిగితే వెంటనే వివరిస్తుంది. తెర మీద ఏఐ పాత్రలతో ఇంటరాక్ట్ కావటం కొత్త అనుభూతిని కలిగిస్తుంది.





తోడు రోబోలు

రోబోలంటే పనులు చేసి పెట్టటానికేనా? కాదు, తోడుగా ఉండటానికీ అని జపాన్‌కు చెందిన ల్యాడెన్స్ ఏఐ అంకుర సంస్థ చెబుతోంది. కొకొమో, ఇను అనే రెండు అందమైన పెట్ రోబోలను ప్రదర్శించింది. నారింజరంగులో టెడ్డీబేర్‌లా కనిపిస్తున్న కొకొమో ఓ అటనమస్ పెట్ రోబో. చక్రాల సాయంతో పరుగెడుతుంది. ఇంట్లో మీరు ఎక్కడికి వెళ్తే అక్కడికి వెంట వస్తుంది. క్రమంగా మీ గురించి నేర్చుకుంటుంది. కూనిరాగాల వంటి శబ్దాలతో ప్రతిస్పందిస్తుంది. ఇక ఒక కన్నుతో కూడిన ఇనూ ఏమో డెస్క్‌టాప్ మీద ఒదిగిపోతుంది. పని చేస్తున్నప్పుడు తోడుగా ఉంటుంది. ఆడియో, కదలికల ద్వారా ఇంటరాక్ట్ అవుతుంది. దీనికి వెనకాల చిన్న తోక కూడా ఉంది. మాట, స్పర్శలకు స్పందించి దాన్ని ఊపుతుంది.

పోషణ సలహాదారు

ఇదో ఏఐ ఆధారిత న్యూట్రిషనిస్ట్ రోబో. కాకపోతే పైకి కనిపించదు. ప్లేట్‌లోనే ఒదిగిపోయి ఉంటుంది. అందులో వడ్డించుకున్న పదార్థాలను విశ్లేషించి ఎందులో ఏయే పోషకాలున్నాయో, ఎన్ని కేలరీలు ఉన్నాయో యాప్ ద్వారా చెబుతుంది. మీ అవసరాలను బట్టి తినాలో, వద్దో సూచిస్తుంది.



ఈనాడు సినిమా

వారణాసి.. అరుదైన ఘనత



మహేశ్ బాబు

కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు రాజమౌళి కలయికలో రూపొందుతున్న 'వారణాసి' సినిమా అరుదైన ఘనతని సొంతం చేసుకుంది. ఈ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను పారిస్‌లోని ప్రఖ్యాత లే గ్రాండ్ రెక్స్ థియేటర్లో ప్రదర్శించారు. ఇలా అక్కడ ప్రదర్శించిన తొలి భారతీయ సినిమా గ్లింప్స్‌గా 'వారణాసి' రికార్డు నెలకొల్పింది. ఈ విషయాన్ని లే గ్రాండ్ రెక్స్ సామాజిక మాధ్యమాల వేదికగా ప్రకటించగా.. దాన్ని 'వారణాసి' టీమ్ రీట్వీట్ చేస్తూ సంతోషం వ్యక్తం చేసింది. దీన్ని గొప్పగా ఆదరించిన పారిస్ ప్రేక్షకులకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపింది. తమ సాహసయాత్ర వారణాసి నుంచి పారిస్ వరకు చేరుకుందని.. 2027లో పూర్తి మహాకావ్యంతో మళ్లీ థియేటర్లలో కలుద్దామని చిత్ర బృందం ట్వీట్‌లో పేర్కొంది. గతంలో ఈ థియేటర్లో రజనీకాంత్ 'కబాలి', ప్రభాస్ 'బాహుబలి 2', 'సాహో' చిత్రాల్ని ప్రదర్శించారు. అయితే ఓ భారతీయ చిత్ర గ్లింప్స్‌ను ఈ స్థాయిలో ఓ వేడుకగా విడుదల చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఇక మరోవైపు ఈ చిత్ర విడుదల తేదీపైనా నెట్టింట ఆసక్తికర ప్రచారం సాగుతోంది. దీన్ని వచ్చే ఏడాది శ్రీరామ నవమి సందర్భంగా ఏప్రిల్ 9న విడుదల చేసేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. దీనిపై చిత్ర వర్గాల నుంచి స్పష్టత రావాల్సి ఉంది. ప్రపంచాన్ని.. కాలాన్ని చుట్టేసే సాహసికుడి కథతో రూపొందుతున్న ఈ ఫాంటసీ యాక్షన్ అడ్వెంచర్ సినిమాలో మహేశ్‌బాబు రుద్ర అనే శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. అలాగే రామాయణ ఘట్టానికి సంబంధించిన సీక్వెన్స్‌లో రాముడిగా కనువిందు చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు. ఇక దీంట్లో మందాకినిగా ప్రియాంక చోప్రా కనిపించనుండగా.. కుంభ అనే ప్రతినాయక పాత్రను పృథ్వీరాజ్ సుకుమారన్ పోషిస్తున్నారు. దీనికి ఎం.ఎం కీరవాణి సంగీతమందిస్తుండగా.. కె.ఎల్ నారాయణ, ఎస్.ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు.

మెలిస్సా మెరుపులు



రుక్మిణీ వసంత్

యశ్ 'టాక్సిక్' సినిమాలో రుక్మిణీ వసంత్ పోషిస్తున్న పాత్రేంటన్నది స్పష్టత వచ్చింది. ఆమె ఈ చిత్రంలో మెలిస్సా అనే పాత్రలో కనువిందు చేయనుందని తెలియజేస్తూ చిత్ర బృందం తన ఫస్ట్‌లుక్‌ను నెట్టింట పంచుకుంది. అందులో తను మోడ్రన్ లుక్‌లో స్టైలిష్‌గా పబ్‌లో నుంచి నడిచొస్తున్నట్లు కనిపించింది. 'కాంతార 1' విజయం తర్వాత రుక్మిణి కన్నడలో చేస్తున్న చిత్రమిది. దీంట్లో ఆమెతో పాటు కియారా, నయనతార, హ్యూమా ఖురేషి, తారా సుతారియా ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఇది పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఉండనుంది. ఇక గురువారం యశ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా నుంచి కొత్త లుక్‌తో పాటు ఓ గ్లింప్స్ విడుదలయ్యే అవకాశముంది. ఈ బహుభాషా చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తుండగా.. కేవీఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ మైండ్ క్రియేషన్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ఇది మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది.



నితిన్, ప్రశాంత్, మేఘలేఖ, వర్ష, సత్య సాయిబాబా, సురేశ్ బొబ్బిలి, సాయికృష్ణ

సిరీస్ చివరివరకూ ఆ ప్రశ్నలే వెంటాడతాయి

'కానిస్టేబుల్ కనకం 2' దర్శకుడు ప్రశాంత్

ETV WIN

"'కానిస్టేబుల్ కనకం'ను మించి 'కానిస్టేబుల్ కనకం 2' అందరికీ నచ్చుతుంద"న్నారు దర్శకుడు ప్రశాంత్ దిమ్మల. చంద్రిక ఎక్కడుందనే ప్రశ్నకు ఈ రెండో సీజన్‌తో సరైన సమాధానం దొరుకుతుందని.. సిరీస్ చివరి వరకు 'ఎందుకు.. ఏమిటీ' అనే ప్రశ్నలు వెంటాడుతుంటాయని తెలిపారు. ఆయన దర్శకత్వం వహించిన ఈ క్రైమ్ థ్రిల్లర్ సిరీస్‌లో వర్ష బొల్లమ్మ టైటిల్ పాత్ర పోషించారు. మేఘలేఖ, రాజీవ్ కనకాల, శ్రీనివాస్ అవసరాల కీలక పాత్రలు పోషించారు. కోవెలమూడి సత్య సాయిబాబా, వేమూరి హేమంత్ కుమార్ నిర్మించారు. ఈ కొత్త సీజన్ ఈ నెల 8నుంచి ఈటీవీ విన్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నటి వర్ష బొల్లమ్మ మాట్లాడుతూ.. "రెండేళ్ల క్రితం ఈటీవీలో ఈ సిరీస్ చేస్తున్నానని చెప్పినప్పుడు కొందరు 'అందులో చేస్తున్నావా?' అని అడిగారు. ఇప్పుడు వాళ్లంతా ఈటీవీలోనే సిరీస్‌లు, సినిమాలు చేస్తున్నారు. ఇంత మంచి కుటుంబంలో భాగమైనందుకు చాలా ఆనందంగా ఉంది. మా 'కానిస్టేబుల్ కనకం 2' జిమ్‌జామ్‌లా చాలా రుచికరంగా ఉంటుంది. ప్రస్తుతం అందరూ చంద్రిక ఎక్కడుందని అడుగుతున్నారు. ఈ సీజన్‌తో నేను సహస్ర ఎవరని అడగబోతున్నా" అన్నారు. "ఈ రెండో సీజన్ అద్భుతంగా వచ్చింది. ట్విస్ట్‌లు, మలుపులు, ప్రతి పాత్ర రివీల్ అయ్యే తీరు ఆకట్టుకుంటాయి. దీంట్లో ఉత్కంఠభరితమైన డ్రామాను చూస్తార"న్నారు దర్శకుడు ప్రశాంత్ దిమ్మల. నటి మేఘలేఖ మాట్లాడుతూ.. "చంద్రిక పాత్రని నేను చేయగలనని నమ్మి నాకిచ్చినందుకు దర్శకుడు ప్రశాంత్‌కు కృతజ్ఞతలు. ఈ సంక్రాంతిని ప్రేక్షకులంతా మా 'కానిస్టేబుల్ కనకం 2'తో వేడుక చేసుకుంటారని నమ్ముతున్నా" అంది. "మా 'కానిస్టేబుల్ కనకం' తొలి సీజన్ చిరంజీవి ట్రైలర్ విడుదల చేయడంతో మొదలైంది. ఇప్పుడాయన సినిమాతో పాటు విడుదలవుతుండటంతో మా కనకం ప్రయాణం పూర్తి కానుంది" అన్నారు ఈటీవీ విన్ కంటెంట్ హెడ్ నితిన్. ఈటీవీ విన్ హెడ్ సాయికృష్ణ మాట్లాడుతూ.. "మా 'కానిస్టేబుల్ కనకం 2' విడుదలయ్యే వరకు తొలి సీజన్‌ను ఈటీవీ విన్‌లో ఉచితంగా చూడొచ్చు. అది చూస్తేనే ఈ రెండో సీజన్ అర్థమవుతుంది. ఈ ఏడాది విన్ నుంచి ఎనిమిది థియేట్రికల్ సినిమాలొస్తాయి. ఏడు వెబ్‌సిరీస్‌లు వస్తాయి" అన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయిబాబా, సురేశ్ బొబ్బిలి, విష్ణు, సుహాస్, రమణ భార్గవ్, ప్రియదర్శిని, సౌమ్య, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఏడాదిలోనూ కొనసాగేనా వారసుల జోరు?



అహాన్ పాండే



ఆర్యన్ ఖాన్



సుహానా ఖాన్ | శనయా కపూర్ | రషా థడానీ | సారా అర్జున్

సినీ తారలకు ఎంత క్రేజ్ ఉంటుందో.. వాళ్ల నటవారసులకు కూడా బాగానే ఫాలోయింగ్ ఉంటుంది. వాళ్లు కూడా దానికి తగ్గట్లుగానే ఘనంగా తెరపైకి అడుగుపెట్టాలని ముందు నుంచే ప్రణాళికలు చేసుకుంటారు. ఇప్పుడీ బాటలోనే గతేడాది ఒకరు యాక్షన్ అంటూ మెగాఫోన్ పడితే.. మరొకరేమో తొలి అడుగుతోనే రూ.కోట్ల క్లబ్‌లోకి అడుగుపెట్టారు పలువురు హిందీ సినీతారల వారసులు. మరి 2025లో ఎవరి వారసులు, వారసురాల్లు వెండితెరకు పరిచయమయ్యారు? ఆ యువతారలు ఈ కొత్త ఏడాదిలో ఎలాంటి కథలతో అలరించబోతున్నారు?

శనయా ప్రేమకథ

గతేడాది బాలీవుడ్‌లోకి అడుగుపెట్టిన నటవారసుల్లో శనయా కపూర్ ఒకరు. నటుడు సంజయ్ కపూర్, మహీప్ కపూర్ దంపతుల ముద్దుల కుమార్తె ఈమె. విక్రాంత్ మాస్సేతో కలిసి 'ఆంఖోన్‌కి గుస్తాఖియాన్' సినిమాతో తొలిసారి ప్రేక్షకుల్ని పలకరించిందీమె. ఈ ప్రేమకథా చిత్రం ఆశించినంత ఫలితాన్ని అందుకోలేకపోయినా ఇందులో శనయా నటనకు మంచి మార్కులే పడ్డాయి. ఇప్పటికే 'గుంజన్ సక్సేనా' చిత్రానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా, 'ది ఫ్యాబులస్ లైవ్స్ ఆఫ్ బాలీవుడ్ వైవ్స్' అనే వెబ్‌సిరీస్‌లోనూ అతిథి పాత్రలో కనిపించినా.. ఆమె కథానాయికగా తెరపై మెరిసింది మాత్రం 2025లోనే. ఇప్పుడీ కొత్త ఏడాదిలో 'తూ యా మెయిన్' అనే ప్రేమకథతో ప్రేక్షకుల్ని అలరించనుంది శనయా.

తెలుగులో సందడికి సిద్ధం

"ఉయ్ అమ్మా.." అంటూ పాటలు పాడుతూ గతేడాది ప్రారంభంలోనే కుర్రకారుని ఉర్రూతలూగించింది యువకథానాయిక రషా థడానీ. రవీనా టాండన్ కుమార్తెగా తెరకు పరిచయమైన ఈ తార 'ఆజాద్' సినిమాతో 2025లో వెండితెరపై తొలి అడుగు వేసింది. అజయ్ దేవగణ్ మేనల్లుడు అమన్ దేవగణ్, ఆమె జంటగా నటించారు. ఈ సినిమా బాక్సాఫీసు వద్ద నిరాశపరిచినా.. రషా నటనకు, తన అదిరిపోయే స్టెప్పులకు మంచి మార్కులే పడ్డాయి. తక్కువ సమయంలోనే ఆమె తెలుగులో కూడా సందడి చేయడానికి సిద్ధమవడం విశేషం. ప్రస్తుతం ఘట్టమనేని జయకృష్ణ సరసన 'శ్రీనివాస మంగాపురం' చిత్రంలో నటిస్తోంది. ఆమెతో పాటు బాలనటిగా ప్రేక్షకులకు సుపరిచితమైన రాజ్ అర్జున్ నటవారసురాలు సారా అర్జున్ 'ధురంధర్'తో కథానాయికగా తెరపై మెరిసింది.

తండ్రి బాటలో నడుస్తూ.. తెరపైకి అడుగుపెడతారనుకున్నారు అభిమానులు. కానీ మెగా ఫోన్ పట్టి యాక్షన్ చెప్పారు. ఇదంతా బాలీవుడ్ అగ్రహీరో షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ గురించే. గతేడాది 'బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' సిరీస్‌తో దర్శకుడిగా పరిచయమయ్యారు ఆర్యన్. హిందీ చిత్రపరిశ్రమ చుట్టూ తిరిగే కథనాన్ని తనదైన శైలిలో చూపించారు. షారుక్, ఆమిర్, సల్మాన్, రణ్‌వీర్ సింగ్ లాంటి పలువురు హీరోలతో పాటు దర్శకుడు రాజమౌళి తళుక్కున మెరవడం ఈ సిరీస్‌కి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఇప్పుడాయన ఈ కొత్త ఏడాదిలో దర్శకుడిగా మరో మెట్టు ఎక్కుతూ.. ఓ భారీ చిత్రాన్ని తెరకెక్కించే పనిలో ఉన్నట్లు సమాచారం.

కింగ్‌తో తెరపైకి ఎంట్రీ

ఇప్పటికే 'ది ఆర్చీస్' చిత్రంతో ఓటీటీ వేదికగా అలరించింది షారుక్ ఖాన్ కుమార్తె సుహానా ఖాన్. ఇప్పుడామె ఈ ఏడాది వెండితెరపై మ్యాజిక్ చేయడానికి ముస్తాబవుతోన్నట్లు తెలుస్తోంది. షారుక్ ప్రధాన పాత్రలో 'కింగ్' సినిమాలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ యాక్షన్ చిత్రంలో సుహానా కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులోని యాక్షన్ సీక్వెన్స్ కోసం షారుక్ స్వయంగా తన కుమార్తెకు శిక్షణ ఇస్తున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. హాస్య నటుడు గోవిందా కుమారుడు యశ్వర్ధన్ అహూజా కూడా ఈ సంవత్సరమే చిత్రపరిశ్రమలోకి అడుగుపెట్టబోతున్నట్లు సమాచారం. వీరితో పాటు 'ఇక్కీస్' సినిమాతో అక్షయ్ కుమార్ మేనకోడలు సిమర్ భాటియా.. అమితాబ్ బచ్చన్ మనవడు అగస్త్య నంద తెరపై మెరిశారు.

తొలి అడుగుతోనే రూ.కోట్ల క్లబ్‌లోకి

రాత్రికి రాత్రే స్టార్ అవ్వడమనే విషయానికి నిదర్శనంగా నిలిచాడు యువకథానాయకుడు అహాన్ పాండే. 2025లో 'సైయారా'తో అదిరిపోయే హిట్ అందుకొని చిత్రపరిశ్రమలోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చిన హీరో ఈయన. సీనియర్ నటుడు చంకీ పాండే సోదరుడు చిక్కీ పాండే కుమారుడే ఇతను. మోహిత్ సూరి తెరకెక్కించిన ఈ 'సైయారా' చిత్రంలో అనీత్ పడ్డా, అహాన్ పాండే జంటగా నటించారు. 2025లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలిచిందీ సినిమా. మౌత్ టాక్ పవర్ ఏంటో మరోసారి రుజువు చేసిన ఈ ప్రేమకథలో అహాన్ తన నటనతో యువతను ఫిదా చేశారు. తొలి అడుగులోనే రూ.కోట్ల క్లబ్‌లోకి చేరిన అహాన్‌కు ఈ సంవత్సరం ప్రత్యేకంగా నిలిచిపోతుందనడంలో సందేహమే లేదు. ఈ కొత్త ఏడాదిలో కూడా ఈ విజయపరంపరను కొనసాగించడానికి ఇప్పటికే ప్రయత్నాలు మొదలుపెట్టారాయన. ప్రస్తుతం అహాన్... అలీ అబ్బాస్ జాఫర్ తెరకెక్కిస్తున్న ఓ చిత్రంలో హీరోగా నటిస్తున్నట్లు తెలుస్తోంది.

వింటేజ్ చిరంజీవిని చూస్తారు

"కామెడీ, యాక్షన్, ఎమోషన్ అన్నీ ఉన్న సినిమా 'మన శంకర వరప్రసాద్ గారు'. ఇన్నాళ్లు చిరంజీవి నుంచి ఏమైతే మిస్ అయ్యామో అవన్నీ దీంట్లో ఉంటాయి. ఇది ఆద్యంతం కడుపుబ్బా నవ్విస్తుంది" అన్నారు నిర్మాతలు సాహు గారపాటి, సుస్మిత కొణిదెల. వాళ్లిద్దరూ సంయుక్తంగా నిర్మించిన ఈ సినిమాలో చిరంజీవి టైటిల్ పాత్ర పోషించారు. అనిల్ రావిపూడి తెరకెక్కించారు. నయనతార కథానాయికగా నటించగా.. వెంకటేశ్ ప్రత్యేక పాత్ర పోషించారు. ఈ సినిమా సంక్రాంతి సందర్భంగా ఈనెల 12న థియేటర్లలోకి రానుంది. ఈ నేపథ్యంలోనే మంగళవారం హైదరాబాద్‌లో విలేకర్లతో చిత్ర విశేషాలు పంచుకున్నారు నిర్మాతలు సాహు - సుస్మిత.



ఆ ట్రాక్ మరోస్థాయిలో
సాహు గారపాటి

"సెన్సార్ వాళ్లు సినిమా చూసి చాలా నవ్వుకున్నారు. పిల్లలతో కలిసి చూసే సినిమాలా ఉందని మెచ్చుకున్నారు. అలాగే ట్రైలర్ చూసి చిరంజీవి, వెంకటేశ్‌ల అభిమానులంతా చాలా ఎంజాయ్ చేస్తున్నారు. ఎందుకంటే తొలిసారి ఇద్దరు స్టార్స్ కలిసి నటించిన సినిమా కావడం అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది. వాళ్లిద్దరి మధ్య మంచి స్నేహం ఉండటం వల్ల చాలా ఇష్టంగా కలిసి పని చేశారు. సినిమాలో వాళ్లిద్దరి మధ్య చాలా ఫన్నీ సీన్స్ ఉన్నాయి. ఈ చిత్ర ప్రచార కార్యక్రమాల్లోనూ వాళ్లిద్దరూ కలిసి పాల్గొంటారు. అలాగే నయనతార, చిరు మధ్య సన్నివేశాలు ఎలా ఉంటాయన్నది ట్రైలర్‌లో శాంపిల్‌గా చూపించాం. ఆ భార్యాభర్తల ట్రాక్ సినిమాలో మరో స్థాయిలో అలరిస్తుంది".

● "అన్ని రకాల కమర్షియల్ హంగులతో నిండిన చిత్రమిది. చిన్నప్పటి నుంచి చిరంజీవి సినిమాలు చూస్తూ పెరిగిన వాళ్లు ఈ చిత్రం ద్వారా మరోసారి ఆ వింటేజ్ చిరును చూస్తారు. చిరంజీవి వ్యక్తిగతంగానూ ఫిట్‌నెస్‌కు చాలా ప్రాధాన్యత ఇస్తారు. ఈ సినిమా అవుట్‌డోర్ షూట్ జరిగే సమయంలోనూ రెండు పూటల జిమ్ చేసేవారు. మా సినిమా అందరి కన్నా ముందు నుంచే సంక్రాంతి రేసులో ఉంది. ఆ తర్వాత మరో రెండు మూడు సినిమాలు పండగ బరిలోకి వచ్చాయి. ఒకేసారి ఇన్ని చిత్రాలు పోటీలో ఉండటం వల్ల ప్రతి ఒక్కరికీ కొంత థియేటర్లు తగ్గుతాయి. అది అందరికీ ఇబ్బందే. కానీ, మాకైతే థియేటర్ల పరంగా వచ్చిన పెద్ద ఇబ్బందైతే ఏమీ లేదు. టికెట్ ధరలు పెంపునకు సంబంధించి రెండు తెలుగు ప్రభుత్వాలతో మాట్లాడుతున్నాం. దీనిపై ఈ రెండు రోజుల్లోనే స్పష్టత రావొచ్చు. ఈ సినిమాకి ముందు రోజే ప్రీమియర్లు ప్లాన్ చేస్తున్నాం. ఈ చిత్రానికి సీక్వెల్ చేసే ఆలోచనలేమీ లేవు".

ఇది నా కెరీర్‌కి మైలురాయి: సుస్మిత కొణిదెల

"ఇది మంచి కుటుంబ కథా చిత్రం. అసభ్యతకు తావులేకుండా మంచి వినోదంతో నిండి ఉంటుంది. నా కెరీర్‌కు మైలురాయి లాంటి సినిమా ఇది. దీంట్లో భాగమవ్వడాన్ని అదృష్టంగా భావిస్తున్నా. ఇది నాన్నకి ఎంతో ఇష్టమైన కామెడీ జానర్ సినిమా కావడం.. అనిల్ రావిపూడి దర్శకత్వం వహించడం.. సాహు గారపాటితో కలిసి నేను నిర్మించడం.. ఈ ప్రయాణాన్ని ఆద్యంతం ఆస్వాదించా. ఈ కథలో వెంకటేశ్ పాత్రకు చాలా ప్రాధాన్యముంది. ఆయన తెరపైకి వచ్చినప్పటి నుంచి సినిమాలో వినోదం ఒక్కసారిగా రెట్టింపవుతుంది. దీంట్లో ఆయన పోషించిన పాత్రకు.. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాలో చేసిన పాత్రకు ఏ పోలిక ఉండదు".

● "ఈ చిత్ర టీజర్, ట్రైలర్‌లలో నాన్నని చూసిన వాళ్లంతా.. 30ఏళ్ల క్రితం 'రౌడీ అల్లుడు'లో చిరంజీవిని చూసినట్లుందని మెచ్చుకుంటున్నారు. ఈ కథ నాన్నకి బాగా నచ్చడంతో.. ఈ సినిమా కోసం ఆయన ఓ కొత్త మీటర్ పట్టుకున్నారు. కొత్తదనం నిండిన నటనతో తెరపై చాలా ఫ్రెష్‌గా కనిపిస్తారు. దీంట్లో తన లుక్ కోసం నాన్న కఠిన కసరత్తులు చేశారు. గతంతో పోలిస్తే ఫిట్‌నెస్ చాలా పెంచారు. ఫలితంగానే తెరపై ఓ స్పెషల్ లుక్‌లో కనిపిస్తున్నారు. అందుకే మేము కూడా ఆయన ఫిట్‌నెస్‌కు తగ్గ డ్రెస్‌లే వేయాలి.. అవి ఇప్పటి కల్ట్ యువతరానికీ నచ్చేలా ఉండాలని కాస్ట్యూమ్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. అనిల్ రావిపూడి కూడా తను నాన్నని ఎలా చూడాలనుకుంటున్నారో స్పష్టంగా చెప్పారు. దానివల్ల ఆయనకు స్టైలింగ్ చేయడం మాకు తేలికైంది".

'చంద్రుడిపైకి ప్రయాణం అంత సులభం కాదు. కానీ, అది భారతదేశానికి అసాధ్యం కాదు!' అంటూ 'స్పేస్ జెన్- చంద్రయాన్' సిరీస్ అధికారిక టీజర్‌ను సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది ఓటీటీ సంస్థ. నటి శ్రియా శరణ్, నకుల్


ప్రపంచం గురించి ఇస్రో కంటే ఇంకెవరికి తెలుసు!



శ్రియా

మెహతా ప్రధాన పాత్రల్లో రూపొందిన ఈ సిరీస్‌కు అనంత్ సింగ్ దర్శకత్వం వహించారు. హాట్‌స్టార్ స్పెషల్స్‌లో భాగంగా ఈ సిరీస్ ఈ నెల 23 నుంచి జియోహాట్‌స్టార్‌లో ప్రసారం కానుంది. 'ప్రపంచం గురించి ఇస్రో కంటే బాగా తెలిసిన వారెవరూ లేరు.. ఈ వైఫల్యం తర్వాత చంద్రయాన్ 3 ఎలా ఉంటుంది? మీరు దాన్ని సాధిస్తారా?" లాంటి సంభాషణలతో ఈ టీజర్ వీక్షకుల్లో ఆసక్తిని రేకెత్తించేలా ఉంది. ఈ సిరీస్‌ను భారతదేశ కలలను చరిత్రగా మార్చిన శాస్త్రవేత్తల గురించి.. ఇప్పటి వరకూ ఎవరికీ తెలియని అంశాల ఆధారంగా తెరకెక్కించినట్లు సిరీస్ బృందం వెల్లడించింది. ఈ సిరీస్‌లో ప్రకాశ్ బెలవాడి, డానిష్ సైత్, గోపాల్ దత్ తదితరులు కీలకపాత్రల్లో నటించారు.

ఆ రోజే శంబాల హిట్టని చెప్పా



యుగంధర్ ముని, సాయికుమార్, దిల్ రాజు, ఆది

"ఈరోజుల్లో ఒక సినిమాతో ప్రేక్షకుల్ని ఫిదా చేయడం.. విజయాన్ని అందుకోవడం అంత తేలికేం కాదు. దీన్ని 'శంబాల' చేసి చూపించింది. ఈ చిత్ర ప్రోమో చూసినప్పుడే ఇది సక్సెస్ అవుతుందని చెప్పా" అన్నారు నిర్మాత దిల్‌రాజు. ఆది సాయికుమార్ హీరోగా యుగంధర్ ముని తెరకెక్కించిన చిత్రమే 'శంబాల'. మహిధర్ రెడ్డి, రాజశేఖర్ అన్నభీమోజు నిర్మించారు. అర్చన అయ్యర్ కథానాయిక. ఈ సినిమా ఇటీవల విడుదలైన నేపథ్యంలో మంగళవారం హైదరాబాద్‌లో థ్యాంక్స్ మీట్ నిర్వహించారు. దిల్‌రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ఆదికి ఇది 25వ సినిమా. ఇది మంచి విజయాన్ని అందుకోవడం చాలా ఆనందంగా ఉంది. ఒకప్పుడు 'బొమ్మరిల్లు' సినిమా చిత్ర పరిశ్రమలో చాలా మార్పు తీసుకొచ్చింది. నిజంగా 'బొమ్మరిల్లు 2' తీయాలంటే మాత్రం ఆది, వాళ్ల నాన్న సాయికుమార్‌తోనే తీయాలి. కొడుకు విజయం కోసం ఆ తండ్రి పడే తపనని మాటల్లో చెప్పలేం" అన్నారు. "ఎంతో పోటీ మధ్య విడుదలైన మా సినిమా ఇప్పటికీ విజయవంతంగా రన్ అవుతుండటం చాలా ఆనందాన్నిస్తోంది. దీన్ని మౌత్‌టాక్‌తో ముందుకు తీసుకెళ్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. ఇకపై మంచి సినిమాలు చేస్తా" అన్నారు హీరో ఆది సాయికుమార్. నటుడు సాయికుమార్ మాట్లాడుతూ.. "మంచి కంటెంట్ ఎప్పుడూ గెలుస్తుందని 'శంబాల' నిరూపించింది. ఇది ఈనెల 9న హిందీలో విడుదలవుతోంది. అక్కడా విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో యుగంధర్ ముని, మహిధర్ రెడ్డి, అర్చన అయ్యర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


భల్లే బాగుందిలే.. రెండు మనసుల కూడిక



శర్వానంద్, సాక్షి వైద్య

'నారీ నారీ నడుమ మురారి' చిత్రంతో సంక్రాంతి బరిలో వినోదాలు పంచనున్నారు కథానాయకుడు శర్వానంద్. రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాని అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. సంయుక్తా మేనన్, సాక్షి వైద్య కథానాయికలు. శ్రీవిష్ణు ప్రత్యేక పాత్ర పోషించారు. ఈ చిత్రం ఈనెల 14న విడుదల కానున్న నేపథ్యంలో మంగళవారం ఓ పాటను విడుదల చేశారు. "భల్లే బాగుందిలే.. ఈ రెండు మనసుల కూడిక.. మాయే చేసిందిలే.. మంత్రం వేసిందిలే" అంటూ సాగిన ఈ మెలోడీ పాటను విశాల్ చంద్రశేఖర్ స్వరపరిచారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యమందించారు. హరిచరణ్ ఆలపించారు.

'భారత్ భాగ్య విధాత' షురూ!



కంగనా రనౌత్

గతేడాది 'ఎమెర్జెన్సీ' చిత్రంతో ప్రేక్షకుల ముందుకొచ్చారు బాలీవుడ్ నటి, ఎంపీ కంగనా రనౌత్. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ రాజకీయ జీవితం ఆధారంగా కంగన స్వీయ దర్శకత్వంలో నటిస్తూ రూపొందించిన చిత్రమిది. ఈ సినిమా తర్వాత ఆమె తదుపరి చిత్రాలను అధికారికంగా ప్రకటించనప్పటికీ.. తాజాగా కంగనా "సినిమా సెట్‌కు తిరిగి రావడం ఆనందంగా ఉందం"టూ ఇన్‌స్టా స్టోరీ ద్వారా పంచుకున్నారు. తన సొంత నిర్మాణ సంస్థ మణికర్ణిక ఫిల్మ్స్ ప్రొడక్షన్ బ్యానర్‌పై.. రాబోయే చిత్రం 'భారత్ భాగ్య విధాత' చిత్రీకరణతో తిరిగి సెట్లో అడుగుపెట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సెట్స్‌కి రావడం పట్ల ఆనందాన్ని వ్యక్తం చేసింది కంగన.





రిలయన్స్ షేరుకు రష్యా చమురు సెగ

డిసెంబరు నుంచి దిగుమతి చేసుకోవడం లేదంటూ కంపెనీ స్పష్టత

అమెరికా, ఐరోపా దేశాల ఆంక్షలను ఎదుర్కొంటున్న రష్యా నుంచి రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) ముడి చమురు దిగుమతి చేసుకుంటోందంటూ వచ్చిన వార్తల సెగ మంగళవారం రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరుకు తగిలింది. ముడిచమురు నుంచి ఉత్పత్తి చేసే పెట్రోల్, డీజిల్ వంటి వాటిని ఐరోపా దేశాలకు ఆర్ఐఎల్ ఎగుమతి చేస్తుంటుంది. ఆయా దేశాల ఆంక్షలను ఆర్ఐఎల్ ఉల్లంఘించినట్లుగా వచ్చిన వార్తలను సంస్థ ఖండించినా, స్టాక్‌మార్కెట్లో షేరు 4 శాతానికి పైగా నష్టపోయి, సంస్థ మార్కెట్ విలువ ఒకరోజు రూ.94,000 కోట్లకు పైగా క్షీణించింది.

ఐరోపా దేశాల ఆంక్షల అనంతరమూ రష్యా నుంచి తాము ముడిచమురును దిగుమతి చేసుకున్నట్లు వచ్చిన వార్తల్లో నిజం లేదని ముకేశ్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ స్పష్టం చేసింది. ఐరోపా కూటమి విధించిన ఆంక్షలకు అనుగుణంగా, గుజరాత్‌లోని జామ్‌నగర్ వద్ద ఉన్న తమ రిఫైనరీలో రష్యా ముడిచమురు వాడకాన్ని 2025 నవంబరు 20న ఆపేశామని రిలయన్స్ తెలిపింది. ఇంతకుముందు రష్యా చమురును అత్యధికంగా కొనుగోలు చేసే భారతీయ సంస్థగా ఆర్ఐఎల్ ఉంది. జామ్‌నగర్ కాంప్లెక్స్‌లో రెండు రిఫైనరీలున్నాయి. సెజ్ యూనిట్లో ఉత్పత్తి చేసిన ఇంధనాలను ఐరోపా కూటమి, అమెరికా, ఇతర విపణులకు సంస్థ ఎగుమతి చేస్తోంది. రెండోదైన పాత యూనిట్లో ఉత్పత్తి చేసిన ఇంధనాలను భారతీయ విపణికి ఆర్ఐఎల్ సరఫరా చేస్తోంది. 2025 డిసెంబరు 1 నుంచి రష్యాయేతర దేశాల నుంచి దిగుమతి చేసుకున్న ముడి చమురునే వాడుతున్నట్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ తెలిపింది.

బీపీసీఎల్ కోసం వచ్చాయా?

డేటా అనలిటిక్స్ సంస్థ కెప్లర్ నివేదికను ఉటంకిస్తూ.. 2.2 మిలియన్ బ్యారెళ్ల ఉరల్స్‌తో (రష్యా ముడి చమురులో ఒక రకం) కూడిన మూడు ట్యాంకర్లు సిక్కా ఓడరేవు దిశగా వెళ్తాయని బ్లూమ్‌బర్గ్ వార్తా కథనం తెలిపింది. జామ్‌నగర్ రిఫైనింగ్ కాంప్లెక్స్‌కు సరఫరా అయ్యే ముడి చమురులో అత్యధికం ఈ ఓడరేవు ద్వారానే వస్తుందని పేర్కొంది. అయితే సిక్కా ఓడరేవును రిలయన్స్‌తో పాటు మిగతా సంస్థలూ వాడుతుంటాయి. ఈ వార్తా కథనంలో చెబుతున్న మూడు ఓడల ద్వారా వచ్చిన ముడి చమురు, భారత్ పెట్రోలియం కార్పొరేషన్ (బీపీసీఎల్)కు చెందిన బినా రిఫైనరీ కోసమై ఉండొచ్చని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.

ట్రంప్ హెచ్చరికలే కారణమా?

అమెరికా అధ్యక్షుడు ట్రంప్, భారత్‌పై రెండు రోజుల క్రితం మళ్లీ హెచ్చరికలు చేశారు. రష్యా చమురును కొనడం తనకు సంతోషం కలిగించడం లేదని, భారత్ ఉత్పత్తులపై సుంకం మరింత పెంచుతానని పేర్కొన్నారు. ఈ హెచ్చరికల వల్లే రెండురోజులుగా మన స్టాక్‌మార్కెట్లు నష్టపోతున్నాయి. ఈ పరిస్థితుల్లోనే, రిలయన్స్‌పై బ్లూమ్‌బర్గ్ అందించిన కథనం, మదుపర్లపై ప్రతికూల ప్రభావం చూపిందని భావిస్తున్నారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు మంగళవారం బీఎస్ఈలో 4.42% నష్టపోయి రూ.1,507.70 వద్ద ముగిసింది. గత 8 నెలల్లో ఈ షేరుకు ఒక రోజులో వచ్చిన అత్యధిక నష్టం ఇదే. మంగళవారం ఒక దశలో 5.18 శాతం కుదేలై రూ.1,497.05కూ పడింది కూడా. కంపెనీ మార్కెట్‌విలువ ఒక్క రోజులోనే రూ.94,388.99 కోట్లు ఆవిరై రూ.20,40,290.90 కోట్లకు పరిమితమైంది.

బ్యాంకుల లాభంలో 75 శాతానికి డివిడెండ్ చెల్లింపులు పరిమితం

ఆర్‌బీఐ ప్రతిపాదన

ముంబయి: బ్యాంకులు తమ వాటాదార్లకు చెల్లించే డివిడెండ్లను, నికర లాభంలో 75 శాతానికి పరిమితం చేయాలని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రతిపాదించింది. ఆర్థిక ఏడాదికి షేర్లపై చెల్లించే మొత్తాలను డివిడెండ్‌గా ఆర్‌బీఐ నిర్వచించింది. ఇందులో మధ్యంతర డివిడెండ్ కూడా ఉంటుంది. అయితే పెర్పెచ్యువల్ నాన్ క్యుములేటివ్ ప్రిఫరెన్స్ షేర్ల (పీఎన్‌సీపీఎస్)పై డివిడెండ్‌ను మాత్రం ఈ పరిమితి నుంచి మినహాయించింది. గరిష్ఠ డివిడెండ్ చెల్లింపు లెక్కింపునకు కొత్త పద్ధతిని ప్రతిపాదిస్తూ ముసాయిదాను ఆర్‌బీఐ జారీ చేసింది. ఇందులో భాగంగా డివిడెండ్‌లను ప్రకటించడానికి ముందు దీర్ఘకాలిక వృద్ధి ప్రణాళికలు, మూలధన స్థితిని బ్యాంకుల బోర్డు డైరెక్టర్లు పరిగణనలోకి తీసుకోవాలి. డివిడెండ్ చెల్లింపులకు ప్రతిపాదించిన పరిమితిని బ్యాంకులు నికర లాభం … ఉండాలి. భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న విదేశీ బ్యాంకులు తమ ప్రధాన కార్యాలయానికి నగదు పంపాలంటే, సదరు కాలవ్యవధిలో నికర లాభం కలిగి ఉండాలి. ఫిబ్రవరి 5లోగా వీటిపై స్పందనలు తెలియజేయాల్సిందిగా ఆర్‌బీఐ కోరింది.

కంటి వ్యాధులకు ఆధునిక చికిత్స



న్యూసెలియన్ థెరప్యూటిక్స్‌తో పాండోరమ్ భాగస్వామ్యం

ఈనాడు, హైదరాబాద్: కంటి వ్యాధులకు అత్యాధునిక చికిత్సను అందించే దిశగా న్యూసెలియన్ థెరప్యూటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో, పాండోరమ్ టెక్నాలజీస్ వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఆసియా-పసిఫిక్ మార్కెట్ల కోసం ఎక్సోజోమ్ ఆధారిత కణజాల పునరుద్ధరణ చికిత్సల తయారీని విస్తరించడమే ఈ ఒప్పంద లక్ష్యం. వ్యాక్సిన్ల తయారీ సంస్థ భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్‌కు పూర్తిస్థాయి అనుబంధ సంస్థ న్యూసెలియన్ థెరప్యూటిక్స్, కాంట్రాక్టు పరిశోధన, అభివృద్ధి, ఉత్పత్తి సేవల (సీఆర్‌డీఎంఓ) విభాగానికి చెందిన టిష్యూ ఇంజినీరింగ్, రీజనరేటివ్ మెడిసిన్ సంస్థ పాండోరమ్ అభివృద్ధి చేసిన కురాజెనెక్స్ అనే వినూత్న చికిత్సను భారీ స్థాయిలో ఉత్పత్తి చేసేందుకు అవసరమైన పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలను న్యూసెలియన్ అందించనుంది. ఈ ప్రాజెక్టు ప్రస్తుతం కంటి ఉపరితల గాయాలు, స్టీవెన్స్-జాన్సన్ సిండ్రోమ్, న్యూరోట్రోఫిక్ కెరాటిటిస్ వంటి తీవ్ర కంటి సమస్యలపై దృష్టి సారిస్తోంది. రాబోయే రోజుల్లో చర్మం, ఊపిరితిత్తులు, ఇతర అవయవాల వాపు, ఫైబ్రోసిస్ వంటి సమస్యలకూ ఈ చికిత్సలను విస్తరించాలని పాండోరమ్ లక్ష్యంగా పెట్టుకుంది. సంక్లిష్ట బయోలాజిక్స్ తయారీకి తమ వద్ద అత్యాధునిక తయారీ వేదికలు ఉన్నాయని న్యూసెలియన్ ముఖ్య వ్యాపార అధికారి (సీబీఓ) రఘు మలపాక వివరించారు. తాజా ఒప్పందం భారత అత్యాధునిక బయోలాజిక్ థెరపీల తయారీ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటి చెబుతుందని పాండోరమ్ సీఈఓ తుహిన్ భౌమిక్ అన్నారు. భారత్‌లో తయారీ, భారత్‌లో ఆవిష్కరణలకు ఇది నిదర్శనమని భారత ప్రభుత్వ బయోటెక్నాలజీ విభాగం ఎండీ జితేంద్ర కుమార్ పేర్కొన్నారు.

జీవితాంతం బీమా రక్షణ.. ఆదాయం

జీవన్ ఉత్సవ్‌ను ఆవిష్కరించిన ఎల్ఐసీ

ఈనాడు - హైదరాబాద్

ప్రభుత్వ రంగ బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) సరికొత్త బీమా పాలసీ 'జీవన్ ఉత్సవ్'ను అందుబాటులోకి తెచ్చింది. జీవితాంతం బీమా రక్షణ అందించే ఏక (సింగిల్) ప్రీమియం పాలసీ ఇది. ఎల్ఐసీ సీఈఓ, మేనేజింగ్ డైరెక్టర్ ఆర్.దొరైస్వామి ఈ పాలసీని మంగళవారం ఆవిష్కరించారు. మార్కెట్‌తో సంబంధం లేని, లాభాల్లో వాటా లేని వ్యక్తిగత పొదుపు జీవిత బీమా పథకం ఇది. ఇందులో పాలసీదారులకు జీవితాంతం ఆదాయంతో పాటు, బీమా రక్షణ లభిస్తుంది.



✦ 30 రోజుల వయసున్న పిల్లల నుంచి గరిష్ఠంగా 65 ఏళ్ల వయసు గల వారు ఈ పాలసీని ఎంచుకోవడానికి అర్హులు.
✦ కనీస ప్రాథమిక బీమా మొత్తం రూ.5లక్షలు. గరిష్ఠ పరిమితి లేదు.
✦ పాలసీ కాలపరిమితిలో ప్రతి రూ.వెయ్యికి ఏటా రూ.40 చొప్పున గ్యారంటీడ్ అడిషన్స్ జమ అవుతాయి.
✦ రెగ్యులర్ బెనిఫిట్ ఆప్షన్ కింద పాలసీదారులు ఎంచుకున్న వ్యవధిని బట్టి (7 నుంచి 17 ఏళ్ల తర్వాత) ఏటా ప్రాథమిక బీమా మొత్తంలో 10% ఆదాయం లభిస్తుంది.
✦ ఫ్లెక్సీ ఇన్‌కం బెనిఫిట్ ఆప్షన్ కింద పాలసీదారులు తమకు రావాల్సిన 10% ఆదాయాన్ని అప్పుడే తీసుకోకుండా ఎల్ఐసీ వద్దే దాచి పెట్టొచ్చు. ఇలా ఉంచిన మొత్తంపై, సంస్థ వార్షిక వడ్డీ 5.5% (వార్షిక చక్రవడ్డీ) చెల్లిస్తుంది. పాలసీదారులు తమ అవసరానికి అనుగుణంగా ఈ మొత్తాన్ని వెనక్కి తీసుకోవచ్చు.
✦ పాలసీ వ్యవధిలో పాలసీదారు మరణిస్తే నామినీకి పాలసీ మొత్తంతో పాటు, అప్పటివరకూ జమైన గ్యారంటీడ్ అడిషన్స్ అందుతాయి. గడువు తీరే వరకూ జీవించి ఉంటే, మెచ్యూరిటీ ప్రయోజనం కింద ప్రాథమిక బీమా మొత్తం లేదా సింగిల్ ప్రీమియానికి 1.25 రెట్లు (ఏది ఎక్కువగా ఉంటే అది), గ్యారంటీడ్ అడిషన్స్ కలిపి చెల్లిస్తారు. ఈ నెల 12 నుంచి ఈ పాలసీ తీసుకునే వీలుంది.

టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్‌కు పినాక ఆధునికీకరణ పనులు



ఈనాడు, హైదరాబాద్: భారత సైన్యానికి చెందిన మొదటి తరం 'పినాక మల్టిపుల్ లాంచ్ రాకెట్ సిస్టమ్స్ (ఎంఎల్ఆర్ఎస్)', బ్యాటరీ కమాండ్ పోస్టులను ఆధునికీకరించేందుకు, మరమ్మతులు చేసే పనులను టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్) దక్కించుకుంది. మంగళవారం దిల్లీలో జరిగిన అధికారిక కార్యక్రమంలో భారత సైన్యం నుంచి ఈ ఆర్డర్ అందుకున్నట్లు టీఏఎస్ఎల్ తెలిపింది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో భాగంగా, సైన్యంలోని 510 అడ్వాన్స్ బేస్ వర్క్‌షాప్ (ఏబీడబ్ల్యూ), టాటా సంస్థ సంయుక్తంగా పనిచేయనున్నాయి. ఈ ప్రాజెక్టు తొలి దశలో ఎంపిక చేసిన కొన్ని వ్యవస్థలను ప్రయోగాత్మకంగా ఆధునికీకరణ చేస్తారు. అనంతరం మిగిలిన వాటికి అవసరమైన కీలక విడిభాగాలను, సాంకేతిక సహకారాన్ని, నాణ్యతా ప్రమాణాల పర్యవేక్షణను టాటా సంస్థ అందిస్తుంది. 80 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిన పినాక వ్యవస్థను, 1989 నుంచి డీఆర్‌డీఓ సహకారంతో టాటా సంస్థ అభివృద్ధి చేస్తోంది. ప్రస్తుతం ఈ లాంచర్లు పినాక ఎంకే-1 రాకెట్లను ప్రయోగిస్తుండగా, భవిష్యత్తులో అతి తక్కువ మార్పులతో 120 కిలోమీటర్లు, 300 కిలోమీటర్ల దూరాన్ని చేరుకోగల ఆధునిక గైడెడ్ రాకెట్లనూ ప్రయోగించేలా వీటిని తీర్చిదిద్దేందుకు డీఆర్‌డీఓ, టీఏఎస్ఎల్ పనిచేస్తున్నాయి.

కోడి గుడ్లు

7న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	580
వరంగల్	582
విజయవాడ	610
తూ/ప గోదావరి	585
విశాఖపట్నం	585
చిత్తూరు	643

హెచ్‌ఈవీ నివారణ కోసం టీకా

హెవాక్సిన్‌ను ఆవిష్కరించిన డాక్టర్ రెడ్డీస్

ఈనాడు, హైదరాబాద్: కలుషిత నీరు, ఆహారం ద్వారా వ్యాపించే హెపటైటిస్- ఇ వైరస్ (హెచ్‌ఈవీ) నివారణ కోసం 'హెవాక్సిన్' పేరుతో వ్యాక్సిన్‌ను డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ దేశీయ మార్కెట్లోకి విడుదల చేసింది. ఈ వైరస్ వల్ల కలిగే తీవ్రమైన కాలేయ సమస్యలను అరికట్టడంలో ఈ టీకా కీలక పాత్ర పోషిస్తుందని కంపెనీ పేర్కొంది. 18-65 ఏళ్ల వారికి ఇది ఎంతో మేలు చేస్తుందని వెల్లడించింది. దేశంలో హెపటైటిస్- ఇ నివారణకు డ్రగ్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) ఆమోదం పొందిన తొలి వ్యాక్సిన్ ఇదేనని సంస్థ పేర్కొంది. దీర్ఘకాలిక కాలేయ వ్యాధి ఉన్న రోగులకు హెచ్‌ఈవీ ప్రాణాంతకంగా మారుతోందని డాక్టర్ రెడ్డీస్ బ్రాండెడ్ మార్కెట్స్ (భారత్, ఎమర్జింగ్ మార్కెట్స్) సీఈఓ ఎంవీ రమణ పేర్కొన్నారు.

మహీంద్రా ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ ఈవీ



విద్యుత్తుతో నడిచే స్పోర్ట్స్ వినియోగ వాహనం ఎక్స్‌యూవీ 3ఎక్స్‌ఓ ఈవీని మహీంద్రా అండ్ మహీంద్రా ఆవిష్కరించింది. టాటా నెక్సాన్ ఈవీ, ఎంజీ విండ్‌సర్‌కు ఇది పోటీ ఇస్తుందని భావిస్తున్నారు. 4 -4.2 మీటర్ల విభాగంలో ఆవిష్కరించిన ఈ కారులో అడాస్, 360 డిగ్రీ కెమేరా, టచ్‌స్క్రీన్ సిస్టమ్స్, నెట్‌తో అనుసంధానం, పనోరమిక్ సన్‌రూఫ్, డాల్బీ ఆడియో వంటి సదుపాయాలున్నాయి. ఈ కారు ప్రారంభ ధర రూ.13.89 లక్షలు (ఎక్స్‌షోరూం). ఈ కారుకు బుకింగులు ప్రారంభించామని, ఫిబ్రవరి 23 నుంచి డెలివరీలు ఇస్తామని సంస్థ తెలిపింది. 39.4 కిలోవాట్ అవర్ బ్యాటరీ వల్ల ఒక ఛార్జింగుతో 285 కిలోమీటర్లు ప్రయాణించొచ్చని వెల్లడించింది.

రూ.14,000 పెరిగిన కిలో వెండి



ఈనాడు వాణిజ్య విభాగం: ఇటీవల కాస్త తగ్గినట్లు కనిపించిన వెండి ధర, మళ్లీ భారీగా పెరుగుతోంది. మంగళవారం రాత్రి 11.55 గంటలకు హైదరాబాద్ బులియన్ విపణిలో కిలో వెండి ధర రూ.2,59,300కు చేరింది. సోమవారం ధర రూ.2,45,000తో పోలిస్తే రూ.14,000కు పైగా పెరిగింది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు (31.10 గ్రాముల) వెండి ధర 81.20 డాలర్లకు చేరడం వల్లే, దేశీయంగా ధర ఇంతలా పెరిగిందని బులియన్ వర్తకులు చెబుతున్నారు. 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.1600 పెరిగి రూ.1,41,900కు చేరింది. ఈ ధరల్లో అన్ని పన్నులు కలిసే ఉన్నాయి.

బయోకాన్ నుంచి 3 క్యాన్సర్ ఔషధాలు!

దిల్లీ: క్యాన్సర్ చికిత్సకు ఉపయోగించే మూడు కొత్త బయోసిమిలర్స్‌ను తన అనుబంధ సంస్థ బయోకాన్ బయోలాజిక్స్ ఆవిష్కరించనుందని బయోకాన్ ప్రకటించింది. ట్రస్టుజుమాబ్/ హైలారోనిడేస్(హెర్సెప్టిన్ ఎస్‌సీ/హెర్సెప్టిన్ హైలెక్టా), నివోలుమాబ్ (ఒప్డివో), పెమ్రోలిజుమాబ్ (కీట్రుడా).. ఈ మూడు ఔషధాలను శాన్ ఫ్రాన్సిస్కోలో వచ్చే వారం జరగబోయే '2026 జేపీ మోర్గాన్ హెల్త్‌కేర్ కాన్ఫరెన్స్'లో ప్రదర్శించనున్నట్లు ఎక్స్ఛేంజీలకిచ్చిన సమాచారంలో బయోకాన్ తెలిపింది. ఈ కొత్త మందులతో పరిశ్రమలో అంకాలజీ ఔషధాల్లో అత్యంత విస్తృత స్థాయి పోర్ట్‌ఫోలియో ఉన్న కంపెనీల్లో ఒకటిగా అవతరించనున్నట్లు, ఇప్పటికే 17 క్యాన్సర్ ఔషధాలు కంపెనీ చేతిలో ఉన్నట్లు బయోకాన్ బయోలాజిక్స్ సీఈఓ, ఎండీ శ్రీహాస్ తంబే పేర్కొన్నారు.

ఉక్కు ధరల పెంపులో నిబంధనల ఉల్లంఘన



- 28 కంపెనీల్లో సెయిల్, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్
- 56 మంది ఎగ్జిక్యూటివ్‌లు సైతం

ఉక్కు ధరల పెంపు విషయంలో 28 ఉక్కు కంపెనీలు, 56 మంది ఎగ్జిక్యూటివ్‌లు కుమ్మక్కయ్యారని కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గుర్తించింది. 2015-23 మధ్య వీరు ఆ పనిచేశారని, అందుకు వాట్సప్ చాట్స్ వంటి ఆధారాలూ లభించాయని ఒక కాన్ఫిడెన్షియల్ ఆర్డర్‌లో సీసీఐ పేర్కొందని సమాచారం. ఇది నిర్ధారణ అయితే, ఆయా కంపెనీలు, వ్యక్తులు భారీ అపరాధ రుసుములను ఎదుర్కోవాల్సి రావొచ్చు.

దేశీయ ఉక్కు మార్కెట్‌పై ఆధిపత్యం చెలాయిస్తున్న టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, సెయిల్‌తో పాటు 25 ఇతర కంపెనీలూ యాంటీ ట్రస్ట్ చట్టాలను ఉల్లంఘించినట్లు సీసీఐ ఆర్డర్‌లోని పత్రాలు పేర్కొన్నాయి. జేఎస్‌డబ్ల్యూ ఎండీ సజ్జన్ జిందాల్, టాటా స్టీల్ సీఈఓ టీవీ నరేంద్రన్, సెయిల్‌కు చెందిన నలుగురు మాజీ ఛైర్మన్లకూ ఇందులో పాత్ర ఉందని అక్టోబరు 6 నాటి సీసీఐ ఆదేశాలు చెబుతున్నాయని వార్తా సంస్థ 'రాయిటర్స్' తన కథనంలో పేర్కొంది. అయితే కంపెనీలు కానీ, సీసీఐ కానీ ఈ విషయమై ఇంకా స్పందించలేదు.

దర్యాప్తు ఇలా: దేశంలోని తొమ్మిది కంపెనీలు కలిసి ఉక్కు సరఫరాను నియంత్రిస్తూ, ధరలు పెంచుతున్నాయంటూ కొంత మంది బిల్డర్లు 2021లో ఒక క్రిమినల్ కేసు వేశారు. దీంతో 2022లో కొన్ని చిన్న కంపెనీలపై సీసీఐ దాడులు చేసి, దర్యాప్తు చేపట్టింది. ఆ తర్వాతి కాలంలో 31 కంపెనీలు, కొద్ది మంది ఎగ్జిక్యూటివ్‌లపైనా దర్యాప్తు చేసింది. సీసీఐ నిబంధనల కింద కుమ్మక్కు అయ్యే కార్యకలాపాల గురించి ఏ విషయమూ తెలకుండా, ప్రజలకు వెల్లడించరాదన్నది నిబంధన.

ఇవి కూడా: సీసీఐ దర్యాప్తు చేపట్టిన కంపెనీల్లో శ్యామ్ స్టీల్ ఇండస్ట్రీస్, రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్(విశాఖ ఉక్కు), ఇతర చిన్న కంపెనీలూ ఉన్నాయి. శ్యామ్, రాష్ట్రీయ ఇస్పాత్ సైతం స్పందించలేదని రాయిటర్స్ తెలిపింది.

పెనాల్టీ తప్పదు: ఇప్పటికే సీసీఐ ఆయా కంపెనీలను 2023కు ముందు 8 ఆర్థిక సంవత్సరాల, ఆర్థిక ఫలితాలను సమర్పించాలని తెలిపింది. సాధారణంగా అపరాధ రుసుములను వాటి ఆధారంగానే లెక్కవేస్తుంటాయి.

మనుషులెందుకు ఏఐ ఏజెంట్లుండగా..

- భవిష్యత్తులోనూ ఉద్యోగులను తీసుకోను
- ఎస్ఏఏఎస్ పితామహుడు జేసన్ లెమ్కిన్




సాఫ్ట్‌వేర్ వ్యాపార సంస్థల ఎగ్జిక్యూటివ్‌లు, వ్యవస్థాపకుల నెట్‌వర్కింగ్ సంస్థ ఎస్ఏఏఎస్‌టీఆర్ వ్యవస్థాపకుడు, ఎస్ఏఏఎస్ కు పితామహుడుగా పరిగణించే జేసన్ లెమ్కిన్ ఒక విప్లవాత్మక నిర్ణయం తీసుకున్నారు. కంపెనీ నుంచి ఇద్దరు హై ప్రొఫైల్ ఎగ్జిక్యూటివ్‌లు ఉన్నట్లుండి వెళ్లడంతో.. ప్రత్యామ్నాయంపై దృష్టి పెట్టారు. ఒక్కో జూనియర్ సేల్స్ రెప్రెజెంటేటివ్‌ని 1.5 లక్షల డాలర్ల వార్షిక జీతం (దాదాపు రూ.1.35 కోట్ల)తో నియమించుకోవడం బదులు, ఏఐ (కృత్రిమమేధ) ఏజెంట్లను రంగంలోకి దింపారు. తన మార్కెట్ టీంలో చివరి వ్యక్తి రాజీనామా అనంతరం, మొత్తం బృందాన్ని ఏఐ ఏజెంట్లతో నింపేశారు. భవిష్యత్తులోనూ విక్రయ విభాగంలో మనుషులను నియమించేది లేదని ఆయన చెబుతున్నారు. వర్చువల్ అసిస్టెంట్లయిన ఏఐ ఏజెంట్ల ద్వారానే సమస్యల పరిష్కారం, ప్రణాళికల రూపకల్పన, చర్యలు తీసుకోవడం వంటి పనులన్నీ స్వయంచాలకంగా చేసేలా కొత్త ఆపరేటింగ్ మోడల్‌ను సిద్ధం చేశారు. ఈ మోడల్‌లో 1.2 మంది మనుషులు, 20 ఏఐ ఏజెంట్లను నిర్వహిస్తున్నారు. అంతక్రితం 10 ఎస్‌డీఆర్‌లు, ఏఈలు ఉండేవారు. ఏఐ ఏజెంట్ల వల్ల ఉత్పాదకత పెరిగినా, వాటికి పరిమితులైతే ఉంటాయని విశ్లేషకులు అంటున్నారు.

11 నెలల కనిష్ఠానికి సేవల రంగ వృద్ధి



దేశీయ సేవల రంగ వృద్ధి, 2025 డిసెంబరులో 11 నెలల కనిష్ఠమైన 58 పాయింట్లుగా నమోదైంది. కొత్త వ్యాపారాల విస్తరణ నెమ్మదించడంతో కొత్త ఆర్డర్ల రాక తగ్గిందని ఓ నెలవారీ సర్వే తెలిపింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ సూచీ 2025 నవంబరులో 59.8 పాయింట్లు కాగా, గత నెలలో 58 పాయింట్లకు చేరింది. గతేడాది జనవరి తర్వాత ఇదే అత్యల్ప సేవల రంగ వృద్ధి. పీఎంఐ పరిభాషలో 50 పాయింట్లకు ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు, దిగువన ఉంటే క్షీణతగా భావిస్తారు. వృద్ధి అంచనాల్లో సంస్థలు సానుకూలంగానే ఉన్నప్పటికీ.. మొత్తంగా సెంటిమెంట్ మూడున్నరేళ్లలోనే కనిష్ఠ స్థాయికి చేరిందని సర్వే వెల్లడించింది.

ఏఈపీసీ ఛైర్మన్ ఎ.శక్తివేల్



దిల్లీ: దుస్తుల ఎగుమతిదార్ల ప్రోత్సాహక మండలి (ఏఈపీసీ) ఛైర్మన్‌గా ఎ.శక్తివేల్ బాధ్యతలు స్వీకరించారు. సుధీర్ సెఖ్రి స్థానాన్ని శక్తివేల్ భర్తీ చేశారని ఏఈపీసీ తెలిపింది. ఈ మండలికి శక్తివేల్ ఛైర్మన్ కావడం ఇది అయిదో సారని సంస్థ వెల్లడించింది. స్వెటర్లను ఎగుమతి చేసే పాపీస్ నిట్వేర్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులే శక్తివేల్. తిరుప్పూర్‌ను ప్రపంచ నిట్వేర్ కేంద్రంగా మార్చడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు ఏఈపీసీ తెలిపింది. ఇక్కడి నుంచి ఎగుమతులు 1984లో రూ.15 కోట్లు కాగా, 2024-25కు రూ.45,000 కోట్లకు పెరిగినట్లు వెల్లడించింది. అమెరికా అదనపు సుంకాల వల్ల దేశ వస్త్ర ఎగుమతిదారులపై పడుతున్న ప్రతికూల ప్రభావాన్ని తగ్గించేందుకు కృషి చేయనున్నట్లు శక్తివేల్ తెలిపారు. బాధ్యతలు స్వీకరించాక శక్తివేల్, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కలిశారు.

సెమాగ్లుటైడ్ పేటెంట్ వివాదం

నాట్కో పిటిషన్‌పై నొవో నార్డిస్క్‌కు దిల్లీ హైకోర్టు నోటీసులు

దిల్లీ: మధుమేహం, ఊబకాయం చికిత్సలో వినియోగిస్తున్న సెమాగ్లుటైడ్ ఔషధంపై డెన్మార్క్‌కు చెందిన నొవో నార్డిస్క్‌కు ఉన్న పేటెంట్‌ను రద్దు చేయాలంటూ నాట్కో ఫార్మా దిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. సెమాగ్లుటైడ్‌కు సంబంధించిన ప్రధాన పేటెంట్ 2024 సెప్టెంబరుతోనే ముగిసింది. మందు తయారీ విధానం, సరఫరా విధానంపై నొవో నార్డిస్క్ వద్ద ఉన్న 'సెకండరీ పేటెంట్' గడువు ఈ ఏడాది మార్చి వరకు ఉంది. ఇప్పటికే ఉన్న సాంకేతికతకు స్వల్ప మార్పులు చేసి, గడువు పెంచుకోవడమేనని, దీనివల్ల రోగులకు తక్కువ ధరలో మందులు అందకుండా పోతున్నాయని నాట్కో వాదిస్తోంది. ఈ పేటెంట్‌ను చట్టబద్ధంగా రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరింది. ఈ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు, ఈ విషయంపై నొవో నార్డిస్క్‌కు నోటీసులు జారీ చేసింది.

2025లో 2,81,61,228 వాహనాల విక్రయం

2024తో పోలిస్తే 7.71% వృద్ధి: ఫాడా



వాహన విభాగం	2024	2025	వృద్ధి(%)
ప్రయాణికుల	40,79,532	44,75,309	9.7
ద్విచక్ర	1,89,24,815	2,02,95,650	7.24
త్రిచక్ర	12,21,886	13,09,953	7.21
వాణిజ్య	9,46,190	10,09,654	6.71

దేశంలో గత ఏడాది అన్ని విభాగాల్లో కలిపి, వాహన రిటెయిల్ విక్రయాలు 2,81,61,228కు చేరాయని వాహన డీలర్ల సమాఖ్య ఫాడా వెల్లడించింది. 2024లో విక్రయమైన 2,61,45,445 వాహనాల సంఖ్య కంటే, ఇవి 7.71% ఎక్కువ. కార్లు, ద్విచక్ర వాహనాలపై జీఎస్‌టీ రేటు 10% తగ్గడం, విక్రయాలు పెరిగేందుకు దోహదం చేసినట్లు పేర్కొంది. '2025లో జనవరి-ఆగస్టు మధ్య రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) రేట్ల కోత, కేంద్ర బడ్జెట్‌లో రూ.12 లక్షల వార్షికాదాయం వరకు పన్ను నుంచి ఉపశమనం ప్రకటించడం వంటివి వాహన పరిశ్రమకు కలిసొచ్చాయి. సెప్టెంబరు-డిసెంబరులో జీఎస్‌టీ రేటు తగ్గడం, పండగ ఉత్సాహం కలిసి.. వాహన విక్రయాలు మరింత ఊపందుకున్నాయ'ని ఫాడా అధ్యక్షుడు సీఎస్ విఘ్నేశ్వర్ వెల్లడించారు.

2026-27లో 6.9% వృద్ధి: ఇండ్-రా

దిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27)లో భారత ఆర్థిక వ్యవస్థ 6.9% వృద్ధి చెందే అవకాశం ఉందని ఇండియా రేటింగ్స్ అండ్ రీసెర్చ్ (ఇండ్-రా) అంచనా వేసింది. జీఎస్‌టీ, ఆదాయపు పన్ను కోతలకు తోడు వివిధ దేశాలతో వాణిజ్య ఒప్పందాల వంటివి మన దేశానికి ఆర్థిక ఉత్ప్రేరకాలుగా పని చేస్తాయని పేర్కొంది. 'రిటెయిల్ ద్రవ్యోల్బణం వచ్చే ఆర్థిక సంవత్సరం లోనూ సగటున 3.8 శాతంగా నమోదు కావొచ్చు. భారత్-అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం కుదిరితే, అది జీడీపీ వృద్ధికి మరింత తోడ్పడుతుంద'ని ఇండ్-రా ముఖ్య ఆర్థికవేత్త దేవేంద్ర కుమార్ పంత్ తెలిపారు.

ఉద్రిక్తతలే సూచీలను నష్టపరచాయ్

ఎఫ్ఐఐ అమ్మకాలు.. రూ.107.63 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.1749.35 కోట్లు

సెన్సెక్స్ ▼376 85063
నిఫ్టీ ▼72 26179



సూచీలు వరసగా రెండో రోజూ నేలచూపులు చూశాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, భారత్ ఉత్పత్తులపై సుంకాలు పెంచుతామంటూ అమెరికా తాజా హెచ్చరికల నేపథ్యంలో రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ లాంటి దిగ్గజ కంపెనీల షేర్లు నష్టాలు చవిచూడటం ఇందుకు కారణం. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 12 పైసలు పెరిగి 90.18 వద్ద ముగిసింది. బ్రెంట్ ముడి చమురు ధర 0.5% పెరిగి 62.08 డాలర్ల వద్ద ముగిసింది. ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లోనే ముగియగా.. ఐరోపా మార్కెట్లు సానుకూల ధోరణిలోనే ఆరంభమయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.20 లక్షల కోట్లు తగ్గి రూ.479.60 లక్షల కోట్ల (5.32 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

ఆద్యంతం నష్టాల్లోనే..: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 85,439.62) స్వల్ప నష్టాల్లో 85,331.14 పాయింట్ల వద్ద ఆరంభమైంది. అదే ఒరవడి కొనసాగిస్తూ 84,900.10 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 376.28 పాయింట్ల నష్టంతో 85,063.34 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 71.60 పాయింట్లు కోల్పోయి 26,178.70 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 26,124.75 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని; 26,273.95 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకింది.

✦ అదానీ ఎంటర్‌ప్రైజెస్ బాండ్ల (ఎన్‌సీడీ) పబ్లిక్ ఇష్యూకు 45 నిమిషాల్లోనే పూర్తి స్థాయిలో స్పందన లభించినట్లు తెలుస్తోంది. ఇష్యూ ప్రాథమిక పరిమాణం రూ.500 కోట్లు కాగా.. కేవలం 10 నిమిషాల్లోనే ఈ విలువకు సమానమైన బాండ్లకు దరఖాస్తులు వచ్చాయి. గ్రీన్‌షూ ఆప్షన్ అయిన మరో రూ.500 కోట్లను కలిపాక.. రూ.1,000 కోట్లకు సమానమైన బిడ్‌లు 45 నిమిషాల్లోనే వచ్చినట్లు స్టాక్ ఎక్స్ఛేంజీల వివరాల ప్రకారం తెలుస్తోంది. ఈ బాండ్లపై 24, 36, 60 నెలల కాలావధికి 8.9% ప్రతిఫలాన్ని సంస్థ ఆఫర్ చేసింది.

17 కంపెనీల షేర్లు రాణించాయ్: సెన్సెక్స్ 30 కంపెనీల్లో 17 షేర్లు లాభాల్లో ముగిశాయి. ట్రెంట్, రిలయన్స్ ఇండస్ట్రీస్ సహా 13 షేర్లు నష్టపోయాయి. ఐటీసీ 2.07%, కోటక్ మహీంద్రా బ్యాంక్ 2.02%, ఇండిగో 1.96%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.56% మేర తగ్గాయి. ఐసీఐసీఐ బ్యాంక్ 2.87%, హిందుస్థాన్ యునిలీవర్ 1.75%, సన్‌ఫార్మా 1.73%, ఎస్‌బీఐ 1.33%, టీసీఎస్ 1.28% చొప్పున లాభపడ్డాయి. బీఎస్ఈ రంగాల సూచీల్లో విద్యుత్, చమురు- గ్యాస్, సేవలు, భారీ యంత్ర పరికరాలు, స్థిరాస్తి డీలాపడ్డాయి. ఆరోగ్య సంరక్షణ, పీఎస్‌యూ బ్యాంక్, ఐటీ రంగాల సూచీలు రాణించాయి.

✦ డిసెంబరు 31తో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి ట్రెంట్ ప్రకటించిన ఆదాయ వృద్ధి గణాంకాలు మదుపర్లను నిరాశపర్చడంతో ఈ కంపెనీ షేరుకు అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. బీఎస్ఈలో 8.62% నష్టంతో రూ.4,047.70 వద్ద ఈ షేరు ముగిసింది. ఇంట్రాడేలో 9.92% కుదేలై రూ.3,990కూ దిగివచ్చింది.

శ్రీ అధికారి బ్రదర్స్ షేరు 1:10 నిష్పత్తిలో విభజన

వివిధ టీవీ ఛానళ్లకు కంటెంట్‌ను అందించే శ్రీ అధికారి బ్రదర్స్ టెలివిజన్ నెట్‌వర్క్ 1:10 నిష్పత్తిలో షేరు విభజనకు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రూ.10 ముఖ విలువ గల ఒక్కో షేరును.. రూ.1 ముఖ విలువ గల 10 షేర్లుగా విభజించేందుకు ఆ సంస్థ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపింది. షేర్ల విభజన నిర్ణయానికి వాటాదార్ల అనుమతి తీసుకున్నాక, రికార్డు తేదీని ప్రకటిస్తామని స్టాక్ ఎక్స్ఛేంజీలకు కంపెనీ సమాచారం ఇచ్చింది. గత అయిదేళ్లలో ఈ మీడియా సంస్థ షేరు 89000% ప్రతిఫలాన్ని మదుపర్లకు పంచింది. షేర్ల విభజన ప్రకటనతో మంగళవారం బీఎస్ఈలో శ్రీ అధికారి బ్రదర్స్ టెలివిజన్ నెట్‌వర్క్ షేరు 0.92% పెరిగి రూ.1,700.50 వద్ద ముగిసింది.

కరెంట్ అఫైర్స్

మాదిరి ప్రశ్నలు



★ ఏ నగరంలోని భారత రాయబార కార్యాలయంలో ఇటీవల భారత సాహిత్య, సాంస్కృతిక దిగ్గజం రవీంద్రనాథ్ ఠాగూర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు? జ: బీజింగ్ (ప్రఖ్యాత చైనా శిల్పి యువాన్ జికున్ రూపొందించిన ఈ శిల్పాన్ని 'సంగమం - ఎ కాన్ఫ్లుయెన్స్ ఆఫ్ ఇండియన్ ఫిలసాఫికల్ ట్రెడిషన్స్' అనే సాంస్కృతిక సదస్సు సందర్భంగా ఆవిష్కరించారు.)

★ ప్రతిష్ఠాత్మక 'ఉర్సులా కె లే గుయిన్ ప్రైజ్ ఫర్ ఫిక్షన్' పురస్కారాన్ని 2025కు గాను ఇటీవల ఎవరు గెలుచుకున్నారు? జ: వజ్ర చంద్రశేఖర (25వేల డాలర్ల విలువైన ఈ పురస్కారాన్ని ఈయన రచించిన 'రేక్స్ ఫాల్' పుస్తకానికిగాను గెలుచుకున్నారు.)

★ భారతదేశమంతటా కృత్రిమ మేధస్సు (ఏఐ)ను మరింత అందుబాటులోకి తీసుకురావడానికి ఇటీవల ఏ రెండు ప్రముఖ సంస్థలు ఓ భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకున్నాయి? (స్థానిక కంప్యూటింగ్ శక్తిని నిర్మించడం, ఏఐ ఆవిష్కరణలను పెంచడం, అధునాతన ఏఐ సాధనాలతో వినియోగదారులు, స్టార్టప్‌లు, వ్యాపారాలను శక్తిమంతం చేయడం ద్వారా అందరికీ ఏఐ మిషన్‌ను ప్రోత్సహించడం ఈ ఒప్పందం లక్ష్యం.) జ: రిలయన్స్ ఇండస్ట్రీస్, గూగుల్

మరింత సమాచారం

★ ఇటీవల దేశవ్యాప్తంగా ఎప్పుడు జరిగిన 'స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం మూడు గిన్నిస్ ప్రపంచ రికార్డులను గెలుచుకుంది? జ: 2025 సెప్టెంబరు 17 - అక్టోబరు 2



దరఖాస్తు చేశారా?

- ఐఐటీ భువనేశ్వర్‌లో 101 నాన్-టీచింగ్ పోస్టులు. చివరి తేదీ: 08.01.2026
- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో 394 ఖాళీలు. చివరి తేదీ: 09.01.2026

పదో తరగతి తెలుగు — బతుకు గంప



1. బతుకుగంప పాఠ్యభాగ ప్రక్రియను వివరించండి.

జ: బతుకు గంప పాఠం కథానిక ప్రక్రియలో సాగింది. తెలుగు సాహిత్యంలో కథ, కథానిక అనే పదాలు పర్యాయపదాలుగా మారిపోయాయి. నిజానికి కథ, కథానిక కంటే పెద్దది. కథానిక ఒక వచన ప్రక్రియ. వ్యక్తి జీవితంలో ఒక ముఖ్య సన్నివేశాన్ని లేదా సంఘటనల మధ్య సంబంధాన్ని కథానిక కళాత్మకంగా చిత్రిస్తుంది. క్లుప్తత అనేది కథానిక ప్రధాన లక్షణం. పాత్రలు, నేపథ్యం, కథనం, జీవిత వాస్తవ చిత్రణ, కంఠస్వరం కథానికలో చాలా ముఖ్యమైన అంశాలు.

4 మార్కులు

1. ఎల్లమ్మకు, రచయిత్రికి గల అనుబంధం గురించి రాయండి.

జ: ఎల్లమ్మ పండ్లు అమ్మేది. రచయిత్రికి, ఎల్లమ్మకు పరిచయం ఎలా జరిగిందో తెలియదు. కానీ, ఇద్దరికీ విడదీయరాని అనుబంధం ఏర్పడింది. నాలుగు రోజులు ఎల్లమ్మ కనబడకపోతే గిలగిలలాడేది. రచయిత్రిని చూడకపోతే ఎల్లమ్మకు కూడా ఏమీ తోచదు. ఎల్లమ్మ పండ్లు అమ్మడానికి వస్తే అవసరం ఉన్నా, లేకపోయినా రచయిత్రి కొనేది. ఆ విధంగా ఒకరిపై ఒకరికి అమితమైన స్నేహ భావం కలిగింది. ఎల్లమ్మ భర్తకు కాలు విరిగిపోయిందని తెలిసి, రచయిత్రి చాలా బాధపడింది. కాఫీ ఇచ్చి ఓదార్చింది. ఎల్లమ్మ తన చిన్నతనం నుంచి జరిగిన సంఘటనలన్నీ రచయిత్రికి చెప్పుకుంది. డబ్బులు ఇస్తానన్నా తీసుకోలేదు. తనకి ఉన్న స్నేహితులు అందరిలోనూ ఎల్లమ్మ గొప్పది.

8 మార్కులు

ఫైనల్ పరీక్షలు - 2026
ముఖ్యమైన ప్రశ్నలు - జవాబులు

2. పాఠం ఆధారంగా ఎల్లమ్మ వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

జ: ఎల్లమ్మ వ్యక్తిత్వం చాలా గొప్పది. ఎల్లమ్మ భర్త సంసారాన్ని పట్టించుకోకపోయినా బాధపడలేదు. తనే సంసార భారాన్ని భరించింది. తను కష్టపడుతూనే అనాథ బాలుని పెంచి పెద్ద చేసింది. ఎవరు కష్టాలలో ఉన్నా చూడలేని స్వభావం కలది. ఆమెది ఇతరులకు సహాయం చేసే స్వభావం. ఎన్ని కష్టాలలో ఉన్నా ఎవరినీ చేయి చాచి దేనినీ అడగదు. సంతృప్తిగా జీవిస్తుంది. ఉన్నంతలో ఇతరులకు సహాయపడుతుంది. ఒక మంచి మాటను కోరుకుంటుంది. ఓదార్పును ఆశిస్తుంది. తను నమ్మిన వారికి తన కష్టసుఖాలను చెప్పుకుంటుందే కానీ, ఏనాడు వాటిని తీర్చమని ఎవరినీ అడగదు. ఎవరి దగ్గర డబ్బు కూడా తీసుకోదు. తను కూడబెట్టిన డబ్బుని ఖర్చు పెట్టుకుంటుంది. ఆత్మవిశ్వాసం గల మహిళ. పిల్లలపైన ఆమెకు అమితమైన ప్రేమ ఉంది.

ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు



రచయిత:
చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

తేడా తెలుసుకో.. పోలిక పట్టుకో!


జనరల్ స్టడీస్ — అరిథ్‌మెటిక్

క్రికెట్ పోటీలో ఆటగాళ్లు ఏయే ఓవర్లలో ఎక్కువ లేదా తక్కువ పరుగులు చేశారో గుర్తుంచుకోవడం కొద్దిగా కష్టం. నెల మొత్తం మీద ఇంటి ఖర్చులు వేటిపై అధికంగా ఉన్నాయో వెంటనే చెప్పడం కుదరకపోవచ్చు. తరగతిలోని విద్యార్థులు ఏయే సబ్జెక్టుల్లో ఎన్నెన్ని మార్కులు సాధించారో విశ్లేషించాలంటే కాస్త ఆలోచించాల్సిందే. కానీ వాటిని బార్ గ్రాఫ్‌ల రూపంలో ఇస్తే మాత్రం ఠక్కున సమాధానాలు దొరుకుతాయి. సమాచారాన్ని సులభంగా అర్థం చేసుకోడానికి గణాంకశాస్త్రంలో వినియోగించే అత్యంత శక్తిమంతమైన సాధనాల్లో కమ్మీ చిత్రాలు లేదా బార్ డయాగ్రమ్స్ ఒకటి. ఇందులో నిర్దిష్ట డేటాను సమాన వెడల్పు కలిగిన నిలువు లేదా అడ్డు వరసల రూపంలో ప్రదర్శిస్తారు. ముఖ్యంగా తేడాలను తెలుసుకోడానికి, పోలికలను పట్టుకోడానికి ఉపయోగిస్తారు. ప్రతి కమ్మీ పొడవు అది సూచించే సంఖ్య లేదా విలువపై ఆధారపడి ఉంటుంది. పోటీ పరీక్షల్లో తరచూ వీటిపై ప్రశ్నలు అడుగుతున్నారు. చిత్రం నుంచి సమాచారాన్ని క్రమ పద్ధతిలో సేకరించడం నేర్చుకుంటే వాటికి తేలికగా జవాబులు కనుక్కోవచ్చు. గ్రాఫ్‌లో ఇచ్చిన స్కేలును, అక్షాలను సరిగా అర్థం చేసుకోవాలి.

✤ కమ్మీ చిత్రాలు ✤

(బార్ డయాగ్రమ్స్)


బార్ గ్రాఫ్ అంటే నిలువుగా లేదా క్షితిజ సమాంతర దీర్ఘ చతురస్రాకార కమ్మీల రూపంలో ఒక సమూహ డేటాను ప్రదర్శించే చిత్రం. ఈ బార్ గ్రాఫ్‌లు పలు సమూహాల్లోని వివిధ డేటాను విశ్లేషించడానికి దోహదపడతాయి. సాధారణంగా వివిధ వ్యాపారాల్లో ఉత్పత్తి, అమ్మకాలను పోల్చడానికి వాడతారు. ఆరోగ్య రంగంలో వ్యాధి వ్యాప్తి, దాని నియంత్రణను అర్థం చేసుకోవడానికి ఉపయోగిస్తారు. పారిశ్రామిక రంగంలో ఉత్పత్తి, డిమాండ్‌లను విశ్లేషించడానికి వినియోగిస్తారు.



మాదిరి ప్రశ్నలు

I. కింది బార్ చిత్రాన్ని పరిశీలించి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

1999లో వర్షా కాలంలో రోడ్డు ప్రమాదాల వల్ల చనిపోయిన వారి వివరాలను సూచించే బార్ చిత్రం.



1. ఏ రెండు వరుస వారాల మధ్య మరణాల వృద్ధి గరిష్ఠం?

1) జూన్ 30, జులై 7 2) జులై 14, జులై 21 3) జులై 21, జులై 28 4) ఆగస్టు 4, ఆగస్టు 11

వివరణ: బార్ చిత్రం ఆధారంగా..

జూన్ 30, జులై 7 మధ్య మరణాల వృద్ధి = 180 − 142 = 38

జులై 14, జులై 21 మధ్య మరణాల వృద్ధి = 155 − 145 = 10

జులై 21, జులై 28 మధ్య మరణాల వృద్ధి = 160 − 155 = 5

ఆగస్టు 4, ఆగస్టు 11 మధ్య మరణాల వృద్ధి = 165 − 150 = 15

∴ జూన్ 30, జులై 7 మధ్య మరణాల వృద్ధి గరిష్ఠం. **జ: 1**

2. 150 కంటే ఎక్కువ మరణాలున్న వారాలు ఎన్ని?

1) 3 2) 4 3) 2 4) 1

వివరణ: బార్ చిత్రం ఆధారంగా..

150 కంటే ఎక్కువ మరణాలున్న వారాలు 4. అవి జులై 7, జులై 21, జులై 28, ఆగస్టు 11 **జ: 2**

3. 150 కంటే తక్కువ మరణాలున్న వారాలు ఎన్ని?

1) 1 2) 2 3) 3 4) 4

వివరణ: బార్ చిత్రం ఆధారంగా..

150 కంటే తక్కువ మరణాలున్న వారాలు 2. అవి జూన్ 30, జులై 14. **జ: 2**

4. ఏ రెండు వరుస వారాల మధ్య మరణాల తగ్గుదల గరిష్ఠం?

1) జూన్ 30, జులై 7ల మధ్య
2) జులై 7, జులై 14ల మధ్య
3) జులై 28, ఆగస్టు 4ల మధ్య
4) ఆగస్టు 4, ఆగస్టు 11ల మధ్య


వివరణ: జులై 7, జులై 14ల మధ్య తగ్గుదల = 160 − 145 = 35

జులై 28, ఆగస్టు 4ల మధ్య తగ్గుదల = 160 − 150 = 10

గరిష్ఠ తగ్గుదల జులై 7, జులై 14 ల మధ్య ఉంది. **జ: 2**

II. కింది బార్ చిత్రాన్ని పరిశీలించి, ప్రశ్నలకు సమాధానాలు రాయండి.

వివిధ దేశాలకు సంబంధించిన జననాల రేటు (1000కి)



1. జర్మనీలో జననాల రేటు కంటే 25% అధికంగా జననాల రేటు ఉన్న దేశం?

1) స్వీడన్ 2) జర్మనీ 3) ఇంగ్లండ్ 4) ఇండియా

వివరణ: జర్మనీలో జననాల రేటు = 1000లో 16 మంది.

జర్మనీలో జననాల రేటు కంటే 25% అధికం అంటే (100 + 25)% = 125%

$\therefore$ 16 లో 125% $= 16 \times \frac{125}{100} = 4 \times 5 = 20$

ఇది ఇంగ్లండ్ జననాల రేటుకు సమానం **జ: 3**

2. ఇంగ్లండ్‌లోని జననాల రేటుతో పోలిస్తే ఇండియాలో జననాల రేటు ఎంత శాతం?

1) 135%
2) 145%
3) 155%
4) 165%



వివరణ: ఇంగ్లండ్‌లో జననాల రేటు = 20

ఇండియాలో జననాల రేటు = 33

$\therefore$ కావాల్సిన శాతం $= \frac{33}{20} \times 100 = 165\%$ **జ: 4**

3. ఇండియా, స్వీడన్ దేశాల జననాల రేటుల మధ్య నిష్పత్తి ఎంత?

1) 11 : 5 2) 5 : 11
3) 4 : 5 4) 2 : 3

వివరణ: ఇండియా జననాల రేటు = 33 (1000 కి)

స్వీడన్ జననాల రేటు = 15 (1000 కి)

∴ కావాల్సిన నిష్పత్తి = 33 : 15 = 11 : 15 **జ: 1**



రచయిత: జె.వి.ఎస్. రావు



భూ ఉపరితలంపై అగ్నిశిలలే అధికం!

జనరల్ స్టడీస్ - జాగ్రఫీ



భూఉపరితలం అంతటా ఒకే విధంగా, సమానంగా ఉండదు. అనంత కాలక్రమంలో భూ అంతర్భాగంలో అనేక ప్రక్రియలు జరుగుతుంటాయి. గాలి, నీరు తదితర బాహ్యబలాల ప్రభావంతో క్రమక్షయం, నిక్షేపం, శైథిల్యం మొదలైన ప్రకృతికారక చర్యలు నిరంతరం సాగుతుంటాయి. ఫలితంగా భూమిపై రకరకాల ఆకారాలు ఏర్పడుతుంటాయి. వాటినే భూస్వరూపాలు అంటారు. ఎత్తుపల్లాలు, ఆకృతి, వాలు ఆధారంగా శాస్త్రవేత్తలు ఆ స్వరూపాలను ప్రధానంగా పర్వతాలు, పీఠభూములు, మైదానాలుగా వర్గీకరించారు. అవి ప్రకృతి అందాలను సృష్టించడంతోపాటు స్థానిక వాతావరణాన్ని, నదుల ప్రవాహాన్ని, మానవ జీవన విధానాన్ని నిర్దేశిస్తుంటాయి. వాటితోపాటు ఎడారులు, హిమానీనదాలు, అగ్నిపర్వతాలు, భూభాగం పైన, భూగర్భంలో ఏర్పడే ప్రవాహాలు, రూపాంతర శిలలన్నీ ప్రధాన భూస్వరూపాల్లో భాగమే. వీటిపై పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. ఖండాలు, దేశాల వారీగా ముఖ్యమైన భూస్వరూపాలు, వేర్వేరు ప్రాంతాల్లో వాటికి ఉన్న పేర్లు, ప్రత్యేకతల గురించి తెలుసుకోవాలి.

ప్రధాన భూస్వరూపాలు

1. కిందివాటిలో నదులు ఏర్పరిచే భూస్వరూపాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) నదులు తమ యవ్వన దశలో భాగంగా గార్జ్‌లు, అగాధధరులు లాంటివి ఏర్పరుస్తాయి.
బి) నదీ వేదికలు, నదీ వంకరలు, సహజ లెవీలు మొదలైనవి నది తన ప్రౌఢ దశలో ఏర్పరుస్తుంది.
సి) ఆక్స్-బౌ సరస్సులు, ఇసుక మేటలు, నదీపాయలు ప్రధానంగా నది వృద్ధ దశలో కనిపిస్తాయి.
డి) నదుల రాతి బల్లలు, జలపాతాలు దాదాపుగా నది యవ్వన దశలో ఏర్పడతాయి.


1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

2. కిందివాటిని జతపరచండి.

నదులు	డెల్టా రకాలు
ఎ) గంగా నది	1) లోబేట్ డెల్టా
బి) కృష్ణా నది	2) డిజిటల్ డెల్టా
సి) నర్మదా నది	3) పక్షిపాద డెల్టా
డి) మిసిసిపి నది	4) ఎస్చ్యురైన్ డెల్టా

1) ఎ-2, బి-1, సి-4, డి-3 2) ఎ-4, బి-3, సి-2, డి-1
3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-1, బి-2, సి-3, డి-4

3. కిందివాటిలో క్రమక్షయ మైదానాలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.



ఎ) ఎడారి ప్రాంతాల్లో పవన క్రమక్షయ చర్యల కారణంగా ఏర్పడే మైదానాలను 'పెడిప్లేన్స్' అంటారు.
బి) సున్నపురాయి నిక్షేపాలున్న భూభాగాల్లో అంతర్భూజలం క్రమక్షయ ప్రక్రియల కారణంగా ఏర్పడే భూస్వరూపాలను 'టెర్రరోసా' అంటారు.
సి) నదుల క్రమక్షయ చర్యల కారణంగా ఉష్ణమండల ప్రాంతాల్లో ఏర్పడిన మైదానాలను సాధారణంగా 'పెనిప్లైన్స్' అంటారు.
డి) తరంగ క్రమక్షయం కారణంగా సముద్రతీరంలో ఏర్పడిన మైదానాలను 'స్ట్రాండ్ ఫ్లాట్' అని పిలుస్తారు.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

4. కిందివాటిని జతపరచండి.

ఎడారులు	దేశాలు
ఎ) పెటగోనియా	1) ఉజ్బెకిస్థాన్
బి) సింప్సన్	2) సూడాన్
సి) నుబియన్	3) అర్జెంటీనా
డి) కజిలేకం	4) ఆస్ట్రేలియా

1) ఎ-1, బి-4, సి-2, డి-3 2) ఎ-1, బి-2, సి-3, డి-4
3) ఎ-1, బి-2, సి-4, డి-3 4) ఎ-3, బి-4, సి-2, డి-1

5. కింది వాక్యాలను సరిచూడండి.



ఎ) హిమానీనదాలు తాము ప్రవహించే మార్గంలో సేకరించిన రాళ్లు, మట్టి, ఇసుక లాంటి వాటిని నిక్షేపించగా ఏర్పడిన టిల్ అనే పదార్థాన్ని 'మొరైన్‌లు' అంటారు.
బి) హిమానీనదాలు ఏర్పరిచే టిల్ పదార్థం బోర్లించిన చెంచా ఆకారంలో ఉంటే, వాటినే డ్రమ్లిన్‌లు అంటారు.
సి) హిమానీనదాలు ఏర్పరిచే మైదానాలు పొడవుగా, సన్నగా సర్పాకారంగా ఏర్పడే గుట్టలను ఎస్కర్లు అంటారు.
డి) హిమానీనదాల్లో ఉండే టిల్ అనే పదార్థం ఒక రిడ్జ్‌లా నిక్షేపణం చెందితే దాన్ని కేమ్స్ అంటారు.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.


6. కిందివాటిని జతపరచండి.

హిమగర్తాలు	పలు దేశాల్లో వాటి పేర్లు
ఎ) హోయోలు	1) నార్వే
బి) కారెన్స్	2) ఫ్రాన్స్
సి) సర్కులు	3) జర్మనీ
డి) బోట్న్	4) స్పెయిన్

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-4, బి-1, సి-3, డి-2
3) ఎ-1, బి-2, సి-3, డి-4 4) ఎ-3, బి-4, సి-2, డి-1

7. కిందివాటిని సరిచూడండి.

ఎ) అగ్నిశిలల్లో భాగమైన లాకోలిత్ శిలలు పుట్టగొడుగు ఆకారంలో కనిపిస్తూ, ఉబ్బెత్తుగా ఉంటాయి.
బి) అంతర్గత అగ్నిశిలల్లో భాగమైన లాకోలిత్ శిలలు ప్రధానంగా సాసర్ ఆకారంలో విస్తరించి ఉంటాయి.
సి) అంతర్గత అగ్నిశిలల్లో భాగమైన పాకోలిత్ శిలలు భూమి లోపల ఒత్తిడి కారణంగా ముడతపడి ఒక తరంగంలా ఏర్పడతాయి.



డి) అగ్నిశిలల్లో ప్రధానంగా శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం, సహజ వాయువులు ఉండవు.

1) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

8. కిందివాటిని జతపరచండి.

ఎడారులు	దేశాలు
ఎ) రబ్-ఆల్-ఖలీ	1) ఇరాన్
బి) తిక్లాయకాన్	2) తుర్క్మెనిస్థాన్
సి) కారాకుం	3) సౌదీ అరేబియా, యెమెన్
డి) దష్త్-ఎ-కవీర్	4) చైనా

1) ఎ-4, బి-3, సి-2, డి-1 2) ఎ-1, బి-4, సి-3, డి-2
3) ఎ-3, బి-4, సి-2, డి-1 4) ఎ-1, బి-3, సి-4, డి-2

9. కిందివాటిలో అగ్నిశిలలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) అగ్నిశిలలు సాధారణంగా గట్టిగా, ముద్దగా ఉంటూ తమ ద్వారా త్వరగా నీటిని ప్రసరించనీయవు.
బి) ఈ అగ్నిశిలల్లో ప్రధానంగా ఇనుప ఖనిజం, అల్యూమినియం, సోడియం, సిలికా, క్యాల్షియం, మెగ్నీషియం లాంటివి లభిస్తాయి.
సి) భూమి ఉపరితలంలో అంటే భూపటలంలో అధిక భాగం విస్తరించిన శిలలు అగ్నిశిలలు.
డి) అగ్నిశిలలను మాతృశిలలు అని కూడా పిలుస్తారు. వీటినే అస్తరిత శిలలు అంటారు.

1) ఎ, బి, సి, డి సరైనవి.
2) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
3) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

10. కిందివాటిని జతపరచండి.

అగ్నిపర్వతాలు	ఖండాలు
ఎ) బ్లాక్‌బర్న్	1) ఆసియా
బి) ఒజోస్ డెల్ సలాడో	2) ఆఫ్రికా
సి) కామెరున్	3) ఉత్తర అమెరికా
డి) క్రాకటోవా	4) దక్షిణ అమెరికా

1) ఎ-4, బి-3, సి-2, డి-1
2) ఎ-1, బి-4, సి-3, డి-2
3) ఎ-3, బి-4, సి-2, డి-1
4) ఎ-1, బి-3, సి-2, డి-4



11. అవక్షేప శిలలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) అవక్షేప శిలలు సాధారణంగా అగ్నిశిలల కంటే తక్కువ కాఠిన్యతతో ఉంటాయి.
బి) ఈ శిలల్లో సాధారణంగా శిలాజ ఇంధనాలైన బొగ్గు, పెట్రోలియం, సహజవాయువులు లభిస్తాయి.
సి) వీటిని ద్వితీయ శిలలు, స్తరిత శిలలు అని కూడా పిలుస్తారు.
డి) అవక్షేప శిలలు నీరు/గాలి/హిమానీనదాల వల్ల ఏర్పడతాయి.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.

12. కింది వాటిని జతపరచండి.

పీఠభూమి	విస్తరణ
ఎ) టిబెట్ పీఠభూమి	1) ఆండిస్ పర్వతాల మధ్య
బి) లద్దాఖ్ పీఠభూమి	2) హిందూకుష్-కారాకోరం మధ్య
సి) పామీర్ పీఠభూమి	3) కారాకోరం-లద్దాఖ్ పర్వతాల మధ్య
డి) బొలీవియా పీఠభూమి	4) కున్‌లున్‌షాన్-కైలాస్ పర్వతాల మధ్య

1) ఎ-1, బి-2, సి-3, డి-4 2) ఎ-1, బి-4, సి-3, డి-2
3) ఎ-1, బి-3, సి-4, డి-2 4) ఎ-4, బి-3, సి-2, డి-1

13. రూపాంతర శిలలకు సంబంధించిన వాక్యాలను సరిచూడండి.

ఎ) ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటం వల్ల చుట్టూ ఉన్న శిలలు రూపాంతరం చెందడాన్ని పైరో రూపాంతరం అంటారు.
బి) ఉష్ణోగ్రతతో పాటు తక్కువగా ఉంటూ పీడనం పాత్ర ఎక్కువగా ఉంటూ ఏర్పడే రూపాంతరాన్ని డైనమిక్ రూపాంతరం అంటారు.
సి) భూమి లోపల ఉష్ణోగ్రత పీడనాల్లో, మార్పుల్లో భాగంగా పీడనం అకస్మాత్తుగా కాకుండా నిదానంగా పెరగడం వల్ల జియోథర్మల్ రూపాంతరం జరుగుతుంది.
డి) అగ్నిశిలలు, అవక్షేపక శిలల్లో ఖనిజాలు అధికంగా ఉన్నప్పుడు రసాయనిక చర్య కారణంగా జరిగే రూపాంతరం మెటసోమాటిక్ రూపాంతరం.

1) ఎ, బి, సి సరైనవి; డి సరికాదు.
2) ఎ, బి, సి, డి సరైనవి.
3) ఎ, బి సరైనవి; సి, డి సరికావు.
4) ఎ, బి, డి సరైనవి; సి సరికాదు.

14. కిందివాటిని జతపరచండి.

(శిలల్లో లభించే ఖనిజాలు, వాటి ఉపయోగాలు)

ఖనిజాలు	ఉపయోగాలు
ఎ) ఒలివైన్	1) పింగాణీ, గ్లాస్ తయారీ
బి) మైకా	2) ఆస్‌బెస్టాస్ పరిశ్రమ
సి) ఆంఫిబోల్	3) ఎలక్ట్రానిక్ పరికరాలు
డి) ఫెల్డ్‌స్పర్	4) ఆభరణాల తయారీ

1) ఎ-1, బి-2, సి-3, డి-4
2) ఎ-3, బి-4, సి-2, డి-1
3) ఎ-4, బి-3, సి-2, డి-1
4) ఎ-1, బి-4, సి-2, డి-3




రచయిత: బండ్ల శ్రీధర్

సమాధానాలు

1-2, 2-1, 3-2, 4-4, 5-2, 6-1, 7-2, 8-3, 9-1, 10-3, 11-2, 12-4, 13-2, 14-3.

అక్షర శ్రేణి

పోటీపరీక్షల్లో రీజనింగ్ విభాగంలోని అక్షర శ్రేణి (Letter Series) నుంచి తరచుగా ప్రశ్నలు అడుగుతుంటారు. ఆంగ్ల అక్షరమాల క్రమం అందరికీ తెలిసిందే. ఈ అక్షరాల స్థాన సంఖ్యలు ముందు నుంచి వెనక్కి, వెనక నుంచి ముందుకి తెలిసి ఉండాలి. అంతేకాకుండా ఏ అక్షరానికి ఏది Opposite Letter అనే దానిపైనా అభ్యర్థికి అవగాహన అవసరం. శ్రేణిలో అక్షరాలు ఒక నిర్దిష్ట క్రమాన్ని లేదా వరుసను అనుసరిస్తాయి. ఆ క్రమాన్ని గుర్తించి, ప్రశ్నార్థకం స్థానంలో వచ్చే తర్వాతి అక్షరాలను కనుక్కోవాలి.



ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

నిర్దిష్ట క్రమం గుర్తిస్తేనే.. ప్రశ్నార్థకం ఛేదన సాధ్యం!

మాదిరి ప్రశ్నలు

సూచన (ప్ర. 1 – 11): దిగువ ఇచ్చిన అక్షర శ్రేణుల్లో ప్రతి శ్రేణి ఒక విభిన్నమైన అమరికలో ఉంది. శ్రేణిని జాగ్రత్తగా గమనించి సరైన అమరికను కనుక్కుని, క్రమంలో తర్వాత వచ్చే అక్షరాన్ని లేదా పదాలను గుర్తించండి.

1. AI BJ CK ?
1) LM 2) GH 3) QR 4) DL

సాధన: ఇచ్చిన శ్రేణిలోని మొదటి వరుసలోని అక్షరాలు A, B, C, ...
రెండో వరుసలోని అక్షరాలు I, J, K, ...
A + 1 = B, B + 1 = C, C + 1 = D
I + 1 = J, J + 1 = K, K + 1 = L
శ్రేణిలో తర్వాత వచ్చే క్రమం DL

సమాధానం: 4

2. A C B E C G D ? ?
1) MN 2) LM 3) IE 4) GH

సాధన: A C B E C G D I E (A, B, C, D +1 each; C, E, G, I +2 each)

సమాధానం: 3

3. Z W S P L I ?
1) D 2) E 3) G 4) B

సాధన: Z – 3 = W, W – 4 = S, S – 3 = P, P – 4 = L, L – 3 = I, I – 4 = E

సమాధానం: 2

4. AC BD EG FH IK ??
1) JL 2) OP 3) IJ 4) JK

సాధన: A + 2 = C, B + 2 = D, E + 2 = G, F + 2 = H, I + 2 = K క్రమంలో ఉంది.
దీని ప్రకారం తర్వాత వచ్చే అక్షరాలు.
J + 2 = L (మిగతా ఆప్షన్లలో ఏవీ ఈ క్రమాన్ని అనుసరించడం లేదు)

సమాధానం: 1

5. HPL, KLQ, NHV, QDA ,TZF, ?
1) WVK 2) XVK 3) WDK 4) XWK

సాధన: H + 3 = K, K + 3 = N, N + 3 = Q, Q + 3 = T →(1)
P – 4 = L, L – 4 = H, H – 4 = D, D – 4 = Z → (2)
L + 5 = Q, Q + 5 = V, V + 5 = A, A + 5 = F → (3)
పై మూడు సమీకరణాలను గమనించినప్పుడు, తర్వాతి క్రమం T + 3 = W, Z – 4 = V, F + 5 = K వస్తుంది.
ప్రశ్నార్థకం స్థానంలో వచ్చే క్రమం WVK

సమాధానం: 1

6. KES, MIQ, PMN, TQJ, YUE, ?
1) FYX 2) EYY 3) EXZ 4) EXY

సాధన: ఇచ్చిన శ్రేణిలో K + 2 = M, M + 3 = P, P + 4 = T, T + 5 = Y → (1)
E + 4 = I, I + 4 = M, M + 4 = Q, Q + 4 = U → (2)
S – 2 = Q, Q – 3 = N, N – 4 = J, J – 5 = E → (3)
తర్వాతి క్రమం Y + 6 = E, U + 4 = Y, E – 6 = Y
⇒ EYY

సమాధానం: 2

7.
A D C F
C F E H
E H G J
O R ? ?

1) LK 2) MN 3) ST 4) QT

సాధన: ఇచ్చిన శ్రేణిలో ప్రతి వరుసలో
మొదటి అక్షరం + 3 = రెండో అక్షరం
రెండో అక్షరం – 1 = మూడో అక్షరం
మూడో అక్షరం + 3 = నాలుగో అక్షరం
నాలుగో వరుస క్రమం ⇒ O + 3 = R; R – 1 = Q, Q + 3 = T
చివరి వరుసలో ?, ? స్థానాల్లో QT వస్తాయి.

సమాధానం: 4

8.
F J N R V
E H K N Q
I K M O Q
K L M ? O

1) S 2) N 3) X 4) Y

సాధన: F + 4 = J, J + 4 = N, N + 4 = R, R + 4 = V
E + 3 = H, H + 3 = K, K + 3 = N, N + 3 = Q
I + 2 = K, K + 2 = M, M + 2 = O, O + 2 = Q
K + 1 = L, L + 1 = M, M + 1 = N, N + 1 = O

సమాధానం: 2

9. IMHP, MPJQ, QSLR, UVNS, ?
1) YYPT 2) YYOT 3) YXPT 4) XYPT

సాధన: I + 4 = M, M + 4 = Q, Q + 4 = U, U + 4 = Y
M + 3 = P, P + 3 = S, S + 3 = V, V + 3 = Y
H + 2 = J, J + 2 = L, L + 2 = N, N + 2 = P
P + 1 = Q, Q + 1 = R, R + 1 = S, S + 1 = T

సమాధానం: 1

10. BCE, GHJ, LMO, QRT, ?
1) UVX 2) VWX 3) WXZ 4) VWY

సాధన: B + 5 = G, G + 5 = L, L + 5 = Q, Q + 5 = V
C + 5 = H, H + 5 = M, M + 5 = R, R + 5 = W
E + 5 = J, J + 5 = O, O + 5 = T, T + 5 = Y

సమాధానం: 4

11. MJPT, PGMW, SDJZ, ?, YXDF
1) VZFC 2) WAGD 3) VAGC 4) VAGD

సాధన: M + 3 = P, P + 3 = S, S + 3 = **V**, V + 3 = Y
J – 3 = G, G – 3 = D, D – 3 = **A**, A – 3 = X
P – 3 = M, M – 3 = J, J – 3 = **G**, G – 3 = D
T + 3 = W, W + 3 = Z, Z + 3 = **C**, C + 3 = F

సమాధానం: 3




రచయిత
రాజేశ్ మధు,
విషయ నిపుణులు

884 Word of the Day

Effrontery

Telugu meaning: సిగ్గుమాలినతనం, అహంకారం
English meaning: The word effrontery (అఫ్రాన్టరీ) is a noun that describes shameless boldness, rude behaviour, or audacity that shocks others.
Synonyms: Insolence, Boldness; ***Antonyms:*** Modesty, Humility
Usage: 1. He had the effrontery to challenge the professor's expertise without any evidence to support his claims.
2. Her effrontery in interrupting the meeting astonished everyone, as such disrespect was rarely tolerated.

కరెంట్ అఫైర్స్



ప్రభుత్వ రంగ విద్యుత్ సంస్థ ఏపీ జెన్‌కో 2026, జనవరి 4న థర్మల్ ప్లాంట్ల ద్వారా 5,828 మెగావాట్లు, జల విద్యుత్ ద్వారా 181 మెగావాట్లు.. మొత్తం 6,009 మెగావాట్లను ఉత్పత్తి చేసి చరిత్ర సృష్టించింది. ఉత్పత్తి సామర్థ్యం పెరగడం వల్ల గతంతో పోలిస్తే రోజుకు సుమారు 1,500 మెగావాట్ల విద్యుత్.. థర్మల్ ప్లాంట్ల ద్వారా గ్రిడ్‌కు అందుతోందని అధికారులు తెలిపారు.



సుప్రీంకోర్టులో భారత ప్రభుత్వ అదనపు సొలిసిటర్ జనరల్ (ఏఎస్‌జీ)గా మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ 2026, జనవరి 5న బాధ్యతలు స్వీకరించారు. మూడేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారు.
☛ రవీంద్రకుమార్ 1983లో ఆంధ్రప్రదేశ్ బార్‌కౌన్సిల్‌లో నమోదై న్యాయవాద వృత్తి ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వం, ఏపీఎస్ఆర్టీసీ, ఏపీ విద్యుత్ బోర్డు, ఏపీ ట్రాన్స్‌కో, ఏపీ డిస్కంల స్టాండింగ్ కౌన్సెల్‌గా పనిచేశారు.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Jobs at NIELIT

National Institute of Electronics and Information Technology (NIELIT) is conducting walk-in interviews for the Team Lead, VLSI Design, Senior Trainers, etc. posts on a contractual basis. The total number of posts is 21. Eligible candidates can appear for the interview on 16 January 2026.

Did You Apply..?

Today (January 7) is the last date for the following Jobs

☛ 86 Senior Resident Jobs at AIIMS Nagpur. ***Eligibility:*** DM/MCh.

For more information and other notifications - scan QR code

స్టీఫెన్ విలియం హాకింగ్

శాస్త్రవేత్తలు విశేషాలు

ఈయన ప్రపంచ ప్రఖ్యాత భౌతిక శాస్త్రవేత్త. తన జీవిత కాలంలో 'బ్లాక్ హోల్స్ (కృష్ణ బిలాలు)', 'కాస్మాలజీ (విశ్వ సృష్టిశాస్త్రం)'పై నిరంతర పరిశోధనలు చేశారు. అమియోట్రోఫిక్ లేటరల్ స్క్లెరోసిస్ (ఏఎల్ఎస్) వ్యాధి కారణంగా ఆయన శరీరం చచ్చుబడిపోవడంతో పూర్తిగా చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. అయినప్పటికీ నిరాశపడకుండా తన సంకల్ప బలంతో సృష్టి రహస్యాలను ఛేదించాలనుకున్నారు. కాస్మాలజీలో ఆయన వెలువరించిన సిద్ధాంతాలు ఎందరికో మార్గదర్శకంగా నిలిచాయి. విజ్ఞానశాస్త్ర పరంగా ఈయన్ను అత్యంత తెలివైన సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్తగా పరిగణిస్తారు. **రేపు (జనవరి 8) స్టీఫెన్ హాకింగ్ జయంతి** సందర్భంగా ఆయన జీవితంలోని ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!



బాల్యం – వృత్తి జీవితం

స్టీఫెన్ హాకింగ్ 1942, జనవరి 8న ఆక్స్‌ఫర్డ్‌లో జన్మించారు. లండన్‌లోని బైరాన్ హౌస్ స్కూల్‌లో పాఠశాల విద్యను ప్రారంభించారు.
▮ హాకింగ్ 1959లో ఆక్స్‌ఫర్డ్‌లోని యూనివర్సిటీ కాలేజ్‌లో చేరారు. అందులో భౌతిక, రసాయనశాస్త్రాలను అభ్యసించారు. 1962లో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీలో ట్రినిటీ కాలేజ్‌లో చేరారు.
▮ ఆ తర్వాత హాకింగ్ ఏఎల్ఎస్ బారిన పడ్డారు. వ్యాధి ప్రభావం వల్ల క్రమేణా ఆయన శరీరమంతా చచ్చుబడిపోయింది. గొంతు మూగబోయింది. అవేమీ లెక్కచేయకుండా ఆయన పట్టుదలతో చదువుపైనే దృష్టి సారించారు. విశ్వం ఏర్పడటం గురించి అధ్యయనం చేయడం మొదలుపెట్టారు.
▮ 1966లో 'ప్రాపర్టీస్ ఆఫ్ ఎక్స్‌పాండింగ్ యూనివర్సెస్' అనే థీసిస్‌తో కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి పీహెచ్‌డీ పట్టా అందుకున్నారు. విశ్వం ఏకత్వం నుంచి ప్రారంభమైందని పేర్కొంటూ జనరల్ రిలేటివిటీ, బిగ్‌బ్యాంగ్ థియరీ సహా వివిధ అంశాలను అందులో పేర్కొన్నారు.

స్టీఫెన్ హాకింగ్‌కి లభించిన అవార్డులు - గౌరవాలు, ఆయన చేసిన పరిశోధనలు, గతంలో అడిగిన ప్రశ్నలు - జవాబుల కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

భారతదేశంలో సంస్థానాల విలీనం

స్వాతంత్ర్యానికి పూర్వం

భారతదేశంలోని ప్రాంతాల్లో కొన్ని బ్రిటిష్ పాలనలో, మరికొన్ని స్వదేశీ సంస్థానాధీశుల అధీనంలో ఉండేవి. స్వాతంత్ర్యానంతరం అవి స్వతంత్రంగా ఉండటమా, భారత్ లేదా పాకిస్థాన్‌లో చేరడమా అనే ప్రశ్న తలెత్తింది. భారత్‌లో చేరడమే లాభదాయకమని అనేక సంస్థానాలు భావించాయి. కానీ జునాగఢ్, కశ్మీర్, హైదరాబాద్ సంస్థానాలు స్వతంత్రంగా ఉండాలని నిర్ణయించుకున్నాయి.



☛ 1947లో భారత్, పాకిస్థాన్‌లుగా విడిపోయే నాటికి మనదేశంలో దాదాపు 562 సంస్థానాలుండేవి. ఈ సంస్థానాలపై ఆంగ్లేయుల అధికారం అంతం కావడంతో వాటి భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయా సంస్థానాధిపతులే నిర్ణయించుకోవాలని లార్డ్ మౌంట్ బాటన్ రూపొందించిన పథకం నిర్దేశించింది.

జునాగఢ్

☛ కథియవార్ ద్వీపకల్పంలోని సంస్థానాల్లో జునాగఢ్ ప్రసిద్ధమైంది. దీని పాలకుడు నవాబ్ సర్ మహ్మద్ రసూల్‌ఖాన్. ఈ సంస్థానంలో 75% మంది ప్రజలు హిందువులు.
☛ సంస్థానంలోని ప్రజలు భారత సమాఖ్యలో చేరాలని ఆశించారు. నవాబ్ మాత్రం తన సంస్థానం పాకిస్థాన్‌లో చేరుతుందని ప్రకటించాడు.

కశ్మీర్

☛ భౌగోళికంగా కశ్మీర్ సంస్థానం జమ్మూ, కశ్మీర్ లోయ, గిల్గిత్, లద్దాఖ్ అనే నాలుగు భాగాలుగా ఉండేది. ఈ సంస్థానానికి రాజా హరిసింగ్ అనే హిందువు అధిపతిగా ఉండేవారు. ఇక్కడ ముస్లిం జనాభా అధికం.

హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనం కావడం సహా పూర్తి సమాచారం ఈ-బుక్ రూపంలో 'ఈనాడు ఈప్రతిభ' వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Reading Comprehension

Bank Exams
English

Directions (Qs. 1 - 10): *Read the following passage carefully and answer the questions given after reading it. Certain words/phrases have been printed in bold to help you locate them while answering some of the questions.*

Over the past decade, the gig economy has emerged as a significant component of modern labour markets, reshaping how work is organised and delivered across the world. Characterised by short-term contracts, freelance assignments, and task-based employment, the gig economy has gained momentum due to rapid digitalisation, the expansion of platform-based businesses, and changing workforce preferences. In countries like India, where demographic pressure and unemployment remain persistent challenges, gig work has emerged as an alternative source of income for millions, particularly youth and urban migrants. The economic importance of the gig economy lies in its ability to provide flexibility to both workers and employers. For businesses, it reduces fixed labour costs and allows quick scaling of operations in response to market demand. For workers, it offers autonomy, flexible working hours, and access to diverse income streams. Sectors such as ridehailing, food delivery, logistics, content creation, software services, and home-based services have witnessed **exponential** growth through gig platforms. Moreover, the gig economy has played a crucial role in absorbing labour displaced by automation and economic disruptions, especially during periods of crisis. However, despite its expanding footprint, the gig economy is accompanied by several structural and regulatory challenges. One of the most pressing concerns is the absence of job security. Gig workers are generally classified as independent contractors rather than employees, which excludes them from traditional labour protections such as minimum wages, paid leave, provident funds, and health insurance. Income volatility further aggravates their vulnerability, as earnings often **fluctuate** based on demand, algorithmic ratings, and platform policies beyond the worker's control. Another critical issue relates to social security and legal recognition. Existing labour laws in many developing economies were designed for formal, long-term employment and have not kept pace with evolving work arrangements. As a result, gig workers frequently operate in a **regulatory grey area**, lacking grievance redressal mechanisms and collective bargaining power. Additionally, algorithmic management practices used by digital platforms often result in opaque decision-making, raising concerns about fairness, accountability, and worker rights. To harness the full potential of the gig economy while ensuring worker welfare, practical policy measures are essential. First, there is a need to redefine labour classifications to recognise gig workers as a distinct category, entitled to basic social security benefits. Governments can introduce contributory social protection schemes covering health insurance, accident insurance, and retirement benefits, with shared responsibility between platforms, workers, and the state. Second, minimum earnings standards and transparent algorithmic practices should be mandated to reduce income uncertainty and discrimination. **Skill development and .... initiatives also play a vital role in enhancing the long-term sustainability of gig employment.** Training programmes focused on digital literacy, financial management, and sector-specific skills can help workers transition to higher-value roles. Furthermore, financial inclusion through access to credit, insurance, and digital payment systems can strengthen economic resilience among gig workers.

1. What would be the most appropriate title for the passage?
A) Digital Platforms: Emerge and the Decline of Traditional Jobs
B) Labour Laws: Informal Employment in India
C) Automation and Employment Crisis in Developing Economies
D) Gig Economy: Opportunities, Challenges, and Policy Responses
E) Youth Unemployment and Urban Migration

2. According to the passage, the gig economy is mainly characterised by:
A) Permanent employment and fixed wages
B) Government-regulated labour contracts
C) Complete elimination of labour costs
D) Declining role of digital platforms
E) Task-based and short-term work arrangements

3. Choose the word most similar in meaning to **"exponential"** as used in the passage.
A) gradual B) limited C) rapid
D) uncertain E) stagnant

4. Which of the following is identified as a major concern for gig workers, as per the passage?
I. Income volatility II. Lack of social security
III. Excessive government regulation
A) I and II only B) II and III only
C) I and III only D) All of the above
E) None of the above

5. The phrase **regulatory grey area** in the passage implies:
A) complete legal clarity
B) partial or unclear legal coverage
C) strict enforcement of labour laws
D) worker-friendly regulations
E) absence of digital platforms

6. What does the passage suggest as a key policy response to gig economy challenges?
A) Eliminating digital labour platforms
B) Treating gig workers as informal labour only
C) Reducing worker flexibility
D) Restricting gig work to urban areas
E) Redefining labour classifications

7. Which of the following sectors is mentioned as benefiting from gig platforms?
A) Ride-hailing, food delivery and logistics
B) Heavy manufacturing C) Agriculture only
D) Public administration E) Defence services

8. Choose the antonym of **fluctuate** as used in the passage.
A) vary B) differ C) change
D) stable E) collect

9. What role does skill development play according to the passage?
A) Reducing platform accountability
B) Enhancing long-term sustainability of gig work
C) Limiting worker mobility
D) Replacing social security systems
E) Eliminating income fluctuations entirely

10. Fill in the blank with the appropriate word from the given options.
A) Highly critical
B) Completely optimistic
C) upskilling
D) Dismissive
E) Indifferent

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

లక్షమంది డ్రోన్ సైనికులతో ప్రత్యేక దళం

- శత్రుభీకర భైరవ్ సేన
- ఆధునిక యుద్ధాలను ఎదుర్కొనేందుకు భారత సైన్యం కసరత్తు



ఈటీవీ భారత్: భారత సైన్యం తన రూపురేఖలను పూర్తిగా మార్చుకుంటోంది. భవిష్యత్తులో జరిగే ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు సరికొత్త అస్త్రశస్త్రాలతో సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా అతి పెద్ద మార్పునకు శ్రీకారం చుట్టింది. ఏకంగా లక్ష మందికి పైగా 'డ్రోన్ ఆపరేటర్ల'తో ఒక భారీ మానవ సైన్యాన్ని తయారుచేసింది. శత్రు స్థావరాలను ధ్వంసం చేసేందుకు 'భైరవ్' పేరుతో కొత్తగా ప్రత్యేక బలగాలను రంగంలోకి దించింది. ఈ దళం ఆధునిక సాంకేతికతతో శత్రువులను హడలెత్తించడానికి సిద్ధంగా ఉంది.

భైరవ్ దళ ఏర్పాటు వెనుక భారీ వ్యూహం ఉంది. ఇది సాధారణ దళానికి, పారా స్పెషల్ ఫోర్సెస్‌కు మధ్య వారధిలా పనిచేస్తుంది. ఆధునిక యుద్ధాల్లో డ్రోన్ల వినియోగం కీలకంగా మారింది. అందుకే ఈ దళంలోని ప్రతి సైనికుడికి డ్రోన్లను ఆపరేట్ చేయడంలో, వాటిని యుద్ధంలో వాడటంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. వీరు శత్రువుల భూభాగంలోకి చొరబడి, వారి స్థావరాలను డ్రోన్ల సాయంతో కచ్చితత్వంతో దెబ్బకొట్టగలరు. అత్యంత వేగంగా, దూకుడుగా దాడులు చేయడం వీరి ప్రత్యేకత.

15 బెటాలియన్లు సిద్ధం

సైనిక ప్రధాన కార్యాలయ ఆదేశాల మేరకు భైరవ్ దళాల ఏర్పాటు వేగంగా జరుగుతోంది. ఇప్పటికే సుమారు 15 బెటాలియన్లను భారత సైన్యం సిద్ధం చేసింది. వీటిని రెండు సరిహద్దుల్లోని (పాక్, చైనా) కీలక ప్రాంతాల్లో మోహరించారు. భవిష్యత్తులో వీటి సంఖ్యను 25కు పెంచాలని సైన్యం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారు.

ప్రస్తుతం రాజస్థాన్ ఎడారి ప్రాంతంలో ఈ దళం కఠోర శిక్షణ తీసుకుంటోంది. ఇక్కడ ఒక ఆసక్తికరమైన విధానాన్ని అమలు చేశారు. 'సన్స్ ఆఫ్ ద సాయిల్' అనే సూత్రంతో స్థానికులకే పెద్దపీట వేశారు. రాజస్థాన్ ఎడారి ప్రాంతం, అక్కడి వాతావరణం, భాష, భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న స్థానిక యువకులను ఈ బెటాలియన్‌లో ఎక్కువగా చేర్చుకున్నారు. వీరిని 'డెజర్ట్ ఫాల్కన్స్' అని కూడా పిలుస్తున్నారు. రాజస్థాన్ వీరత్వానికి, పరాక్రమానికి ప్రతీకగా వీరు నిలుస్తారని అధికారులు చెబుతున్నారు. టెక్నాలజీ, శారీరక దారుఢ్యం, తెలివితేటల కలయికగా ఈ దళం రూపుదిద్దుకుంది. ఈ నెల 15న జైపుర్‌లో జరగనున్న ఆర్మీ డే కవాతులో ఈ భైరవ్ దళం తొలిసారిగా పాల్గొంటుంది.

రుద్ర బ్రిగేడ్స్ పేరుతో మరో శక్తిమంతమైన వ్యవస్థను కూడా సైన్యం ఏర్పాటు చేసింది. ఇది పదాతి, శకట, శతఘ్ని దళ విభాగాలు, ప్రత్యేక బలగాలు ఒకే గొడుగు కింద పనిచేస్తాయి. ఒకరకంగా ఇది సంపూర్ణ యుద్ధవ్యవస్థ.

ఓటరు జాబితాలో పేరుపై స్పందించేందుకు సోనియాకు మరింత గడువిచ్చిన కోర్టు

దిల్లీ: భారత పౌరసత్వాన్ని పొందడానికి ముందే ఓటరు జాబితాలో పేరున్న అంశంపై స్పందించేందుకు కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీకి కోర్టు మరింత సమయాన్ని ఇచ్చింది. 1983లో సోనియా గాంధీ భారత పౌరసత్వాన్ని పొందారు. అంతకు మూడేళ్ల ముందు నుంచే ఓటర్ల జాబితాలో ఆమె పేరు ఉందని, దీనిపై విచారణ జరపాలని మెజిస్ట్రేట్ కోర్టులో పిటిషన్ దాఖలైంది. గతేడాది సెప్టెంబరు 11న మెజిస్ట్రేట్ కోర్టు ఈ పిటిషన్‌ను తోసిపుచ్చడంతో దీనిని సవాలు చేస్తూ పిటిషన్‌దారు దిల్లీ కోర్టును ఆశ్రయించారు. దీనిపై తమ స్పందనను తెలపాలంటూ డిసెంబరు 9న సోనియా గాంధీ, దిల్లీ పోలీసులకు న్యాయమూర్తి గోగ్నే నోటీసులు జారీ చేశారు. మంగళవారం ఈ అంశం విచారణకు రావడంతో సోనియా తరఫు న్యాయవాది మరింత సమయం కావాలని కోరారు. ఫిబ్రవరి 7 వరకు కోర్టు గడువును పెంచింది. అదే తేదీకి విచారణను వాయిదా వేసింది.

ఆర్డీఎక్స్‌తో పేల్చేస్తామంటూ గుజరాత్ హైకోర్టుకు బెదిరింపు

జిల్లా కోర్టులు, ప్రభుత్వ కార్యాలయాలకు కూడా

గాంధీనగర్: గుజరాత్‌లో మంగళవారం బాంబు బెదిరింపులు కలకలం సృష్టించాయి. రాజధాని గాంధీనగర్‌లోని గుజరాత్ హైకోర్టుతో పాటు నాలుగు జిల్లా కోర్టులకు, రెండు కలెక్టర్ కార్యాలయాలకు ఈమెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు వచ్చాయి. వెంటనే తనిఖీలు చేపట్టిన అధికారులు ఆ బెదిరింపులు బూటకంగా తేల్చారు. ఆర్డీఎక్స్‌తో పేల్చేస్తామంటూ హైకోర్టుకు ఈమెయిల్ వచ్చింది. వెంటనే అప్రమత్తమైన పోలీసు శాఖ, బాంబు నిర్వీర్య దళం కలిసి జాగిలాలతో ఆ ప్రాంగణంలో తనిఖీలు నిర్వహించాయి. ఎలాంటి పేలుడు పదార్థాలను గుర్తించలేదు. గాంధీనగర్, భరూచ్‌లోని కలెక్టర్ కార్యాలయాలకు, సూరత్, ఆనంద్, రాజ్‌కోట్, భరూచ్ జిల్లా కోర్టులకు సైతం బాంబు బెదిరింపులు అందాయని అధికారులు తెలిపారు.

ఇండోనేసియాలో ఆకస్మిక వరదలు..

16 మంది మృతి

మనాడో: కుండపోత వర్షాల వల్ల ఇండోనేసియాలోని ఉత్తర సులవేసి ప్రావిన్సులో సంభవించిన ఆకస్మిక వరదల కారణంగా కనీసం 16 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు. సోమవారం తెల్లవారుజామున నదులు ఉప్పొంగి సియావు తగులాండాంగ్ బియారో జిల్లాలో బురద, రాళ్లు, శిథిలాలతో కూడిన వరద నీరు ఉద్ధృతంగా ప్రవహించి గ్రామాలను ముంచెత్తిందని జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ ప్రతినిధి తెలిపారు. ఇందులో 140కి పైగా ఇళ్లు దెబ్బతినగా, 680 మందిని పునరావాస కేంద్రాలకు తరలించాల్సి వచ్చిందని వివరించారు. రోడ్లు, సమాచార వ్యవస్థ దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోంది. బాధితులకు వేగంగా సాయం అందించేందుకు వీలుగా సితారో జిల్లాలో సోమవారం నుంచి 14 రోజుల పాటు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.

మధ్య ఆఫ్రికా అధ్యక్షుడిగా మూడోసారి ఎన్నికైన టౌదెరా

బంగుయి: మధ్య ఆఫ్రికా రిపబ్లిక్ దేశ అధ్యక్షుడిగా ఫాస్టిన్ ఆర్కాంజ్ టౌదెరా మూడోసారి విజయం సాధించారు. గత నెల జరిగిన ఎన్నికల్లో దాదాపు 76 శాతం ఓట్లతో ఆయన నెగ్గినట్లు సోమవారం ఎన్నికల అధికారులు ప్రకటించారు. పదవీ పరిమితులను తొలగించిన కారణంగా ప్రధాన ప్రతిపక్ష కూటమి ఓటింగును బహిష్కరించింది. జాతీయ ఎన్నికల అథారిటీ చేసిన అవకతవకలు, మోసాలను ఉదహరిస్తూ.. ఇప్పటికే ఇద్దరు ప్రతిపక్ష నాయకులు ఈ ఎన్నికలను సవాలు చేశారు. 14 శాతం ఓట్లతో రెండో స్థానంలో ఉన్న అనిసెట్ జార్జెస్ అనే వ్యక్తి తనను తాను విజేతగా ప్రకటించుకున్నారు.

విలాస్‌రావ్‌పై విమర్శలు

రితేశ్‌కు క్షమాపణలు చెప్పిన భాజపా నేత

ముంబయి: బాలీవుడ్ నటుడు రితేశ్ దేశ్‌ముఖ్‌కు మహారాష్ట్ర భాజపా అధ్యక్షుడు రవీంద్ర చవాన్ క్షమాపణలు చెప్పారు. రితేశ్ తండ్రి గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు విమర్శలకు దారి తీయడంతో మంగళవారం ఈ పరిణామం చోటుచేసుకుంది. పార్టీ కార్యకర్తలతో సోమవారం మాట్లాడుతూ... మాజీ ముఖ్యమంత్రి, రితేశ్ తండ్రి విలాస్‌రావ్ దేశ్‌ముఖ్‌పై చవాన్ విమర్శలు గుప్పించారు. స్వస్థలం లాతూర్‌లో విలాస్‌రావ్ జ్ఞాపకాలను తుడిచిపెట్టేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దీంతో వివాదం రాజుకుంది. రాష్ట్ర అభివృద్ధి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడిని తక్కువ చేసేందుకు భాజపా యత్నిస్తోందని కాంగ్రెస్ ఆరోపించింది. దీనిపై సామాజిక మాధ్యమం వేదికగా రితేశ్ దేశ్‌ముఖ్ స్పందించారు. "ప్రజల కోసం తమ జీవితాన్ని అంకితం చేసిన వారి పేర్లు సామాన్యుల హృదయాల్లో అచ్చువేసి ఉంటాయని రెండు చేతులూ జోడించి చెబుతున్నా. చేతితో రాసిన దాన్ని అయితే చెరిపేయవచ్చు. అచ్చువేసిన దాన్ని చెరిపేయలేం'' అంటూ రితేశ్ ఓ వీడియో ప్రకటనను విడుదల చేశారు. తాను విలాస్‌రావ్‌ను విమర్శించలేదని, ఆయన పేరు చెప్పి లాతూర్‌లో ఓట్లు దండుకోవాలని కాంగ్రెస్ చూస్తోందని అనంతరం రవీంద్ర చవాన్ మీడియాతో అన్నారు. రితేశ్ దేశ్‌ముఖ్ తనకు మంచి మిత్రుడని, నా మాటలు ఆయన్ని బాధించి ఉంటే అందుకు క్షమాపణలు చెబుతున్నానని తెలిపారు.



చైనా హైలాంగ్‌జియాంగ్ ప్రావిన్స్‌లోని హార్బిన్‌లో నిర్వహిస్తున్న ఐస్ అండ్ స్నో ఉత్సవంలో మంగళవారం జరిగిన సామూహిక వివాహకార్యక్రమంలో పాల్గొన్న జంటలు

మగ సంతానం కోసం 11 మందిని కన్న దంపతులు!

చండీగఢ్: ఆ దంపతులకు వివాహమై దాదాపు 19 ఏళ్లు. వారికి మొత్తం 11 మంది సంతానం. మగపిల్లాడి కోసం ఎదురు చూసిన భార్యాభర్తలు వరుసగా 10 మంది బాలికలకు జన్మనిచ్చారు. చివరిగా ఈ నెల 4న మగ శిశువు జన్మించడంతో వారి సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది. హరియాణాలోని జింద్ జిల్లా ఉచానాలో ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యుడు నరవీర్ షియోరాన్ వెల్లడించారు. 37 ఏళ్ల మహిళ ఈ నెల 3న పురిటి నొప్పులతో ఆస్పత్రిలో చేరి.. మరుసటి రోజు సాధారణ కాన్పులో మగ బిడ్డకు జన్మనిచ్చినట్లు తెలిపారు. ఇంత మంది పిల్లల్ని పెంచడం కష్టం కాదా అన్న మీడియా ప్రశ్నకు శిశువు తండ్రి సంజయ్ కుమార్ స్పందిస్తూ..''కుమారుడు కావాలని మా కోరిక. మా పిల్లలు కూడా తమ్ముడు కావాలని అడిగారు. అందుకే మగ పిల్లాడు పుట్టే వరకు వేచి చూశాం. మాకున్న వనరులతోనే పిల్లలందరి బాగోగులు చూసుకుంటూ సంతోషంగా ఉన్నాం'' అని చెప్పారు. సంజయ్‌కు 2007లో వివాహమైంది. పెద్ద కుమార్తె 12వ తరగతి చదువుతోంది.

వీధి కుక్కల కేసుపై నేడు విచారణ

- మనుషుల విషయంలోనూ ఇన్ని దరఖాస్తులు రావు
- సుప్రీంకోర్టు వ్యాఖ్య



దిల్లీ: వీధి కుక్కల అంశంపై అనేక వ్యాజ్యాలతో దరఖాస్తులు అవుతున్నాయని, మనుషులకు సంబంధించిన కేసుల్లో కూడా ఇన్ని రావు అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వీధికుక్కల బెడద గురించి మంగళవారం ఇద్దరు న్యాయవాదులు ప్రస్తావించడంతో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. వీధికుక్కల అంశంపై బుధవారం విచారణ జరగనుంది. త్రిసభ్య ధర్మాసనం ఈ విచారణ చేపడుతుంది. న్యాయవాదులందరి వాదనలను కోర్టు వింటుందని ధర్మాసనం స్పష్టం చేసింది. విద్యాసంస్థలు, ఆస్పత్రులు, రైల్వే స్టేషన్లు తదితర ప్రదేశాల్లో కుక్క కరిచిన ఘటనలు పెరిగిపోతున్న నేపథ్యంలో వీధి కుక్కలకు సంతాననిరోధక శస్త్రచికిత్సలు చేసి షెల్టర్లకు తరలించాలని గత నవంబరు 7న కోర్టు సూచించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై గత జులై 28న కోర్టు తనంత తానుగా విచారణ చేపట్టింది.

పీఎంఎల్‌ఏ కేసులో న్యాయవాది అభ్యర్థనను తోసిపుచ్చిన ధర్మాసనం

దిల్లీ: అగస్టా వెస్ట్‌ల్యాండ్ వీవీఐపీ హెలికాప్టర్ కుంభకోణంలో మనీలాండరింగ్ అభియోగాలు ఎదుర్కొంటున్న ఒక న్యాయవాది పీఎంఎల్‌ఏ చట్టంలోని కొన్ని నిబంధనలను సవాలు చేస్తూ దాఖలు చేసిన వ్యాజ్యాన్ని సుప్రీంకోర్టు మంగళవారం తోసిపుచ్చింది. న్యాయవాది సైతం సాధారణ పౌరుల్లా విచారణ ఎదుర్కోవాల్సిందేనని న్యాయమూర్తులు స్పష్టం చేశారు. 'నేను ధనికుణ్ని కాబట్టి చట్టాన్ని సవాలు చేస్తానన్న ప్రవృత్తి నశించాలి' అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడుకున్న ధర్మాసనం పేర్కొంది. విజయ్ మదన్‌లాల్ కేసులో తాము వెలువరించిన తీర్పు నేపథ్యంలో పీఎంఎల్‌ఏ నిబంధనల చెల్లుబాటుపై వేసిన రివ్యూ పిటిషన్లు కోర్టు పరిశీలనలో ఉన్నాయని వివరించింది. మరో ప్రత్యేక రిట్ పిటిషన్ అవసరం లేదని భావిస్తున్నట్టు న్యాయమూర్తులు పేర్కొన్నారు.

విదేశీయుల్ని 'జాబితా' నుంచి మినహాయించే అధికారం మాదే

- సుప్రీంకోర్టుకు తెలిపిన ఈసీ
- రేపు వాదనల కొనసాగింపు

దిల్లీ: ఓటరు జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) చేపట్టే అధికారం, సామర్థ్యం తనకు ఉందని ఎన్నికల సంఘం (ఈసీ) మంగళవారం సుప్రీంకోర్టుకు తెలియజేసింది. విదేశీయులెవరూ ఓటర్లుగా నమోదు కాకుండా చూసే రాజ్యాంగబద్ధమైన బాధ్యత కూడా తనపై ఉందని పేర్కొంది. ఎన్నికల సంఘం తరఫున వాదనలు వినిపించిన న్యాయవాది రాకేశ్ ద్వివేది. . సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీలతో కూడుకున్న ధర్మాసనానికి ఈ విషయం తెలియజేశారు. పలు రాష్ట్రాల్లో ఎస్ఐఆర్ చేపట్టాలని ఈసీ తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లపై తుది విచారణ చేపడుతూ ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈసీ అధికారాలు, పౌరసత్వ నిర్ధారణ, ఓటు హక్కు తదితర అంశాలపై పిటిషనర్లు ప్రశ్నలు లేవనెత్తారు. సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తుల నియామకానికి సంబంధించిన 124(3) అధికరణాన్ని ఉటంకిస్తూ భారత పౌరులు మాత్రమే మూడు ప్రజాస్వామ్య స్తంభాలైన కార్యనిర్వాహక, న్యాయ, శాసననిర్మాణ వ్యవస్థల ప్రతినిధులుగా ఉండాలని ఈసీ వాదించింది. రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని వంటి రాజ్యాంగ పదవులకు నియుక్తుడయ్యే వ్యక్తి భారత పౌరుడై ఉండాలన్నది ప్రధాన షరతు అని న్యాయవాది రాకేశ్ ద్వివేది అన్నారు. ప్రధానమైన నియామకాలన్నీ పౌరసత్వం ఆధారంగానే జరగాలని నిర్దేశిస్తున్న మన రాజ్యాంగం పౌరసత్వ ప్రధానమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. వాక్పటిమతో రాజకీయ పార్టీలు చేసే వాదనలకు ఎన్నికల సంఘం సమాధానం చెప్పాల్సిన పనిలేదన్నారు. ఓటరు జాబితా సవరణ బాధ్యత ఎన్నికల సంఘానిదేనన్నారు. ఎస్ఐఆర్, జాతీయ పౌరపట్టిక (ఎన్ఆర్‌సీ) భిన్నమైన అంశాలని స్పష్టంచేశారు. 'ఎన్ఆర్‌సీ అందరికీ వర్తిస్తుంది, ఓటరు జాబితా కేవలం 18 ఏళ్లు పైబడిన వారికి మాత్రమే. అలాగే మానసిక వైకల్యం కలిగిన వారిని ఓటరు జాబితాలో చేర్చడానికి లేదు' అని చెప్పారు. ద్వివేదీ గురువారం వాదనలు కొనసాగించనున్నారు. పౌరసత్వంపై విచారణ జరిపే రాజ్యాంగబద్ధ అధికారం లేని ఎన్నికల కమిషన్.. అనుమానాస్పద పౌరులపై దర్యాప్తు చేపట్టవచ్చా అని ధర్మాసనం అంతకు ముందు ప్రశ్నించింది.

పాక్‌కు గూఢచర్యం చేస్తున్న బాలుడి అరెస్టు

ఛండీగఢ్: దేశ రాజధాని దిల్లీలో బాంబు పేలుళ్ల అనంతరం నిఘా పెంచిన పోలీసులు పాకిస్థాన్ గూఢచర్య సంస్థలతో సంబంధం ఉన్నవారిని, ఉగ్ర మద్దతుదారులను గుర్తించి అరెస్టుచేస్తున్నారు. ఈ నేపథ్యంలో పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ కోసం గూఢచర్యం చేస్తున్న 15 ఏళ్ల బాలుడిని పఠాన్‌కోట్‌లో అరెస్టుచేసినట్లు పోలీసులు మంగళవారం వెల్లడించారు. జమ్మూలోని సాంబా జిల్లాకు చెందిన బాలుడు దాదాపు ఏడాదిగా ఐఎస్ఐ ఏజెంట్లకు భారత సైనిక స్థావరాలు, దేశ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని చేరవేస్తున్నాడు. అరెస్టయిన బాలుడితో పాటు పంజాబ్‌కు చెందిన మరికొందరు మైనర్లకు కూడా ఐఎస్ఐతో సంబంధాలు ఉన్నట్లు విచారణలో వెల్లడైంది. సరిహద్దు ప్రాంతాల్లోని మైనర్ల ఆన్‌లైన్ కార్యకలాపాలు, కదలికలపై పోలీసులు దృష్టిపెట్టారు. భారత యువతను లక్ష్యంగా చేసుకొన్న పాక్ నిఘా సంస్థ పలు నకిలీ సోషల్ మీడియా ఖాతాలను నడుపుతున్నట్లు దర్యాప్తులో తేలింది.

వలపు వలలో చిక్కి!

వలపు వలలో చిక్కి దాదాపు ఏడు నెలలుగా దేశ భద్రతకు సంబంధించిన కీలక సమాచారాన్ని పాక్ మహిళకు చేరవేస్తున్న ఓ వ్యక్తిని హరియాణా పోలీసులు అరెస్టుచేశారు. నిందితుడిని అంబాలా సమీపంలోని సబ్కా గ్రామానికి చెందిన సునీల్‌కుమార్(31)గా గుర్తించారు. ఐఎస్ఐకు చెందిన హ్యాండ్లర్లు ఓ మహిళ పేరుతో నకిలీ ఫేస్‌బుక్ ఖాతా ద్వారా సునీల్‌ను పరిచయం చేసుకున్నారు. ఓ ప్రైవేటు కాంట్రాక్టర్ వద్ద సూపర్‌వైజర్‌గా పనిచేస్తోన్న సునీల్ పలు సైనిక స్థావరాలకు సంబంధించిన ప్రాజెక్టుల నిర్మాణంలో భాగమయ్యాడు. దీంతో అంబాలా వైమానిక స్థావరంలోకి సులువుగా వెళ్లి, అక్కడి కీలక సమాచారాన్ని సేకరించి పాక్‌కు చేరవేశాడు. సునీల్ కదలికలపై అనుమానం వచ్చి అదుపులోకి తీసుకొని ప్రశ్నించగా.. స్థావరంలోని పలు పరిసరాల ఫోటోలు, వీడియోలు తీసి పాక్ మహిళకు పంపినట్లు వెల్లడైంది. భారత్ రహస్య సమాచారం తెలుసుకునేందుకు సునీల్‌కు ఐఎస్ఐ డబ్బును ఎరగా వేసిందని, నిందితుడిని నాలుగు రోజులు కస్టడీకి తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

ప్రభుత్వం సర్వసత్తాక ప్రభువు కాదు: సుప్రీం

దిల్లీ: ప్రజలకు దక్కాల్సిన ప్రయోజనాలపై నిర్ణయాలు తీసుకునే సర్వసత్తాక అధికారాలు కలిగిన ప్రభువును తానే అన్న భావనను ప్రభుత్వం విడిచిపెట్టాలని సుప్రీంకోర్టు మంగళవారం సూచించింది. ప్రభుత్వ యంత్రాంగంలో నెలకొన్న ఆలసత్వం ఔత్సాహికుల ఉత్సాహాన్ని నీరుగారుస్తుందని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మహాదేవన్‌లతో కూడుకున్న ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వం తాను రూపొందించిన విధానాలు, బహిరంగంగా అది చేసే ప్రకటనల మేరకే ప్రవర్తిస్తుందని ప్రజలు నమ్మడం సహజమని ధర్మాసనం పేర్కొంది. ''ప్రభుత్వం తన అధికారాలన్నిటినీ న్యాయంగా, పారదర్శకంగా, ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా.. రాజ్యాంగంలోని 14వ అధికరణం ఇచ్చిన హామీకి అనుగుణంగా ఉపయోగిస్తుందని అందరూ భావించడం సహజం'' అని పేర్కొన్న సర్వోన్నత న్యాయస్థానం ఒరిస్సా హైకోర్టు 2018 డిసెంబరులో వెలువరించిన తీర్పును పక్కనపెట్టింది. 1989 నాటి పారిశ్రామిక విధానం కింద ప్రభుత్వం తనకు ఒక సబ్సిడీ ఇవ్వడానికి నిరాకరించడాన్ని ప్రశ్నిస్తూ ఒక కంపెనీ హైకోర్టు తలుపు తట్టింది. హైకోర్టు తన అభ్యర్థనను నిరాకరించడంతో ఆ సంస్థ సుప్రీంకోర్టుకు వెళ్లింది. అధికార యంత్రాంగం ఆలసత్వం కారణంగానే ఈ దీర్ఘకాల వ్యాజ్యానికి ఆస్కారమేర్పడిందని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ప్రభుత్వ పారిశ్రామిక విధాన లక్ష్యం పెట్టుబడులను ప్రోత్సహించడం, ఉపాధి కల్పన అయినప్పుడు ప్రభుత్వ యంత్రాంగం ఆలసత్వానికి పాల్పడితే అది ఔత్సాహికుల్ని నీరుగారుస్తుంది అని ధర్మాసనం పేర్కొంది. ఈ వ్యాజ్యంలో అప్పీలుదారు అయిన ప్రైవేటు సంస్థకు సబ్సిడీలు పొందే అర్హత ఉందని తెలిపింది. మూడు నెలల్లో సబ్సిడీల రూపంలో కంపెనీకి చెల్లించాల్సిన రూ.11,14,750 సంవత్సరానికి 9 శాతం వడ్డీ కలిపి చెల్లించాలని ఆదేశించింది.

'విచారణ లేని సుదీర్ఘ నిర్బంధం శిక్షతో సమానం'

దిల్లీ: ఎలాంటి విచారణ జరపకుండా, దర్యాప్తులో పురోగతి లేకుండా నిందితుణ్ని సుదీర్ఘకాలం నిర్బంధంలో ఉంచడం ఆమోదయోగ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టంచేసింది. అలా చేయడం విచారణకు ముందే ఒక రకంగా శిక్ష విధించడంతో సమానమని సుప్రీంకోర్టు మంగళవారం ప్రకటించింది. రూ.27 వేల కోట్ల బ్యాంకు మోసానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో ఆమ్‌టెక్ గ్రూపు సంస్థల మాజీ ఛైర్‌పర్సన్ అరవింద్ ధామ్‌కు బెయిలు మంజూరుచేస్తూ జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ అలోక్ అరాధేలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్య చేసింది. అరవింద్ ధామ్‌కు బెయిలు నిరాకరిస్తూ గత సంవత్సరం ఆగస్టు 19న దిల్లీ హైకోర్టు వెలువరించిన ఆదేశాన్ని సుప్రీంకోర్టు పక్కనపెట్టింది. ''విచారణ ప్రారంభించకుండా లేదా నత్తనడకన దర్యాప్తు సాగిస్తూ విచారణ ఖైదీని సుదీర్ఘ కాలం నిర్బంధంలో ఉంచడాన్ని సమ్మతించలేం. ఆర్థిక నేరాల తీవ్రత, వాస్తవాల్లో తేడాలు ఉంటాయి. వాటన్నిటినీ ఒకే గాటన కట్టి అందరికీ ఒకేలా బెయిలు నిరాకరించడం తగదు'' అని ధర్మాసనం పేర్కొంది. ''ఇలాంటి పరిస్థితుల్లో నిందితుణ్ని సుదీర్ఘకాలం జైలులో ఉంచడం, ముఖ్యంగా సాక్ష్యాలు పత్రరూపంలో ఉండి నిందితుడు ఇప్పటికే ప్రాసిక్యూషన్ నిర్బంధంలో ఉన్నప్పుడు బెయిలు నిరాకరించడం సత్వర విచారణకు వీలు కల్పిస్తూ రాజ్యాంగంలోని 21వ అధికరణం చేసిన నిర్దేశాన్ని ఉల్లంఘించినట్టే'' అని ధర్మాసనం అభిప్రాయపడింది. నిందితుడు అరెస్టు కావడానికి పూర్వమే గత సంవత్సరం జూన్ 19న, జులై 2న జులై 9న విచారణలో పాల్గొన్నారని, తద్వారా దర్యాప్తునకు సహకరించారని కోర్టు తెలిపింది.

ఎక్కువ ధర కోసం వేలాన్ని రద్దుచేయరాదు: సుప్రీంకోర్టు

దిల్లీ: ఒక స్థలం వేలంపాటలో ఓ కంపెనీ అత్యధిక బిడ్ వేసినా, అంతకన్నా ఎక్కువ ధర వస్తుందనే అంచనాతో మొత్తం ప్రక్రియను రద్దుచేసి, కొత్తగా వేలం నిర్వహిస్తామనడం సరికాదని సుప్రీంకోర్టు మంగళవారం తేల్చిచెప్పింది. గాజియాబాద్ అభివృద్ధి ప్రాధికార సంస్థ (జీడీఏ) 2023లో గాజియాబాద్‌లో 3,150 చదరపు మీటర్ల పారిశ్రామిక స్థలాన్ని వేలం వేసినప్పుడు 'గోల్డెన్ ఫుడ్ ప్రోడక్ట్స్ ఇండియా' సంస్థ అత్యధిక బిడ్ వేసింది. అదే పారిశ్రామికవాడలో 123 నుంచి 132 చదరపు మీటర్ల స్థలాలు అంతకన్నా ఎక్కువ ధరకు విక్రయమయ్యాయి. ఆ కారణం చూపి గోల్డెన్ ఫుడ్స్ బిడ్‌ను రద్దుచేసి మళ్లీ వేలం నిర్వహిస్తామని జీడీఏ ప్రకటించింది. దీన్ని అలహాబాద్ హైకోర్టు సమర్థించింది. హైకోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టు కొట్టివేసింది. చిన్న స్థలాలకు ఎక్కువ ధర పలికిందనే మిషతో పెద్ద స్థలం వేలం పాటను రద్దుచేయడం సరికాదని స్పష్టంచేసింది.

మోదీ, అమిత్‌షాలకు వ్యతిరేకంగా జేఎన్‌యూలో నినాదాలు

- ఖండించిన భాజపా
- విద్యార్థులపై చర్యలు తప్పవన్న వర్సిటీ

దిల్లీ: దేశ రాజధాని దిల్లీ అల్లర్ల (2020) కుట్ర కేసులో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ (జేఎన్‌యూ) మాజీ విద్యార్థి నాయకుడు ఉమర్ ఖాలిద్, మరో విద్యార్థి నేత షర్జీల్ ఇమామ్‌లకు సుప్రీంకోర్టు బెయిలు నిరాకరించడంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు వ్యతిరేకంగా యూనివర్సిటీ ఆవరణలో విద్యార్థులు సోమవారం రాత్రి నినాదాలు చేశారు. అభ్యంతరకరంగా, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేసిన సంఘం నాయకురాలు అతిథి మిశ్ర సహా సుమారు 35 మంది విద్యార్థులపై కేసు నమోదు చేయాలని పరిపాలనా విభాగం పోలీసులకు మంగళవారం లేఖ రాసింది. విచారణ జరిపి వీరిపై చర్యలు తీసుకొనేందుకు ఓ కమిటీని ఏర్పాటుచేసింది. చట్టవ్యతిరేక, దేశ వ్యతిరేక కార్యకలాపాలను ఎంతమాత్రం సహించేది లేదని వర్సిటీ స్పష్టంచేసింది. అభ్యంతరకర నినాదాలు చేసిన విద్యార్థుల్ని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపింది. ''వర్సిటీలు నవకల్పనలకు, ఆలోచనలకు కేంద్రాలు. విద్వేషాలకు అవి ప్రయోగశాలలు కావడాన్ని అనుమతించలేం. వాక్స్వాతంత్ర్యం ప్రాథమిక హక్కు అయినంతమాత్రాన హింస, చట్టవ్యతిరేక ప్రవర్తనను సహించలేం. తక్షణ సస్పెన్షన్, బహిష్కరణ, శాశ్వత వేటు వంటి చర్యల్ని సంబంధిత విద్యార్థులు ఎదుర్కోక తప్పదు'' అని హెచ్చరించింది. వివాదాస్పద వ్యాఖ్యలను కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్రంగా ఖండించారు. దేశాన్ని విడగొట్టాలని ప్రయత్నించేవారికి యూనివర్సిటీని స్థావరంగా ప్రతిపక్షాలు మార్చేశాయని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ప్రోద్బలంతోనే జేఎన్‌యూ విద్యార్థులు ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలిచ్చారని భాజపా ఆరోపించింది. ప్రధానికి హాని తలపెడతామని బెదిరించడం కాంగ్రెస్‌కు పరిపాటిగా మారిందని భాజపా అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా అన్నారు. జేఎన్‌యూ విద్యార్థి సంఘం ఒక ప్రకటన విడుదల చేస్తూ- తాము శాంతియుతంగా, ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమిస్తున్నామని, కొన్ని మాధ్యమాలు దీనిని తప్పుదోవ పట్టించాయని ఆరోపించింది.

రూ.200 కోట్ల అంతర్జాతీయ ఫారెక్స్ మోసం గుట్టురట్టు

- మహారాష్ట్రలో ఏడుగురి అరెస్టు

పాల్ఘర్: ఆన్‌లైన్ ఫారెక్స్, బంగారు వ్యాపార పథకాల పేరిట ప్రలోభపెట్టి వందలమంది నుంచి రూ.200 కోట్లకు పైగా మోసపూరితంగా దొంగిలించిన అంతర్జాతీయ సిండికేట్‌ను మహారాష్ట్ర పోలీసులు పట్టుకున్నారు. ఇందుకు సంబంధించి ఏడుగురిని అరెస్టు చేసినట్లు అధికారులు తెలిపారు. వీరికి దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో 50 క్రిమినల్ కేసులతో సంబంధమున్నట్లు గుర్తించారు. సూత్రధారులు దేశం వెలుపల నుంచి ఈ రాకెట్‌ను నడిపిస్తున్నారని అన్నారు. నిందితులు వివిధ వివాహ, సామాజిక మాధ్యమ వెబ్‌సైట్‌ల ద్వారా వ్యక్తులను సంప్రదించి వారిని మోసపూరిత పథకాల్లో పెట్టుబడి పెట్టే విధంగా ప్రలోభపెట్టారు. అనంతరం ఫారెక్స్, బంగారు వ్యాపారానికి సంబంధించి అధిక లాభాల ఆశ చూపారు. లాభాలు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నట్లు చూపించే నకిలీ వెబ్‌సైట్ల లింకులు పంపి, పెట్టుబడి మొత్తాలను డిపాజిట్ చేయడానికి వారికి మ్యూల్ ఖాతాలను అందించారు. అలా జమచేసిన తర్వాత ఆ డబ్బును రకరకాల ఖాతాలకు మళ్లించి, విదేశాలకు తరలిస్తారు. మనీలాండరింగ్, పన్ను ఎగవేతకు ఉపయోగించే బ్యాంకు ఖాతాల నెట్‌వర్క్ ద్వారా అక్రమ నిధులను స్వీకరించడానికి కుట్ర పన్నినందుకు వీరిలో ఐదుగురిని అరెస్టు చేశారు. వీరిని నడిపిస్తున్నవారు విదేశాల్లో ఉన్నట్లు గుర్తించారు.

సిగరెట్ పీకలతో కళాకృతి



సిగరెట్ పీకలతో పర్యావరణానికి ప్రమాదం పొంచి ఉంటుంది. వాటిని ఎక్కడపడితే అక్కడ పడేయడంవల్ల ఇబ్బందులూ తప్పవు. కానీ వాటితోనే పర్యావరణ పరిరక్షణపై ప్రచారం చేస్తున్నారు.. రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన ప్రశాంత్ పాండే అనే యువ కళాకారుడు. ఆయన 3,50,000 సిగరెట్ పీకలతో అద్భుత కళాఖండాన్ని సృష్టించారు. 'బయోగ్రఫీ' పేరుతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో దానిని ప్రదర్శిస్తున్నారు. ఈ కళాఖండం రూపొందించడానికి ఆయన ఐదేళ్లు శ్రమించి శుభ్రపరిచిన సిగరెట్ పీకలను సేకరించారు. వాటిని అతి పెద్ద కళాఖండంగా తీర్చిదిద్దారు. దానిద్వారా పర్యావరణంపై, సమాజంలో వ్యక్తుల చీకటి కోణాలపై ప్రశ్నలను లేవనెత్తారు. ప్రేమ, ద్వేషం, మళ్లీ ప్రేమ వంటి సందేశాన్నీ ఆయన అందిస్తున్నారు.



మావల్ అడవుల్లో భారీ ఉడుత

మహారాష్ట్రలోని పుణెకు సమీపంలో ఉన్న మావల్ అడవుల్లో భారీ ఉడుత కనిపించింది. 2026కు సంబంధించి పులుల సర్వే సందర్భంగా దీనిని అటవీ అధికారులు గుర్తించారు. 'ఇండియన్ జెయింట్ స్క్విరెల్ (శెక్రు)'ను మహారాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర జంతువుగా గుర్తించింది. లోనావాలా ప్రాంతంలో దీనిని గుర్తించడంపట్ల పక్షి ప్రేమికులు, పరిశోధకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం లోనావాలా టైగర్ పాయింట్‌వద్ద అధికారులు సర్వే చేస్తున్నప్పుడు ఈ భారీ ఉడుత కనిపించింది.

ఈటీవీ భారత్ యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి

కురుపు పగిలి 20 ఏళ్ల నాటి బుల్లెట్ బయటకు!



హరియాణాలోని ఫరీదాబాద్‌కు చెందిన 32 ఏళ్ల కవితకు విచిత్రమైన అనుభవం ఎదురైంది. ఎటువంటి సర్జరీ లేకుండానే ఆమె శరీరంలో నుంచి ఆమెకు తెలియకుండానే 20 ఏళ్ల నుంచి ఉండిపోయిన తుపాకీ బుల్లెట్ బయటకు వచ్చింది. ఆమెకు తొడ భాగంలో కురుపు కావడం, అది ఇటీవల పగిలి పోవడంతో అది బయటకు వచ్చింది. దీంతో ఆశ్చర్యపోవడం ఆమె వంతైంది. మనేసర్‌లోని కోటా ఖండేవాలా అనే గ్రామంలో కవిత చదువుకున్నారు. ఆమె 12 ఏళ్ల వయసులో పాఠశాలలో చదువుకుంటున్న సమయంలో ఎక్కడి నుంచో ఒక పదునైన వస్తువు వచ్చి తొడ భాగంలో తగిలింది. రక్తం కారింది. అయితే రాయి బలంగా వచ్చి తగిలిందని అందరూ భావించారు. ఆ గాయం తర్వాత కొన్ని రోజులకు మానిపోయింది. అప్పటి నుంచి ఆమెకు తొడ భాగంలో నొప్పిగానీ, వాపుగానీ, ఇతర ఇబ్బందులుగానీ రాలేదు. ప్రస్తుతం ఫరీదాబాద్‌లోని దబువా కాలనీలో ఉంటున్న ఆమెకు ఇటీవల కురుపైంది. అది పెద్దదై పగిలిపోయింది. అందులో నుంచి బుల్లెట్ బయటకు వచ్చింది. కోటా ఖండేవాలా గ్రామం సైనిక శిక్షణ శిబిరానికి దగ్గరలో ఉండేది. అక్కడి నుంచి బుల్లెట్ దూసుకొచ్చి ఉండవచ్చని భావిస్తున్నారు.



విశాఖపట్నం పర్యటనలో పార్లమెంటరీ స్థాయీసంఘం సభ్యులు

అమెరికా సుంకాల ప్రభావంపై పార్లమెంటు స్థాయీసంఘం అధ్యయనం
విశాఖపట్నంలో పర్యటన

ఈనాడు, దిల్లీ: అమెరికా సుంకాలు భారతీయ వాణిజ్యంపై చూపుతున్న ప్రభావం గురించి అధ్యయనం చేయడానికి వాణిజ్య వ్యవహారాల పార్లమెంటరీ స్థాయీ సంఘం క్షేత్రస్థాయి పర్యటన మొదలుపెట్టింది. మంగళవారం నుంచి గురువారం వరకు ఆంధ్రప్రదేశ్, తమిళనాడుల్లో పర్యటించాలని నిర్ణయించిన కమిటీ.. తొలిరోజైన మంగళవారం విశాఖపట్నంలో సమావేశమైంది. టీఎంసీ ఎంపీ డోలాసేన్ అధ్యక్షతన వచ్చిన కమిటీ విశాఖలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, వివిధ వ్యాపారవర్గాల ప్రతినిధులతో సమావేశమైంది. అమెరికా సుంకాల ప్రభావం సముద్ర ఉత్పత్తులపై ఎలా ఉందని మత్స్యకార వర్గాలు, ఎగుమతి మండళ్లు, ఆర్థిక సంస్థల ప్రతినిధులను అడిగి తెలుసుకొంది. విశాఖలోని ఫిషింగ్ హార్బర్, రామకృష్ణ బీచ్‌లోని సీకేఫ్‌లను సందర్శించింది. బుధవారం ఈ కమిటీ చెన్నైకి వెళ్లి అక్కడి ఆటోమోటివ్, తోలు ఉత్పత్తి రంగాల ప్రతినిధులతో సమావేశమవుతుంది. గురువారం కోయంబత్తూరుకు వెళ్లి అక్కడ జౌళి, రెడిమేడ్ వస్త్ర తయారీ వ్యాపారులతో చర్చిస్తుంది. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అంచనావేసి, ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలు సిఫార్సు చేస్తూ పార్లమెంటుకు నివేదిక సమర్పించేందుకు ఈ కమిటీ పర్యటిస్తోంది. పర్యటనలో స్థాయీసంఘం సభ్యురాలిగా తెలంగాణ కాంగ్రెస్ ఎంపీ రేణుకా చౌదరి కూడా పాల్గొన్నారు.

ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీని సందర్శించనున్న ఎన్ఎంసీ ఛైర్మన్

ఈనాడు, అమరావతి: జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) ఛైర్మన్ డాక్టర్ అభిజాత్ చంద్రకాంత్ బుధవారం ఉదయం ఎన్టీఆర్ ఆరోగ్య వర్సిటీని సందర్శించనున్నారు. వీసీ, ఇతర అధికారులతో వర్సిటీ ప్రగతిపై సమీక్షిస్తారు. ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యే అవకాశం ఉందని వర్సిటీ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు మంగళవారం రాత్రి గన్నవరం విమానాశ్రయం చేరుకున్న అభిజాత్ చంద్రకాంత్‌కు ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వీసీ డాక్టర్ పి.చంద్రశేఖర్ స్వాగతం పలికారు.



అభిజాత్ చంద్రకాంత్‌కు స్వాగతం పలుకుతున్న వీసీ చంద్రశేఖర్

డివిజనల్ ఎకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర డివిజనల్ ఎకౌంట్స్ ఆఫీసర్స్ సంఘం నూతన సంవత్సరం-2026 డైరీని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఆవిష్కరించారు. సచివాలయంలోని ఛాంబర్‌లో ఆ సంఘం సభ్యులు మంత్రిని మంగళవారం కలిసి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీఏఎంఎస్ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లేపల్లి శ్రీనివాసరావు, కార్యదర్శి అబ్దుల్ సయీం తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్ సభ్యుల నియామకం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ఎస్సీ కమిషన్ సభ్యులుగా ఐదుగురిని ప్రభుత్వం నియమించింది. పాలకొండ నియోజకవర్గానికి చెందిన ఆర్.సీతారాం, సూళ్లూరుపేటకు చెందిన డాక్టర్ బాబు శ్రీపతి, మాచర్లకు చెందిన మేకల భిక్షం, యర్రగొండపాలెంకి చెందిన డాక్టర్ గౌతంరాజ్, హిందూపురానికి చెందిన రామాంజినమ్మలను సభ్యులుగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వీరు బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి రెండేళ్లు లేదా 60 ఏళ్ల వయసు వరకు ఏది ముందు పూర్తి అయితే దాన్ని పదవీ కాలానికి పరిగణనలోకి తీసుకుంటారు.

స్క్రబ్ టైఫస్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి

- కేంద్ర ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు అనురాధ

ఈనాడు, అమరావతి: కీలక శాఖల సమన్వయంతోనే కీటక జనిత వ్యాధుల నియంత్రణ సాధ్యమవుతుందని కేంద్ర వైద్య ఆరోగ్య- కుటుంబ సంక్షేమ శాఖ ప్రాంతీయ సంచాలకులు అనురాధ సూచించారు. అంటు వ్యాధుల కట్టడికి ప్రభుత్వం నియమించిన ప్రత్యేక టాస్క్ ఫోర్స్ తొలి సమావేశం మంగళవారం వర్చువల్ విధానంలో జరిగింది. పలువురు జాతీయ స్థాయి నిపుణులు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ.. 'రాష్ట్రంలో కుక్క కాటు మరణాలపై ఆడిట్ జరగాలి. దోమలు పుట్టకుండా, కుట్టకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి. స్క్రబ్ టైఫస్‌పై ప్రజల్లో అవగాహన పెంచాలి. చిన్నారులు కుష్ఠు వ్యాధి బారిన పడడానికి దారితీస్తున్న కారణాలపై అధ్యయనం చేయాలి. ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాల్లో ఆహార భద్రత, వ్యవసాయ, మున్సిపల్, పంచాయతీరాజ్ శాఖల అధికారులను భాగస్వాములుగా చేయాలి' అని సూచించారు.

◆ ఇన్‌ఫెక్షన్ కంట్రోల్ ఎకాడమీ ఆఫ్ ఇండియా (ఇక్యాయ్) డైరెక్టర్ రంగారెడ్డి మాట్లాడుతూ 'వసతి గృహాల్లో తనిఖీలకు వైద్య ఆరోగ్య, సంక్షేమ, పంచాయతీ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటుచేయాలి. సమస్యల చెక్‌లిస్ట్ ఆధారంగా పరిస్థితులను చక్కదిద్దాలి. స్క్రబ్ టైఫస్‌పై వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చి ప్రజల్లో అవగాహన పెంచాలి' అని అన్నారు.

◆ మణిపాల్‌లోని కస్తూర్బా వైద్య కళాశాల మైక్రోబయాలజీ సీనియర్ ప్రొఫెసర్ చిరంజయ్ ముఖోపాధ్యాయ మాట్లాడుతూ తురకపాలెం అనుభవాల దృష్ట్యా ఏటా వర్షాకాలానికి ముందు ఫీవర్ క్లినిక్‌లు నిర్వహించాలన్నారు. నీటి నమూనాల పరీక్షకు ఆధునిక సాంకేతికతతో ల్యాబ్‌ల సామర్థ్యం పెంచాలని సూచించారు.

◆ వైద్య ఆరోగ్య- కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ వీరపాండియన్ మాట్లాడుతూ సమావేశంలో చర్చించిన అంశాలపై నెల రోజుల్లో చర్యలు తీసుకుంటామన్నారు.

◆ బ్రూసెల్లోసిస్ వ్యాధిని గుర్తించేందుకు సిరో మానిటరింగ్, సిరో సర్వైలెన్స్ చేస్తున్నామని, జంతువుల్లో లెప్టోస్పిరోసిస్ గుర్తించేందుకు 2,061 నమూనాలు పరీక్షించామని పశుసంవర్ధక శాఖ అధికారులు వెల్లడించారు. తురకపాలెంలో జునోటిక్ పరీక్షల్లో నెగెటివ్ ఫలితం వచ్చిందన్నారు. రాష్ట్రంలో ఏడు లక్షల కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సిన్ వేయించామని మున్సిపల్ అధికారులు పేర్కొన్నారు. సమావేశంలో ఐడీఎస్‌పీ అదనపు సంచాలకుడు డాక్టర్ హిమాన్షు చౌహాన్, కుష్ఠు వ్యాధి నిపుణుడు నరసింహారావు, డీపీహెచ్ పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే రామచంద్రారెడ్డి చిన్నాన్న భూ అక్రమాలపై తెదేపా గ్రీవెన్స్‌లో ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: పీలేరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి చిన్నాన్న వివేకానంద రెడ్డి.. వీఆర్వో సహకారంతో తమ 5 ఎకరాల భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, గత ప్రభుత్వంలో ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని అన్నమయ్య జిల్లా ముస్తురుకు చెందిన మునిరత్నం వాపోయారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి, ఏపీ హౌసింగ్ బోర్డు ఛైర్మన్ బత్తుల తాతయ్యబాబుకు అర్జీ ఇచ్చి న్యాయం చేయాలని కోరారు.

◆ తన భూమిలోకి జేసీబీలతో కొందరు అక్రమంగా చొరబడి కాలువ తవ్వారని, చుట్టూ కంచె వేశారని.. ప్రశ్నిస్తే కుల దూషణలకు దిగి..నరుకుతాం, చంపుతామని బెదిరిస్తున్నారని అనంతపురం జిల్లా పుల్లలరేవుకు చెందిన పెద్దన్న వినతిపత్రం ఇచ్చారు.

◆ తన భూమికి తప్పుడు పత్రాలు సృష్టించిన వ్యక్తులు.. వ్యవసాయ పనులకు వెళ్తుంటే కత్తులు, కర్రలతో దాడిచేస్తూ బెదిరిస్తున్నారు.. పోలీసులకు ఫిర్యాదు చేసినా న్యాయం జరగలేదని అనకాపల్లి జిల్లా గవరపాలెంకి చెందిన బుద్ధ ప్రభాకరరావు అర్జీ ఇచ్చారు. ◆ తన భర్త మరణానంతరం అతని కుటుంబ సభ్యులు తమకు రావల్సిన ఆస్తులు ఇవ్వకుండా వేధిస్తున్నారని తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం మండలం గోవవరం గ్రామానికి చెందిన మంగాదేవి ఫిర్యాదు చేశారు. ◆ తమ భూములను కాజేసే ప్రయత్నం చేస్తూ ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సత్యసాయి జిల్లా నరసంపేటకు చెందిన గంగన్న కోరారు.

◆ తమ కొడుకులు, కోడళ్లు కలిసి ఇనుప గొట్టంతో దాడిచేసి తన చెయ్యి విరిచారని గుంటూరు జిల్లా పెద గొట్టిపాడు గ్రామానికి చెందిన ఆంతోనమ్మ వాపోయారు. దాడికి ముందే తనకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదుచేసినా రక్షణ కల్పించలేదని ఆరోపించారు. ఎస్పీకి ఫిర్యాదు చేయడానికి వెళ్తే తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేస్తానని సీఐ బెదిరిస్తున్నారని, న్యాయం చేయాలని కోరుతూ అర్జీ ఇచ్చారు.

ఈ-పంట వివరాలు ఆన్‌లైన్‌లో చూసుకోవచ్చు

వ్యవసాయశాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ఈనాడు, అమరావతి : 'ఈ-పంట' యాప్ ద్వారా రైతులే అందులో నమోదైన పంటల వివరాలు తెలుసుకోవచ్చని, అవి సరిగా ఉన్నాయో లేదో ధ్రువీకరించుకునే అవకాశాన్నీ రబీ సీజన్ నుంచి అందుబాటులోకి తెచ్చామని వ్యవసాయ శాఖ డైరెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తెలిపారు. రైతులు దీన్ని వినియోగించుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. అభ్యంతరాలూ నమోదు చేయవచ్చని తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్ విడుదల చేశామన్నారు. 'పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే సేవలు సులభంగా అందుతాయి. రైతుల మొబైల్ నంబరుకు 3 సందేశాలు పంపిస్తాం. ఆర్ఎస్‌కే సహాయకుడు పొలాన్ని సందర్శించే ముందు ఒకసారి, పంట నమోదు తర్వాత మరోసారి, రైతు పంట ధ్రువీకరించిన తర్వాత ఇంకోసారి వస్తాయి' అని వివరించారు.

ఈ-పంట వివరాల వెబ్‌సైట్లు: www.karshak.ap.gov.in/ecrop , www.agriculture.ap.gov.in

ద.మ.రైల్వే నుంచి ద.కోస్తాకు 959 పోస్టుల బదిలీ

ఈనాడు, హైదరాబాద్: దక్షిణ మధ్య రైల్వే(ఎస్‌సీఆర్) హెడ్‌క్వార్టర్స్ నుంచి దక్షిణ కోస్తా రైల్వే(ఎస్‌సీఓఆర్) హెడ్‌క్వార్టర్స్‌కు 959 పోస్టులు బదిలీ కానున్నాయి. రైల్వే బోర్డు ఆదేశాల మేరకు సోమవారం సికింద్రాబాద్‌లో జరిగిన ద.మ.రైల్వే, ద.కోస్తా జనరల్ మేనేజర్ల సంయుక్త సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. సికింద్రాబాద్ రైల్‌నిలయంలోని ద.మ.రైల్వే ప్రధాన కార్యాలయంలో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను విశాఖపట్నంలో ప్రధాన కార్యాలయం ఉన్న ద.కోస్తా జోన్‌కు తక్షణమే బదిలీ చేయాలని నిర్ణయించారు. ప్రధాన కార్యాలయంలోని అన్ని విభాగాల పోస్టుల గుర్తింపు.. బదిలీ ప్రక్రియను చేపట్టనున్నారు. డిసెంబరు 12న రైల్వేబోర్డు నుంచి వచ్చిన లేఖకు అనుగుణంగా ద.కోస్తా జోన్‌కు తాత్కాలికంగా 22 మంది సిబ్బందిని తక్షణమే బదిలీ చేయాలంటూ వచ్చిన ఆదేశంపైనా చర్చించారు.

ఆప్షన్ల ప్రకారం రిలీవ్: ద.మ.రైల్వే ప్రధాన కార్యాలయంలో ప్రాధాన్య క్రమంలో ఆప్షన్లు ఇచ్చిన సిబ్బందిని రిలీవ్ చేయాలని సమావేశంలో నిర్ణయించారు. సిబ్బంది సంబంధిత అంశాలపై చర్చించేందుకు కార్మిక సంఘాల ప్రతినిధులతో రెండు జోన్లు సంయుక్త సమావేశం నిర్వహించాల్సిన అవసరం ఉందని ఇద్దరు జీఎంలు సంజయ్‌కుమార్ శ్రీవాస్తవ(ద.మ.రైల్వే), సందీప్ మాథూర్(ద.కోస్తా) భేటీలో అభిప్రాయపడ్డారు.

రూ.6,500 కోట్ల రుణ సమీకరణ

ఈనాడు, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మంగళవారం రూ. 6,500 కోట్ల రుణం తీసుకుంది. రిజర్వు బ్యాంకు నిర్వహించిన సెక్యూరిటీల వేలంలో పాల్గొని ఈ మొత్తం సమీకరించింది. వివరాలు ఇలా ఉన్నాయి.

రుణం (రూ.కోట్లలో)	వడ్డీ	కాలపరిమితి (ఏళ్లు)
1,000	7.53	10
1,000	7.64	14
1,000	7.61	16
1,000	7.60	18
1,000	7.60	19
1,500	7.59	21

టోల్‌ప్లాజాల వద్ద జీఎస్టీ సెన్సర్లు



జాతీయ రహదారి-44పై తెలంగాణ నిర్మల్ జిల్లా సోన్ మండలంలోని గంజాల్ టోల్‌ప్లాజాల వద్ద ఎన్‌హెచ్ఏఐ ఆధ్వర్యంలో వాహనాల ట్రాకింగ్ సెన్సర్లను బిగించారు. వీటిని రోజువారీ టోల్‌వసూళ్లు, సరకు రవాణా వాహనాల లెక్కింపులో ఉపయోగించి స్పష్టమైన వివరాలను తెలుసుకుంటారు. వీటి సహాయంతో రహదారిపై ప్రయాణిస్తున్న వాహనాల వివరాలను ఎప్పటికప్పుడు సేకరిస్తారు. కేంద్రప్రభుత్వ ఆదేశం మేరకు వెహికల్ ట్రాకింగ్ ఆఫ్ జీఎస్టీ సిస్టంకు వీటిని అనుసంధానించినట్లు సంబంధిత సిబ్బంది పేర్కొన్నారు. ఇవి త్వరలోనే అందుబాటులోకి రానున్నాయి. -న్యూస్‌టుడే, సోన్


టిక్కెట్ ధరల పెంపుపై సింగిల్ జడ్జి ఉత్తర్వులు రద్దు చేయండి

తెలంగాణ హైకోర్టును ఆశ్రయించిన రాజాసాబ్, మన శంకరవరప్రసాద్ చిత్రాల నిర్మాతలు

ఈనాడు, హైదరాబాద్: కొత్త సినిమాల విడుదల సందర్భంగా టిక్కెట్ ధరల పెంపునకు సంబంధించి దాఖలైన పిటిషన్లలో విచారణ ముగిసేదాకా ఎలాంటి మెమోలు, సర్క్యులర్లు జారీ చేయరాదంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులపై రాజాసాబ్, మన శంకరవరప్రసాద్ చిత్రాల నిర్మాతలు మంగళవారం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. అఖండ-2 సినిమా టిక్కెట్ ధరల పెంపును నిలిపివేస్తూ ఈ వివాదానికి సంబంధించిన పిటిషన్లపై తేలేదాకా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వరాదంటూ గత ఏడాది డిసెంబరు 9న సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్, షైన్ స్క్రీన్స్ హైకోర్టులో అప్పీలు దాఖలు చేశాయి. సింగిల్ జడ్జి ఉత్తర్వుల కారణంగా త్వరలో విడుదల కానున్న ఈ చిత్రాల టిక్కెట్ ధరల పెంపునకు అవకాశం లేకుండా పోతోందని తెలిపాయి. సింగిల్ జడ్జి ఉత్తర్వులు కొట్టివేయాలని కోరాయి. ఈ పిటిషన్లపై బుధవారం జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టనుంది.

చంద్రబాబును కలిసి... శంకర్రావు మురిసిపోయారు!

- అభిమాన నేతను కలవాలని.. ఉద్యోగంలో చేరినప్పటి నుంచి కోరిక
- పదవీ విరమణకు ముందు నెరవేరింది



శంకర్రావు భుజంపై చేయి వేసి ఆప్యాయంగా మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు. చిత్రంలో రామకృష్ణ

ఈనాడు, అమరావతి: సీఎం చంద్రబాబును చూస్తూ సంతోషంతో మురిసిపోతున్న వ్యక్తి పేరు శంకర్రావు. రాష్ట్ర సచివాలయంలో సెక్షన్ ఆఫీసర్. 1996 మార్చిలో అంటే చంద్రబాబు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. . ఆయన టైపిస్ట్ ఉద్యోగంలో చేరారు. అప్పటి నుంచి చంద్రబాబును నేరుగా కలవాలనేది శంకర్రావు కోరిక. అది ఇన్నాళ్లకు నెరవేరింది. సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికల్లో గెలిచిన కొత్త కార్యవర్గంతో కలిసి చంద్రబాబును కలిసి సంతోషంతో ఉప్పొంగిపోయారు..

నిరాశా నిస్పృహల్లో ఉన్నప్పుడు...

ఉద్యోగం దొరక్క నిరాశ, నిస్పృహల్లో ఉన్న సమయంలో సచివాలయ ఉద్యోగాల నోటిఫికేషన్ వెలువడింది. నాడు సెక్రటేరియట్‌లో టైపిస్టుగా శంకర్రావు ఉద్యోగం సాధించారు. అప్పటి నుంచి చంద్రబాబు అభిమానిగా మారిపోయారు. సీఎంగా సచివాలయానికి వచ్చే చంద్రబాబును చూస్తున్నా.. . ఎన్నడూ కలవలేకపోయారు. తన కోరికను ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రామకృష్ణతో చెప్పారు. ఆయన తమ కార్యవర్గంతోపాటు శంకర్రావునూ తీసుకెళ్లి సీఎంకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన 'మీ వల్లే ఉద్యోగం వచ్చింది సార్. త్వరలో పదవీ విరమణ చేయబోతున్నా. మీరు ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే నాకు ఇంటిస్థలం వచ్చింది. 2014-19 మధ్య హౌస్ బిల్డింగ్ ఎలవెన్స్ ఇచ్చినప్పుడు ఇల్లు కట్టుకున్నా' అని సీఎంకు వివరించారు. శంకర్రావు కుటుంబ వివరాలు తెలుసుకున్న చంద్రబాబు... 'మీరు సంతోషంగా ఉన్నారు కదా? పదవీ విరమణ తర్వాతైనా ఏ అవసరం ఉన్నా వచ్చి కలవండి' అని సూచించారు.

డ్వాక్రా ఉత్పత్తులకు అంతర్జాతీయ స్థాయి బ్రాండింగ్

ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశం

ఈనాడు, అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న 23 వేలకు పైగా ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయి బ్రాండింగ్, మార్కెటింగ్ జరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. డ్వాక్రా మహిళలు, మైక్రో ఆంత్రప్రెన్యూర్లకు ఆర్థిక సుస్థిరత వచ్చేలా ఉత్పత్తులను వ్యవస్థీకృతం చేయాలని సూచించారు. డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న ఉత్పత్తులకు బ్రాండింగ్, మార్కెటింగ్ కల్పించే అంశంపై మంగళవారం సచివాలయంలో సీఎం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వాక్రా మహిళలు తయారు చేస్తున్న వివిధ రకాల ఉత్పత్తుల గురించి సీఎంకు అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'వ్యవస్థీకృతంగా ఈ ఉత్పత్తులను విక్రయించేందుకు వినూత్నంగా బ్రాండింగ్ చేయాలి. అరకు కాఫీ తరహాలోనే బ్రాండ్‌ని రూపొందిస్తే ఉత్పత్తులకు మరింత విలువ పెరుగుతుంది. తద్వారా మహిళలకు ఆర్థిక ప్రయోజనం కూడా కలుగుతుంది. రాష్ట్రంలో పశుసంవర్ధకం తోపాటు సేవల రంగంలో కూడా మహిళా సంఘాలు రాణించాలి' అని పేర్కొన్నారు.

వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి: షర్మిల

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ విభాగాల్లో రెండు లక్షల ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం వెంటనే జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని పీసీసీ అధ్యక్షురాలు షర్మిల డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక కొలువులు ఇస్తామన్న హామీని నిలబెట్టుకోవాలని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఐదేళ్లు జాబ్ క్యాలెండర్ పేరుతో యువత చెవుల్లో పూలు పెడితే. . కూటమి ప్రభుత్వం ఏకంగా క్యాలీఫ్లవర్ పెడుతోందని షర్మిల విమర్శించారు.

వసతి గృహాల విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యం

రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డీబీవీ స్వామి



విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న రాష్ట్ర మంత్రి శ్రీబాల వీరాంజనేయస్వామి

గుంటూరు (జిల్లాపరిషత్తు), న్యూస్‌టుడే: రాష్ట్రంలోని సంక్షేమ వసతిగృహాలు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల భద్రతతో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి అన్నారు. గుంటూరులోని పరివర్తనభవన్‌లో కళాశాల విద్యార్థినుల వసతిగృహాన్ని మంత్రి మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. మరుగుదొడ్లు, స్నానపు గదులను పరిశీలించారు. ఓ మరుగుదొడ్డి అపరిశుభ్రంగా ఉండడంతో సిబ్బందిని ప్రశ్నించి, శుభ్రం చేయాలని ఆదేశించారు. గడువు తీరిన చిక్కీలు ఇస్తున్నారని, కొన్ని కూరల్లో రుచి, నాణ్యత ఉండట్లేదని విద్యార్థినులు ఆయనకు ఫిర్యాదుచేశారు. అనంతరం విద్యార్థినులతో కలిసి మంత్రి భోజనం చేశారు. కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, మేయర్ కోవెలమూడి రవీంద్ర, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకుడు యు.చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులకు రూ.వందల కోట్లు

అనంతరం విలేకర్లతో మంత్రి మాట్లాడుతూ.. చిక్కీలను పరిశీలించగా గడువులోపే ఉన్నాయని, అయినా దీనిపై విచారణకు ఆదేశించానన్నారు. పొరుగుసేవల విధానంలో మరుగుదొడ్లు, స్నానపు గదుల నిర్వహణ బాధ్యతలు అప్పగిస్తామన్నారు. రాష్ట్రంలోని హాస్టళ్ల మరమ్మతులకు రూ.203 కోట్లు, 29 నూతన వసతిగృహాల భవనాలకు రూ.105 కోట్లు కేటాయించామని వివరించారు. నాణ్యమైన భోజనం తయారుచేసేలా సిబ్బందికి శిక్షణ ఇప్పిస్తున్నామని.. గుంటూరు జిల్లా సిబ్బందిని కూడా పంపాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

నివాసాలకూ బిల్డింగ్ కోడ్

4 వేల చ.మీటర్లు, ఆపైన చేపట్టే నిర్మాణాలకు వర్తింపు

- పర్యావరణ హితంగా నిర్మాణాలు
- విద్యుత్ వినియోగం తగ్గించడమే లక్ష్యం
- 'ఎకో నివాస్ సంహిత'గా వాటికి గుర్తింపు

ఈనాడు, అమరావతి: వాణిజ్య భవనాలకు ఇప్పటివరకు అమలులో ఉన్న విద్యుత్ నియంత్రణ భవన నియమావళి (ఈసీబీసీ) ఇక నివాస భవనాలకూ వర్తించనుంది. 4 వేల చదరపు మీటర్ల విస్తీర్ణం (ప్లాట్ ఏరియా), ఆపైన నిర్మించే భవనాలకు బిల్డింగ్ కోడ్ తప్పనిసరి చేశారు. నిర్మాణానికి పుర, నగరపాలక సంస్థల నుంచి అనుమతులు తీసుకునేటప్పుడు భవన నియమావళి అమలు చేస్తామని స్వీయ ధ్రువీకరణ ఇవ్వాలి. నిర్మాణం పూర్తయి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ తీసుకునేటప్పుడు అమలు చేసినట్లుగా విద్యుత్‌శాఖ ఎంపిక చేసిన నిపుణుల నుంచి తీసుకున్న ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. ఇలాంటి నిర్మాణాలను 'ఎకో నివాస్ సంహిత'గా ప్రభుత్వం గుర్తిస్తుంది.

విద్యుత్ వినియోగం తగ్గించేందుకు..

విద్యుత్ వినియోగం తగ్గించేందుకు, పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ బిల్డింగ్ విధానాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఇళ్లు, వాణిజ్య భవనాలు, ప్రభుత్వ కార్యాలయాల్లోకి గాలి, వెలుతురు వచ్చేలా నిర్మాణాలు చేపట్టడం ద్వారా విద్యుత్తు వినియోగాన్ని నియంత్రించాలన్నది ఉద్దేశం. కేంద్ర ప్రభుత్వం 2007లో ఎనర్జీ కన్జర్వేషన్ బిల్డింగ్ కోడ్ మొదటిసారి తీసుకొచ్చింది. కొన్ని సవరణలతో తాజాగా తీసుకొచ్చిన ఎనర్జీ కన్జర్వేషన్, సస్టెయినబుల్ బిల్డింగ్ కోడ్-2024...ఎకరం, ఆపైన విస్తీర్ణంలో చేపట్టే గృహ నిర్మాణ సముదాయాలకు వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

■ పర్యావరణ హిత నివాస భవన నిర్మాణాలకు బిల్డింగ్ కోడ్ రాష్ట్రంలో అమలు చేయడం దేశంలోనే మొదటిసారి. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలున్నా ఏ రాష్ట్రంలోనూ ఇంకా నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని అమలుకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖకు అనుమతించింది. ఉన్నతశ్రేణి కుటుంబాల నివాసం కోసం స్థిరాస్తి వ్యాపార సంస్థలు 4 వేల చదరపు మీటర్ల విస్తీర్ణం, ఆపైన చేపట్టే విల్లాలు, ఇతర భారీ భవంతులకే బిల్డింగ్ కోడ్ వర్తింపజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.

■ ప్రభుత్వ కార్యాలయాల కోసం నిర్మించే భవనాలకూ బిల్డింగ్ కోడ్ కొత్తగా వర్తించనుంది. 4 వేల చదరపు మీటర్ల విస్తీర్ణం, ఆపైన చేపట్టే భవనాల్లో విధిగా అమలు చేయాలి.

గ్రీన్ బిల్డింగ్ విధానం అమలు... లాభాలు

విద్యుత్తు ఆదా
- ■ బయట నుంచి వెలుతురు (సన్ లైట్) ఇళ్లు, వాణిజ్య సముదాయాల్లోకి వచ్చేలా నిర్మాణాలు చేపట్టాలి
- ■ సౌర విద్యుత్ ఉత్పత్తి
- ■ ఎల్ఈడీ లైట్లు, తక్కువ విద్యుత్‌తో పని చేసే ఇతర ఎలక్ట్రికల్ పరికరాల వినియోగం

నీటి సంరక్షణ
- ■ వర్షపు నీటి సంరక్షణ
- ■ వాడుక నీటి పునర్వినియోగం
- ■ తక్కువ నీరు వినియోగించేలా ట్యాప్‌లు, ఫ్లష్ సిస్టమ్ వినియోగం

పర్యావరణ పరంగా
- ■ ఫ్లైయాష్ ఇటుకల వినియోగం
- ■ తక్కువ కెమికల్ రంగుల వాడకం
- ■ గ్రీన్ ప్లాంట్లు, టెర్రస్ గార్డెన్ అభివృద్ధి

ఉష్ణోగ్రతల నియంత్రణకు..
- ■ హీట్ రిఫ్లెక్టింగ్ రూఫ్
- ■ గ్రీన్ రూఫ్, గోడల ఇన్సులేషన్

కాంగ్రెస్, భారాస రెండూ అన్యాయం చేశాయి

కృష్ణా జలాల విషయంలో తెలంగాణకు కేంద్రమే న్యాయం చేసింది

- రాయలసీమ ఎత్తిపోతలను ఎన్జీటీ అడ్డుకుంది
- పీపీటీలో కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్



ఈనాడు, హైదరాబాద్: కృష్ణా జలాల విషయంలో రాష్ట్రానికి కాంగ్రెస్, భారాస రెండు ప్రభుత్వాలూ అన్యాయమే చేశాయని... కేంద్ర ప్రభుత్వమే న్యాయం చేసిందని మహారాష్ట్ర సీఎం సలహాదారు, కేంద్ర జలశక్తి మంత్రిత్వశాఖ మాజీ సలహాదారు వెదిరె శ్రీరామ్ అన్నారు. 95 శాతం పూర్తయిన రాయలసీమ ఎత్తిపోతల ప్రాజెక్టును అడ్డుకుంది భారాస, కాంగ్రెస్ కాదని... జాతీయ హరిత ట్రైబ్యునల్(ఎన్జీటీ) ఆపిందని ఆయన పేర్కొన్నారు. కృష్ణా-గోదావరి నదీ జలాల కేటాయింపులపై మంగళవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావుతో కలిసి వెదిరె శ్రీరామ్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "ఉమ్మడి రాష్ట్రానికి బచావత్ ట్రైబ్యునల్ అవార్డు ప్రకారం 811 టీఎంసీల వాటా దక్కింది. అయితే సమైక్య రాష్ట్రంలో నీటి కేటాయింపుల విషయంలో తెలంగాణ ప్రాంతానికి అన్యాయం జరిగిందన్న క్రమంలోనే ప్రత్యేక రాష్ట్ర డిమాండ్ వచ్చింది. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 2015లో జరిగిన తొలి ఎపెక్స్ కౌన్సిల్ సమావేశంలో నీటి కేటాయింపుల్లో సింహభాగం వాటా కోరాల్సింది పోయి నాటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ 299 టీఎంసీలకే సంతకం చేశారు. ఈ ఒప్పందం ఏడాదికే అని భారాస చెబుతోంది. కానీ, 2020లో రెండో ఎపెక్స్ కౌన్సిల్ సమావేశం జరిగినప్పుడు కృష్ణా జల వివాదాల రెండో ట్రైబ్యునల్ తీర్పు (కేడబ్ల్యూడీటీ-2) వచ్చేవరకు కేడబ్ల్యూడీటీ-1 కేటాయింపులే కొనసాగుతాయని నిర్ణయించారు. దీనివల్ల కేసీఆర్ అంగీకరించింది ఏడాది కాలానికే ఎలా పరిమితమవుతుంది?

పాలమూరు-రంగారెడ్డిపై చిత్తశుద్ధి ఏదీ?

తెలంగాణకు 60 ఏళ్లుగా కాంగ్రెస్ తీవ్ర అన్యాయం చేసింది. 2014 కన్నా ముందు ప్రారంభమైన శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ), కల్వకుర్తి, నెట్టెంపాడు, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలు, డిండి, కోయిల్‌సాగర్ లాంటి ప్రాజెక్టులకు పరిపాలన అనుమతులు మాత్రమే ఇచ్చి.. నీటి కేటాయింపులు చేయలేదు. భారాస అధికారంలోకి వచ్చాక కూడా ఈ ప్రాజెక్టుల్లో ఒక్కటీ పూర్తి చేయలేదు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల నిర్మాణం మొదలుపెట్టి రూ.30 వేల కోట్లు ఖర్చుపెట్టి డిస్ట్రిబ్యూటరీ కాలువలు లేకుండా వదిలేశారు. ఈ ప్రాజెక్టుపై చిత్తశుద్ధి లేకుండా... కేవలం రూ.వేల కోట్లు ఖర్చు పెట్టామని కాంగ్రెస్, భారాస చెప్పడం వల్ల ఏం ప్రయోజనం? తెలంగాణ అంగీకరించిన 299 టీఎంసీల నీటిని కూడా రాష్ట్రం ఏర్పాటైనప్పటి నుంచి ఏ ఒక్క ఏడాదీ పూర్తిగా వాడుకోలేదు. ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేసుకోకపోవడమే కారణం. మరోవైపు, కృష్ణా నదిపై ఏపీ ఏకంగా 400 టీఎంసీల సామర్థ్యం ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేసుకుంది. మన ప్రాజెక్టుల పూర్తికి ఆనాడు కేవలం రూ.20 వేల కోట్లలోపు నిధులు వెచ్చిస్తే సరిపోయేది. అది చేయకుండా కాళేశ్వరంపై అనవసరంగా రూ.లక్ష కోట్లు వెచ్చించారు. అందులో కనీసం ఐదో వంతు వెచ్చించి ఉంటే ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నల్గొండ జిల్లాలు సస్యశ్యామలమయ్యేవి. గోదావరి జలాల విషయానికొస్తే.. కాళేశ్వరం నిర్మాణం పూర్తి డిజైనింగ్ వైఫల్యం. రాయలసీమ ఎత్తిపోతల పనులు ప్రారంభమవుతున్నాయని తెలిసి కూడా టెండర్లు వచ్చేవరకూ కేసీఆర్ నోరు మెదపలేదు. ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లవద్దని ఏపీకి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ లేఖలు రాసింది. అప్పుడు భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బండి సంజయ్ ఈ అన్యాయంపై గళమెత్తారు. ఇంత చేసినా కేంద్రాన్ని భారాస, కాంగ్రెస్ దూషిస్తున్నాయి. ఇకనైనా కృష్ణా జలాలపై వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తగిన విధంగా ముందుకెళ్లి రాష్ట్రానికి న్యాయం చేయాలి. కేంద్ర ప్రభుత్వ సహకారం ఎప్పుడూ ఉంటుంది" అని పేర్కొన్నారు.

కేంద్రం తెలంగాణ పక్షాన ఉంది: రామచందర్‌రావు

జల వనరుల విషయంలో కాంగ్రెస్, భారాసలు ఏళ్ల తరబడి గారడి మాటలతో ప్రజలను మోసం చేస్తున్నాయని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు విమర్శించారు. పవర్ పాయింట్ ప్రజంటేషన్ అనంతరం రామచందర్‌రావు మీడియాతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ పక్షాన ఉందని, రాష్ట్రానికి జలవనరుల వాటాల్లో ఎట్టి పరిస్థితిలో అన్యాయం జరగదన్నారు. భాజపా మొదటి నుంచి తెలుగు రాష్ట్రాలకు న్యాయమైన వాటా దక్కేలా కృషి చేస్తోందని చెప్పారు. కాంగ్రెస్, భారాసలు కృష్ణా జలాల వాటాలపై మాటలతో మభ్యపెడుతున్నాయని దుయ్యబట్టారు.

విద్యారంగ సమస్యలపై 10న ధర్నా: డీటీఎఫ్

ఈనాడు, అమరావతి: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై ఈ నెల 10న విజయవాడలో ధర్నా నిర్వహించనున్నట్లు డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నరహరి, ఎస్వీ రమణయ్య తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. "30 డిమాండ్లతో కూడిన ధర్నా నోటీసులు ఇచ్చాం. మాతృభాషలో బోధనతో పాటు ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. నెలవారీ పదోన్నతులు కల్పించాలి. పదోతరగతి వంద రోజుల ప్రణాళిక నుంచి సెలవు దినాలను మినహాయించాలి. 12వ పీఆర్సీని నియమించి, 30 శాతం మధ్యంతర భృతి చెల్లించాలి. సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలి" అని డిమాండ్ చేశారు.

ఆ కమిటీకి అధికారుల పేర్లు సూచించండి

ఈనాడు, హైదరాబాద్: నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల నీటి ప్రవాహ సామర్థ్యాన్ని మరోమారు లెక్కించేందుకు ఏర్పాటు చేసిన కమిటీకి రెండు రాష్ట్రాలూ ఈఈ స్థాయి అధికారుల పేర్లను సూచించాలని కృష్ణా బోర్డు కోరింది. మంగళవారం తెలంగాణ నీటిపారుదల శాఖ, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీలకు బోర్డు లేఖలు రాసింది. 'గతేడాది జనవరి 21న నిర్వహించిన బోర్డు 19వ సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం కాలువల సామర్థ్యాల లెక్కింపునకు కమిటీ ఏర్పాటు చేశాం. ఇందులో కృష్ణా బోర్డు నుంచి ఈఈ వైఎం గోపాలకృష్ణను సభ్యుడిగా నియమించగా... రెండు రాష్ట్రాలూ సభ్యులను నామినేట్ చేయాల్సి ఉంది. వెంటనే పేర్లను సూచించండి' అని లేఖలో బోర్డు పేర్కొంది.

పదో తరగతి చదువుతున్నాను. భవిష్యత్తులో పైలట్ కావాలనుంది. ఇందుకు ఏ కోర్సులు చదవాలి, శిక్షణకు ఎంత ఖర్చు అవుతుంది. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, ఉద్యోగావకాశాలు ఎలా ఉంటాయి? - అనిల్



పైలట్ అవ్వాలంటే?

■ పదో తరగతిలో ఉన్నప్పుడే భవిష్యత్తులో పైలట్ కావాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ప్రశంసనీయం. పైలట్ కేవలం ఉద్యోగం మాత్రమే కాదు. అధిక బాధ్యత, నైపుణ్యం, క్రమశిక్షణ, ధైర్యం, నిర్ణయాత్మక సామర్థ్యంతో కూడిన గౌరవప్రదమైన వృత్తి. సరైన ప్రణాళికతో, దశల వారీగా ముందుకు సాగితే ఈ లక్ష్యాన్ని తప్పకుండా సాధించవచ్చు.

◗ పైలట్ కావాలంటే ఇంటర్మీడియట్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్టులను తప్పనిసరిగా చదవాలి. ఇవి విమానాల పని విధానం, వేగం, దిశ, ఎత్తు, ఇంజిన్ సంబంధిత అంశాలను అర్థం చేసుకోవడానికి పునాదిగా ఉపయోగపడతాయి.

◗ దేశంలో పైలట్ శిక్షణ అందించే అనేక గుర్తింపు పొందిన సంస్థలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఇందిరా గాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడెమీ పేరున్న సంస్థ. దేశవ్యాప్తంగా అనేక ప్రైవేట్ ఫ్లయింగ్ స్కూల్స్ శిక్షణను అందిస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల్లో శిక్షణ పొందేందుకు పోటీ చాలా ఎక్కువగా ఉంటుంది. దాదాపుగా యాభై లక్షల రూపాయలు అవసరం అవుతాయి.

◗ ప్రైవేట్ సంస్థల్లో పైలట్ శిక్షణ ఖర్చు చాలా ఎక్కువగా ఉంటుంది. సాధారణంగా కమర్షియల్ పైలట్ లైసెన్స్ పొందడానికి అరవై లక్షల నుంచి కోటి రూపాయల వరకు కావాలి.

◗ కమర్షియల్ పైలట్ లైసెన్స్ పొందిన తర్వాత దేశీయ, అంతర్జాతీయ విమానయాన సంస్థల్లో కో-పైలట్‌గా కెరియర్ ప్రారంభమవుతుంది. అనుభవం పెరిగే కొద్దీ కెప్టెన్ స్థాయికి చేరుకోవచ్చు. అదేవిధంగా హెలికాప్టర్ పైలట్‌గా, ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌గా లేదా రక్షణ రంగంలోనూ సేవలు అందించవచ్చు.

◗ కమర్షియల్ పైలట్ కావడానికి ఎక్కువ ఫీజు అవసరం. కాబట్టి, భారత వాయుసేనలో ఖర్చు లేకుండా పైలట్ కావడానికి ప్రయత్నించవచ్చు. ఇంటర్మీడియట్ పూర్తిచేసుకున్నవారికి నేషనల్ డిఫెన్స్ అకాడెమీ ద్వారా ఎంపిక, శిక్షణ జరుగుతాయి. అలాగే డిగ్రీ విద్యార్హతతో సీడీఎస్‌ఈ, ఏఎఫ్‌క్యాట్‌లతో అవకాశం ఉంటుంది. ఎంపికలో అభ్యర్థి ప్రతిభ, వ్యక్తిత్వం, సృజనాత్మకత, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు, శారీరక ఫిట్‌నెస్, చూపు, వినికిడి లాంటి అంశాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు. ఎంపికైన వారికి వాయుసేన శిక్షణ కేంద్రాల్లో అత్యంత కఠినమైన పైలట్ శిక్షణ అందిస్తారు. శిక్షణ పూర్తయ్యాక అభ్యర్థి ప్రతిభను బట్టి యుద్ధ విమానాలు, రవాణా విమానాలు లేదా హెలికాప్టర్లకు కేటాయిస్తారు. శిక్షణ కాలంలోనూ స్టైపెండ్, వసతి, భోజనం, వైద్య సౌకర్యాలు ప్రభుత్వమే కల్పిస్తుంది.

శిక్షణ మొత్తం ప్రభుత్వ ఖర్చుతోనే జరుగుతుంది. అనంతరం ఉద్యోగంలో ఆకర్షణీయ వేతనం, ఇతర ప్రోత్సాహకాలు, నివాస సౌకర్యాలు, వైద్య సదుపాయాలు లభిస్తాయి. పదవీ విరమణ తర్వాత కూడా పౌర విమానయాన రంగంలో మంచి అవకాశాలూ అందుబాటులో ఉంటాయి.

చివరిగా.. పైలట్ కావడం సులభమైన మార్గం కాదు. కానీ అసాధ్యం మాత్రం కాదు. స్పష్టమైన లక్ష్యం, క్రమశిక్షణతో కూడిన చదువు, సరైన శిక్షణ, మంచి ఆరోగ్యం ఉంటే ఈ కల నెరవేరుతుంది. దేశానికి సేవ చేస్తూ ఆకాశంలో ఎగరాలనుకొనే యువతకు పైలట్ వృత్తి ఒక అద్భుతమైన అవకాశం.

- ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

“ ఎంపీసీతో ఇంటర్ పూర్తయ్యాక భారత పౌర విమానయాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) నిర్దేశించిన ప్రమాణాలు అంటే ఎత్తు, బరువు, ఆరోగ్యం ఉండాలి. పైలట్ శిక్షణలో మొదటిది స్టూడెంట్ పైలట్ లైసెన్స్. రెండో దశలో ప్రైవేట్ పైలట్ లైసెన్స్ పొందుతారు. అయితే పైలట్‌గా ఉద్యోగం చేయాలంటే అత్యంత కీలకమైంది కమర్షియల్ పైలట్ లైసెన్స్. దీన్ని పొందాలంటే థియరీ, ప్రాక్టికల్ శిక్షణ రెండూ తప్పనిసరి. థియరీ తరగతుల్లో విమాన నావిగేషన్, వాతావరణ విజ్ఞానం, విమాన నియమాలు, ఇంజిన్ పరిజ్ఞానం లాంటి అంశాలను లోతుగా నేర్పిస్తారు. ప్రాక్టికల్ శిక్షణలో కనీసం రెండు వందల గంటల పాటు విమానం నడిపిన అనుభవం పొందాలి. ”

ప్రాజెక్ట్ ఇంజినీర్లు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్), హైదరాబాద్.. ఒప్పంద ప్రాతిపదికన ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

● ప్రాజెక్ట్ ఇంజినీర్: 04

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి. **వయసు:** 33 ఏళ్లు.

వేతనం: నెలకు రూ.40,000 - రూ.55,000.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.01.2026

ఎంపిక: ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://www.ecil.co.in/jobs.html

అప్రెంటిస్‌లు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్), హైదరాబాద్.. అప్రెంటిస్‌ల కోసం దరఖాస్తులు కోరుతోంది.

● గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-200
● డిప్లొమా అప్రెంటిస్-48

విభాగాలు: ఈసీఈ, సీఎస్‌ఈ/ఐటీ, మెకానికల్, ఈఈఈ, ఈఐఈ, సివిల్, కెమికల్.

అర్హత: డిప్లొమా లేదా బీఈ/బీటెక్ (మెకానికల్/ఎలక్ట్రానిక్స్ ఈసీఈ) ఉండాలి.

వయసు: 31.12.2025 నాటికి 25 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

స్టైపెండ్: నెలకు గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌కు రూ.9,000, డిప్లొమా అప్రెంటిస్‌కు రూ.8,000.

ఎంపిక: ప్రవేశపరీక్ష, విద్యార్హతల మెరిట్‌తో.

దరఖాస్తుకు చివరి తేదీ: 20.01.2026

వెబ్‌సైట్: https://www.ecil.co.in/jobs.html

ప్రస్తుత పోటీ ప్రపంచంలో మెరుగైన నైపుణ్యాలు ఉన్నవారే కార్పొరేట్ సంస్థలలో ఉద్యోగం పొందగలుగుతున్నారు. వీరికి విద్యార్హతలు, సాంకేతిక నైపుణ్యాలు, విషయ పరిజ్ఞానం బాగానే ఉంటున్నాయి. కానీ యువ ఉద్యోగుల్లో కొందరే కొలువులో విజయం సాధించి ఉన్నత స్థాయికి చేరుకుంటున్నారు. ఎక్కువ మంది ఉద్యోగ బాధ్యతల్లో ఒత్తిడికి గురై, భావోద్వేగాలను నియంత్రించుకోలేకపోతున్నారు. ఫలితంగా కెరియర్ అర్ధాంతరంగా ముగుస్తోంది. అందువల్ల యువ ఉద్యోగులు 'ఉద్వేగ ప్రజ్ఞ' (ఎమోషనల్ ఇంటెలిజెన్స్)పై దృష్టి సారించాలి.

కార్పొరేట్ స్కిల్స్

ఉద్వేగ నియంత్రణ ఉద్యోగ అధిరోహణ!



భావోద్వేగ నియంత్రణ

కాలేజీ సిలబస్‌లో, కార్పొరేట్ సంస్థల శిక్షణలో భావోద్వేగాలకు తక్కువ ప్రాధాన్యమే దక్కుతోంది. ఉద్యోగ విధుల్లో విమర్శలు ఎదురైనప్పుడు, సహోద్యోగులతో విభేదాలు తలెత్తినప్పుడు లేదా ఆశించిన గుర్తింపు రానప్పుడు యువ ఉద్యోగులు త్వరగా నిరాశకు లేదా ఆగ్రహానికి లోనవుతున్నారు. విధుల్లో ఒత్తిడి ఎదురైనప్పుడు ఆలోచనలపై నియంత్రణ కోల్పోయి భావోద్వేగాలకు లోనవుతుంటారు. ఎంపిక చేసుకున్న ఉద్యోగి కేవలం పనిలో సమర్థుడైతే సరిపోదని, వినియోగదారులు, సహోద్యోగులతో హుందాగా ప్రవర్తించాలని యాజమాన్యాలు కోరుకుంటాయి. భావోద్వేగాలపై నియంత్రణ లోపించిన ఉద్యోగులు వృత్తిలో ఎదగలేకపోతున్నారు.

నియంత్రణ లోపిస్తే

ప్రవీణ్ ఒక ఐటీ సంస్థలో డేటా అనలిస్టుగా చేరాడు. తక్కువ కాలంలోనే మంచి నైపుణ్యాలున్న ఉద్యోగిగా గుర్తింపు పొందాడు. ఒక డేటా అనాలిసిస్‌కు సంబంధించి టీమ్ లీడర్‌కు నివేదిక పంపాడు. అందులో లోపాలు ఉన్నాయని, పనితీరు ఇలాగే కొనసాగితే ఉద్యోగంలో ఎదుగుదల ఉండదని టీమ్ లీడర్ మెయిల్ ద్వారా అతడికి సూచించారు. అప్పటికే, వ్యక్తిగత కారణాలతో మానసిక ఒత్తిడిలో ఉన్న అతడు ఆ మెయిల్‌ను విమర్శగా భావించి, భావోద్వేగానికి లోనయ్యాడు. తన అనాలిసిస్‌ను తప్పుపట్టాల్సిన అవసరం లేదని, టీమ్ లీడర్ స్థాయిలో ఇలాంటి మెయిల్స్ పంపవద్దని హెచ్చరికతో కూడిన రిప్లై పంపాడు. ఈ సమాధానం ఊహించని టీమ్ లీడర్ ప్రవీణ్‌ను భావోద్వేగాలు నియంత్రించుకోలేని ఉద్యోగిగా మదింపు వేసి, అతడికి కొత్త ప్రాజెక్టులు అప్పగించలేదు. ఈ మార్పును గమనించినప్పటికీ, నష్ట నివారణ చర్యలు చేపట్టకపోవడంతో క్రమంగా సంస్థలో అతడి అవసరం తగ్గింది. భావోద్వేగాలను నియంత్రించుకోలేక, చివరికి ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి వచ్చింది.

✦ రోజువారీ పనిలో జరిగే చిన్నచిన్న పొరపాట్లకు ఎలా స్పందించాలో తెలుసుకోవడం ఎంతో అవసరం. సీనియర్లు ఇచ్చే ఫీడ్‌బ్యాక్‌ను వ్యక్తిగత విమర్శగా తీసుకోవద్దు. పనితీరు మెరుగుపరుచుకునే సూచనగా స్వీకరించాలి. ఇలా చేస్తేనే యువ ఉద్యోగులు కార్పొరేట్ సంస్థలలో దీర్ఘకాలం మనుగడ సాగించగలరు.

పాజిటివ్ స్పందన

ఒక సంస్థలో సాఫ్ట్‌వేర్ ట్రెయినీగా రవి చేరాడు. అతడు చేసిన ప్రజెంటేషన్‌లోని లోపాలపై టీమ్ లీడర్ అందరి సమక్షంలో విమర్శించారు. రవి ఆ విమర్శలను భావోద్వేగంతో కాకుండా, నిజాయతీగా విశ్లేషించుకున్నాడు. మీటింగ్ పూర్తయ్యాక టీమ్ లీడర్‌ను కలిసి, ఆ అభిప్రాయాలను సానుకూలంగా స్వీకరిస్తున్నానని చెప్పాడు. ఈ సూచనలు వృత్తిలో ఎదుగుదలకు దోహదపడతాయని తెలియజేసి, మరిన్ని సలహాలూ కోరాడు.

ఈ ఊహించని స్పందనతో అతడిపై టీమ్ లీడర్‌కు గౌరవం, అభిమానం పెరిగింది. మేనేజ్‌మెంట్ ముందు అతడిని భావోద్వేగాలు నియంత్రించుకుంటూ, విమర్శలను సానుకూలంగా తీసుకునే ఉద్యోగిగా ప్రాజెక్ట్ చేశారు. అదనంగా మెంటర్‌షిప్ అవకాశాలు కల్పించి, ఉన్నత స్థాయి శిక్షణకు సిఫారసు చేశారు. రవి బలమైన ఉద్యోగిగా ఎదిగి, తక్కువ వ్యవధిలోనే టీమ్ లీడర్ స్థాయికి చేరుకున్నాడు.

ఆవేశం.. అవరోధమే

ప్రకాశ్ ఒక కార్పొరేట్ సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రెయినీగా చేరాడు. టీమ్ లీడర్ అతడికి ఒక ప్రాజెక్ట్ అప్పగించారు. ఆ ప్రాజెక్ట్ విజయం సాధించాలంటే బృందంతో సమష్టిగా పని చేయాలి. కానీ విద్యార్థి దశలో ఒంటరిగా చదవడానికి అలవాటు పడ్డ ప్రకాశ్ సహోద్యోగుల సహాయం తీసుకోవడానికి సిద్ధపడలేదు. దీంతో ప్రాజెక్టు పూర్తి చేయాల్సిన గడువు సమీపించే కొద్దీ, ఒత్తిడిని తట్టుకోలేకపోయాడు. ఒక సమావేశంలో అధికారులతో ఆగ్రహంగా మాట్లాడాడు. ఈ ప్రవర్తనను భావోద్వేగ నియంత్రణ లోపంగా పరిగణించి, యాజమాన్యానికి టీమ్ లీడర్ నివేదిక పంపారు. ఫలితంగా ప్రకాశ్‌ను బృందం నుంచి తొలగించారు.

నాయకత్వానికి దారి

లత ఎమ్మెస్సీ కెమిస్ట్రీ పూర్తి చేసి, రసాయనాల తయారీ సంస్థలో నాణ్యత నియంత్రణ విభాగంలో ట్రెయినీగా చేరింది. మార్కెట్ నుంచి వచ్చిన సున్నితమైన ఫిర్యాదులను తక్కువ సమయంలో పరిష్కరించాల్సిన బాధ్యతను ఆమెకు టీమ్ లీడర్ అప్పగించారు. బృంద సభ్యులు తీవ్ర ఒత్తిడిలో ఉన్నప్పటికీ, వారి సహకారం లోపించినప్పటికీ, భావోద్వేగాలను ఆమె నియంత్రించుకుంది. సమస్యల పరిష్కారంపైనే దృష్టి సారించి, అప్పగించిన బాధ్యతను విజయవంతంగా పూర్తి చేసింది. ఈ సామర్థ్యాన్ని గుర్తించిన టీమ్ లీడర్.. సంక్షోభాలను సమర్థంగా ఎదుర్కోగల ఉద్యోగిగా ఆమెను అభినందించారు. లత గురించి సానుకూల నివేదికను యాజమాన్యానికి పంపారు. దీంతో తదుపరి ప్రాజెక్ట్‌కు ఆమెను టీమ్ లీడర్‌గా నియమించారు.

✦ కార్పొరేట్ సంస్థలలో భావోద్వేగ పరిణతి చాలా ముఖ్యం. నైపుణ్యాల లోపంతో ఉద్యోగాలు కోల్పోయే వారికంటే, భావోద్వేగాలను నియంత్రించుకోలేని ఉద్యోగులు కెరియర్‌లో నష్టపోతున్నారు. పని ఒత్తిడిని భరించడం, విమర్శలను నిర్మాణాత్మకంగా స్వీకరించడం, అందరితో కలిసి పనిచేయడం లాంటి గుణాలను అలవర్చుకున్నప్పుడే యువ ఉద్యోగులు వృత్తిలో ఎదగగలరు. అందువల్ల కార్పొరేట్ సంస్థలలో కొలువు సంపాదించడమే కాకుండా, అక్కడ ఎదగడానికి ఉద్వేగ ప్రజ్ఞను పెంపొందించుకోవడమూ ఎంతో ముఖ్యం.



- దొరైరాజ్,
సీనియర్ జనరల్ మేనేజర్,
ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

ఈఎస్ఐసీలో

ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఈఎస్ఐసీ) చెన్నై.. ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

● సీనియర్ రెసిడెంట్-99

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో డీఎన్‌బీ, ఎంఎస్/ఎండీ, ఎంసీహెచ్, డీఎంతో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: ఇంటర్వ్యూ తేదీ నాటికి 45 నుంచి 55 ఏళ్లు ఉండాలి. **వేతనం:** నెలకు రూ.67,700. **దరఖాస్తు ఫీజు:** రూ.500. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీ, ఈఎస్ఎంలకు ఫీజు లేదు.

ఎంపిక: ఇంటర్వ్యూతో **ఇంటర్వ్యూ తేదీలు:** జనవరి 20, 21, 22, 23

వెబ్‌సైట్: https://esic.gov.in/recruitments



పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్ష తేదీలు దగ్గర పడుతున్నాయి. దాదాపు విద్యార్థులంతా సన్నద్ధతలో నిమగ్నమయ్యారు. కొంతమందిని మాత్రం తెలియని భయాలు వెంటాడతాయి. అయితే ఇప్పటి నుంచైనా ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకుంటే ఎక్కువ మార్కులు, అధిక గ్రేడ్ పాయింట్లు సాధించవచ్చు.

పరీక్షలో విజయానికి.. ఇలా చేద్దాం

భయానికి, ఒత్తిడికీ కారణాలు తెలుసుకోవడం ముఖ్యం. ఫెయిల్ అవుతానేమో అనే భయం ఉన్నవారు ఇప్పటి నుంచైనా శ్రద్ధగా చదివితే సులువుగా ఉత్తీర్ణత సాధిస్తాను అనుకోవాలి. ఇందుకోసం సిలబస్ మొత్తం చదవాల్సిన పని లేదు. ముఖ్యమైన ప్రశ్నలు నేర్చుకుంటే సరిపోతుంది. అలాగే ఎక్కువ మార్కులు రావేమో అని మథన పడుతున్నవారు ఇంకా సమయం ఉంది. అన్నీ చదివితే తప్పకుండా పూర్తి మార్కులు పొందగలరని గ్రహించాలి.

▮ అకడమిక్ పరీక్షల్లో విజయానికి ముందు నుంచీ చదవలేకపోయినా చివరి రెండు నెలలు సద్వినియోగం చేసుకుంటే ఎక్కువ మార్కులు తెచ్చుకోవడానికి వీలవుతుంది. గత ఐదేళ్ల ప్రశ్నపత్రాలను బాగా చదివినా సరిపోతుంది. దాదాపు సిలబస్ అంతా వీటితోనే కవర్ అవుతుంది. పునరావృతమయ్యే ప్రశ్నలే ఎక్కువగా ఉంటాయి.

▮ ఉన్న సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి రోజువారీ ప్రణాళిక వేసుకోండి. దీన్ని ఆదర్శనీయంగా కాకుండా, ఆచరణీయంగా ఉండేలా రూపొందించుకోవాలి.

▮ గతంలో తరగతులకు హాజరు కాకపోవచ్చు లేదా శ్రద్ధగా వినకపోవచ్చు. అయితే ఇప్పటి నుంచైనా తప్పనిసరిగా రివిజన్ క్లాసులు శ్రద్ధగా వినాలి. వీటి ద్వారా కాన్సెప్ట్‌ని అర్థం చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. దీంతో సులువుగా నేర్చుకోవడానికి వీలవుతుంది. ఇంకా సందేహాలు ఉంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి. స్నేహితుల సాయంతోనూ అర్థం చేసుకోవడానికి ప్రయత్నించవచ్చు.

▮ చదివింది మర్చిపోకుండా ఉండటానికి మైండ్ మ్యాపింగ్, కాన్సెప్ట్ లెర్నింగ్ లాంటి వాటితో ఉపయోగం ఉంటుంది. విరామం లేకుండా చదివే బదులు పొమడారో టెక్నిక్‌ని అమలు చేయాలి. పెద్ద టాపిక్‌లను చిన్న చిన్న భాగాలుగా చేసుకుని నేర్చుకోవచ్చు.

▮ ప్రీ ఫైనల్ పరీక్షల ద్వారా పబ్లిక్ పరీక్షలను సమర్థంగా ఎదుర్కోవచ్చు. వీటిని ఫైనల్ పరీక్షలుగా భావించి, తప్పనిసరిగా రాయాలి. ఈ పరీక్షల్లో చేసిన తప్పులు సరిదిద్దుకుంటే పబ్లిక్ పరీక్షల్లో ఇబ్బంది పడాల్సిన అవసరం ఉండదు. ఇంకా సమయం ఉంటే నమూనా పరీక్షలూ రాసుకోవచ్చు. కష్టమైన సబ్జెక్టుల్లో రాణించడానికి ఇవి తోడ్పడతాయి.

▮ పరీక్షలు రాసేటప్పుడు ముందు ప్రశ్నను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించాలి. రెండు సార్లు జాగ్రత్తగా చదివితే అందులో దేని గురించి అడిగారో తెలుస్తుంది. దీంతో సులువుగా సరైన సమాధానం రాయడానికి వీలవుతుంది.

▮ సమాధానం తెలిస్తే సరిపోదు. అర్థమయ్యేలా రాయడం ఎంతో ముఖ్యం. అందువల్ల బాగా రాయడాన్ని సాధన చేయాలి. ముఖ్యమైన అంశాలను హైలైట్ చేయాలి. ఆకట్టుకునేలా పట్టికలు, బొమ్మలు వేయడం. ఇవన్నీ స్కోరును పెంచుతాయి.

▮ కొత్తగా నేర్చుకున్న ప్రశ్నలకు జవాబులు రాసి, మీరే సమీక్షించుకోండి. చేస్తోన్న చిన్నచిన్న పొరపాట్లు సరిదిద్దుకోండి. అలాగే ఎంత సమయంలో రాయగలుగుతున్నారో పరిశీలించండి. దీంతో అసలు పరీక్షలో సమయ నిర్వహణతో ఇబ్బంది ఉండదు.

▮ పరీక్షలో విజయానికి మానసిక ప్రశాంతత ఎంతో ముఖ్యం. అలాగే భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవాలి. ఇందుకోసం యోగా, ప్రాణాయామం లాంటివి ప్రయత్నించవచ్చు. ఏ విషయంలోనైనా ఆందోళనగా అనిపిస్తే ఉపాధ్యాయులూ, తల్లిదండ్రులతో చర్చించడం ద్వారా ఉపశమనం పొందడానికి వీలవుతుంది. అవకాశం ఉన్నవారు కౌన్సెలర్ల సహాయాన్నీ తీసుకోవచ్చు.

▮ డిజిటల్ క్రమశిక్షణ ఎంతో ముఖ్యం. పరీక్షల వరకూ మొబైల్ పక్కన పెట్టేయడమే మంచిది. అలాగే ఈ సమయంలో ఆన్‌లైన్ లెర్నింగ్‌నూ పరిమితం చేసుకుంటేనే ప్రయోజనం.

▮ పోషకాహారం తీసుకుంటూ, సమయానికి నిద్ర పోవడమూ ప్రధానమే. బయటి ఆహారం తీసుకోవద్దు. ఆరోగ్య సమస్యలు లేకుండా చూసుకోవాలి.

▮ చివరిగా పబ్లిక్ పరీక్షల ముందు నేర్చుకున్నవన్నీ పునశ్చరణ చేయడం ఎంతో అవసరం. ఇలా జరిగితేనే తప్పులు లేకుండా, వేగంగా సమాధానం రాయగలరు.

ఎయిమ్స్ రాజ్‌కోట్‌లో

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), రాజ్‌కోట్ ఒప్పంద ప్రాతిపదికన సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● సీనియర్ రెసిడెంట్-41

అర్హత: పోస్టులను అనుసరించి సంబంధిత విభాగంలో ఎండీ, డీఎన్‌బీ, ఎమ్మెస్సీ, ఎంఎస్‌తో పాటు పని అనుభవం ఉండాలి.

వయసు: 12.01.2026 నాటికి 45 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీకి ఐదేళ్లు, ఓబీసీకి మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

వేతనం: నెలకు రూ.67,700.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12.01.2026

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1000. ఎస్సీ, ఎస్టీలకు రూ.800. **ఎంపిక:** ఇంటర్వ్యూతో

వెబ్‌సైట్: https://aiimsrajkot.edu.in/recruitmentnnew

డీఐపీఆర్‌లో

డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైకలాజికల్ రిసెర్చ్(డీఐపీఆర్).. ఇంటర్న్‌షిప్ కోసం దరఖాస్తులు కోరుతోంది.

● సైకాలజీ: 06 ● కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్: 02 **ఇంటర్న్‌షిప్ వ్యవధి:** 6 నెలలు.

అర్హత: సంబంధిత విభాగంలో బీటెక్/పీజీ

స్టైపెండ్: నెలకు రూ.5,000. **పోస్టు ద్వారా దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ:** 25.01.2026. **చిరునామా:** డైరెక్టర్, డీఐపీఆర్, లఖ్‌నవూ రోడ్, దిల్లీ

వెబ్‌సైట్: https://drdo.gov.in/drdo/en

నైసర్‌లో

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రిసెర్చ్(నైసర్), భువనేశ్వర్.. అప్రెంటిస్‌ల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.

● లైబ్రరీ అప్రెంటిస్: 03

అర్హత: బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ (బీఎల్ఐఎస్సీ) ఉండాలి.

స్టైపెండ్: నెలకు రూ.14,000.

ఎంపిక: షార్ట్‌లిస్ట్, రాత పరీక్ష/ఇంటర్వ్యూలతో

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20.01.2026.

ఇంటర్వ్యూ తేదీ: 29.01.2026.

వేదిక: లెక్చర్ హాల్, లైబ్రరీ బిల్డింగ్, ఎన్ఐఎస్ఈఆర్, పోస్ట్ జత్నీ, ఒడిశా.

వెబ్‌సైట్: https://www.niser.ac.in/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్ మార్కెటింగ్ అసోసియేట్

సంస్థ: పాజ్ **నైపుణ్యాలు:** బిజినెస్ అనాలిసిస్, బిజినెస్ రిసెర్చ్, కంటెంట్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్‌మీడియా మార్కెటింగ్, మార్కెట్ అనాలిసిస్, మార్కెటింగ్, మార్కెటింగ్ స్ట్రాటజీ, మార్కెట్ రిసెర్చ్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.1,500-15,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://hosturl.link/QigjJD

టెక్నికల్ కంటెంట్ క్రియేటర్

సంస్థ: బెటర్ **నైపుణ్యాలు:** కంటెంట్ మార్కెటింగ్, కంటెంట్ రైటింగ్, సెర్చ్ ఇంజిన్ ఆప్టిమైజేషన్ **స్టైపెండ్:** రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://hosturl.link/ZuYmEG

వీడియో ఎడిటింగ్/ మేకింగ్

సంస్థ: క్రిడానోస్
నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, ప్రీమియర్ ప్రో, ఫైనల్ కట్ ప్రో, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ **స్టైపెండ్:** రూ.3,000-5,000
దరఖాస్తు గడువు: జనవరి 29
☛ https://hosturl.link/t2iMgF

షాపిఫై యాప్ డెవలప్‌మెంట్

సంస్థ: శంభో
నైపుణ్యాలు: నోడ్.జేఎస్, రెస్ట్ ఏపీఐ, షాపిఫై **స్టైపెండ్:** రూ.5,000-12,000
దరఖాస్తు గడువు: జనవరి 29
☛ https://hosturl.link/94lQP0

ట్యాలెంట్ మేనేజ్‌మెంట్

సంస్థ: డిజిటల్ ఆదర్శ్
నైపుణ్యాలు: కంటెంట్, ఇన్‌ఫ్లుయెన్సర్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డ్‌ఇన్, సోషల్‌మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.7,000-8,000
దరఖాస్తు గడువు: జనవరి 29
☛ https://tinyurl.com/4f3m6vbt

హైదరాబాద్‌లో డేటా ఎంట్రీ

సంస్థ: ఉన్నతి ఎంటర్‌ప్రైజస్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, హిందీ మాట్లాడటం, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-ఆఫీస్
స్టైపెండ్: రూ.10,000-20,000
దరఖాస్తు గడువు: జనవరి 25
☛ https://hosturl.link/KfvYbk

మోషన్ గ్రాఫిక్స్

సంస్థ: ఇన్వెస్ట్4ఎడ్యు ప్రై.లి.
నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://tinyurl.com/3nuhp6d2

హెచ్‌ఆర్ రిక్రూటర్ & అడ్మిన్

సంస్థ: మాంక్‌నేస్ సూపర్‌ఫుడ్స్ ప్రై.లి.
నైపుణ్యాలు: అడ్మినిస్ట్రేటివ్ సపోర్ట్, రిక్రూట్‌మెంట్
స్టైపెండ్: రూ.13,500-15,000
దరఖాస్తు గడువు: జనవరి 29
☛ https://tinyurl.com/494b3epb

సేల్స్ అండ్ మార్కెటింగ్

సంస్థ: స్టైమ్ వరల్డ్
నైపుణ్యాలు: కొలాబరేషన్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఫీల్డ్ వర్క్, మార్కెటింగ్, ప్రజెంటేషన్ స్కిల్స్, సేల్స్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.11,000-20,000
దరఖాస్తు గడువు: జనవరి 28
☛ https://tinyurl.com/yc4hbd7k